

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 290

మంగళవారం 10-1-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



శత్రు సైన్యంపై మూషికాస్త్రం!
డీఆర్‌డీఓ వినూత్న ప్రయోగాలు. మొదటి దశ ప్రయోగం విజయవంతం -6లో



సెన్సెక్స్.. బౌన్స్‌బ్యాక్
మూడు రోజుల నష్టాలకు చెక్. 60,747 వద్ద ముగింపు -13లో



విమానంలో అసభ్య ప్రవర్తన
ఢిల్లీ నుంచి పట్నా వస్తున్న ఇండిగో విమానంలో తప్పతాగిన ఇద్దరు ప్రయాణికులు ఎయిర్ హోస్టెస్‌తో అసభ్యంగా ప్రవర్తించారు.
వివరాలు 6లో ▸



తొలి సిక్కు మహిళా జడ్జి
అమెరికాలోని హ్యారిస్ కౌంటీ జడ్జిగా భారత సంతతికి చెందిన మన్‌ప్రీత్ మోనికాసింగ్ బాధ్యతలు చేపట్టి చరిత్ర సృష్టించారు.
వివరాలు 6లో ▸



రణరంగంగా బ్రెజిల్
మాజీ దేశాధ్యక్షుడు జైర్ బోల్సోనారో మద్దతుదారులు దురాక్రమణకు దిగారు. దీనిపై దేశాధ్యక్షుడు డ సిల్వా ఆగ్రహం వ్యక్తంచేశారు.
వివరాలు 6లో ▸



భారత అంబాసిడర్లు
రాబోయే 25 ఏళ్ల అమృతకాల ప్రయాణంలో ప్రవాస భారతీయుల పాత్ర అత్యంత కీలకమని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

కేసీఆర్ దిగిపోతేనే సర్పంచ్‌లకు గౌరవం



రాష్ట్రంలో సర్పంచ్‌లకు ఆత్మగౌరవం దక్కాలంటే.. సీఎం కేసీఆర్‌ను గద్దె దించాలని, బీఆర్‌ఎస్‌కు బొంద పెట్టాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.
- వివరాలు 2లో▶

గురుకుల విద్యార్థులకు హార్వర్డ్ కిటుకులు!



విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాల పెంపునకు అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం, ది లక్ష్మీ మిట్టల్ అండ్ ఫ్యామిలీ సౌత్ ఏషియా ఇన్‌స్టిట్యూట్, ఓయూతో బీసీ గురుకుల సొసైటీ అవగాహన కుదుర్చుకుంది.
- వివరాలు 14లో▶

11 ఇంటర్ చేంజర్లు.. 85 వంతెనలు

'ఆర్‌ఆర్‌ఆర్' ఉత్తరభాగం ప్రణాళిక సిద్ధం
- వివరాలు 10లో▶

ఇదండీ సంగతి



ఒకరిని విడిచి ఒకరు ఉండలేకపోతుంటే.. మళ్లీ పొత్తు ప్రశ్నలేంటయ్యా?

5 లక్షల మందితో సభ.. ఎక్కడా తగ్గొద్దు

ఖమ్మం సభ దేశం దృష్టిలో నిలవాలి • బీఆర్‌ఎస్ నేతలకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశం



సోమవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌తో భేటీ అయిన ఖమ్మం జిల్లా నేతలు వద్దిరాజు రవిచంద్ర, హరిప్రియ, కమల్‌రాజ్, ఉపేందర్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, నామా నాగేశ్వరరావు, సండ్ర వెంకట వీరయ్య, తాతా మధు, రేగా కాంతారావు

18న సభను సర్వశక్తులూ ఒడ్డి విజయవంతం చేయాలి

- 20 నియోజకవర్గాల నుంచి కనీసం ఐదు లక్షల మందిని తరలించాలి
- ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజా ప్రతినిధులతో ప్రగతిభవన్‌లో భేటీ
- మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, పువ్వాడకు ఏర్పాట్ల బాధ్యతలు
- నేటి రాత్రికే ఖమ్మంకు మంత్రి హరీశ్‌రావు.. రేపు ఏర్పాట్లపై సమీక్ష
- 100 ఎకరాల్లో సభ నిర్వహణకు ఏర్పాట్లు షురూ..

సాక్షి, హైదరాబాద్/ సాక్షిప్రతినిధి, ఖమ్మం: యావత్ దేశం దృష్టిని ఆకర్షించేలా, భారీగా ఖమ్మం సభను నిర్వహించాలని పార్టీ నేతలను భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) అధినేత, ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. ఈ నెల 18న జరగనున్న సభను సర్వశక్తులూ ఒడ్డి విజయవంతం చేయాలని, ఎక్కడా తగ్గొద్దని స్పష్టం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు పొరుగునే ఉన్న సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లోని పది నియోజకవర్గాలు కలిపి.. మొత్తంగా 20 నియోజకవర్గాల నుంచి ఐదు లక్షల మందిని సభకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు. సభ ఏర్పాట్ల మిగతా 2వ పేజీలో ▶

జాతీయ స్థాయిలో చర్చ.. ఎన్నికల రిహార్సల్..

జాతీయ స్థాయి నేతలను ఆహ్వానిస్తున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ సభను కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. జాతీయ రాజకీయాల్లో అరంగేట్రం తర్వాతి తొలి సభ కావడంతో భారీగా నిర్వహించాలని భావిస్తున్నారని అంటున్నాయి. ఈ సభకు పంజాబ్, ఢిల్లీ, కేరళ సీఎంలను, యూపీ, కర్ణాటక మాజీ సీఎంలు అఖిలేశ్, కుమారస్వామిలను కూడా ఆహ్వానించారు. సీపీఎం, సీపీఐ ప్రముఖులను, ప్రాంతీయ పార్టీల నేతలనూ ఆహ్వానించినట్టు సమాచారం. వీరి హాజరు, భారీ సభతో దేశవ్యాప్తంగా రాజకీయ చర్చ జరుగుతుందని.. ఇది ఎన్నికలకు రిహార్సల్ అని పార్టీ నేతలు అంటున్నారు.

19న హైదరాబాద్‌కు ప్రధాని మోదీ

పరేడ్ గ్రౌండ్స్ బహిరంగ సభలో ప్రసంగించనున్న ప్రధానమంత్రి

- అంతకుముందు రూ.7,076 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- వందేభారత్ రైలుకు పచ్చజెండా.. సికింద్రాబాద్ స్టేషన్ ఆధునీకరణ పనులకు శ్రీకారం
- ఏర్పాట్లను పరిశీలించిన బండి సంజయ్, లక్ష్మణ్



మోదీ కార్యక్రమాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీజేపీ నేతలు బండి సంజయ్, లక్ష్మణ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 19న రాష్ట్రానికి రానున్నారు. నెల వ్యవధిలోనే రెండోసారి తెలంగాణ పర్యటనకు వస్తున్న ప్రధానమంత్రి.. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. గత ఏడాది కాలంలో ప్రధాని తెలంగాణకు రావడం ఇది ఐదోసారి కావడం గమనార్హం. కాగా గత నవంబర్ 12న రామగుండంలో జరిగిన బహిరంగ సభలో కూడా ఆయన ప్రసంగించిన సంగతి తెలిసిందే. తాజా రాష్ట్ర పర్యటనలో భాగంగా ప్రధాని రూ.7,076 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. 19న ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో వందేభారత్ రైలును (సికింద్రాబాద్–విశాఖపట్నం) మోదీ పచ్చజెండా ఊపి ప్రారంభిస్తారు. అక్కడే సికింద్రాబాద్ స్టేషన్ ఆధునీకరణ పనులకు భూమిపూజ చేస్తారు. ఆ తర్వాత పరేడ్ గ్రౌండ్స్‌కు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారు. అనంతరం అక్కడే బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. మొత్తంగా చూస్తే వందేభారత్ రైలు, సికింద్రాబాద్– మహబూబ్‌నగర్ డబ్లింగ్ పనులు (రూ.1,410 కోట్ల వ్యయం), ఐఐటీ హైదరాబాద్‌లో చేపట్టిన వివిధ నిర్మాణాలు (రూ. 2,597 కోట్లు) కలిపి రూ.4,007 కోట్ల విలువైన ప్రాజెక్టులను మోదీ జాతికి అంకితం చేస్తారు. అలాగే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ మిగతా 2వ పేజీలో ▶

టెన్త్ ప్రశ్నపత్రంలో మార్పులు

'సాక్షి' కథనంపై స్పందించిన విద్యాశాఖ మంత్రి

- అభ్యంతరాలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశం
- ఈ మేరకు సరికొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసిన ఎస్‌సీఈఆర్టీ
- సూక్ష్మప్రశ్నలకు మరింత చాయిస్.. వ్యాసరూప ప్రశ్నల్లో 'సెక్షన్'.. విద్యార్థులకు ఇబ్బంది తప్పించే దిశగా మార్పులు
- సైన్స్ విభాగాలకు మాత్రం ఒకేరోజు పరీక్ష నిర్వహణ!



సాక్షి, హైదరాబాద్: పదో తరగతి పరీక్షల విధానంలో మార్పులపై వస్తున్న విమర్శల నేపథ్యంలో విద్యాశాఖ దిద్దుబాటు చర్యలకు దిగింది. ప్రశ్నపత్రాల్లో మార్పులు చేసి.. పరీక్ష విధానం కాస్త తేలికగా ఉండేలా మార్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. 'టెన్త్'కు కఠిన పరీక్ష శీర్షికన ఈ నెల 2న 'సాక్షి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. చాయిస్ తగ్గించడం, వ్యాసరూప ప్రశ్నల విధానాన్ని కఠినం చేయడం, ఒకేరోజు సైన్స్ సబ్జెక్టుకు సంబంధించిన రెండు పేపర్లు నిర్వహించడంపై విద్యార్థుల్లో నెలకొన్న ఆందోళనను ఈ కథనం వెలుగులోకి తెచ్చింది. పలు ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు ఈ అంశాలను ఎత్తిచూపుతూ.. విద్యార్థుల ఆందోళనను ప్రభుత్వం మిగతా 3వ పేజీలో ▶



గవర్నర్ ప్రసంగిస్తుండగా ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న డీఎంకే, కాంగ్రెస్ ఇతర పార్టీల నాయకులు. చిత్రంలో కుడి వైపు.. తమిళనాడు సీఎం స్టాలిన్

గవర్నర్ 'వాకౌట్'

తమిళనాడు అసెంబ్లీలో కనీవినీ ఎరుగని దృశ్యాలు

ప్రభుత్వ ప్రసంగ పాఠాన్ని పట్టించుకోని గవర్నర్

- 'ద్రవిడ' ప్రస్తావనను విస్మరిస్తూ ప్రసంగం
- భగ్గుమన్న అధికార డీఎంకే సభ్యులు
- గవర్నర్‌కు వ్యతిరేకంగా సభ తీర్మానం
- మధ్యలోనే లేచి వెళ్లిపోయిన గవర్నర్

- వివరాలు 6లో

తమిళనాట గవర్నర్‌కు, డీఎంకే సర్కారుకు మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. సమావేశాల తొలి రోజు సభనుద్దేశించి గవర్నర్ రవి చేసిన ప్రసంగం వివాదాన్ని రాజేసింది. పెరియార్, అన్నాదురై వంటి దిగ్గజాల పేర్లు పలకకుండా.. ద్రవిడ ప్రస్తావనను విస్మరిస్తూ ఆయన ప్రసంగించారు. దీంతో గవర్నర్‌కు వ్యతిరేకంగా తీర్మానం ప్రవేశపెట్టేందుకు సీఎం స్టాలిన్ సిద్ధమై మాట్లాడుతుండగా.. గవర్నర్ సభ నుంచి వెళ్లిపోయారు.

మిర్చిపై 'నల్లతామర' పంజా!

ఈసారీ మిరప పంటను ఆశించిన పురుగు

- రాష్ట్రంలో 2.4 లక్షల ఎకరాల్లో సాగు.. ఇప్పటికే 90 వేల ఎకరాలకు విస్తరించిన నల్లతామర పేను
- రంగంలోకి సీఐపీఎంసీ, ఎన్‌బీఏఐఆర్ శాస్త్రవేత్తలు
- ఆరు జిల్లాల్లో పర్యటన.. రైతులకు సూచనలు
- పంట దక్కకపోతే తాము అప్పులపాలేనంటూ రైతుల ఆందోళన

- వివరాలు 5లో



బందోజు సురేందర్, రైతు, నేరడ, మహబూబాబాద్

“ఎన్ని మందులు కొట్టినా చావట్లేదు

గత ఏడాది ఒకటిన్నర ఎకరాల్లో మిర్చి సాగుచేసిన. రూ.1.5 లక్షలు పెట్టుబడి పెట్టినా నల్లతామర పేను కారణంగా పంట చేతికి రాలేదు. ఈసారి అయినా పంట బాగా వచ్చి అప్పులు తీరుతాయని మిర్చి వేసిన. విత్తనాల నుంచి మందులదాకా అన్నింటిలో జాగ్రత్తపడ్డా. తొలివిడత కాపు పడింది. సంతోషపడ్డా. కానీ మళ్లీ నల్లతామర పేను సోకింది. ఎన్ని మందులు చల్లినా పురుగు చావలేదు. పంట నాశనమైంది. మళ్లీ అప్పులు మిగిలాయి.

క్లుప్తంగా...

పథకాలను నిర్వీర్యం చేసిన కేసీఆర్ సర్కార్: బూర



సాక్షి, హైదరాబాద్: సంక్షేమ పథకాలను కేసీఆర్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని బీజేపీ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ధ్వజమెత్తారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతు రుణమాఫీ అమలు ఏమైందని ప్రశ్నించారు. ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు 98 లక్షల మంది రైతులు ఓటేస్తే.. 50 లక్షల మంది రైతులను కేసీఆర్ మోసం చేశారని ఆరోపించారు. 'బ్యాంకుల్లో రైతులతో వడ్డీలు కట్టించుకుంటున్నారు. పాడి సంపదను పెంచే పథకాలను ఎందుకు అమలు చేయడం లేదు? ఆయిల్‌పామ్ సాగు కోసం కేంద్ర ప్రభుత్వం సబ్సిడీలు ఇస్తే దాన్ని తమ ప్రభుత్వానిదిగా చెబుతున్నారు. బడా రైతుల కోసమే రైతుబంధు అమలు చేస్తున్నారు. 600 ఎకరాలున్న మంత్రి మల్లారెడ్డికి రూ.60 లక్షల రైతుబంధు ఇస్తున్నారు' అని నర్సయ్యగౌడ్ మండిపడ్డారు.

తమిళనాడులోనూ ఆ పథకాలు అమలు చేయాలి

- బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపిన తమిళనాడు నాడార్ సంఘాలు
- మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో భేటీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని అభివృద్ధి, సంక్షేమ పథకాలను తమిళనాడులో కూడా అమలు చేయాలని ఆ రాష్ట్ర నాడార్ సంఘాలు కోరారు. సోమవారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్‌ను తమిళనాడు నాడార్ సంఘాల నేతలు కలిసి భారత్ రాష్ట్ర సమితి(బీఆర్ఎస్)కు మద్దతు తెలిపారు. నాడార్ సంఘాల నేతలు మాట్లాడుతూ తెలంగాణలో గౌడ, ఈడిగా కులస్తులకు అందించే సంక్షేమం, అభివృద్ధి పథకాలు దేశానికి ఆదర్శంగా ఉన్నాయన్నారు. తమిళనాడులో నాడార్‌లను పాలకులు ఓటుబ్యాంక్‌గానే ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. దేశవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ విస్తరించాలని ఆకాంక్షించారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ మాదిరిగా కుల, చేతివృత్తులను తమిళనాడులోనూ ప్రోత్సహించాలని కోరారు. దేశవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర తరహా పథకాలు అమలు కావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. త్వరలో చెన్నైలో జరిగే నాడార్ కులసంఘాల సమావేశానికి రావాలని శ్రీనివాస్‌గౌడ్‌ను ఆహ్వానించారు.

ఐనవోలు బ్రహ్మోత్సవాలకు కేసీఆర్‌కు ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: ఈనెల 13 నుంచి జరగనున్న వరంగల్ జిల్లా ఐనవోలు శ్రీమల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ ఆహ్వానించారు. ఈమేరకు సోమవారం ఆయన ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు వేదమంత్రాలతో సీఎంకు ఆశీర్వచనం పలికారు. డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఆలయ ఈవో నాగేశ్వరరావు, ఆలయ మాజీ చైర్మన్ మునిగాల సమ్మయ్య, ప్రధాన అర్చకులు రవీందర్, విక్రాంత్ జోషి పాల్గొన్నారు.

ఇక మీదట నిర్మాణాత్మక పోరాటాలు: గట్టు



సాక్షి, హైదరాబాద్: సైద్ధాంతిక, నిర్మాణాత్మక పోరాటాలు ఇక మీద కొనసాగిస్తామని, పార్టీ సంస్థాగత నిర్మాణంపై కసరత్తు జరుగుతోందని వైఎస్సార్‌టీపీ రాజకీయ కార్యాచరణ కమిటీ సభ్యుడు గట్టు రామచంద్రరావు తెలిపారు. సోమవారం వైఎస్సార్‌టీపీ కేంద్ర కార్యాలయంలో పిట్ట రాంరెడ్డి, నీలం రమేశ్, గడిపెల్లి కవిత, ఏపూరి సోమన్నలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని పార్టీల్లో ఉన్న వైఎస్సార్ అభిమానులను ఆహ్వానిస్తున్నామన్నారు. వైఎస్సార్ అభిమానులు ఎక్కువగా కాంగ్రెస్‌లో అవమానాలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అన్ని జిల్లాల్లో కేడర్ సమావేశాలు ప్రారంభం అవుతున్నాయని, ఈనెల 12 నుంచి జిల్లాల వారీగా సమీక్ష కార్యక్రమాలుంటాయని గట్టు వెల్లడించారు.

భూములు కాపాడుకోవడానికే బీఆర్ఎస్‌లోకి వెళ్తున్నారు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో భూములు, భూవివాదాలు ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారులే బీఆర్ఎస్‌లో చేరుతున్నారని రాయలసీమ ఉద్యమ నేత బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి దుయ్యబట్టారు. ఆ భూముల విషయంలో ఇబ్బందులు పెడతామని బెదిరించి పార్టీలో చేర్పించుకుంటున్నారని ఆరోపించారు. వారికే హైదరాబాద్ నుంచి ఫోన్లు వెళ్తున్నాయన్నారు. తెలంగాణను బాగు చేయలేని వాడు.. దేశాన్ని ఏం బాగు చేయగలడని ప్రశ్నించారు. కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కార్యాలయాన్ని విశాఖకు కాకుండా కర్నూలుకు తరలించాలని కోరుతూ సోమవారం ఆయన కేఆర్ఎంబీ చైర్మన్ ఎంకే సిన్హాను జలసౌధలో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సిద్ధేశ్వరం–సోమశిల వద్ద ఐకానిక్ వంతెనకి బదులు బ్యారేజీ కడితే శ్రీశైలంతో సమానంగా జలవిద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చని తెలిపారు.

కేసీఆర్ దిగిపోతేనే సర్పంచ్‌లకు గౌరవం

ఇందిరాపార్కు వద్ద ధర్నాలో పీసీసీ చీఫ్ రేవంత్

- కాంట్రాక్టర్లకు బిల్లుల కోసమే పంచాయతీ నిధుల దారి మళ్లింపు
- ప్రభుత్వ తీరుతో సర్పంచ్‌లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు
- వారి కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పనికిమాలిన చట్టాలను రద్దు చేస్తామని వెల్లడి



సభలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి. చిత్రంలో అద్దంకి దయాకర్, శివసేనారెడ్డి, మల్లు రవి, చెరుకు సుధాకర్, మహేష్ కుమార్ గౌడ్, తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సర్పంచ్‌లకు ఆత్మగౌరవం దక్కాలంటే.. సీఎం కేసీఆర్‌ను గద్దె దింపాలని, బీఆర్ఎస్‌ను బొందపెట్టాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సర్పంచుల ఖాతాల్లోని నిధులను దారి మళ్లించి పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. కేవలం కాంట్రాక్టర్లకు బిల్లులు కట్టబెట్టడానికే నిధులను దారి మళ్లించారని ఆరోపించారు. సోమవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నా కార్యక్రమంలో రేవంత్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామాలకు గౌరవం పెరగాలంటే సర్పంచులకు గౌరవం ఇవ్వాలని, వివిధ మార్గాల ద్వారా గ్రామాలకు వచ్చే నిధులను పంచాయతీల ఖాతాలోనే వేయాలని రేవంత్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరుతో ఇప్పటికే కొందరు సర్పంచ్‌లు ఆత్మహత్యకు పాల్పడ్డారని.. మరికొందరు భార్య పుస్తెలమ్మి అప్పులు కట్టాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు సుమారు 60మంది సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నారని, ఇటీవల సిరిసిల్లలో ఆనంద్‌రెడ్డి అనే సర్పంచ్ బలవన్మరణానికి పాల్పడ్డారని చెప్పారు. మునుగోడు సర్పంచ్ బస్టాండ్‌లో భిక్షమెత్తారని గుర్తు చేశారు.

తెలంగాణ మోడల్ అంటే ఇదేనా?

రాష్ట్రంలో పుట్టబోయే ప్రతి బిడ్డమీద కూడా లక్షా 50వేల అప్పు ఉందని.. తెలంగాణ మోడల్ అంటే ఇదేనా? అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. "బీఆర్ఎస్ అంటే భారత్ రాష్ట్ర సమితి కాదు భస్మాసుర సమితి. కేసీఆర్ తీరు మార్చుకోకపోతే ఈ భస్మాసుర సమితి కూడా రక్షించలేదు. కొత్త గ్రామ పంచాయతీలకు భవనాలు ఎక్కడైనా కట్టించారా? కేవలం సోకుల కోసం వేల కోట్లు ఖర్చు చేస్తూ.. సర్పంచుల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తారా? సర్పంచుల సమస్యలు తీరాలంటే కేసీఆర్ కుటుంబాన్ని పొలిమేరలు దాటేదాక తరమాలి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పనికిమాలిన చట్టాలను రద్దు చేస్తాం. సర్పంచుల నిధులు పక్కదారి పట్టకుండా పటిష్ట చట్టం తీసుకొస్తాం.." అని రేవంత్ చెప్పారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మరణించిన ప్రతీ సర్పంచ్ కుటుంబానికి కోటి రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్పంచులకు పూర్వ వైభవం రావాలంటే కేసీఆర్ అధికారం పోవాల్సిందేనన్నారు. రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ చైర్మన్ రాచమల్ల సిద్ధేశ్వర్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్, మహేశ్‌కుమార్‌గౌడ్, కిసాన్ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి, అనిల్ కుమార్‌రెడ్డి, చెరుకు సుధాకర్ పాల్గొన్నారు. రాష్ట్రంలో ఆత్మహత్య చేసుకున్న సర్పంచుల ఆత్మ శాంతి కోసం కార్యక్రమంలో 2 నిమిషాలు మౌనం పాటించారు.

ఇప్పుడు మంత్రి కేటీఆర్‌ను ఏం చేయాలి?

గ్రామాల్లో చెట్లు ఎండిపోతే సర్పంచ్‌ను సస్పెండ్ చేస్తామని సీఎం కేసీఆర్ అన్నారని.. మరి హైదరాబాద్ మహానగరాన్ని మురికికూపంగా మార్చిన మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను ఏం చేయాలని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. కేటీఆర్ నిర్లక్ష్యం వల్ల మూసీలో 30 మంది చనిపోయారని, హైటెక్ సిటీ నుంచి ముసారాంబాగ్ వరకు ఎక్కడ చూసినా పరిస్థితులు బాగోలేవని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అధ్వానంగా మార్చిన తండ్రి, కొడుకులను ట్యాంక్ బండ్ మీద ఉరేసినా తప్పు లేదని వ్యాఖ్యానించారు.

వియ్యంకుడి దశదిన కర్మకు కేసీఆర్



వియ్యంకుడు హరినాథ్‌రావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీఎం కేసీఆర్

చిత్రపటానికి పుష్పాంజలి.. హాజరైన పలువురు మంత్రులు, బీఆర్ఎస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తన వియ్యంకుడు, మంత్రి కేటీఆర్ మామ దివంగత పాకాల హరినాథ్‌రావు దశదిన కర్మకు హాజరయ్యారు. హైదరాబాద్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో హరినాథ్‌రావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. హరినాథ్‌రావు కుమార్తె, కేటీఆర్ భార్య శైలిమ, కుమారులు రాజ్ పాకాల, శైలేంద్ర పాకాల, ఇతర కుటుంబసభ్యులను కేసీఆర్ పరామర్శించారు. కేసీఆర్ వెంట మంత్రి కేటీఆర్, మనుమడు హిమాన్షు, మనుమరాలు అలేఖ్య ఉన్నారు. కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పువ్వాడ అజయ్ కుమార్, మల్లారెడ్డి, రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్, ఎంపీలు నామా నాగేశ్వర్ రావు, జోగినపల్లి సంతోష్ కుమార్, రంజిత్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్ నేత, బీబీ పాటిల్, కవితా మాలోత్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, శేరి సుభాష్ రెడ్డి, బస్వరాజు సారయ్య, బండ ప్రకాశ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, లక్ష్మారెడ్డి, కేపీ వివేకానంద, కాలె యాదయ్య, రసమయి బాలకిషన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, మాజీమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తదితరులు హాజరయ్యారు.

ఆ 12మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోండి

నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ నేతలపై దాడి చేసిన బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయాలి

- రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో డీజీపీని కలిసిన టీపీసీసీ నేతల బృందం
- ఫిరాయింపు ఎమ్మెల్యేలకు సీఎస్ వత్తాసు పలుకుతున్నారని ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచి అధికార బీఆర్ఎస్‌లోకి ఫిరాయించిన 12 మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని, నాగర్‌కర్నూలులో కాంగ్రెస్ నాయకులపై దాడి చేసిన బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఆయన ఇతర కాంగ్రెస్ నేతలతో డీజీపీ అంజనీకుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలుగా గెలిచి, అధికార పార్టీకి అమ్ముడుపోయిన 12 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలపై సీబీఐ విచారణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ అంశంపై చీఫ్ సెక్రటరీని అపాయింట్‌మెంట్ కోరితే తప్పించుకు తిరుగుతున్నారని ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగానే అమ్ముడుపోయిన ఎమ్మెల్యేలకు సీఎస్ వత్తాసు పలుకుతున్నట్లు కాంగ్రెస్ భావించాల్సి వస్తుందన్నారు.

ఆ 12 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నిరసన

ఫిరాయింపు ఎమ్మెల్యేల 12 నియోజకవర్గాల్లో సంక్రాంతి తరువాత కాంగ్రెస్ నిరసన కార్యక్రమాలు చేపడుతుందని రేవంత్ తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రాజెక్టు శిలాఫలకాన్ని సందర్శించేందుకు వెళ్లిన కాంగ్రెస్ నాయకులపై బీఆర్ఎస్ నేతలు దూషణలు, దాడులకు దిగారని, వారిని అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరినట్లు తెలిపారు. కార్యకర్తల గొంతుపై కాలు పెట్టి తొక్కి పరుష పదజాలంతో దూషించారని, దాడికి గురైన బాధితుల్లో ఒక గిరిజనుడు, మరొక దళితుడు ఉన్నారని తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతారని భావించామని, కానీ తమ పార్టీ నాయకుడు నాగం జనార్దన్ రెడ్డిపైనే అక్రమ కేసులు పెట్టారని రేవంత్ మండిపడ్డారు. ఇది ప్రభుత్వం, పోలీసుల బరితెగింపు చర్య అని విమర్శించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో కాంగ్రెస్ కార్యకర్తలపై దాడులకు నిరసనగా ఈ నెల 17న దళిత గిరిజన ఆత్మగౌరవ సభ నిర్వహిస్తామని చెప్పారు.

కీలక శాఖలన్నింటిలో తెలంగాణేతరులు: రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రాంత అధికారులపై నమ్మకం లేకనే కీలక శాఖలన్నింటిలో తెలంగాణేతరులను నియమించి నిరుద్యోగుల జీవితాలతో సీఎం కేసీఆర్ ఆటలాడుతున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. సోమవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థులు ఆయన్ను కలిసి వినతిపత్రం అందించారు. 1600, 800 మీటర్ల రన్నింగ్ పోటీల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు మెయిన్ పరీక్షల్లో అవకాశం కల్పించేలా ప్రయత్నించాలని కోరారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. పోలీస్ నియామకాలపై గతంలోనే ప్రభుత్వానికి లేఖ రాశానని, మరోమారు ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. నిరుద్యోగులకు యువజన కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. ఏ నియామకాల కోసం తెలంగాణ తెచ్చుకున్నామో వాటి కోసమే మళ్లీ ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇక్కడ పరిపాలన అందించడానికి ఏ ఒక్క తెలంగాణ అధికారులకు సమర్థత లేదా? అని ప్రశ్నించారు. రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్‌గా తెలంగాణ అధికారి లేరన్నారు. విద్యార్థుల ప్రాణాలు పోతున్నా పట్టింపు లేదని విమర్శించారు.

ఎక్కడా తగ్గొద్దు..

▶ మొదటి పేజీ తరువాయి

బాధ్యతను మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌లకు అప్పగించారు. బీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా రాష్ట్రంలో జరుగుతున్న ఖమ్మం బహిరంగ సభకు జన సమీకరణ, సభను సక్సెస్ చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సీఎం కేసీఆర్ సోమవారం ప్రగతిభవన్‌లో సమీక్షించారు. మూడు గంటలకుపైగా జరిగిన ఈ భేటీలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజాప్రతినిధులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు.

వ్యూహాత్మకంగా జన సమీకరణ

ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజాప్రతినిధులే సభ సక్సెస్ చేసే కీలక బాధ్యతలు తీసుకోవాలని కేసీఆర్ స్పష్టం చేసినట్టు తెలిసింది. ఖమ్మంకు సమీపాన ఉన్న సూర్యాపేట జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలు, మహబూబాబాద్, పాలకుర్తి, డోర్నకల్, ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, ఇల్లందు, సత్తుపల్లి నియోజకవర్గాల నుంచి 40 వేల మంది చొప్పున జన సమీకరణ చేసేలా ప్రణాళిక వేసుకోవాలని కేసీఆర్ ఆదేశించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మిగతా నియోజకవర్గాల నుంచి 10- 20 వేల మంది చొప్పున తరలించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. రూట్ మ్యాప్, పార్కింగ్, ఎన్ని వాహనాలు అవసరం. ఆ ప్రాంతంలో ఎన్ని వాహనాలు అందుబాటులో ఉన్నాయి, ట్రాఫిక్ జామ్ మళ్లింపు వంటి అంశాలపైనా చర్చించారు.

రాజకీయ పరిస్థితులపైనా చర్చ

సీఎంతో భేటీలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వరరెడ్డి, తాతా మధుసూదన్, విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్‌రెడ్డి, లావుడ్యా రాములునాయక్, వనమా వెంకటేశ్వరరావు, బానోతు హరిప్రియ, జెడ్పీ చైర్‌పర్సన్ లింగాల కమల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో సభ నిర్వహణతోపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాజకీయ పరిస్థితులపై కేసీఆర్ చర్చించినట్టు తెలిసింది. ఈ సభ సక్సెస్ తమను రానున్న ఎన్నికల్లో విజయతీరాలకు చేరుస్తుందన్న ధీమా ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజాప్రతినిధుల్లో వ్యక్తమవుతున్నట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి.



సభ నిర్వహణకు ఎంపిక చేసిన స్థలాన్ని చదును చేయిస్తున్న దశ్యం

బహుముఖ వ్యూహంతోనే ఖమ్మం ఎంపిక

ఖమ్మం సభ ద్వారా దేశ రైతాంగం, ప్రజలు, రాజకీయ వర్గాలకు బీఆర్ఎస్ ఎజెండాపై పూర్తి స్పష్టత ఇవ్వాలని కేసీఆర్ భావిస్తున్నట్టు సమాచారం. సభకు హాజరవనున్న ముఖ్యమంత్రుల చేతుల మీదుగా ప్రతిష్టాత్మక 'కంటి వెలుగు' కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించే అవకాశం ఉందని తెలిసింది. ఇక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో కేవలం ఒకే అసెంబ్లీ సీటును గెలుచుకున్న నేపథ్యంలో.. ఇక్కడ పార్టీ బలోపేతానికి ఈ సభ తోడ్పడుతుందని భావిస్తున్నారు. ఇదే సమయంలో టీడీపీ, వైఎస్సార్‌టీపీ వంటి పార్టీలు ఖమ్మంపై దృష్టి కేంద్రీకరించడాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నట్టు తెలిసింది. కమ్యూనిస్టు పార్టీలకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొంత బలం ఉండటం, మునుగోడులో బీఆర్ఎస్ మద్దతు కూడా ఇచ్చిన నేపథ్యంలో.. ఆ పార్టీల జాతీయ నాయకత్వాన్ని కేసీఆర్ ఆహ్వానించారు. పొరుగునే ఉన్న ఏపీ నుంచి కూడా కొంత మంది సభకు రావొచ్చనే అంచనాలు ఉన్నాయి. ఏపీ నుంచి జన సమీకరణపై ఆ రాష్ట్ర బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్‌తో నేడో రేపో కేసీఆర్ సమావేశం కానున్నట్టు తెలిసింది.

నేడు ఖమ్మంకు హరీశ్

సభ బాధ్యతను అప్పగించిన ముగ్గురు మంత్రుల్లో మంత్రి హరీశ్‌రావు మంగళవారం రాత్రే ఖమ్మం చేరుకోనున్నారు. వేముల ప్రశాంత్‌రెడ్డి కూడా ఒకట్రెండు రోజుల్లో వెళ్లనున్నారు. వారు సభ ముగిసే వరకు ఖమ్మంలోనే మకాం వేసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. బుధవారం ఖమ్మం వీడీవోస్ కాలనీలోని మంత్రి పువ్వాడ అజయ్ క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ సభ సన్నాహక సమావేశం నిర్వహించి.. జిల్లా, స్థానిక నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు.

100 ఎకరాల్లో సభ

ఖమ్మం నూతన కలెక్టరేట్ ప్రారంభం అనంతరం పక్కనే ఉన్న 100 ఎకరాల ప్రాంగణంలో బీఆర్ఎస్ సభ నిర్వహణకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. సోమవారమే ప్రాంగణాన్ని చదును చేసే పనులు మొదలు పెట్టారు. ఖమ్మం నియోజకవర్గ నేతలు ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. సీపీ విష్ణు ఎస్.వారియర్, ఇతర పోలీసు అధికారులు ప్రాంగణాన్ని పరిశీలించి.. బందోబస్తు, పార్కింగ్ ఏర్పాట్లపై ప్రాథమికంగా చర్చించారు.

ప్రధాని పర్యటనలో పాల్గొనండి

- నిధులు, అభివృద్ధి ప్రాజెక్టుల కోసం అడగండి
- కేసీఆర్‌కు బీజేపీనేత కె.లక్ష్మణ్ సూచన



సాక్షి, హైదరాబాద్: ట్విట్టర్ టిల్లుగా మంత్రి కేటీఆర్‌కు కేవలం కేంద్రంపై విమర్శలు చేయడమే పరిపాటిగా మారిందని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ మండిపడ్డారు. ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనలో సీఎం కేసీఆర్ పాల్గొని రాష్ట్రానికి కావాల్సిన నిధులు, అభివృద్ధి ప్రాజెక్టుల అనుమతులు కోరాలని డిమాండ్ చేశారు. సోమవారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ కేవలం విమర్శలతో సరిపెట్టకుండా ప్రధానికి నేరుగా విజ్ఞప్తులు చేసి సీఎం తమ చిత్తశుద్ధి చాటాలన్నారు. రూ.2,400 కోట్లకుపైగా రైల్వే ప్రాజెక్టుల ప్రారంభోత్సవానికి 19న ప్రధాని రాష్ట్రానికి వస్తున్నారని చెప్పారు. వందేమాతరం ఎక్స్‌ప్రెస్ రైలే కాకుండా రాష్ట్రానికి వివిధ రూపాల్లో నిధులు కల్పిస్తున్నారంటే రాష్ట్ర సర్కార్ ఆలోచించాలన్నారు. తెలంగాణ పట్ల, ఈ ప్రాంత అభివృద్ధికి వేలాదికోట్ల నిధులతో ఇతోధిక సాయం చేస్తుంటే కేటీఆర్ కేంద్రంపై విరుచుకుపడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు, మంత్రులు కళ్లున్నా చూడలేని కబోధులుగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వం రాష్ట్రంలో రూ.1.04 లక్షల కోట్లతో జాతీయ రహదారులు చేపట్టడం అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. రోడ్డు, రైల్, ఎయిర్ కనెక్టివిటీతో పాటు పీఎం గ్రామీణ సడక్ యోజన ద్వారా పల్లెల రోడ్లను పట్టణాలతో అనుసంధానం వంటి అభివృద్ధి ఏనాడైనా కేసీఆర్ కేంద్రమంత్రిగా ఉండగా అయ్యిందా అని నిలదీశారు. యూపీఏ హయాంలో మంత్రిగా కేసీఆర్ ఒరగబెట్టిందేమిటో సూటిగా సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ఆనాడు తెలంగాణ ప్రజలకు పుర్రె గుర్తు, బీడీ కార్మికుల పొట్టకొట్టడం తప్పితే కేసీఆర్ సాధించిందేమీ లేదని లక్ష్మణ్ విమర్శించారు.

ఎన్నికలు ఎప్పుడైనా రావొచ్చు

- మనం అన్నివిధాలా సిద్ధంగా ఉండాలి: బండి సంజయ్
- బెంగాల్ తరహాలో ఇబ్బంది పెట్టేందుకు కేసీఆర్ కుట్ర
- ఇక్కడున్నది బీజేపీ కార్యకర్తలని తెలుసుకునేలా చేయాలి

సాక్షి, హైదరాబాద్: 'రాబోయే 8 నెలల్లో ఎప్పుడైనా అసెంబ్లీ ఎన్నికలు రావొచ్చు. మనం అన్ని విధాలా సిద్ధంగా ఉండాలి. బెంగాల్ మాదిరిగా బీజేపీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టేందుకు సీఎం కేసీఆర్ కుట్ర చేస్తున్నాడు. ఇక్కడున్నది తెలంగాణ బీజేపీ కార్యకర్తలు. తరిమితరిమి కొడతారనే సంగతి తెలుసుకునేలా చేయాలి. నాపై 11 నాన్ బెయిలబుల్ కేసులు పెట్టారు. ప్రజల కోసం కేసులు లెక్క కాదు. జైలుకు పోయేందుకు కూడా సిద్ధంగా ఉన్నాం. క్రమశిక్షణ ఉన్న పార్టీ, కొట్లాడే పార్టీ, బీఆర్ఎస్‌ను ఎదిరించే పార్టీ మనది. తెలంగాణకు, భాగ్యనగరానికి కేంద్రం ఎన్ని నిధులిచ్చిందనే విషయంపై కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలి..' అని బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపునిచ్చారు. 19న ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో సోమవారం రాత్రి పార్టీ కార్యాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల నేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్, పార్టీ నేతలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, చింతల రామచంద్రారెడ్డి, దుగ్యాల ప్రదీప్‌కుమార్, డా.ప్రకాశ్‌రెడ్డి, ఉమారాణి, డా.గౌతమ్ రావు, బొక్క నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, మంత్రిపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టాలి: కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులను మంజూరు చేస్తే ఆయా నిధులను తస్కరించిన దొంగ సీఎం కేసీఆర్ అని సంజయ్ ఆరోపించారు. ఈ విషయంలో కేసీఆర్, పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, అధికారులపై చీటింగ్, దొంగతనం, నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ సిటీ, జాతీయ ఉపాధి హామీ, కంపా నిధులను కూడా దారి మళ్లించారని విమర్శించారు. రాష్ట్రంలో ఉద్యోగులకు జీతాలే సక్రమంగా ఇవ్వలేని దుస్థితిలో ఉన్న కేసీఆర్.. తెలంగాణను ఏ విధంగా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న బండి సంజయ్. చిత్రంలో కె.లక్ష్మణ్, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు

నిధులపై బహిరంగ చర్చకు రండి..: కేసీఆర్‌కు దమ్ముంటే తెలంగాణకు కేంద్రం ఏయే పథకానికి ఎన్ని నిధులిచ్చిందనే అంశంపై బహిరంగ చర్చకు సిద్ధం కావాలని బండి సవాల్ విసిరారు. '2014లో లిక్కర్ ఆదాయం రూ.10 వేల కోట్లుంటే.. నేడది రూ.40 వేల కోట్లు దాటింది. రాష్ట్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు రూ.20 వేల కోట్లకు మించి ఖర్చు కావడం లేదు? మిగిలిన సొమ్ము ఏం చేస్తున్నట్లు?' అని నిలదీశారు. హిందూ ధర్మాన్ని కించపరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. హిందూ ఓటు బ్యాంకును కాపాడుకోవాలని కోరారు.

19న హైదరాబాద్‌కు ప్రధాని మోదీ

▶ మొదటి పేజీ తరువాయి

ఆధునీకరణ (రూ.699 కోట్లు), కాజీపేట వర్క్ షాపు నిర్మాణం (రూ. 521 కోట్లు)తో పాటు మూడు జాతీయ రహదారుల విస్తరణ పనులు కలిపి మొత్తం రూ.3,069 కోట్ల విలువైన ప్రాజెక్టులకు భూమి పూజ చేస్తారని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జి.కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్సీఆర్ అధికారులతో బీజేపీ నేతల భేటీ

మోదీ పర్యటన నేపథ్యంలో సోమవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సందర్శించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు ఎంపీ డా.కె.లక్ష్మణ్ దక్షిణ మధ్య రైల్వే అధికారులతో సమావేశమయ్యారు. వందే భారత్ రైలుతో పాటు ఆరోజు ప్రధాని ప్రారంభించనున్న వివిధ కార్యక్రమాల ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం బండితో కలిసి లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు.

రాష్ట్ర ప్రయోజనాలకు ప్రధాని పెద్దపీట

'రాష్ట్ర ప్రయోజనాలకు ప్రధాని మోదీ పెద్ద పీట వేస్తున్నారు. ఇప్పటికే రూ.1.04 లక్ష కోట్ల వ్యయంతో తెలంగాణలో జాతీయ రహదారుల నిర్మాణాన్ని కేంద్రం చేపట్టింది. ఈ విషయంలో తెలంగాణ దేశంలోనే రెండో స్థానానికి చేరుకుంది. వందే భారత్ రైలుతో ప్రయాణికులకు మూడున్నర గంటల సమయం ఆదా కానుంది. మరోవైపు ప్రధానమంత్రి సడక్ యోజన కింద పెద్ద ఎత్తున రోడ్డు నిర్మాణ పనులు చేపడుతూ గ్రామాలను పట్టణాలతో అనుసంధానిస్తున్నారు. దీంతోపాటు నదుల అనుసంధాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణకు కేంద్రం నిధులు ఇవ్వడం లేదంటూ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను మీడియా ప్రస్తావించగా స్పందిస్తూ..'నూతన సంవత్సర కానుకగా ప్రధాని తెలంగాణలో రైల్వే అభివృద్ధి పనుల కోసం రూ.2,400 కోట్లు ఖర్చు చేయబోతున్నారు. అబద్ధాలు ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులకు ఈ పర్యటనతోనైనా కనువిప్పు కలగాలని కోరుకుంటున్నా..' అని అన్నారు. అనంతరం రైల్వే ఉన్నతాధికారులతో కలిసి బండి, లక్ష్మణ్ పరేడ్ గ్రౌండ్స్‌ను సందర్శించారు.

18న నియోజకవర్గాల్లో రక్తదాన శిబిరాలు: కాసాని



సాక్షి, హైదరాబాద్: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతి సందర్భంగా ఈ నెల 18న పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆపార్టీ తెలంగాణ శాఖ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తెలిపారు. ఈ మేరకు అన్ని జిల్లాల పార్టీ నాయకులతో ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్టీఆర్ వర్ధంతి రోజున అన్ని నియోజకవర్గాల్లో వీలున్నచోట రక్తదాన శిబిరాలు చేపట్టాలని సూచించారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వంద రక్తదాన శిబిరాలు నిర్వహించాలని, ఈ మేరకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో జ్ఞానేశ్వర్ కేక్ కట్ చేశారు. కాగా టీడీపీ భవిష్యత్తు బాగుండాలని కోరుతూ కాసాని మంగళవారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో 'దశ మహా విద్యాపూర్వక నవ చండీ యాగం' నిర్వహించనున్నారు.



కౌటాలలో టీ పెడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

ప్రజలు ఆశీర్వదిస్తే సిర్పూర్ నుంచి పోటీ

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

కౌటాల(సిర్పూర్): సిర్పూర్ ఎమ్మెల్యే అక్రమ దందాలకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ప్రజలు ఆశీర్వదిస్తే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆయన చేపట్టిన బహుజన రాజ్యాధికార యాత్ర సోమవారం కుమురంభీం జిల్లా కౌటాలకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ తుమ్మిడిహెట్టి వద్ద దివంగత సీఎం వైఎస్ఆర్ ప్రారంభించిన ప్రాణహిత ప్రాజెక్టును కేసీఆర్ కాళేశ్వరానికి తరలించి, స్థానిక రైతుల నోట్లో మట్టి కొట్టారని ఆరోపించారు.

ప్రభుత్వాసుపత్రుల్లోనే మందులు ఇవ్వాలి

ఎట్టి పరిస్థితుల్లో బయటకు రాయకూడదు: మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: మందులు ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు రాయకూడదని, డిశ్చార్జి అయిన రోగులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే మందులు ఇవ్వాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ నుంచి అవసరమైన మందులు ఆసుపత్రులకు సకాలంలో అందించాలన్నారు. సోమవారం తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆసుపత్రుల నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రారంభించిన 56 టిఫా స్కానింగ్ సేవలు గర్భిణులకు అందేలా చూడాలని సూచించారు. సి సెక్షన్ల శాతం ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎక్కువగా ఉందని, దాన్ని తగ్గించేందుకు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలన్నారు. అనవసర సి సెక్షన్ల వల్ల కలిగే నష్టాన్ని కౌన్సెలింగ్ ద్వారా వివరించాలన్నారు. సి సెక్షన్ లేదా సాధారణ డెలివరీ చేయాలా వద్దా అనేది పూర్తిగా డాక్టర్ల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందనే విషయాన్ని తెలియజేయాలని ఆయన చెప్పారు. డైట్, శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది రోగులు, వారి సహాయకులతో మర్యాదగా ప్రవర్తించాలని, నిర్లక్ష్యం ప్రదర్శించే వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. సమీక్షలో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వీ, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, కుటుంబ సంక్షేమ కమిషనర్ శ్వేత మహంతి, ప్రజారోగ్య సంచాలకులు శ్రీనివాస రావు, డీఎంఈ రమేష్ రెడ్డి, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

13 నుంచి సంక్రాంతి సెలవులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు ఈనెల 13 నుంచి 17వరకు సంక్రాంతి సెలవులు ఇవ్వనున్నారు. 18న తిరిగి స్కూళ్లు తెరుచుకుంటాయి. ఈ సెలవుల సమయంలో పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక హోంవర్క్ ఇవ్వాలని పాఠశాల హెచ్ఎంలకు అధికారులు సూచించారు. కళాశాలలకు మాత్రం ఈ నెల 14 నుంచి 16వరకు 3 రోజుల పాటు సెలవులు ఇవ్వనున్నారు. కాలేజీలు ఈ మధ్యనే మొదలవడం వల్ల వీరికి తక్కువ సెలవులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. టెన్త్, ఇంటర్ పరీక్షల తేదీల ప్రకటన, జిల్లాల్లో ఎంసెట్‌కు ప్రత్యేక కోచింగ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో విద్యా సంస్థలు పునఃప్రారంభమైన తర్వాత పరీక్షల కోసం పునశ్చరణ చేపట్టాలని భావిస్తున్నారు.

మహిళా భద్రత విభాగం ఇన్‌చార్జిగా శిఖాగోయల్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మహిళా భద్రత విభాగం ఇన్‌చార్జిగా అడిషనల్ డీజీ శిఖా గోయల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఏసీబీ డైరెక్టర్‌గా ఉన్న శిఖాగోయల్‌ను ఇటీవల మహిళా భద్రత విభాగానికి బదిలీ చేసిన విషయం తెలిసిందే. మహిళా భద్రత విభాగాల కార్యకలాపాలను ఆమె పర్యవేక్షించనున్నారు.

రెండున్నర నెలల కోసం వైద్య పోస్టులు

సాక్షి, హైదరాబాద్: వచ్చే మార్చి 31వరకు మాత్రమే ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ట్యూటర్ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించుకునేందుకు అనుమతినిస్తూ ఆర్థిక శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అందుకోసం మొత్తం 201 పోస్టులను మంజూరు చేసింది. 14 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో వీరిని నియమిస్తారు. రెండున్నర నెలల కోసం లేదా అవసరం ఉన్నన్ని రోజులు లేదా రెగ్యులర్ నియామకాలు జరిపే వరకు వీరిని కొనసాగిస్తామని ఆర్థికశాఖ తెలిపింది. ఆర్థిక సంవత్సరం ముగింపు కాబట్టి రెండున్నర నెలలు దాటిన తర్వాత వారిని కొనసాగిస్తామని కొందరు అధికారులు చెబుతున్నా, ఉత్తర్వుల్లో మాత్రం పేర్కొన లేదని వైద్యులంటున్నారు. ట్యూటర్లకు నెలవారీ రూ. 57,700 వేతనం ఇస్తారు. రిమ్స్ ఆదిలాబాద్‌కు 16 పోస్టులు, నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీకి 16, సిద్దిపేటకు 8, నల్లగొండకు 18, సూర్యాపేటకు 18, సంగారెడ్డికి 13, నాగర్ కర్నూలుకు 14, వనపర్తికి 16, భద్రాద్రి కొత్తగూడెంకు 15, జగిత్యాలకు 14, మంచిర్యాలకు 13, మహబూబాబాద్‌కు 14, రామగుండం మెడికల్ కాలేజీకి 16 ట్యూటర్ పోస్టులను మంజూరు చేశారు.

అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు

మంత్రి కేటీఆర్ వెల్లడి
- ఐటీ విస్తరించిన ప్రాంతాల్లోనే అభివృద్ధి అనేది అవాస్తవం
- ఎనిమిదేళ్ల కృషితో పెట్టుబడుల అనుకూల వాతావరణం
- త్వరలో దేశంలోనే అతిపెద్ద ప్రోటోటైప్ సెంటర్ టీ వర్క్స్
- హైసియా ఆధ్వర్యంలో ఐటీ పరిశ్రమ ప్రతినిధుల భేటీ



అమెరికా రాయబారి ఎలిజబెత్ జోన్స్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కేటీఆర్. చిత్రంలో హైదరాబాద్ యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగర అభివృద్ధిపై తమకు సంపూర్ణ అవగాహన ఉందని, ఐటీ రంగం విస్తరించి ఉన్న ప్రాంతాల్లో మాత్రమే అభివృద్ధి జరుగుతోందనే విషయం వాస్తవం కాదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు చెప్పారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన జరుగుతోందని స్పష్టం చేశారు. హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) ఆధ్వర్యంలో సోమవారం నెక్లెస్ రోడ్డులోని త్రిల్‌సిటీలో జరిగిన ఐటీ పరిశ్రమ ప్రతినిధుల సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. రాష్ట్రంలో ఎనిమిదేళ్లుగా ప్రణాళికబద్ధంగా చేసిన కృషితో హైదరాబాద్‌లో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడిందని తెలిపారు. ఆవిష్కరణల వాతావరణాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగా టీ హబ్, వీ హబ్, ఇన్నోవేషన్ సెల్, ప్రత్యేక శానిటేషన్ హబ్ ఏర్పాటు కాగా, త్వరలోనే దేశంలో అతిపెద్ద ప్రోటోటైప్ సెంటర్ టీ వర్క్స్‌ను ప్రారంభిస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌లో ఆవిష్కరణల వ్యవస్థ బలంగా ఉండటంతో ఇప్పటికే అంతరిక్ష పరిశోధనలలో స్కై రూట్, ధ్రువ వంటి స్టార్టప్‌లు హైదరాబాద్ నుంచి విజయవంతంగా దూసుకెళ్తున్నాయని, త్వరలో మరిన్ని స్టార్టప్‌లు విజయం సాధిస్తాయని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

ఐటీ ఉద్యోగుల్లో 20 శాతం ఇక్కడే

ఐటీ ఉద్యోగాల సంఖ్యలో హైదరాబాద్ తొలిసారిగా బెంగళూరును అధిగమించిందని, దేశంలోని ఐటీ ఉద్యోగుల్లో 20 శాతం మంది హైదరాబాద్‌లోనే పనిచేస్తున్నారని కేటీఆర్ వెల్లడించారు. ఆఫీసు స్పేస్ వినియోగంలోనూ బెంగళూరును హైదరాబాద్ అధిగమించి అత్యధిక ఉద్యోగాలు కల్పించిన నగరంగా నిలిచిందన్నారు. టాస్క్ ద్వారా ఇప్పటివరకు 7 లక్షల మంది యువతకు ఐటీ, లైఫ్‌సైన్సెస్, ఎలక్ట్రానిక్స్‌తో పాటు వివిధ రంగాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చామని చెప్పారు. రాష్ట్రంలోని పది లక్షల గృహాలకు ఇంటర్నెట్‌ను అందించే 'టీ ఫైబర్' ఈ ఏడాది పూర్తవుతుందని, పౌర సేవల్లో దేశంలోనే తెలంగాణ 'మీ సేవా' కేంద్రాలు ఉత్తమంగా ఉన్నాయని తెలిపారు.

విస్తరణపై దృష్టి పెట్టండి

ఐటీ పరిశ్రమను హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించడంపై ఐటీ సంస్థలు ఆలోచించాలని, జిల్లా కేంద్రాల్లో ఇప్పటికే ఐటీ టవర్ల ఏర్పాటు శరవేగంగా సాగుతోందని కేటీఆర్ తెలిపారు. వరంగల్‌లో ఐటీ కంపెనీలు విజయవంతంగా కార్యకలాపాలు కొనసాగిస్తుండగా, ఆదిలాబాద్ లాంటి మారుమూల ప్రాంతాల్లోనూ ఐటీ కార్యాలయాలు అందుబాటులోకి వస్తాయన్నారు. బాసర ట్రిపుల్ ఐటీ వంటి విద్యాసంస్థల విద్యార్థులతో ఐటీ కంపెనీలు కలిసి పనిచేయాలన్నారు.

సోషల్ ఇన్‌ఫ్రాను బలోపేతం చేస్తున్నాం


సోషల్ ఇన్‌ఫ్రాలో హైదరాబాద్ దేశంలోనే మొదటి స్థానంలోనే ఉందని, ఎస్ఆర్‌డీపీ ద్వారా అనేక ప్రాజెక్టులను పూర్తి చేయడంతోపాటు మురుగు నీటిని వందశాతం శుద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు కేటీఆర్ వెల్లడించారు. 2050 నాటికి హైదరాబాద్ తాగునీటి అవసరాలకు సరిపడా మౌలిక వసతుల నిర్మాణంతోపాటు హైదరాబాద్ మెట్రో, ఎయిర్‌పోర్ట్ మెట్రో తదితర ప్రజా రవాణా వ్యవస్థలను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో 300 కిలోమీటర్ల మేర సైక్లింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసేందుకు జీహెచ్ఎంసీ ప్రయత్నిస్తోందని చెప్పారు. హైసియా అధ్యక్షుడు మనీషా సాబు, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌తో అమెరికా రాయబారి భేటీ

సాక్షి, హైదరాబాద్/ఇబ్రహీంపట్నం రూరల్: భారత్‌లో అమెరికా రాయబారి ఎలిజబెత్ జోన్స్, హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్ సోమవారం ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. టీ హబ్ ప్రాంగణాన్ని కేటీఆర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా టీ హబ్ ప్రత్యేకతలను కేటీఆర్ వారికి వివరించారు. హైదరాబాద్ ఆర్థిక పురోగతికి టీహబ్ అద్దం పడుతోందని, భారత్‌లోనే ప్రముఖ స్టార్టప్ ఇంక్యుబేటర్‌గా టీహబ్‌కు గుర్తింపు ఎందుకొచ్చిందో అర్థమైందని జెన్నిఫర్ లార్సెన్ ట్వీట్ చేశారు. అంతకుముందు ఎలిజబెత్ జోన్స్, జెన్నిఫర్ లార్సెన్‌లు రంగారెడ్డి జిల్లా ఆదిబట్లలోని టాటా లాకిడ్ మార్టిన్‌ను సందర్శించారు. వీరు టాటా లాకిడ్ ప్రతినిధులతో మాట్లాడుతూ.. టాటాసంస్థల పనితీరును ప్రశంసించినట్లు తెలిసింది.

ఇంకెన్నాళ్లీ కేసు?

- ఎమ్మెల్యేలకు ఎర కేసుపై హైకోర్టు ధర్మాసనం
- సీనియర్ న్యాయవాదులు చెప్పిన వివరాలే మళ్లీమళ్లీ చెప్పడం సరికాదు
- ప్రజోపయోగ కేసులు వేరేవి కూడా ఉన్నాయంటూ అసహనం



సాక్షి, హైదరాబాద్: 'ప్రజోపయోగ కేసులు వేరేవి కూడా ఉన్నాయి. ఇంకాఎన్నాళ్లు ఈ కేసునే కొనసాగిస్తాం. సీనియర్ న్యాయవాదులు..చెప్పిన వివరాలనే మళ్లీ మళ్లీ చెప్పడం సరికాదు. ఒకే తీర్పును పలువురు.. పలుమార్లు ధర్మాసనం దృష్టికి తేవడం ద్వారా సమయం వృథా తప్ప ప్రయోజనం ఉండదు. 'ఈ కేసును సీబీఐకి ఇవ్వొద్దు.. సింగిల్ జడ్జి ఉత్తర్వులను కొట్టి వేయాలి..' అని ప్రభుత్వం దాఖలు చేసిన ప్రధాన పిటిషన్‌లో మాత్రమే వాదనలు వినిపించాలి. ఇందుకు సంబంధించిన ఇతర పిటిషన్లపై ప్రస్తుతం వాదనలు వద్దు..' అని హైకోర్టు ద్వి సభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఎమ్మెల్యేలకు ఎర కేసులో సోమవారం..ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే, ప్రతివాదుల తరఫు సీనియర్ న్యాయవాదులు ఉదయ హోల్లా, సంజయ్ వర్చువల్‌గా వాదనలు వినిపించారు.

పబ్లిక్ డొమైన్‌లోకి ఎలా వచ్చాయి..

'ఈ కేసులో పోలీసులే సాక్షులు. వాళ్లే విచారణ అధికారులు. వాళ్లే ఫిర్యాదుదారులు. భూసారపు శ్రీనివాస్.. 20 ఏళ్లుగా కరీంనగర్‌లో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఆయన ఇంటిపైకి 30 మంది పోలీసులు దండయాత్రలాగా వచ్చారు. 41ఏ నోటీసులను ఇంటికి అతికించారు. ఈ తతంగం అంతా మీడియాలో విస్తృతంగా ప్రసారం అయింది. అసలు ఈ కేసులో శ్రీనివాస్ నిందితుడు కాదు.. సాక్షి కాదు. ఎఫ్ఐఆర్‌లో అతని పేరు కూడా లేదు. కానీ సిట్ విచారణకు హాజరయ్యారు. బీజేపీ రాష్ట్ర చీఫ్ బండి సంజయ్, ఆ పార్టీ ఇతర ముఖ్య నేతల పేర్లు చెప్పాలని తీవ్ర వేధింపులకు గురిచేశారు. చెప్పినట్లు వినకుంటే నిందితుల జాబితాలో పేరు చేరుస్తామని బెదిరించారు. దర్యాప్తు అంతా రాజకీయ కక్షపూరితంగా సాగుతోంది. 'ఎర'కు సంబంధించి పబ్లిక్ డొమైన్‌లో ఉన్న వివరాలనే సీఎం చెప్పారని ప్రభుత్వ న్యాయవాది పేర్కొంటున్నారు. పోలీసులు రికార్డు చేసిన సీడీల్లో ఉన్న వివరాలు పబ్లిక్ డొమైన్‌లోకి ఎలా వచ్చాయి? ఎవరి వల్ల వచ్చాయి? అన్నది పోలీసులు స్పష్టం చేయాల్సి ఉంది. అత్యంత ప్రముఖులు ఈ కేసులో అంతర్భాగమై ఉన్నారు. కనుక సీబీఐకి అప్పగించడమే సరైన నిర్ణయం..' అని ప్రతివాదుల (నిందితులు) తరఫు న్యాయవాదులు అన్నారు.

సీబీఐకి బదిలీ చేసే అధికారం లేదు..

'హైకోర్టులకు సంబంధించిన చట్ట ప్రకారం ఈ కేసులో అప్పీల్‌ను ద్వి సభ్య ధర్మాసనం ముందు వేయవచ్చు. సింగిల్ జడ్జి వద్ద నిందితులు దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలిస్తే ఇది సివిల్ నేచర్ ఉన్న కేసే అన్నది తెలుస్తుంది. ఆర్టికల్ 227 ప్రకారం.. ట్రిబ్యునళ్లు, హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై ద్విసభ్య ధర్మాసనం వాదనలు వినవచ్చు. హైకోర్టుకు ఆ అధికారం ఉంది. క్రిమినల్ విచారణ సాగినందున అప్పీల్‌పై విచారణ జరిపే అధికారం ద్వి సభ్య ధర్మాసనానికి లేదనడం సరికాదు. ముఖ్యమంత్రి ప్రెస్ మీట్ పెట్టి సీడీలు, వివరాలను మీడియాకు ఇవ్వడం అనేది బాధిత ఎమ్మెల్యేల పార్టీ అధ్యక్షుడిగా ఆయనకు ఉన్న హక్కు. దాన్ని సిట్ దర్యాప్తునకు లింక్ పెట్టి చూడటం తోసిపుచ్చాల్సిన విషయం. ఈ కేసులో ఎఫ్ఐఆర్‌ను గానీ, ట్రాప్‌నుగానీ నిందితులు సహా ఎవరూ ప్రశ్నించలేదు. అందువల్ల సీబీఐకి కేసు బదిలీ చేసే అధికారం హైకోర్టుకు లేదు..' అని దవే వాదించారు. ఈ సందర్భంగా పలు వ్యాఖ్యలు చేసిన ధర్మాసనం తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

కాళేశ్వరం మూడో టీఎంసీపై స్టేటస్ కో ఎత్తివేత

గత ఆదేశాలు సవరించిన సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: కాళేశ్వరం ప్రాజెక్టు మూడో టీఎంసీ విస్తరణ పనులపై స్టేటస్ కో ఆదేశాలను సుప్రీంకోర్టు సవరించింది. రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్‌ను ఆమోదించాలంటూ ఇచ్చిన నివేదికను గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ), కేంద్ర జలసంఘం తదితర సంబంధిత సంస్థలు పరిశీలించాలని ఆదేశించింది. మూడో టీఎంసీ విస్తరణ పనులకు పర్యావరణ అనుమతుల్లేవని చెరకు శ్రీనివాస్‌రెడ్డి, మూడో టీఎంసీ విస్తరణ పనులు నిలిపివేయాలని, పరిహారం వ్యత్యాసాలపై శ్రీరాం గంగాజమున దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లను సోమవారం జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్నలతో కూడిన ధర్మాసనం విచారించింది. స్టేటస్ కో ఆదేశాల వల్ల ప్రజా ప్రయోజనకరమైన ప్రాజెక్టు పనులు చేయలేకపోతున్నామని తెలంగాణ తరఫు సీనియర్ న్యాయవాది వైద్య నాథన్ తెలిపారు. స్టేటస్ కో ఎత్తివేయాలని కోరారు. గోదావరి పరీవాహక రాష్ట్రాలకు ఇబ్బంది లేకుండా వర్షాకాలంలోనే నీటిని ఎత్తిపోస్తామని కోర్టుకు వివరించారు. స్టేటస్ కో విధించడం వల్లనే సవరించిన డీపీఆర్‌ను జీఆర్ఎంబీ, కేంద్ర జల సంఘం పరిశీలించలేకపోతున్నాయని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి తెలిపారు. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు గోపాల శంకర్‌నారాయణన్, పరమేశ్వరన్‌లు వాదనలు వినిపిస్తూ.. పర్యావరణ అనుమతులు లేకుండా తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టు చేపడుతోందన్నారు. అనంతరం గత స్టేటస్ కో ఆదేశాలు సవరిస్తామని కోర్టు పేర్కొంది. మూడో టీఎంసీ విస్తరణ పనుల డీపీఆర్‌ను జీఆర్ ఎంబీ, సీడబ్ల్యూసీ తదితర సంస్థలు పరిశీలించాలని ఆదేశించింది. పరిహారం ఆసక్తిగా ఉన్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సొమ్ములు చెల్లించొచ్చని పేర్కొంది. ఆయా అంశాలపై కోర్టు తుది తీర్పునకు అందరూ లోబడి ఉండాలని స్పష్టం చేసింది.

ఆస్తుల విభజన కేసులో తెలంగాణ, కేంద్రానికి సుప్రీం నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల ఉమ్మడి ఆస్తులు, అప్పుల విభజనపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన సుప్రీంకోర్టు తెలంగాణకు, కేంద్రానికి నోటీసులు జారీచేసింది. ఆస్తుల, అప్పుల విభజన వేగంగా చేయాలని ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. కోర్టు ఆదేశాల మేరకు పిటిషన్ కాపీలు ప్రతివాదులందరికీ అందజేశామని ఏపీ తరఫు న్యాయవాది విశ్వనాథన్ తెలిపారు. విద్యుత్తు ఉద్యోగుల విభజన మాదిరిగా ఏకసభ్య కమిషన్ నియమించాలని కోరగా, ఆ విధంగా చేయలేమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తెలంగాణ, కేంద్రాలకు నోటీసులు జారీచేసిన కోర్టు ఆరువారాల్లో కౌంటరు దాఖలు చేయాలని పేర్కొంది. రిజాయిండర్ దాఖలుకు నాలుగు వారాలపాటు సమయం ఇచ్చింది.

మాస్టర్ ప్లాన్ కేసు విచారణ 11కు వాయిదా

కామారెడ్డి మాస్టర్‌ప్లాన్‌పై హైకోర్టును ఆశ్రయించిన రైతులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ మాస్టర్‌ప్లాన్‌ను వ్యతిరేకిస్తూ 2వ వార్డు రామేశ్వరపల్లి చెందిన 40 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. తమను సంప్రదించకుండానే తమ భూములున్న ప్రాంతాన్ని రిక్రియేషన్ జోన్‌గా ప్రకటించారని రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ మాధవీదేవి విచారణ చేపట్టగా, పిటిషనర్ల పక్షాన న్యాయవాది సృజన్‌రెడ్డి మాస్టర్‌ప్లాన్ మ్యాప్‌ను కోర్టుకు సమర్పించి వాదనలు వినిపించారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్(ఏజీ)ను న్యాయమూర్తి వివరణ కోరగా, ఈ కేసులో కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని విజ్ఞప్తి చేశారు. ఏజీ విజ్ఞప్తిని అంగీకరించిన న్యాయమూర్తి తదుపరి విచారణ బుధవారానికి (ఈ నెల 11) వాయిదా వేశారు. కాగా, విచారణ సందర్భంగా హైకోర్టుకు హాజరైన ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ వాదనలు వినిపించే ప్రయత్నం చేశారు. అయితే న్యాయమూర్తి ఆయన వాదనలను తోసిపుచ్చారు. ఇప్పటికే మాస్టర్‌ప్లాన్ రద్దు చేయాలని రైతు జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ నెల 11న అభ్యంతరాల గడువు ముగియనుంది. తర్వాత కౌన్సిల్‌లో చర్చించనున్నారు. కోర్టు పరిధిలో మాస్టర్‌ప్లాన్ అంశం ఉండటంతో బుధవారం కోర్టులో వాదనలు, తీర్పు తర్వాతే కౌన్సిల్ సమావేశం నిర్వహించే అవకాశాలు ఉన్నాయి.

'మాస్టర్ ప్లాన్'పై కౌన్సిల్‌లో తీర్మానం చేయండి

చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ సహా సభ్యులందరికీ రైతుల వినతి పత్రాలు



కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌పై మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌కు వినతిప్రతం అందజేస్తున్న రైతులు

కామారెడ్డి టౌన్: మునిసిపల్ మాస్టర్ ప్లాన్ వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతు జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్ సభ్యులందరికీ వినతి పత్రాలను అందజేశారు. చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి, వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియలతో పాటు 49 మంది కౌన్సిల్ సభ్యులకు ఇళ్లకు వెళ్లి వినతి పత్రాలను అందజేశారు. చైర్‌పర్సన్ అందుబాటులో లేకపోవడంతో ఆమె తండ్రి నిట్టు వేణుగోపాల్ రావుకు విన్నవించుకున్నారు. తమకు న్యాయం జరిగేలా కౌన్సిల్‌లో చర్చించి తీర్మానం చేయాలని రైతులు కోరారు. ఈనెల 11న అభ్యంతరాలకు గడువు ముగుస్తుందని, 12న అత్యవసర సమావేశం పెట్టుకుని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ప్రభుత్వ విప్, కలెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం తమకు న్యాయం జరుగుతుందని భావించి ఉద్యమానికి తాత్కాలికంగా విరామం ప్రకటిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్చిపూర్, దేవునిపల్లి, టేక్రియాల్, అడ్లూర్, రామేశ్వరపల్లి, అడ్లూర్‌ఎల్లారెడ్డి గ్రామాల రైతులు, రైతు జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

టెన్త్ ప్రశ్నపత్రంలో మార్పులు

▶ మొదటి పేజీ తరువాయి

దృష్టికి తీసుకెళ్లాయి. దీనిపై స్పందించిన విద్యా శాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి సంబంధిత అధికారులతో సమాలోచనలు జరిపారు. ఇబ్బందికరంగా ఉన్న ప్రశ్నపత్రాలు, విధానంలో మార్పుచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ రంగంలోకి దిగింది. అభ్యంతరాలను పరిశీలించి, పరీక్ష పేపర్లలో మార్పులు తెస్తూ కొన్నిప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు అధికారవర్గాలు తెలిపాయి. ప్రభుత్వం ఆమోదించగానే ప్రశ్నపత్రాలను మార్చనున్నారు.

చాయిస్ పెంపు.. ప్రశ్నల తగ్గింపు..

రెండేళ్ల కరోనా కాలం తర్వాత ఈసారి వందశాతం సిలబస్‌తో టెన్త్ పరీక్షలు జరుగనున్నాయి. ఏప్రిల్ 3 నుంచి పరీక్షల నిర్వహణకు బోర్డు ఏర్పాట్లు మొదలు పెట్టింది. ఈ సారి 11 పేపర్లకు బదులు ఆరు పేపర్లతోనే పరీక్షలు ఉంటాయంటూ.. సంబంధించిన మోడల్ పేపర్లను విడుదల చేసింది. ఆ పేపర్లను చూశాక విద్యార్థులు, విద్యారంగ నిపుణులు ఆశ్చర్యపోయారు. రెండు, మూడు మార్కుల సూక్ష్మప్రశ్నలకు గతంలో ఉన్న చాయిస్ ఎత్తివేయడంతో.. ఏ ఒక్క ప్రశ్నకు జవాబు తెలియకపోయినా విద్యార్థి ఆ మేర మార్కులు కోల్పోవాల్సి వస్తుందనే ఆందోళన మొదలైంది. ఇక వ్యాసరూప ప్రశ్నలను సెక్షన్ మాదిరి కాకుండా, గ్రూపులుగా ఇచ్చారు. సెక్షన్ మాదిరిగా అంటే మొత్తం 12 ప్రశ్నలు ఇచ్చి అందులోంచి ఆరింటికి సమాధానాలు రాయాలని కోరుతారు. దీనిలో విద్యార్థులకు చాయిస్ ఎక్కువగా ఉండి, ఎక్కువ స్కోర్ చేసే అవకాశం ఉంటుంది. కానీ, మోడల్ పేపర్లలో 2ప్రశ్నల చొప్పున ఆరు గ్రూపులుగా ఇచ్చి.. ప్రతి గ్రూప్‌లో ఒకదానికి సమాధానం రాయాలని పేర్కొన్నారు. ఆ గ్రూపులోని రెండు ప్రశ్నలకు సమాధానం తెలియకపోతే.. ఆ మేర మార్కులు కోల్పోయినట్టే. మిగతా గ్రూపుల్లోని అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయగలిగినా ప్రయోజనం ఉండదు. ఈ ఆందోళనను ఎస్‌సీఈఆర్టీ అధికారులు పరిగణనలోకి తీసుకున్నారు. సూక్ష్మప్రశ్నలకు ఎక్కువ చాయిస్ ఇవ్వడం మంచిదని.. వ్యాసరూప ప్రశ్నలనూ సెక్షన్ విధానంలో ఇవ్వాలని ప్రతిపాదించినట్టు తెలిసింది. వ్యాసరూప ప్రశ్నల సంఖ్యను తగ్గించే ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. ఫిజిక్స్-కెమిస్ట్రీ/బయాలజీ పేపర్లను వేర్వేరు రోజుల్లో నిర్వహించాలనే డిమాండ్‌ను అధికారులు పరిగణనలోకి తీసుకోవడంలేదని, దీనివల్ల విద్యార్థులకు ఇబ్బంది ఉండదని భావిస్తున్నట్టు తెలిసింది.

మార్పులను పరిశీలిస్తున్నాం..

టెన్త్ ప్రశ్నపత్రాల విధానం వల్ల విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని వివిధపక్షాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను అధికారులు పరిశీలిస్తున్నారు. అధికారుల నివేదిక వచ్చాక ఏ తరహా మార్పులు చేయాలనేది నిర్ణయిస్తాం. ఇప్పటికే ఆ విభాగం ప్రశ్నపత్రాల మార్పులపై నిశితంగా అధ్యయనం చేస్తోంది. విద్యార్థుల ప్రయోజనం కోసం మార్పులు చేస్తాం.

– వాకాటి కరుణ, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ

ఘనంగా ఇండియన్ సైన్స్ కాంగ్రెస్

ఎస్ఆర్ఎం వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డి.నారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహణ

మహారాష్ట్రలోని ఆర్‌టీఎం నాగపూర్ విశ్వవర్సిటీలో జనవరి 3 నుంచి 7 వరకు 108వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌ను నిర్వహించారు. 'సైన్స్- సాంకేతికత, మహిళా సాధికారతతో అభివృద్ధి' లక్ష్యంగా ఈ సదస్సు జరిగింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ఈ సదస్సును ప్రారంభించి సందేశం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రో వైస్ చాన్సలర్ డి.నారాయణరావు ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. 2030 నాటికి సైన్స్, సాంకేతికత, అవకాశాలు-సవాళ్లపై ఆయన ప్లీనరీలో ప్రసంగించారు. ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వశాఖ కేంద్ర కార్య దర్శి డాక్టర్ ఎం.రవిచంద్రన్ భారత ఆర్థిక విధానంపై ప్రసంగించారు.

'వార్ రూమ్' కేసులో మల్లు రవికి నోటీసులు


ఈ నెల 12న విచారణకు రావాలన్న సైబర్ పోలీసులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గళం పేరుతో సోషల్ మీడియాలో సర్క్యులేట్ అయిన మీమ్స్, వీడియోలతో సంబంధం ఉన్న కాంగ్రెస్‌పార్టీ వార్ రూమ్ కేసులో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఆ పార్టీ సీనియర్ నేత మల్లు రవికి నోటీసులు జారీ చేశారు. ఈ నెల 12న విచారణకు హాజరుకావాలని పేర్కొన్నారు. కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఆ పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు సోమవారం సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌కు వచ్చి వాంగ్మూలం ఇచ్చారు. ఈ కేసులో ఆద్యంతం నాటకీయ పరిణామాలే చోటు చేసుకున్నాయి. సోషల్ మీడియా కేసును దర్యాప్తు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు ఓ కార్యాలయంపై దాడి చేయగా అది కాంగ్రెస్ పార్టీ వార్ రూమ్‌గా తేలింది. అక్కడ పోలీసులు అదుపులోకి తీసుకున్న ఎం.శ్రీప్రతాప్, టి. శశాంక్, ఇషాంత్ శర్మలను విచారించగా... సునీల్ కనుగోలు పేరు వెలుగులోకి వచ్చింది. దీంతో అధికారులు సునీల్‌కు సీఆర్పీసీ 41 (ఏ) కింద నోటీసులు జారీ చేశారు. వీటిని కాంగ్రెస్ నేత మల్లు రవికి అందించారు.

అంతా మల్లు రవి చూస్తారన్న సునీల్

సోమవారం సైబర్ క్రైమ్ పోలీసుల విచారణకు అనారోగ్య కారణాల నేపథ్యంలో సునీల్ వాయిదా కోరినా ఫలితం దక్క లేదు. దీంతో మధ్యాహ్నం సైబర్ ఠాణాకు వచ్చిన ఆయన్ను దాదాపు గంటన్నర పాటు విచారించిన అధికారులు వాంగ్మూలం నమోదు చేశారు. ఆ వార్ రూమ్ వ్యవహారాలకు సంబంధం లేదని, తానెప్పుడూ అక్కడి వ్యవహారాలు చక్కబెట్టలేదన్నారు. వార్‌రూమ్ వ్యవహారాలన్నింటికీ మల్లు రవే నేతృత్వం వహిస్తారని చెప్పారు. దీంతో సైబర్ క్రైమ్ పోలీసులు సోమ వారం మల్లు రవికి సీఆర్పీసీ 41 (ఏ) నోటీసులు జారీ చేశారు.ఈ కేసు విచారణలో భాగంగా గురు వారం విచారణకు హాజరుకావాలని కోరారు.







స్త్రీ నించి పొందే ఆనందాన్ని ఆకాశపు నీలత్వంలోంచి,
నీళ్ల చల్లదనంలోంచి, గడ్డి మెత్తదనంలోంచి,
పువ్వుల మెరుగులోంచి పొందాలి. ఇవన్నీ స్త్రీ ఇచ్చేటంత ఆనందాన్ని ఇవ్వాలి.
– చలం

సాక్షి

మంగళవారం, జనవరి, 10

ఎవరి పాపం ఇది?!

అది సాక్షాత్తూ శంకరాచార్యుడు నడయాడిన నేల. ఆయన ప్రవచనాలు విని పులకించిన పుణ్య భూమి. ఆయన చేతుల మీదుగా దేశంలో ఏర్పాటైన నాలుగు ప్రధాన పీఠాల్లో ఒకటైన జ్యోతిర్మఠం ఇక్కడిదే. ఈ పట్టణం పేరు దాన్నుంచే వచ్చింది. హిరణ్యకశిపుడిని వధించిన ఉగ్ర నరసింహుడు శాంతమూర్తిగా మారింది ఈ ప్రదేశంలోనేనని వ్యాస విరచిత స్కంధపురాణం అంటుంది. నిత్యం వేలాదిమంది భక్తులతో కిటకిటలాడే పుణ్యక్షేత్రాల్లో ఇదొకటి. ఇక్కడి ఎత్తయిన హిమవన్నగాలు, దట్టమైన అడవులు, నిత్యం గలగలపారే హిమానీ నదాలను వీక్షించటానికి వచ్చే పర్యాటకులు కూడా తక్కువేమీ కాదు. పైగా చైనా సరిహద్దును ఆనుకునివున్న ప్రాంతంగనుక వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైనది. హిమశిఖరాల అధిరోహణకు తరలివెళ్లే బృందాలు ఈ ప్రాంతం మీదుగానే సాగుతాయి. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఇంతటి ఘనమైన పౌరాణిక, చారిత్రక, పర్యాటక ప్రదేశమైన జోషీమఠ్‌కు సంబంధించి కొన్ని వారాలుగా వెలువడుతున్న వార్తలు హడలెత్తిస్తున్నాయి. అక్కడి నివాస గృహాలు ఉన్నట్టుండి బీటలు వారుతుండటం, నేల నెర్రెలుబారడం స్థానికులకు కునుకు లేకుండా చేస్తున్నాయి. జోషీమఠ్ ఉన్న చమోలీ జిల్లాలోనే కర్ణప్రయాగ్, గోపేశ్వర్ పట్టణాలు... తెహ్రీ జిల్లాలోని ఘన్సాలీ, పిథోర్‌గఢ్ జిల్లా మున్సియారి, ధార్చులా... ఉత్తరకాశీ జిల్లా భట్వారీ... ఇంకా పౌరీ, నైనిటాల్ తదితర పట్టణాలకు సైతం ఇలాంటి ముప్పే పొంచివున్నదని నిపుణులంటున్న మాట.

ఇది ఇప్పటికిప్పుడు ముంచుకొచ్చిన ముప్పు కాదు. గత కొన్ని దశాబ్దాలుగా మనుషులు చేసిన, చేస్తున్న పాపాల పర్యవసానమే ఈ ఉత్పాతం. లాభార్జన తప్ప మరేమీ పట్టని కార్పొరేట్ సంస్థలు, అక్రమార్జనకు అలవాటుపడిన నేతలు ఏకమై ప్రకృతి వనరులను దోచుకు తింటున్నారన్న ఏకైక కారణంతో ఉమ్మడి ఉత్తరప్రదేశ్‌లో ఉత్తరాఖండ్ వాసులు సుదీర్ఘకాలం పోరాటాలు చేశారు. అవి కొన్నిసార్లు హింసాయుత రూపం కూడా తీసుకున్నాయి. వృక్షాలను హత్తుకునే అహింసాయుత చిప్కో ఉద్యమం పురుడుపోసుకున్నది ఈ నేలపైనే. తమ జీవనాధారమైన అడవులను నేలమట్టం చేస్తున్న తీరుపై 1973లో వేలాదిమంది గ్రామీణులు సుందర్‌లాల్ బహుగుణ నేతృత్వంలో ప్రారంభించిన ఈ ఉద్యమం దీర్ఘకాలం ప్రభావవంతంగా కొనసాగడంలో మహిళల పాత్ర ప్రధానమైనది. అనంతరకాలంలో ప్రపంచ పర్యావరణ ఉద్యమాలకు ఊపిరులూదిందీ, ప్రేరణగా నిలిచిందీ చిప్కో ఉద్యమమే. తెహ్రీ డ్యాం నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ కూడా ఎన్నో ఉద్యమాలు సాగాయి. స్థానిక వనరులపై సంపూర్ణావగాహనగల తమ ప్రాంతంవారు పాలకులైతే తప్ప ఈ దోపిడీనీ, ఈ అరాచకాన్నీ నివారించలేమన్న భావనతో స్థానికులు ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించిన పర్యవసానంగానే... వారి త్యాగాల ఫలితంగానే 2000 సంవత్సరంలో ఉత్తరాఖండ్ ఆవిర్భవించింది. కానీ గత రెండు దశాబ్దాలుగా జరిగిందంతా వేరు. బలమైన నాయకత్వం కొరవడి రాష్ట్రం అస్థిరత్వంలోకి జారుకుంది. రాష్ట్రం 13 మంది ముఖ్యమంత్రులను, రెండు దఫాలు రాష్ట్రపతి పాలన చవిచూసిందంటే పార్టీలకు అతీతంగా నాయకగణం ఎలా భ్రష్టుపట్టిపోయిందో అర్థమవుతుంది. అభివృద్ధి పేరుతో నిర్మించిన జలవిద్యుత్ ప్రాజెక్టులు, బహుళ అంతస్తుల భవంతులు, కొండల్ని పిండిచేసి నిర్మించే రహదారులు, సొరంగాలు అక్కడి పర్యావరణ సమతౌల్యాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. అడవుల విధ్వంసం సరేసరి. ఎన్నడో 1976లోనే ఎంసీ మిశ్రా కమిషన్ ఈ ప్రాంత ప్రత్యేక భౌగోళిక స్థితిపై నివేదిక వెలువరించింది. జోషీమఠ్ భూగర్భంలోని అంతర్వాహినులవల్ల ఈ నేలకు కుంగిపోయే గుణమున్నదని హెచ్చరించింది. విన్నవారేరి? దశాబ్దాలుగా అన్ని హెచ్చరికలనూ పాలకులు పెడచెవిన పెట్టి అభివృద్ధి మంత్రం జపించిన పర్యవసానంగా అక్కడి ప్రజానీకం భయం గుప్పెట్లో బతుకులీడుస్తున్నారు. ఈ ప్రాంతంలో సాగిస్తున్న నిర్మాణాల తీరుతెన్నులు చూస్తే భయాందోళనలు కలుగుతాయి. ఆసియాలో అతిపెద్దదైన, దీర్ఘమైన రోప్‌వే ప్రాజెక్టు నిర్మాణం ఇక్కడిదే. 420 మెగావాట్ల విష్ణుప్రయాగ్ జలవిద్యుత్ ప్రాజెక్టు, ఎన్‌టీపీసీకి చెందిన 520 మెగావాట్ల తపోవన్ జలవిద్యుత్ ప్రాజెక్టులతోపాటు చార్‌ధామ్ ప్రాజెక్టు పేరిట విశాలమైన రహదారులు, సొరంగాలు నిర్మాణమవుతున్నాయి. ఇవన్నీ నదీప్రవాహాలకు ఆటంకమవుతుంటే అవి తమ దోవ తాము వెదుక్కుంటున్నాయి. ఇక వలసలతో నానాటికీ పెరుగుతున్న జనాభా సంగతి సరేసరి. ఈ ప్రాంతం భూకంప జోన్‌లో ఉన్నదన్న జ్ఞానం కూడా పాలకులకు కొరవడింది.

మనిషి మనుగడకు ప్రకృతి వనరుల వినియోగం తప్పనిసరే. అందువల్ల సహజమైన సమతుల్యత ఏదోమేరకు దెబ్బతినడం కూడా అనివార్యమే. కానీ దాన్ని కనిష్ట స్థాయిలో ఉంచటం, మరీ ముఖ్యంగా ఎంతో సున్నితమైన హిమవత్పర్వత ప్రాంతంలో ప్రకృతిపట్ల భయభక్తులతో మెలగటం అవసరం. కార్పొరేట్ సంస్థల దురాశకూ, కాంట్రాక్టర్ల లాభార్జనకూ, స్వీయప్రయోజనాల రక్షణకూ యథేచ్ఛగా పర్యావరణ విధ్వంసానికి పూనుకుంటే ఏమవుతుందో జోషీమఠ్ ఉత్పాతం తెలియజెబుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ అభివృద్ధి పేరిట సాగిస్తున్న నిర్మాణాలే ప్రస్తుత దుస్థితికి కారణమని జోషీమఠ్ పీఠాధిపతి స్వామి అవిముక్తేశ్వరానంద్ చేసిన ఆరోపణల్లో నిజం లేకపోలేదు. ఇప్పటికైనా పాలకులు మేల్కొనాలి. పరిస్థితులు చేయిదాటిపోకుండా తక్షణ చర్యలకు ఉపక్రమించాలి. ఉత్తరాఖండ్ భౌగోళిక స్థితిగతుల ఆధారంగా పకడ్బందీ మాస్టర్‌ప్లాన్ రూపొందించి, అందుకు అనుగుణమైన చర్యలు తీసుకోవాలి.

లోహియా లోకదర్శన సులోచనాలు!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

తెలుగువారికి రామమనోహర్ లోహియా ఒక భారత సామ్యవాద నాయక శిరోమణిగానే తెలుసు. హిందూమతం పైనా, పురాణ గాథల పైనా ఆయన చేసిన ప్రగాఢ పరిశోధనలూ, ఆలోచనలూ మనకు దూరంగానే ఉండిపోయాయి. లోహియా ఇతిహాస వ్యాసాల పుస్తకం ఆయనలోని ఈ కోణాన్ని చేరువ చేస్తుంది. పురాణ పాత్రల మీద వెలుగు అన్నట్టేగానీ, ఆ పేరుతో అనేక రాజకీయ, సామాజిక, చారిత్రక సత్యాలు చాటారు. ఉత్తరాది వారు రావణ, కుంభకర్ణాదుల్ని దక్షిణాది వారిగా, రాక్షసులుగా చిత్రించి వధించే ధోరణిని తూర్పారబట్టారు. ఆయన దృష్టిలో శ్రీరాముడు ఉత్తర–దక్షిణ భారతదేశాల మధ్య ఐకమత్యానికి ప్రతీక కాగా, శ్రీకృష్ణుడు తూర్పు–పడమరల ఏకత్వానికి ప్రతీక.

"నాకు అవకాశం దొరకాలే గానీ ఈ భూమండలం సహా, యావత్తు గ్రహరాశిని సొంతం చేసుకొని ఏలుబడిలోకి తెచ్చుకొంటాను."

– భూస్వామ్య వ్యవస్థలో కూలి నాలి చేసుకొని బతికే శ్రమజీవుల కాయకష్టానికి విలువ కట్టిన ప్రసిద్ధ ఆర్థికవేత్త రికార్డో ప్రకటన.


పరాయి వలస పాలనకు వ్యతిరేకంగా అసమాన త్యాగాలతో పోరాడి దాన్నుంచి విముక్తి సాధించుకున్నారు వివిధ ఖండాల ప్రజలు. అయితే విమోచన తరువాత కూడా (స్వతంత్ర భారతం సహా) స్థానిక పాలకుల స్వార్థ ప్రయోజనాల వల్ల దోపిడీ వ్యవస్థలో మౌలికమైన మార్పు రాలేదు. ఈ సత్యాన్ని చాటినవారు భారత స్వాతంత్ర్య పోరాటంలో తలమునకలై తన సమకాలీన రాజకీయ సహచరుల పోకడలనూ, సైద్ధాంతిక రంగంలో ఆటుపోట్లనూ దగ్గరుండి గమనించిన రామమనోహర్ లోహియా. ఇటీవల లోహియా ఇతిహాస వ్యాసాల పేరిట 'పురాణ పాత్రలపై కొత్త వెలుగు' మకుటంతో లోహియా సమతా ట్రస్ట్ నిర్వాహకులు, నిరంతర అధ్యయనశీలి రావెల సోమయ్య ఒక ఉత్తమ సంకలన గ్రంథాన్ని ప్రచురించారు. రిషితుల్యుడు, ఆసియాలో తొలి సామ్యవాదిగా పేరెన్నికగన్న స్వామి వివేకానందకు ఈ సంపుటిని అంకితమిచ్చారు.

పేరుకు 'పురాణ పాత్ర'లపై ప్రసరించిన కొత్త వెలుగే. కానీ దాని చాటున అనేక రాజకీయ, సామాజిక, చారిత్రక సత్యాలు ఉన్నాయి. ఇంతవరకూ తెలుగువారికి లోహియా ఒక భారత సామ్యవాద నాయక శిరోమణిగానే తెలుసు. హిందూమతం పైనా, పురాణ గాథల పైనా ఆయన చేసిన ప్రగాఢ పరిశోధనలూ, ఆలోచనలూ హిందీ భాషా ప్రియులకు మాత్రమే లభ్యమవుతూ వచ్చాయి. ఆ లోటు ప్రస్తుత తెలుగు సంకలనంతో కొంతవరకు తీరుతుంది.

పురాణ పాత్రల ప్రస్తావనలో కూడా లోహియా ఆధారపడింది 'రొడ్డ కొట్టుడు' సరుకు మీద కాదు. ఎకాఎకిని ఏ మహోన్నతుని భావదీప్తిని అందిపుచ్చుకోవాలో సరిగ్గా ఆ ఉద్దండుని 'సహవాసాన్నే' లోహియా కోరుకున్నాడు. 'అవధి' అనే స్థానిక ప్రజల భాషకు వ్యతిరేకులైన సంస్కృత ఛాందసుల ఆగడాలను అతి కష్టం మీద వ్యతిరేకించి నిలబడిన పండిత తులసీదాస్ రామాయణ రచనను ప్రేమించినవాడు లోహియా! స్థానిక భాష 'అవధి'లో రచించిన రామాయణాన్ని కాపాడుకోవడానికి తులసీదాస్ పడిన కష్టాలు వర్ణనాతీతం. ఆ సమయంలో తులసీదాస్ గ్రంథాన్ని భద్రంగా కాపాడిన వ్యక్తి ముస్లిం సోదరుడు. రామలీల ఉత్సవాల్ని జరిపే ఉత్తరాది వారు రావణ, కుంభకర్ణాదుల్ని దక్షిణాది వారిగా, రాక్షసులుగా చిత్రించి వధించే ధోరణిని తూర్పారబట్టినవాడు లోహియా. ఆయన దృష్టిలో శ్రీరాముడు ఉత్తర–దక్షిణ భారతదేశాల మధ్య ఐకమత్యానికి ప్రతీక కాగా, శ్రీకృష్ణుడు తూర్పు–పడమరల ఏకత్వానికి ప్రతీక.

ఛాందసుల మాటేమోగానీ, లోహియాకు మాత్రం హిందూమతంలోనే లోపాయికారిగా పాతుకుపోయిన

రెండో మాట



రాజకీయ దూరదృష్టి ఆశ్చర్యం కల్గించింది. ఎందుకంటే, లోహియా భావనలో మతం, రాజనీతి పరిధులు, ఆశయాలు, వాటి పాటింపు వేరువేరుగా ఉంటాయి. కాబట్టి వాటిని కలపకూడదు. ఎందుకని? "మతం దీర్ఘకాలం ఉండే రాజనీతి కాగా, రాజనీతి అనేది కొంతకాలం మాత్రమే సాగే మతం"! మతం, రాజనీతుల్లో వివేకం లేకుంటే అవి రెండూ కలిసిపోయినప్పుడు దేశం నాశనమవుతుం దన్నాడు లోహియా! "రాజకీయ క్షేత్రంలో మతం చొరబడిపోయి దేశంలో ఎంత ఉద్వేగం, ఉద్రేకం, హింస, ద్వేషాలు ప్రబలిపోతు న్నాయో నేను కళ్లారా చూస్తున్నాను. దేశంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే మత కార్యకలాపాల్ని అరికట్టక తప్పదు"!

చరిత్రకారుడు విల్ డ్యూరాంట్ తన 'లెసన్స్ ఆఫ్ హిస్టరీ'లో సోషలిస్టు, క్యాపిటలిస్టు పరిణామ దశల గురించి వెలిబుచ్చిన భావాలతో లోహియా ఏకీభవిస్తున్నట్టు కన్పిస్తుంది: "పెట్టుబడిదారీ విధాన వ్యాప్తి గురించిన భీతితో సోషలిజం తన స్వేచ్ఛా పరిధిని విస్తృతం చేసుకొనక తప్పని స్థితి ఏర్పడినట్టే, సోషలిస్టు వ్యవస్థ విస్తృతిని గమనించి పెట్టుబడిదారీ వ్యవస్థ కూడా తన సమానత్వ పరిధిని విస్తృత పరుచుకొనక తప్పలేదు. ఫలితంగా రెండు విభిన్న ధృవాలూ త్వరలో ఏకమయ్యే పరిస్థితి ఉత్పన్నం కావొచ్చు"!

సోషలిజానికి శాశ్వత నిర్వచనాలుండవు, దాని నిత్య పరిణామంలో కొత్తగా అన్వేషిస్తూ ఉండవలసిందేనని లోహియా భావన. అంతేగాదు, మన తెలుగు భాషకు లోహియా అర్థవంతమైన భాష్యం కూడా చెప్పడం విశేషం! "తెలుగు భాషలో 'ఉ'కారాంత పదాలు తరచుగా దొరకడానికీ, తులసీదాస్ రాసిన 'అవధి' భాషలోనూ, తులసీ రామాయణంలోనూ ఈ 'ఉ'కారాంత పదాలు ఎక్కువగా ఉండటాన్నీ లోహియా పేర్కొంటాడు. పదాల చివర్లో 'ఉ' కలిపితే పదానికి తీపిదనం ఎక్కువవుతుందనీ, ఈ పద మాధుర్యం వెనుక విజయపురిని పాలించిన ఇక్ష్వాకు రాజుల భాషా ప్రభావం ఉండి ఉండవచ్చనీ, ఈ కారణం వల్లనే ఆంధ్రప్రదేశ్ నుంచి 'ఉ' అయోధ్యకు చేరిందో, లేదా అయోధ్య నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిందో తాను చెప్పలేననీ, కానీ, అవధి, తెలుగు భాషా పదాల పరస్పర వాడకం నిజంగా జరిగిందా అని మాత్రం తెలుసుకోవడం తనకిష్టమనీ అంటాడు. దీనివల్లే లోహియా అనేక ప్రాంతీయ భాషా శాసనాలను ఆసక్తితో చూడటం విశేషం.

కానీ ఒక్క అనుమానం – ఎన్నో విషయాలపైన ఇంతగా సాధికార వ్యాఖ్యలు అందించగల్గిన లోహియాకు క్రీస్తుపూర్వం 2100 సంవత్సరం నాటికే సుమేరియా నాగరికత సంపన్న పాలకుల ఆస్తిపాస్తులను, సేద్య యోగ్యమైన భూసంపదను ఎలా, ఏ పద్ధతుల ద్వారా పేద ప్రజలకు పంచి దుర్భిక్ష పరిస్థితులు తలెత్తకుండా చేయగలిగిందో అవగాహన లేకపోవడం ఒక మహా సోషలిస్టు నాయకుడిలో లోపంగా భావించవచ్చా?! ఎందుకంటే, అమెరికన్ మహా కోటీశ్వరుల్లో బలవంతుడైన రాక్‌ఫెల్లర్ కొడుకు జాన్ డి. రాక్‌ఫెల్లర్ అమెరికాలోని ఘరానా ప్రయివేట్ ట్రస్ట్ కంపెనీల గురించి ప్రస్తావిస్తూ ఓ గొప్ప నిజాన్ని బహిర్గతం చేశాడు: "అందమైన అమెరికన్ గులాబీ రోజాను దాని అందచందాలతో, మధుర సువాసనలతో పెంచడం మహా సులభమే. కానీ ఎలా? ఈ పెద్ద గులాబీని ఆసరా చేసుకొని దాని చుట్టూ మొగ్గ తొడుగుతూన్న చిన్న గులాబీలను కాస్తా తుంచి పారేయడం ద్వారా. ఆ పద్ధతిలో ఎదిగినవే అమెరికన్ ట్రస్టు కంపెనీలన్నీ." జూనియర్ రాక్‌ఫెల్లర్ మార్క్సిజం పరీక్షకు తనను తాను గురి చేసుకొన్నాడో లేదో తెలియదుగానీ, పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించే అసమ సామాజిక, అరాచక పరిస్థితులను బలైపోయిన శిశు 'రోజా' ఉదాహరణ ద్వారా బహిర్గతం చేయగలిగాడు.

నూరేళ్ల క్రితమే ఇంగ్లండ్ మహాకవి షెల్లీ 'ఇంగ్లండ్ ప్రజలకు విన్నపం' పేరిట ఇచ్చిన సందేశం విశ్వగీతికగా మార్మోగిపోయింది. పారిశ్రామిక విప్లవానంతరం పెట్టుబడిదారీ విధాన ఫలితాల వల్ల కష్టజీవులైన కార్మిక కుటుంబాలు అనుభవిస్తున్న వ్యథలను గమనించి, ఆ కష్టాలకు కర్మ సాక్షిగా ఆయన నిలబడ్డాడు.

"కష్ట జీవులారా! మీరు నాటే విత్తనాన్ని మరొకడు
అనుభవిస్తున్నాడు,
నీవు సృష్టించే సమాజ సంపదను మరొకడెవడో దొంగిలిస్తున్నాడు,
నీవు నేసే బట్టలను మరొకడెవడో ధరిస్తున్నాడు,
నీవు సృష్టించే ఆయుధాల్ని మరొకడు ధరిస్తున్నాడు.
విత్తనం నువ్వే నాటు, కానీ నియంతకు అందనివ్వకు,
సంపదను సృష్టించు, కానీ దుర్మార్గ పాలకుడికి అందనివ్వకు,
దుస్తులు కుట్టు, కానీ సోమరిపోతుకు అందనివ్వకు
ఆయుధాలు తయారుచెయ్యి, కానీ వాటిని నీ రక్షణకే
ఉపయోగించు."

abkprasad2006@yahoo.co.in

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అలా ఎందుకు?



ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ అంశం హిందుత్వ వర్సెస్ ముస్లింలు కాదు. ఆ ప్రాంతంలో 9 ఆలయాలు ఉన్నాయి. దాన్ని మానవత్వపు అంశంగా ఎత్తవచ్చు. కానీ కొన్ని శక్తులు మత-కార్డును వాడాయి. 2021లో పది వేల ఇళ్లను కూల్చడానికి సంబంధించిన ఉత్తర్వులకు సంబంధించి హరియాణాలోని కోహ్రీ గావ్ కేసులో ఇదే సుప్రీంకోర్టు వారికి అనుకూల తీర్పు ఇవ్వలేదు.

– జాహక్ తన్వీర్, కాలమిస్ట్

దిద్దుకుందాం



ఇండియాలో మంచి నాణ్యమైన గోధుమ పిండి 39 రూపాయలకు దొరుకుతోంది. డాలర్ మూల్యసామ్యం (పారిటీ)తో లెక్కగట్టినా పాకిస్తాన్‌లో అది అత్యంత ఖరీదే. మనం విఫలమయ్యామని ఒప్పుకోవడంలో ఏ చెడూ లేదు. ముందంటూ ఈ నిరాకరణ మైండ్‌సెట్‌లోంచి బయటపడితేనే మనం ఏవైనా దిద్దుబాటు చర్యలు చేపట్టగలం.

– సయ్యద్ షబ్బార్ జైదీ, పాక్ మాజీ మంత్రి

చేయకూడనిది



తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి తన శాసనసభ ప్రారంభోపన్యాసంలో – రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన పాఠంలోని పెరియార్, అంబేడ్కర్, అన్నా, కలైజ్ఞర్ భాగాలను వదిలేసి తన సొంత పాఠాంతరాలను కలిపారు. ఆయన అలా చేయకూడదు. ఇది రాజ్యాంగ విరుద్ధం.

– దిలీప్ మండల్, జర్నలిస్ట్

తప్పించుకుంటున్నారా?



నిజంగానే వాళ్ల ఉత్పత్తులు 'సురక్షితం, ప్రభావవంతం' అయితే ఫైజర్, మోడెర్నా కంపెనీల్లోని చాలామంది అధికారులు ఎందుకు ఉన్నట్టుండి మానేస్తున్నారు? ఊరికే అడుగుతున్నా.

– ఆండ్రూ బ్రిడ్జెన్, ఇంగ్లండ్ ఎంపీ

అన్యాయం



ఫ్రాన్సులో ప్రతి యేటా 'నియంత్రణల' పేరుతో సుమారు ఆరు లక్షల అడవి పందు లను సంహరిస్తున్నారు. అంటే, ఒక రోజుకు సుమారు 1,600 చొప్పున.


– డెబ్బీ బ్యాంక్స్, యాక్టివిస్ట్

బహుముఖ ప్రజ్ఞాశాలి

ఆధునికాంధ్ర సాహిత్యంలో సుప్రసిద్ధ కవి, ఆచార్యుడు, నటుడు, విమర్శకుడు, ఆకాశవాణి కార్యక్రమాల సలహాదారు ఆయన. అష్టదిగ్గజ కవుల్లో పింగళి సూరన వంశానికి చెందిన పింగళి లక్ష్మీ కాంతం బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన 1894 జనవరి 10వ తేదీన కృష్ణాజిల్లా అర్తమూరులో జన్మించారు. పాఠశాల విద్య మచిలీపట్నం హిందూ ఉన్నత పాఠశాలలో అభ్యసించారు. అప్పుడు చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి అక్కడ తెలుగు పండితుడుగా ఉన్నారు. పింగళి, విశ్వనాథ వంటి వారంతా చెళ్లపిళ్ల వారి శిష్యులే.

బందర్ నోబుల్ హైస్కూల్‌లో తెలుగు పండితుడిగా పింగళి కొన్నాళ్లు పనిచేశారు. తర్వాత మద్రాస్ ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీలో పరిశోధకుడిగా పనిచేశారు. 1931లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బీఏ ఆనర్స్ కోర్సు ప్రారంభించి పాఠ్య ప్రణాళికను రూపొందించారు. అన్ని విశ్వవిద్యాలయాలకు అదే ప్రామాణికమైన పాఠ్యప్రణాళిక.

ఆయన ప్రియమిత్రుడు, సహాధ్యాయి కాటూరి వెంకటేశ్వర రావుతో కలసి తొలి రోజుల్లో శతావధానాలు చేశారు. ఇద్దరూ జంట కవులుగా రచించిన 'సౌందర నందం' కావ్యాన్ని తమ గురు వైన చెళ్లపిళ్ల వేంకట శాస్త్రికి అంకితం ఇచ్చారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ ఆచార్యుడిగా 1961-65 మధ్య పని చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 18 సంవత్సరాలు పనిచేసి 1949లో పదవీ విరమణ చేశారు.



పింగళి లక్ష్మీకాంతం

ఆయన బోధనల నోట్సులు ఆంధ్ర సాహిత్య చరిత్ర, విమర్శకు ప్రామాణి కాలు. తర్వాత వాటిని ఆంధ్ర సాహిత్య చరిత్ర, సాహిత్య శిల్ప సమీక్షలుగా ఆయనే ప్రచురించారు. అవి ఎంతో ప్రసిద్ధి పొందాయి. ఆయన రూపొందించిన సంస్కృత 'కుమార వ్యాకరణం' ఎన్నో విశ్వవిద్యాలయాల్లో పాఠ్య గ్రంథంగా ఉంది. ఆయన రేడియో ప్రసంగాలు, గౌతమ వ్యాసాలు విమర్శకు నిలువెత్తు నిదర్శనాలు. ఆయన రచించిన మధుర పండితరాజం, గంగాలహరి, తేజోలహరి ప్రసిద్ధి పొందాయి. ఆయన గౌతమ నిఘంటువు (ఇంగ్లీషు–తెలుగు) ప్రామాణికమైంది.

పింగళి 1954 నుండి 1961వరకు విజయవాడ ఆకాశవాణి కేంద్రం సలహాదారుడిగా గొప్ప కార్యక్రమాలు రూపొందించారు. నటుడిగా పాండవోద్యగ విజయాల్లో ధర్మరాజుగా, ముద్రారాక్షసం నాటకంలో రాక్షస మంత్రిగా ప్రేక్షకుల మన్ననలు పొందారు. పింగళివారు 1972 జనవరి 10 తేదీన పరమదించారు. సాహితీ ప్రియుల హృదయాల్లో ఆయన చిరస్మరణీయులు.

– డాక్టర్ పీవీ సుబ్బారావు, సాహితీ విమర్శకులు I 98491 77594

(నేడు పింగళి లక్ష్మీకాంతం జయంతి, వర్ధంతి)

జీవ వైవిధ్యం రక్షణ లక్ష్యాలు నెరవేరేనా?

కెనాడా నగరం మాంట్రియల్‌లో 2022 డిసెంబర్‌లో జరిగిన 15వ జీవవైవిధ్య సదస్సులో కుదిరిన ఒప్పందంలో పేర్కొన్న లక్ష్యాలను ఆహ్వానించవలసిందే. అయితే వాస్తవ పరిస్థితులను చూస్తే లక్ష్యాలు నెరవేరతాయా అనిపిస్తోంది. భారత్ సహా 190 దేశాల ప్రతినిధులు పాల్గొని చర్చించి ఒక ఒప్పందం చేసుకున్నారు. 2030 నాటికి ఈ ధరిత్రిపై 30 శాతం జీవవైవిధ్యం కాపాడాలన్నది ఒప్పందంలో ప్రధాన అంశం. ఈ విశ్వంలోగల జీవరాశులన్నిటినీ కలిపి జీవావరణం అంటున్నాం. జీవరాశులన్నీ సురక్షితంగా ఉంటేనే జీవవైవిధ్యం చక్కగా ఉంటుంది. అయితే ఇప్పటికే జీవవైవిధ్యం గణనీయంగా ధ్వంసమైపోయింది. ఇందుకు ప్రధానకారణం మానవ కార్యకలాపాలే.


1972లో స్టాక్‌హోమ్‌లో జరిగిన ధరిత్రి పరిరక్షణ సదస్సు తర్వాత ఐక్యరాజ్య సమితి (ఐరాస) ఆధ్వర్యంలో ఇంతవరకు 27 కాప్ సదస్సులు జరిగాయి. మొత్తం సదస్సుల్లో క్యోటో ఒప్పందం, గతంలో జరిగిన మాంట్రియల్ ఒప్పందం, పారిస్ సదస్సు, 2021లో జరిగిన గ్లాస్గో, 2022లో ఈజిప్టు షర్మెల్ షేక్ నగరంలో జరిగిన సదస్సుల్లో జరిగిన ఒప్పందాలను ఇప్పటివరకు అమలు చేయలేదు. చేసినా అరకొర నిర్ణయాలే తీసుకొని అమలు చేశారు.

గ్లాస్గో ఒప్పందంలోనే 2030 నాటికి సాధించవలసిన లక్ష్యా లను నిర్ణయించారు. వీటిలో చాలా తక్కువగానే సాధిం చారనీ, రానున్న ఐదేళ్ల కాలంలో సైతం సాధించే అవకాశం కనిపించడంలేదనీ, ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెర్రెస్ ఆయా ప్రభుత్వాలు సమర్పించిన ఐదేళ్ల ప్రణాళికలను బట్టి గ్లాస్గో సదస్సుకు ముందు ప్రకటించారు. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన జీవ వైవిధ్య సదస్సు చేసిన నిర్ణయాలను, లక్ష్యాలను సాధించడం సాధ్యమేనా?

ఇప్పటికే 14 లక్షల జీవజాతులు అంతరించాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. పరిశోధకుల అంచనా మేరకు గడచిన నాలుగు వందల కోట్ల సంవత్సరాల జీవపరిణామ క్రమంలో జీవవైవిధ్యం ఏర్పడింది.

దీని పరిరక్షణకు ముందు వ్యవసాయంలో సమూల మార్పులు తీసుకురావలసి ఉంది. ఇందులో భాగంగా కృత్రిమ ఎరువులు, పురుగు మందులను నిలిపి వేసి సంప్రదాయ సేద్యాన్ని చేపట్టాలి. ఇది చాలా నెమ్మదిగా, దీర్ఘకాలం అమలు చేయవలసిన ప్రక్రియ. 2030 నాటికి ఈ మార్పును సాధించగలమా?

జీవ వైవిధ్య రక్షణ ఒప్పందం అమలు చేయాలంటే ధనిక దేశాలు... పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలకు నిధులు సమకూర్చాలనీ, లేకపోతే ఒప్పందం నుండి వైదొలగుతామనీ కాంగో చివరిలో హెచ్చరించింది. అనేక దేశాలు ఈ బాటను ఎంచుకొనే అవకాశం ఉంది. వ్యవసాయానికిచ్చే సబ్సిడీలను కొనసాగించాలని భారత్, ఇతర అభివృద్ధి చెందిన దేశాలు డిమాండ్ చేశాయి. అమెరికా తదితర కొన్నిదేశాలు 60 శాతానికి పైగా సబ్సిడీలు ఇస్తున్నాయి. సబ్సిడీల విషయాన్ని తుది ఒప్పంద



పత్రంలో చేర్చారా లేదా అన్న సందేహాలు వ్యక్తమయ్యాయి. సబ్సిడీలు లేకపోతే వ్యవసాయం సంక్షోభంలో పడి ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది. అయితే ఆర్థిక రంగానికి హాని కలిగించే సబ్సిడీలను తగ్గించాలని ఒప్పందంలో చేరుస్తామని ఒప్పందం రూపొందించిన దేశాలు చెప్పాయి.

ఈ లక్ష్యాలను 2030 నాటికి సాధించాలంటే కేవలం ఆసియా – పసిఫిక్ ప్రాంత దేశాలకే 300 బిలియన్ డాలర్లు అవసరం అవుతాయని ఆ ప్రాంత ఐరాస ఆర్థిక, సామాజిక కమిషన్ (యుఎన్‌ఈపీ) అంచనా వేసింది. 2025 నాటికి 20 బిలియన్ డాలర్లు మాత్రమే ఆర్థిక సహాయం చేస్తామని సంపన్న దేశాలు అంగీకరించాయి. మరి లక్ష్యాలు సాధించడం సాధ్యమవుతుందా?

వాతావరణ విపత్తులు... పర్యావరణ కాలుష్యం, భూతాపం పెరుగుదల మూలంగా అధికమయ్యాయి. 200 ఏళ్లకు పైగా పారిశ్రామికీకరణ, పెట్రో ఉత్పత్తులు, వ్యవసాయానికి వినియోగిస్తున్న రసాయన ఎరువులు, పురుగుమందులు, విచ్చలవిడిగా అడవుల నరికివేత పెరిగాయి. మన దేశంలో 75 జిల్లాల్లో వాతావరణ వైపరీత్యాలు సంభవిస్తున్నాయని వివిధ అధ్యయనాలతో పాటూ, వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి జాతీయ బ్యాంకు ప్రకటించింది. ఇక అభివృద్ధి పేరుతో విధ్వంసం జరుగుతుందనేది వాస్తవం. ఇందుకు తాజా ఉదాహరణలు లక్షదీవులు, నికోబార్ దీవుల్లో జరుగుతున్న విధ్వంసం. ఈ ప్రాంతాల్లో వందలు, వేల ఎకరాల భూభాగంలో పచ్చదనం నాశనం అవుతోంది. ఫలితంగా వేలాదిమంది ఆదివాసీ తెగల జన జీవనం మళ్లీ కోలుకోలే నంతగా దెబ్బ తింటోంది. వందలాది పక్షులు, జంతువుల రకాలు, ఇతర లెక్కలేనన్ని జీవ రాసులు అంతరించిపోతాయి. సుదీర్ఘ కాలంగా ఈ ప్రాంతాల్లో నెలకొని ఉన్న జీవ వైవిధ్యం మళ్లీ కనిపించదు.

ప్రపంచ వ్యాప్తంగా అడవుల్లో నివసించే జంతువులు, పక్షులు, క్షీరదాలు, సరీసృపాలు తదితర అనేక రకాల జీవులలో 1970 నుంచి ఇప్పటి వరకు 69 శాతం నశించాయని లివింగ్ ప్లానెట్ రిపోర్టు (ఎల్‌పీఆర్)- 2022 నివేదిక తెలిపింది. ప్రపంచ జంతుజాల నిధి సంస్థ పరిధిలో ఎల్‌పీఆర్ పని చేస్తోంది.

భారత ప్రభుత్వం వాతావరణంపై 2023లో అనేక సవాళ్లను ఎదుర్కోవలసి ఉంటుంది. గతేడాది పారిస్ ఒప్పందంలో భాగంగా జాతీయ నిర్ణయ కార్యాచరణలు (ఎన్‌డీసీలు) రూపొందించింది. తక్కువ కాలుష్యం వెలువరించే దీర్ఘకాలిక కార్యాచరణను మన ప్రభుత్వం ప్రకటించింది. అలాగే 2070 నాటికి కాలుష్య రహిత వాతావరణం సాధిస్తామని పారిస్ సదస్సులో ప్రకటించింది. మరి ఈ లక్ష్యాలను సాధించి మన దేశమన్నా మాట నిలుపుకొంటుందేమో చూడాలి.

– టీవీ సుబ్బయ్య, సీనియర్ జర్నలిస్ట్

శుభస్య శీఘ్రం

బంగ్లాదేశ్ క్రికెట్ జట్టుకు ఒక ఫీల్డింగ్ శిక్షకుడున్నాడు. షేన్ మెక్ డెర్మాట్. ఈ మధ్య ఆయన ఒక చక్కని జీవిత సత్యం చెప్పాడు. 'ఆటగాడు కొట్టిన బంతి ఎంత ఎత్తుకు వెళితే, దాన్ని 'క్యాచ్' పట్టుకోవటానికి ఫీల్డరుకు అంత ఎక్కువ సమయం ఉంటుంది. కనక, అలాంటి 'క్యాచ్'లు తేలికగా పట్టు కోగలగాలి. కానీ అలాంటి 'క్యాచ్'లలో సగంపైన మా వాళ్ళు వదిలేస్తు న్నారు' అన్నాడు. దీనికి ఆయన ఒక్క మాటలో చెప్పిన కారణం: 'మనసు'!

'బంతి పట్టుకొనేందుకు ఎక్కువ సమయం ఉంటే, మనసు తన విశ్లేషణా, ఊగులాటా ప్రారంభిస్తుంది. 'పట్టు కోగలనో? లేనో?' అన్న శంకా, దాని వెనక జంకూ, మనసంతా నిండేందుకు వ్యవధి ఉంటుంది. విశ్వాస లోపం అంటూ కలగాలేగానీ, వైఫల్యం దాని వెనకే అంటిపెట్టుకొని ఉంటుంది కదా! అందువల్ల 'క్యాచ్' చేజారి పోతుంది. అదే మెరుపు వేగంతో చేతికొచ్చే కష్టమైన 'క్యాచ్'లయితే మావాళ్ళు టక్కున పట్టేస్తున్నారు. అప్పుడు ఆలోచించే అవకాశమే ఉండదు కనక, వైఫల్య భయం ఏర్పడటానికి కూడా వ్యవధి చాలదు' అన్నాడు.



జీవితంలోనూ అంతే కదా! ఈ ఊగిసలాట తత్త్వం –'చాంచల్యం' – చాలా సందర్భాలలో మంచి పనులు తలపెట్టిన మనిషిని వెనక్కు లాగుతుంటుంది. 'చేద్దాంలే, చేద్దాంలే' అని తాత్సారం చేసిన కొద్దీ, మాయదారి మనస్సును నమ్మటానికి లేదు. అది ఆలో చనల పుట్ట. కామ లోభాలకూ, క్రోధ మోహాలకూ కార్య స్థానం. ఏ మాత్రం అవకాశం చిక్కినా, నిరాధారమైన భయాలూ, పిరికితనాలూ, 'దురా'లోచనలూ దాన్ని కబ్జా చేసేస్తాయి. చెదరగొట్టి, బెదరగొట్టి, చెడగొడతాయి. అందువల్ల మనిషి, తను తలపెట్టిన కాసిని మంచి పనులు కూడా, మనసు సహాయ నిరాకరణ కారణంగా మాని వేయాల్సి వస్తుంది. ఎక్కువ ఆలోచించిన కొద్దీ, మనసు సత్సంకల్పాలకూ సత్కార్యాచరణలకూ దూరంగా మళ్లి పోయే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది. అందుకే దానం, ధర్మం, పరోపకారం లాంటి మంచి పనులు చేయదలచుకొన్న వాళ్ళు ఆ పనులు ఎంత త్వరగా పూర్తి చేసుకొంటే అంత మంచిదని పెద్దలు చెప్తుంటారు. పుణ్య కార్యాలకూ, శుభ కార్యాలకూ, 'శుభస్య శీఘ్రం' అంటూ ఉంటారు.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, **తిథి:** బ.తదియ ఉ.9.43 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** ఆశ్లేష ఉ.7.20 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** రా.8.26 నుండి 10.12 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.50 నుండి 9.32 వరకు, తదుపరి రా.10.50 నుండి 11.40 వరకు, **అమృతఘడియలు:** లేవు. ; **రాహుకాలం :** ప. 3.00 నుంచి 4.30 వరకు; **యమగండం :** ఉ.9.00 నుండి 10.30 వరకు; **సూర్యోదయం** 6.38 ; **సూర్యాస్తమయం** 5.38.

క్లుప్తంగా...

ఫిబ్రవరిలో పోడు భూములకు పట్టాలు



సాక్షి, మహబూబాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోడు రైతులకు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఫిబ్రవరిలో చేపట్టనున్నట్లు రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. ఈనెల 12న ముఖ్యమంత్రి కేసీఆర్ మహబూబాబాద్ పర్యటన నేపథ్యంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌లు సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సత్యవతి మాట్లాడారు. మహబూబాబాద్‌లో సీఎం కేసీఆర్‌తో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయాలని అనుకున్నామని అన్నారు. సభలో గిరిజనులకు పోడు భూములకు సంబంధించి పట్టాలు పంపిణీ చేసేందుకు సమాయత్తమయ్యామని చెప్పారు. అయితే కొన్ని సాంకేతిక కారణాల వల్ల పట్టాల పంపిణీలో జాప్యమవుతోందన్నారు. ఫిబ్రవరిలో మహబూబాబాద్‌లో భారీ బహిరంగ సభ పెట్టి పట్టాలు పంపిణీ చేసేందుకు వస్తానని సీఎం చెప్పినట్లు మంత్రి వివరించారు. అప్పటివరకు గిరిజనులు వేచి ఉండాలని, అర్హులైన వారందరికి పట్టాలు అందజేస్తామని ఆమె పేర్కొన్నారు.

తెలంగాణ చేనేత రంగంపై మహారాష్ట్ర అధ్యయనం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో నేత కార్మికులు అనుసరిస్తున్న టెక్నిక్, డిజైన్లతో పాటు అమలవుతున్న పథకాలను అధ్యయనం చేసేందుకు మహారాష్ట్రకు చెందిన అధికారుల బృందం ఈనెల 8, 9 తేదీల్లో తెలంగాణలో పర్యటించింది. సిద్దిపేట, సిరిసిల్లలో పర్యటించిన మహారాష్ట్ర అధికారుల బృందం ఆదర్శ, సిద్దిపేట చేనేత సహకార సంఘాల ప్రతినిధులతో ఆదివారం భేటీ అయింది. గొల్లభామ, రామప్ప చీరల నేతలో వాడే దారాలు, నేత కార్మికులకు అందుతున్న వేతనాలు, చీరల తయారీలో వాడుతున్న టెక్నిక్‌ను తెలుసుకున్నారు. సిరిసిల్ల టెక్స్‌టైల్ అపెరల్ పార్కును సందర్శించిన మహారాష్ట్ర బృందం రేపియర్, సెమీ ఆటోమేటిక్ పవర్ లూమ్ పనితీరును అధ్యయనం చేయడంతో పాటు చేనేత మిత్ర, నేతన్నకు బీమా, నేతన్నకు చే యూత, జియోట్యాగింగ్ వంటి పథకాల గు రించి తెలుసుకున్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి చేనేత కార్మి కుల సహకార సొసైటీని సందర్శించి ఇక్కత్ డిజైన్ల గురించి వివరాలు తెలుసుకున్నారు. ఇక్కత్‌కు నైపుణ్యం అవసరమని కార్మికులు వివరించారు.

తాగి వేధిస్తున్నాడని.. తగలబెట్టేశారు



శ్రీకాంత్‌రెడ్డి

తాడూరు: నిత్యం తాగి తమను వేధింపులకు గురిచేస్తున్న కన్న కొడుకును తల్లిదండ్రులే దారుణంగా హతమార్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని ఇంద్రకల్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు నర్సింహారెడ్డి, విమలమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. రెండో కుమారుడు, మూడో కుమారుడు హైదరాబాద్‌లో జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి (38) తాగుడుకు బానిసయ్యాడు. నిత్యం తాగి వచ్చి తల్లిదండ్రులను వేధింపులకు గురిచేసే వాడు. ఈ క్రమంలోనే సోమవారం తాగి ఇంటికి వచ్చిన శ్రీకాంత్‌రెడ్డి తల్లిదండ్రులతో ఘర్షణకు దిగాడు. గొడవలో కొడుకును తోసేయడంతో అతను కిందపడగా.. వెంటనే వరి గడ్డి వేసి పెట్రోల్ పోసి నిప్పంటించారు. దీంతో తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీ సులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై శ్రీకాంత్‌రెడ్డి తమ్ముడు రవీందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మిర్చిపై 'నల్ల తామర' పంజా!

- ఈసారీ మిరప పంటను ఆశించిన పురుగు
- రాష్ట్రంలో 2.4 లక్షల ఎకరాల్లో సాగు
- ఇప్పటికే 90 వేల ఎకరాలకు విస్తరించిన నల్లతామర పేను
- రంగంలోకి సీఐపీఎంసీ, ఎన్‌బీఏఐఆర్ శాస్త్రవేత్తలు
- ఆరు జిల్లాల్లో పర్యటన.. రైతులకు సూచనలు
- పంట దక్కకపోతే తాము అప్పులపాలేనంటూ రైతుల ఆందోళన



పంట నష్టంపై రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

సాక్షి, మహబూబాబాద్: గత ఏడాది మిర్చి రైతులను గగ్గోలు పెట్టించిన నల్లతామర పురుగు మళ్లీ పంజా విసురుతోంది. మెల్లగా 40శాతం పంటకు వ్యాపించిన పురుగు.. మిర్చి పంటను నిలువునా నాశనం చేస్తోంది. ఎన్ని మందులు కొట్టినా ఫలితం ఉండటం లేదని, పూత రాలిపోయి మొక్కలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఈ పురుగు సోకిన విషయం తెలిసిన నేషనల్ బ్యూరో ఆఫ్ అగ్రికల్చరల్ ఇన్‌సెక్ట్ రిసోర్సెస్ (ఎన్‌బీఏఐఆర్)–బెంగళూరు, సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్ (సీఐపీఎంసీ)–హైదరాబాద్ శాస్త్రవేత్తలు రంగంలోకి దిగారు. పలు జిల్లాల్లో పంటలను పరిశీలిస్తూ.. రైతులకు సూచనలు ఇస్తున్నారు.

గత ఏడాది ఆగమాగం చేసి..

గత ఏడాది రాష్ట్రంలో మిర్చి పంటకు నల్లతామర పురుగు సోకింది. మొదటి పూత సమయంలోనే ప్రతాపం చూపింది. వేల ఎకరాలకు విస్తరించి తీవ్ర నష్టం కలగజేసింది. చాలా మంది రైతులు పెట్టుబడి కూడా చేతికి రాక అప్పుల పాలయ్యారు. మనస్తాపానికి గురై ఒక్క మహబూబాబాద్ జిల్లాలోనే 24మంది మిర్చి రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. అయితే మిర్చికి మంచి ధర ఉండటంతో ఈసారైనా పంట బాగుంటే అప్పులు తీర్చుకోవచ్చన్న ఉద్దేశంతో అదే పంట వేశారు. మొత్తంగా రాష్ట్రంలో 2,41,908 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. ఇందులో చాలా మంది రైతులకు మొదటి పూత దశ వరకు పంట బాగానే ఉండటంతో సంతోషపడ్డారు. కానీ మొదటి కాత పడిన కొద్దిరోజులకే మళ్లీ నల్లతామర పురుగు సోకింది. ఇప్పటివరకు 90వేల ఎకరాలకుపైగా వ్యాపించింది. మరింతగా విస్తరిస్తుండటంతో రైతులు ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. భూమి చదును చేయడం నుంచి విత్తనాల సేకరణ, ఎరువులు, పురుగు మందులదాకా మిర్చి సాగుకోసం ఇప్పటివరకు ఎకరానికి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు.

సోకిన ఒకట్రెండు రోజుల్లోనే..

నల్లతామర పురుగు సోకితే ఒకట్రెండు రోజుల్లోనే పంటకు తీవ్ర నష్టం జరుగుతోందని రైతులు చెప్తున్నారు. చేనులో పూలన్నీ రాలిపోతున్నాయని.. చెట్టు మోడుబారడం మొదలవుతోందని అంటున్నారు. పంటను రక్షించుకునేందుకు రకరకాల మందులు వాడామని.. పది, పదిహేను రోజుల్లో ఎకరానికి రూ.40 వేలకుపైగా విలువచేసే మందులు పిచికారీ చేసినా లాభం లేదని వాపోతున్నారు.

జిల్లాల్లో శాస్త్రవేత్తల పరిశీలన

నల్లతామర సోకిన విషయం తెలుసుకున్న ఎన్‌బీఏఐఆర్ శాస్త్రవేత్తలు కె.శ్రీదేవి, రచన, కందన్, సీఐపీఎంసీ శాస్త్రవేత్తలు సునీత, నీలారాణి, రవిశంకర్‌లతోపాటు ఐఐహెచ్ఆర్ శాస్త్రవేత్తలు శ్రీధర్, వెంకటరమణ, ఇతర ఉద్యాన శాస్త్రవేత్తలు వారం రోజులుగా రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. మిర్చిసాగు అధికంగా ఉన్న ఖమ్మం, మహబూబాబాద్, గద్వాల, భద్రాద్రి కొత్తగూడెం, వనపర్తి, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ జిల్లాలకు వెళ్లి.. గత ఏడాదికి ఇప్పటికి పురుగులో వచ్చిన తేడా, పంటను ఆశించిన తీరును పరిశీలించారు. నల్ల తామర నియంత్రణ కోసం బవేరియా భాసియానా, లెకానీసీలియం లెకానీ, సూడోమోనాస్, బ్యాసిల్లస్, సబ్‌టైలిస్ పౌడర్లను ప్రయోగాత్మకంగా రైతుల మిర్చి తోటల్లో పిచికారీ చేయించారు.

కీటకనాశని జీవ శిలీంధ్రాలతో ఫలితం



నల్ల తామర పురుగు నివారణ కోసం ఎన్‌బీఏఐఆర్ శాస్త్రవేత్త కందన్ నేతృత్వంలో తయారుచేసిన కీటకనాశని జీవ శిలీంధ్రాలు మంచి ఫలితం ఇస్తున్నాయి. కర్ణాటకలోని మిర్చి తోటలపై ప్రయోగాత్మకంగా పిచికారీ చేశాం. తెలంగాణలోనూ అదే రకమైన నల్లతామర పురుగు ఆశించినట్టు నిర్ధారించాం. ఇక్కడా బ్యాసిల్లస్, సూడోమోనాస్ తదితర మందులను పిచికారీ చేయించాం. పంటలు రికవరీ అయ్యే అవకాశం ఉందని భావిస్తున్నాం. – కె.శ్రీదేవి, ఎన్‌బీఏఐఆర్ శాస్త్రవేత్త

రైతులు జాగ్రత్తలు పాటించాలి



తెలంగాణలో మిర్చి అధికంగా సాగుచేసిన ఏడు జిల్లాల్లో పర్యటించాం. పురుగు తీవ్రత గత ఏడాది కన్నా తక్కువగా ఉంది. గత ఏడాది సన్నమిర్చి రకాలకు రాలేదు. కానీ ఇప్పుడు తేజ రకం విత్తనాలకు ఎక్కువగా ఆశిస్తున్నట్టు గుర్తించాం. దీనికి విరుగుడు బ్యాక్టీరియా, శిలీంధ్రాలతో తయారుచేసిన కీటక నాశనులే అని ప్రయోగాల్లో తేలింది. రైతులు విత్తన శుద్ధి, పంట మార్పిడి మొదలైన సస్యరక్షణ చర్యలు కూడా పాటించాలి. – లీలారాణి, సీఐపీఎంసీ శాస్త్రవేత్త

కంటెంట్ ఉంటే ఎవరైనా పాన్ ఇండియా లీడర్

- పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కేటీఆర్



కేటీఆర్‌తో దశరథ్

బంజారాహిల్స్: సృజనాత్మక కంటెంట్ అంటే తనకు చాలా ఇష్టమని మంత్రి కేటీఆర్ అన్నారు. కంటెంట్ ఉంటేనే ఎవరైనా లీడర్‌గా అవుతారని చెప్పారు. సోమవారం దర్శక, రచయిత దశరథ్ రాసిన 'కథా రచన' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'వక్తల ప్రసంగం వెనుక ఎంతో విషయ పరిజ్ఞానం ఉంటుంది. కరోనా సమయంలో సీఎం కేసీఆర్ ప్రసంగం కోసం ఎంతోమంది ఎదురు చూసేవారు. ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా చెప్పడం సీఎం కేసీఆర్ లక్షణం' అని అన్నారు. సినీపరిశ్రమలో అజ్ఞాతశూరులు ఎంతో మంది ఉంటారని చెప్పారు. దేశంలో ప్రస్తుతం తెలుగు సినిమాల హవా నడుస్తోందని, కంటెంట్ ఉన్న సినిమా పాన్ ఇండియా సినిమా కాగలిగినప్పుడు.. కంటెంట్ ఉన్న వ్యక్తి పాన్ ఇండియాకు వెళ్లలేరా అని ప్రశ్నించారు. కంటెంట్ ఉంటే ఎవరైనా పాన్ ఇండియా లీడర్ అవుతారని కేటీఆర్ అన్నారు. తనకు సినిమాలు, కంటెంట్ ఉన్న పుస్తకాలు, పేపర్ చదవడం ఇష్టమన్నారు. మంచి పుస్తకం కనిపిస్తే చదవాలనే ఆసక్తి ఉంటుందన్నారు. మొదటి నుంచి విజువల్ కంటెంట్ ఇష్టమని, ఒక కథని చిత్రరూపంలో మనసుకి హత్తుకునేలా చెప్పడం గొప్ప నైపుణ్యమన్నారు. కథా రచన లాంటి అద్భుతమైన పుస్తకం వచ్చినప్పుడు.. ప్రచురించేందుకు ముందుకొచ్చిన భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణను మంత్రి అభినందించారు. ఇంత చక్కటి పుస్తకం రాసిన దశరథ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శకులు వీవీ వినాయక్, హరీష్ శంకర్, నాగ్ అశ్విన్‌లతో పాటు వీ ఎన్ ఆదిత్య, కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.

మానవత్వంలో 'రాజా'రాం...

- అవ్వకు ఇల్లు కట్టించిన ఎస్‌ఐ



వరంగల్ జిల్లా నల్లబెల్లికి చెందిన మేడిపల్లి సమ్మవ్వ(సమ్మక్క) కుమారుడు సంపయ్య ఇరవై ఏళ్లక్రితం చనిపోగా, భర్త అయిలయ్య ఏడాది క్రితం అనారోగ్యంతో కాలం చేశాడు. దీంతో ఎవరూ లేని ఆమె గ్రామంలో భిక్షాటన చేస్తూ బతుకుతోందని స్థానికులు ఎస్సై నార్లాపురం రాజారాం దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆయన 'ఆమె అనాథ కాదు.. బాగోగులు నేను చూసుకుంటా.. ఉండేందుకు ఇల్లు కటించే బాధ్యత నాదే'' నని చెప్పి... అన్నట్టుగానే సొంత డబ్బులతో ఇల్లు కట్టించి సోమవారం గృహప్రవేశం చేయించారు. స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో ఏసీపీ సంపత్‌రావు ప్రత్యేక పూజలు చేసి రిబ్బన్ కటింగ్ చేసి గృహప్రవేశం చేశారు. అనంతరం సమ్మవ్వకు ఏసీపీ చేతుల మీదుగా నిత్యావసర సరుకులు అందించారు. అనాథ అవ్వను దత్తత తీసుకున్న రాజారాంను అందరూ అభినందించారు. – నల్లబెల్లి

ప్రమాదమా.. తగలబెట్టారా?

- కారులో వ్యక్తి సజీవ దహనం
- ఘటనా స్థలం వద్ద పెట్రోల్ బాటిల్ లభ్యం
- హత్య వెనక కుట్ర ఏమైనా ఉందా? అని పోలీసుల దర్యాప్తు
- మృతుడు మెదక్ జిల్లా బీమ్లాతండాకు చెందిన ధర్మాగా గుర్తింపు
- రాష్ట్ర సచివాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు





దగ్ధమైన కారు. (ఇన్‌సెట్‌లో) ధర్మానాయక్

టేక్మాల్(మెదక్): కారులో ఓ వ్యక్తిని సజీవ దహనం చేసిన ఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు విచారణ జరపగా కారులో దహమైన వ్యక్తిని వెంకటాపూర్ పంచాయతీ పరిధిలోని బీమ్లాతండాకు చెందిన పాత్‌లోత్ ధర్మానాయక్‌గా గుర్తించారు. అల్లాదుర్గం సీఐ జార్జ్ కథనం ప్రకారం.. పాతులోత్ ధర్మానాయక్ (48) రాష్ట్ర సచివాలయంలోని ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నెల 5వ తేదీన ఆయన కుటుంబ సభ్యులతో కలసి స్వగ్రామం వచ్చారు. 6వ తేదీన తన మిత్రులతో కలిసి బాసరకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరారు. ఆదివారం రాత్రి భార్యకు ఫోన్ చేసి ఇంటికి వస్తున్నానని చెప్పారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం గ్రామ శివారులోని చెరువు కట్ట కింది భాగంలో దహనమైన కారులో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్టు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న దుస్తులు, బ్యాగు ఆధారంగా మృతుడిని పాతు లోత్ ధర్మానాయక్‌గా గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య నీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కారులో ధర్మానాయక్ సజీవ దహనమైన చోట పెట్రోల్ బాటిల్ పడి ఉండటంతో ఎవరైనా కుట్రతో హత్య చేసి, కారులో పడేసి తగలబెట్టారా.. లేదా ఏదైనా ప్రమాదామా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇద్దరు కూతుళ్లు జార్ఖండ్‌లోని ఐఐటీలో విద్యనభ్యసిస్తున్నారు. కుమారుడు హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ సెకండ్ ఇయర్ చదువుతున్నట్లు స్థానికులు తెలిపారు.

కారుతో తొక్కించి.. దారుణంగా హతమార్చి..

- నడిరోడ్డుపై హత్య చేసి.. రోడ్డు ప్రమాదంగా చిత్రీకరణ
- బీమా డబ్బుల కోసం హైడ్రామా
- హత్యకు ఓ హెడ్‌కానిస్టేబుల్ పథక రచన
- ఏడాది తర్వాత కేసును ఛేదించిన పోలీసులు



హత్యకు పాల్పడిన నిందితులు

షాద్‌నగర్: బీమా డబ్బులు కాజేసేందుకు నలుగురు వ్యక్తులు డ్రామా ఆడారు. యువకుడిని హాకీ స్టిక్‌తో కొట్టి నడిరోడ్డుపై పడేసి కారుతో తొక్కించి దారుణంగా హత్య చేశారు. ఆపై రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారు. ఏడాది క్రితం జరిగిన ఈ కేసును పోలీసులు ఛేదించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పరిధిలోని మొగిలిగిద్ద శివారులో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి కేసును షాద్‌నగర్ పోలీసులు ఛేదించి నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ వివరాలను సోమవారం షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో శంషాబాద్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి వెల్లడించారు.

కంపెనీ ఏర్పాటు చేసి.. : వరంగల్ జిల్లా చెన్నారావు పేట మండలం బోడ తండాకు చెందిన బోడ శ్రీకాంత్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ కొంత కాలంగా హైదరాబాద్ బాచుపల్లిలోని శ్రేష్ట రెసిడెన్సీలో నివాసం ఉంటున్నాడు. ఓ కంపెనీ ఏర్పాటు చేసి ఫేక్ ఉద్యోగాలు సృష్టించాడు. పని చేస్తామంటూ వచ్చిన వారి పేర్లపై క్రెడిట్‌కార్డులు తీసుకొని, వాటి ద్వారా డబ్బులు తీసుకుంటూ బ్యాంకులను మోసం చేస్తూ విలాసవంతమైన జీవితం సాగిస్తున్నాడు. గుంటూరు జిల్లా నర్సంపేట మండలం గురజాల గ్రామానికి చెందిన భిక్షపతి అనే యువకుడు శ్రీకాంత్ వద్ద పని చేసేందుకు వచ్చాడు. అతడికి తల్లిదండ్రులు, తోబుట్టువులు లేరన్న విషయం తెలుసుకున్న శ్రీకాంత్.. అతడి పేరు మీద రూ.50లక్షల బీమా పాలసీ తీశాడు. పాలసీకి నామినీగా తన పేరు పెట్టుకున్నాడు. 2021లో ఐసీఐసీఐ బ్యాంకులో రూ.52 లక్షలు లోన్ తీసుకుని మేడిపల్లిలో ఓ ఇంటిని కొనుగోలు చేసి భిక్షపతి పేరున రిజిస్టర్ చేయించాడు. తర్వాత డబ్బులు అవసరం ఉండటంతో శ్రీకాంత్ ఆ ఇంటిని అమ్మకానికి పెట్టగా, భిక్షపతి అంగీకరించలేదు. దీంతో ఎలాగైనా అతడిని అంతమొందించాలనుకున్న శ్రీకాంత్ తనకు పరిచయం ఉన్న అప్పట్లో మల్కాజిగిరిలో హెడ్‌కానిస్టేబుల్‌గా (ప్రస్తుతం సైబరాబాద్ సీసీఎస్‌లో..) పనిచేస్తున్న మోతీలాల్‌ను కలిశాడు. తనకు సాయం చేస్తే రూ.10లక్షలు ఇస్తానని చెప్పడంతో భిక్షపతిని హత్య చేసేందుకు హెడ్‌కానిస్టేబుల్ పథకాన్ని రచించాడు.

కారులో తీసుకెళ్లి హత్య : భిక్షపతిని హత్య చేసేందుకు శ్రీకాంత్ తన వద్ద పని చేస్తున్న మహబూబాబాద్ జిల్లా గూడురు మండలం రాముతండాకు చెందిన బానోతు సమ్మన్న, వరంగల్ జిల్లా చెన్నరావుపేట మండలం జల్లి గ్రామానికి చెందిన చాగంటి సతీష్ సాయం తీసుకున్నాడు. సమ్మన్న, సతీష్‌కు చెరో రూ.5లక్షల చొప్పున, హెడ్‌కానిస్టేబుల్‌కు రూ.10లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. 22 డిసెంబర్, 2021న నలుగురూ కలిసి భిక్షపతిని కారులో షాద్‌నగర్ పరిధిలోని మొగిలిగిద్దకి తీసుకొచ్చి మద్యం తాగించారు. తర్వాత భిక్షపతి తలపై హాకీ స్టిక్‌తో బలంగా కొట్టి కింద పడేశారు. అతనిపై నుంచి రెండుసార్లు కారును నడిపించి హతమార్చారు. బీమా క్లెయిమ్ కోసం దరఖాస్తు వచ్చినప్పుడు ఆ కంపెనీ ప్రతినిధులకు అనుమానం రావడంతో పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ దిశగా పోలీసులు దర్యాప్తుచేయడంతో అసలు విషయం వెలుగుచూసింది. నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ కుషాల్కర్ నేతృత్వంలోని సీఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, రాంబాబు, కానిస్టేబుల్స్ కేసును ఛేదించారు.

రైతులకు నాసిరకం ఎరువులు అంటగట్టొద్దు



సాక్షి, హైదరాబాద్: వ్యవసాయం కోసం అందించే ఎరువులు, మందుల విషయంలో కంపెనీలు ఇచ్చే అధిక కమీషన్‌కు ఆశపడి రైతులకు నాసిరకం ఎరువులు అంటగట్టొద్దని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సూచించారు. రైతు, వ్యవసాయం బతికితేనే ఈ ప్రపంచం బతుకుతుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. సోమవారం ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల పారిశ్రామికవేత్తల సదస్సులో నిరంజన్‌రెడ్డి మాట్లాడారు. కొత్త రకమైన, భిన్నమైన సేవలను రైతాంగానికి, వ్యవసాయానికి ఏ విధంగా అందించగలమో ఆలోచించాలన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సేవలు విస్తరించాలని, వ్యవసాయ అనుబంధ, గ్రామీణ అనుబంధ పనులను గుర్తించి వాటిని ఒక గొడుగు కిందకు తేవాలని అధికారులకు వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఆగ్రోస్ ఛైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, ఆగ్రోస్ ఎండీ రాములు, సిజెంటా, హరేరామ హరేకృష్ణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వనపర్తి జిల్లా వీరాయపల్లిలో వేరుశనగ పరిశోధన కేంద్రం

వనపర్తి జిల్లా వీరాయపల్లిలో వేరుశనగ పరిశోధనా కేంద్రానికి 40 ఎకరాలు కేటాయింపులు చేస్తున్నట్టు మంత్రి నిరంజన్‌రెడ్డి వెల్లడించారు. ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం.. ఇక్రిశాట్ సహకారం, సమన్వయంతో వేరుశనగ పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ పరిశోధనా కేంద్రంలో మౌలిక వసతుల కల్పనకు త్వరలో రూ.2 కోట్లు కేటాయిస్తామన్నారు. సోమవారం ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడారు. యాసంగిలో ప్రధాన నూనెగింజల పంటగా వేరుశనగ ఉండాలని, దక్షిణ తెలంగాణతో పాటు ఉత్తర తెలంగాణలో కూడా పంట విస్తరింపజేయాలని అధికారులకు సూచించారు.

క్లుప్తంగా...

మతమార్పిళ్లకు రాజకీయ రంగు పులమొద్దు: సుప్రీం

న్యూఢిల్లీ: ''మతమార్పిళ్లు చాలా సీరియస్ విషయం. దీనికి రాజకీయ రంగు పులమొద్దు'' అని సుప్రీంకోర్టు పేర్కొంది. బలవంతపు మతమార్పిళ్లను అడ్డుకునేందుకు కఠిన చర్యలు చేపట్టేలా కేంద్ర రాష్ట్రాలను ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ ఆర్‌ఎం షా, జస్టిస్ సి.టి.రవికుమార్ ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఇది రాజకీయ ప్రేరేపిత పిటిషన్ అని తమిళనాడు ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది పి.విల్సన్ చేసిన వాదనను తీవ్రంగా తప్పుబట్టింది. ''ఇలా వాదించేందుకు మీకు వేరే కారణాలుండొచ్చు. అంతమాత్రాన కోర్టు విచారణను మరోలా మార్చుకునేందుకు ప్రయత్నించకండి. మీ రాష్ట్రంలో కూడా ఇలాంటివి జరుగుతుంటే అది కచ్చితంగా తప్పే. దీన్ని రాజకీయం చేయకండి'' అంటూ హితవు పలికింది. ఈ కేసులో అమికస్ క్యూరీగా వ్యవహరించి ఎలాంటి చర్యలు చేపట్టాలో సూచించాలని అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణిని కోరింది.

వలసలు, నిరాసక్తత

న్యూఢిల్లీ: ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గడానికి ఉపాధి కోసం వలసలు, పట్టణాల్లో, యువతలో నిరాసక్తత వంటి ఎన్నో కారణాలున్నాయని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. సిబ్బంది, న్యాయం, ప్రజా సమస్యలపై పార్లమెంటు సంఘానికి ఈ మేరకు నివేదించింది. సోమవారం జరిగిన సంఘం సమావేశంలో ఈ అంశంపై ఈసీ ఉన్నతాధికారులు ప్రజెంటేషన్ సమర్పించారు. ఓటింగ్ శాతం పెంచేందుకు రిమోట్ ఓటింగ్ సదుపాయం వంటివి అందుబాటులోకి తేవాలని సూచించారు. అయితే, ''రిమోట్ ఓటింగ్ పరిజ్ఞానం కూడా నెట్‌వర్క్‌లకు అనుసంధానమయ్యే తరహాలో కాకుండా ఈవీఎంల మాదిరిగా స్వతంత్రంగా ఉండేలా చూడటం ముఖ్యం. అప్పుడే ఎలాంటి దుర్వినియోగానికీ తావుండదు'' అని అభిప్రాయపడ్డారు.

నెలాఖరుకు పార్లమెంట్ నూతన భవనం సిద్ధం

న్యూఢిల్లీ: పార్లమెంట్ నూతన భవనం ఈ జనవరి చివరి నాటికి సిద్ధమవుతుందని అధికారవర్గాలు తెలిపాయి. బడ్జెట్ సమావేశాలను కొత్త భవనంలోనే జరిపేదీ లేనిదీ త్వరలోనే కేంద్రం నిర్ణయించే అవకాశాలున్నాయని తెలిపాయి. రెండేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సెంట్రల్ విస్టాలో భాగమే పార్లమెంట్ కొత్త భవనం. రాష్ట్రపతి భవన్– ఇండియా గేట్ మధ్యలోని మూడు కిలోమీటర్ల పొడవైన రాజ్‌పథ్ నవీకరణ, కామన్ సెంట్రల్ సెక్రటేరియట్, ప్రధాని కొత్త కార్యాలయం, నివాసం, ఉపరాష్ట్రపతి ఎన్‌క్లేవ్ వంటివి ఇందులో భాగంగా ఉన్నాయి. నిర్మాణ పనులను టాటా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ చేపట్టింది.

అంతర్జాతీయ డ్రగ్స్ సిండికేట్ గుట్టురట్టు

16 మంది అరెస్ట్, 60 కిలోల డ్రగ్స్ సీజ్ చేసిన ఎన్‌సీబీ


న్యూఢిల్లీ: పంజాబ్‌లోని లూథియానా కేంద్రంగా పనిచేస్తున్న అంతర్జాతీయ డ్రగ్స్ సిండికేట్ గుట్టురట్టు చేసినట్లు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) సోమవారం పేర్కొంది. ఇద్దరు అఫ్గాన్లు సహా 16 మందిని అదుపులోకి తీసుకోవడంతోపాటు 60 కిలోల డ్రగ్స్, 31 తూటాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. ''ఈ ముఠాకు గతేడాది ఢిల్లీలోని షహీన్‌బాగ్, యూపీలోని ముజఫర్‌నగర్‌ల్లో పట్టుబడిన డ్రగ్స్‌తో సంబంధముంది. అఫ్గానిస్తాన్, పాకిస్తాన్‌లతోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో నెట్‌వర్క్ ఉంది'' అని ఎన్‌సీబీ డిప్యూటీ డీజీ జ్ఞానేశ్వర్ సింగ్ చెప్పారు.

ఉత్తరాదిని వీడని పొగమంచు

న్యూఢిల్లీ: ఉత్తర భారతదేశంలో చలి పంజా విసురుతోంది. దట్టమైన పొగమంచు కారణంగా సోమవారం విమాన, రైలు, రోడ్డు రవాణాకు ఆటంకం కలుగుతోంది. వారణాసికి రావాల్సిన పలు విమానాలను ప్రతికూల వాతావరణం కారణంగా దారి మళ్లించారు. కొన్ని విమానాలను రద్దు చేయాల్సి వచ్చింది. పలు ప్రాంతాల్లో రైళ్లు ఆలస్యంగా నడిచాయి. పొగమంచు వల్ల యూపీలో రెండు రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. ఏడుగురు మరణించారు. యూపీలోని ఎటావాలో 3 డిగ్రీలు, కాన్పూర్‌లో 3.1 డిగ్రీలు, ఢిల్లీలో 3.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

'అంజలి' ఇంట్లో చోరీ

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో రోడ్డు ప్రమాదంలో కారు ఈడ్చుకెళ్లడంతో దుర్మరణం పాలైన అంజలీ సింగ్ ఇంట్లో చోరీ జరిగింది. టీవీతో పాటు పలు విలువైన వస్తువులు పోయినట్టు కుటుంబీకులు ఆరోపించారు. ఇందులో నిందితులతో పాటు అంజలి స్నేహితురాలినని చెప్పుకున్న నిధి పాత్ర ఉండొచ్చని అనుమానం వెలిబుచ్చారు.



హిమాచల్‌ప్రదేశ్‌లోని కులులో అతి శీతల వాతావరణంతో గడ్డకట్టిన జలపాతం

శత్రు సైన్యంపై మూషికాస్త్రం!

డీఆర్‌డీఓ వినూత్న ప్రయోగాలు • ఎలక్ట్రానిక్ పరికరాలతో ఎలుకల సామర్థ్యం పెంపు • మొదటి దశ ప్రయోగం విజయవంతం

యుద్ధ క్షేత్రంలో శత్రు శిబిరం ఎత్తుగడలు, రహస్యాలను తెలుసుకోవడానికి సైన్యం రకరకాల మార్గాల్లో ప్రయత్నించడం తెలిసిందే. శత్రువులు ఎక్కడెక్కడ ఏయే ఆయుధాలు మోహరించారో తెలుసుకోవడం యుద్ధంలో కీలకం. ఇలాంటివి పసిగట్టే ఎలుకలపై భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) నిర్విరామంగా ప్రయోగాలు సాగిస్తోంది. డీఆర్‌డీఓలో అంతర్భాగమైన అసిమ్మెట్రిక్ టెక్నాలజీ ల్యాబ్ ప్రస్తుతం ఇదే పనిలో నిమగ్నమైంది. మొదటి దశను విజయవంతంగా పూర్తిచేసి, రెండో దశలోకి ప్రవేశించింది.



ఏమిటీ ప్రయోగం?

సైనికులు జంతువులు, పక్షులను ఉపయోగించుకోవడం కొత్తేమీ కాదు. రిమోట్ కంట్రోల్‌తో పని చేసే ఎలుకలను రంగంలోకి దించాలన్నదే భారత సైన్యం వ్యూహం. ఇవి ఏమాత్రం అనుమానం రాకుండా శత్రు సైనికుల శిబిరాల్లోకి వెళ్లి, అక్కడి సమాచారాన్ని అందిస్తాయి. ఆ సమాచారం ఆధారంగా సైన్యం వ్యూహాలు సిద్ధం చేసుకోవచ్చు. ఈ ఎలుకలను యానిమల్ సైబర్గ్స్ అని పిలుస్తున్నారు. ఏడాదిన్నర క్రితమే ఈ ప్రాజెక్టు ప్రారంభమైంది. దీనిగురించి ఇటీవల జరిగిన 108వ జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో డీఆర్‌డీఓ సైంటిస్టు పి.శివప్రసాద్ ఒక ప్రజంటేషన్ ఇచ్చారు.

యానిమల్ సైబర్గ్స్ అంటే?

జీవించి ఉన్న ఎలుకల సామర్థ్యాన్ని మరింత పెంచుతారు. ఇందుకోసం ఎలక్ట్రికల్, మెకానికల్ పరికరాలు ఉపయోగిస్తారు. సాధారణ ఎలుకలు చేయలేని ఎన్నో పనులను ఇవి సులువుగా చేసేస్తాయి. కేవలం సైన్యంలోనే కాదు, పరిశోధనలు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, భూమిల పాతిపెట్టిన బాంబుల జాడ కనుక్కోవడంతోపాటు శస్త్రచికిత్సల్లోనూ యానిమల్ సైబర్గ్స్ సేవలను వాడుకోవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ జంతువుల్లో మార్పులు చేయడాన్ని జంతు ప్రేమికులు, జంతు హక్కుల సంఘాల కార్యకర్తలు వ్యతిరేకిస్తున్నారు. జంతువుల్లోని సహజ సామర్థ్యాలను దూరం చేయడం వాటిని బాధకు గురిచేయడమే అవుతుందని అంటున్నారు. -సాక్షి, నేషనల్ డెస్క్

ఎలుకలే ఎందుకు?

భారత్‌లో ఎలుకలపై మొదటి దశ ప్రయోగాలు ముగిశాయి. ఎలుకల కదలికలను నియంత్రించడానికి సర్జరీల ద్వారా వాటి శరీరంలో ఎలక్ట్రోడ్‌లు అమర్చారు. ఇక సాధారణ వాతావరణ పరిస్థితుల్లో వాటిని పరీక్షించబోతున్నారు. కొండలను ఎంత వరకు అధిరోహించగలవో చూస్తారు. మొదటి దశ ప్రయోగంలో ఎలుకలు కొంత ఇబ్బందికి గురయ్యాయని డీఆర్‌డీఓ సైంటిస్టు పి.శివప్రసాద్ వెల్లడించారు. కార్యాచరణకు సిద్ధమైన ఎలుకలను రిమోట్ కంట్రోల్‌తో నియంత్రించవచ్చు. ఏ దిశగా వెళ్లాలి? ఎంత దూరంగా వెళ్లాలి? ఎక్కడ ఆగాలి? ఎంతసేపు ఆగాలి? అనేదానిపై వాటి మెదడుకు ఎప్పటికప్పుడు సంకేతాలు అందిస్తారు. ప్రయోగానికి ఎలుకలనే ఎన్నుకోవడానికి కారణంగా ఏమిటంటే.. అవి వేగంగా కదులుతాయి. లోతైన బొరియల్లోకి సైతం తేలిగ్గా వెళ్లగలవు. గోడలు, చెట్లు ఎక్కగలవు. యానిమల్ సైబర్గ్స్‌ను చైనాలో ఇప్పటికే అభివృద్ధి చేశారు. యానిమల్ సైబర్గ్స్ సినిమాల్లో కూడా ఉన్నాయి. స్టార్‌వార్స్ సినిమాలోని చ్యూబాకా కూడా ఇలాంటిదే. ఒళ్లంతా రోమాలతో కనిపించే వింత జంతువు చ్యూబాకాలో శరీరం లోపల ఎలక్ట్రానిక్ పరికరాలు ఉంటాయి.

గవర్నర్ 'వాకౌట్'

తమిళనాడు అసెంబ్లీలో కనీవినీ ఎరగని దృశ్యాలు

- ప్రభుత్వ ప్రసంగ పాఠాన్ని పట్టించుకోని గవర్నర్
- 'ద్రవిడ' ప్రస్తావనను విస్మరిస్తూ ప్రసంగం
- భగ్గుమన్న అధికార డీఎంకే
- పార్టీ సభ్యుల తీవ్ర నిరసన
- గవర్నర్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీ తీర్మానం!



గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకుంటున్న డీఎంకే, మిత్రపక్షాల సభ్యులు

సాక్షి, చెన్నై: తమిళనాట గవర్నర్‌కు, డీఎంకే సర్కారుకు మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఈ క్రమంలో అసెంబ్లీలో కనీవినీ ఎరగని సంఘటనలు చోటుచేసుకున్నాయి. సోమవారం సమావేశాల తొలి రోజు సభనుద్దేశించి గవర్నర్ ఆర్.ఎన్.రవి చేసిన ప్రసంగంలో ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగ పాఠాన్ని పలుచోట్ల విస్మరించడం వివాదం రాజేసింది. అందులో పేర్కొన్న పేర్లలో వివేకానందున్ని మాత్రం ప్రస్తావించి పెరియార్, అన్నాదురై వంటి ద్రవిడ దిగ్గజాలను ఆయన పక్కన పెట్టారు. ద్రవిడ మోడల్ ఆదర్శంగా పలు అభివృద్ధి పథకాలను చేపట్టాం వంటి పాయింట్లనూ ప్రస్తావించలేదు. పైగా పలు అంశాలపై తన అభిప్రాయాలను కూడా జోడిస్తూ ప్రసంగించారు. ఇలాంటి సందర్భాల్లో గవర్నర్లు ప్రసంగ పాఠానికి కట్టుబడటం సంప్రదాయం. ఈ నేపథ్యంలో రవి తీరుపై అధికార డీఎంకే సభ్యులు భగ్గుమన్నారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. వెల్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. అనంతరం ఏకంగా గవర్నర్‌కు వ్యతిరేకంగా తీర్మానం ప్రవేశపెట్టేందుకు సీఎం ఎంకే స్టాలిన్ సిద్ధమయ్యారు! ''గవర్నర్ ప్రసంగంలోని అసంబద్ధ అంశాలను తిరస్కరించాలి. సభకు సమర్పించిన లిఖిత ప్రసంగ పాఠం మాత్రమే చెల్లుబాటవుతుందని ప్రకటించాలి' అని అందులో కోరారు. కానీ స్టాలిన్ మాట్లాడుతుండగానే రవి హఠాత్తుగా లేచి సభ నుంచి నిష్క్రమించారు! అనంతరం తీర్మానాన్ని సభ ఆమోదించింది! రవి తీరు విచారకరమని, ద్రవిడ దిగ్గజాలతో పాటు రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పేరునూ ప్రస్తావించకపోవడం శోచనీయమని స్పీకర్ అప్పవు అన్నారు. సభా సంప్రదాయాలను రవి తుంగలో తొక్కారంటూ మంత్రులు మీడియాతో మండిపడ్డారు. ''జాతీయ గీతాలాపన జరగకుండానే సభను వీడారు. జాతీయ గీతాన్ని కూడా అవమానించారు'' అని విమర్శించారు. డీఎంకే మద్దతుదారులు ట్విట్టర్‌లో 'గెటౌట్‌రవి' అంటూ ట్రోల్ చేస్తున్నారు. ఆయన బర్తరఫ్‌కు, రాజీనామాకు డిమాండ్ చేస్తున్నారు. గవర్నర్ తీరును ఖండిస్తూ ప్రజా ఉద్యమం చేపట్టనున్నట్లు డీఎంకే మిత్రపక్షాలు కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, వీసీకే, ఎండీఎంకే, మనిదనేయ మక్కల్ కట్చి, తమిళర్ వాల్వురిమై కట్చి ప్రకటించాయి. బీజేపీ మాత్రం గవర్నర్‌కు మద్దతుగా నిలిచింది. గవర్నర్ సభలో ఉండగానే ఆయనకు వ్యతిరేకంగా తీర్మానం పెడతారా అంటూ స్టాలిన్, స్పీకర్ తీరును తీవ్రంగా ఖండించింది. డీఎంకే, దాని మిత్రపక్షాలు రాజ్యాంగేతర శక్తుల్లా వ్యవహరిస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై దుయ్యబట్టారు. గవర్నర్‌కు వ్యతిరేకంగా సీఎం తీర్మానం ప్రవేశపెట్టడాన్ని విపక్ష అన్నాడీఎంకే తప్పుబట్టింది. దీన్ని రాష్ట్ర అసెంబ్లీ చరిత్రలో చీకటి రోజుగా అభివర్ణించింది. గవర్నర్, డీఎంకే సర్కారు మధ్య ఎంతోకాలంగా నిప్పూ ఉప్పు వంటి పరిస్థితి నెలకొని ఉంది.

భారత అంబాసిడర్లు

వచ్చే పాతికేళ్లలో ఎన్నారైలది కీలక పాత్ర • 17వ ప్రవాసీ భారతీయ దివస్‌లో మోదీ

అతిథులుగా హాజరైన సురినామ్, గయనా అధ్యక్షులు



అతిథులనుద్దేశించి ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

ఇండోర్: ప్రవాస భారతీయులను విదేశీ గడ్డపై భారత్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. రాబోయే 25 ఏళ్ల అమృతకాల ప్రయాణంలో వారి పాత్ర అత్యంత కీలకమని ఉద్ఘాటించారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో సోమవారం 17వ ప్రవాసీ భారతీయ దివస్ సదస్సును ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి ప్రత్యేక గౌరవ అతిథిగా సురినామ్ అధ్యక్షుడు చంద్రికాప్రసాద్ సంతోఖీ, ముఖ్య అతిథిగా గయనా అధ్యక్షుడు మొహమ్మద్ ఇర్ఫాన్ అలీ హాజరయ్యారు. 66 దేశాల నుంచి వచ్చిన ఎన్నారైలనుద్దేశించి మోదీ ప్రసంగించారు. ఆయన ఏమన్నారంటే...

ప్రవాసీల ఘనతలను రికార్డు చేయాలి

''ఎన్నారైలు భారత దూతలు. మన యోగా, ఆయుర్వేదం, హస్తకళలు, చిరుధాన్యాలు, కాటేజీ పరిశ్రమకు మీరు బ్రాండ్ అంబాసిడర్లు. ప్రపంచ వేదికపై భారత్ పాత్ర మీ వల్లే బలోపేతం కానుంది. స్కిల్ క్యాపిటల్‌గా కూడా ఎదిగే సామర్థ్యం భారత్‌కుంది. ప్రపంచ ప్రగతికి ఇంజన్‌గా మారనుంది. భారత్ గురించి తెలుసుకొనేందుకు ప్రవాసీల సంతానం ఆసక్తి చూపుతుండడం శుభపరిణామం. భారతీయులు ఎన్నో దేశాలకు వలస వెళ్లి శతాబ్దాలుగా స్థిరపడ్డారు. వారి జీవితాన్ని, ఎదుర్కొన్న కష్టానష్టాలు, చేసిన పోరాటాలు, సాధించిన విజయాలను రికార్డు చేయాల్సిన అవసరముంది. ఇందుకు భారత వర్సిటీలు చొరవ తీసుకోవాలి. వారి అనుభవాలు, జ్ఞాపకాలను ఆడియో–విజువల్, అక్షరరూపం నమోదు చేయాలి.

శతాబ్దాల క్రితమే అంతర్జాతీయ వాణిజ్యం

జీ20 సారథ్య బాధ్యతను ఒక మంచి అవకాశంగా భావిస్తున్నాం. మన గురించి ప్రపంచదేశాలకు తెలియజేయడానికి ఇది సరైన వేదిక. ప్రపంచంలో భారత్ పాత్ర గణనీయంగా పెరుగుతోంది. మన మాటకు, సందేశానికి ఎంతో విలువ ఉంది. కరోనా టీకాలను దేశీయంగానే అభివృద్ధి చేసుకున్నాం. 220 కోట్ల టీకా డోసులను ఉచితంగా అందించాం.

మన అభివృద్ధి అసాధారణం, అద్వితీయం

ప్రపంచంలోని ఐదు అత్యున్నత ఆర్థిక వ్యవస్థల్లో భారత్ కూడా ఒకటిగా మారింది. అత్యధిక స్టార్టప్‌లు ఉన్న మూడో దేశం మనదే. నేడు ప్రపంచం భారత్ వైపు చూస్తోంది. కొన్నేళ్లుగా మనం సాధించిన ఘనతలు అసాధారణం, అద్వితీయం. ప్రపంచంలో జరుగుతున్న మొత్తం డిజిటల్ లావాదేవీల్లో 40 శాతం కేవలం భారత్‌లోనే జరుగుతున్నాయి. మనకు అత్యాధునిక స్పేస్ టెక్నాలజీ ఉంది. అంతరిక్షంలోకి ఒకేసారి 100 ఉపగ్రహాలను పంపించగల సత్తా మన సొంతం. ఎన్‌ఆర్‌ఐల ప్రయోజనాలను కాపాడేందుకు కట్టుబడి ఉన్నాం. వారికి అవసరమైన సాయం కచ్చితంగా అందిస్తాం. మన సాంస్కృతిక, ఆధ్యాత్మిక పరిజ్ఞానాన్ని కాపాడాలని ఎన్‌ఆర్‌ఐలను కోరుతున్నాం. విదేశాల్లో భారతదేశ ప్రతిష్టను మరింత పెంచాలని, మన దేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పాలని విన్నవిస్తున్నాం'' అని ప్రధాని మోదీ వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లో ఎన్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, వాటిని సందర్శించాలని ఎన్‌ఐఆర్‌లకు సూచించారు. సురక్షిత, చట్టబద్ధ వలసల ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ ప్రత్యేక పోస్టల్ స్టాంప్‌ను ప్రధాని విడుదల చేశారు.

దర్శన్ సింగ్‌కు ప్రవాసీ సమ్మాన్ అవార్డు

విదేశాల్లో స్థిరపడిన భారతీయులకు ఇచ్చే ప్రవాసీ భారతీయ సమ్మాన్ అవార్డును అమెరికా వ్యాపారవేత్త, దాత దర్శన్ సింగ్ దలీవాల్‌కు ప్రదానం చేశారు. పంజాబ్‌లోని పటియాలాకు చెందిన ఆయన అమెరికాలో వ్యాపారవేత్తగా ఎదిగారు. భారత్‌తోపాటు పలు దేశాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

భారత్‌లోనే చదివా: గయానా అధ్యక్షుడు

భారత్ తమకు అత్యంత కీలకమైన వ్యూహాత్మక భాగస్వామి అని గయానా అధ్యక్షుడు మొహమ్మద్ ఇర్ఫాన్ అలీ పేర్కొన్నారు. ''నేను భారత్‌లో చదువుకున్నా. భారతీయుల ప్రేమాభిమానాలు నాకు తెలుసు'' అన్నారు. భారత్ తమకు నమ్మకమైన భాగస్వామి అని సురినామ్ అధ్యక్షుడు సంతోఖీ హర్షం వ్యక్తం చేశారు.

21వ శతాబ్దపు కౌరవులు!

ఆరెస్సెస్ సభ్యులపై రాహుల్ విమర్శలు

అంబాలా/చండీగఢ్: ఆరెస్సెస్‌పై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. సంఘ్ సభ్యులు 21వ శతాబ్దపు కౌరవులని మండిపడ్డారు. భారతీయ విలువలకు సంఘ్ వ్యతిరేకమని ఆరోపించారు. సంఘ్ కార్యకర్తలు హర హర మహాదేవ్, జైశ్రీరామ్ అంటూ ఏనాడూ నినదించలేదని ఆక్షేపించారు. భారత్ జోడో యాత్రలో సోమవారం హరియాణాలోని అంబాలాలో ఆయన మాట్లాడారు. ''మహాభారతం హరియాణాతో ముడిపడి ఉంది. కౌరవులెవరు? మొదట 21వ శతాబ్దపు కౌరవుల గురించి చెప్పబోతున్నా. వారు చేతిలో లాఠీలు పట్టుకుంటారు. శాఖలు నిర్వహిస్తుంటారు. మన దేశంలోని బిలియనీర్లు ఆ కౌరవుల ఎదుట సాగిలపడుతున్నారు. పాండవులెప్పుడైనా పెద్ద నోట్లను రద్దు చేశారా? తప్పుడు జీఎస్టీ అమలు చేశారా?'' అని ప్రశ్నించారు. పాండవులు తపస్వులు గనుక ఎన్నడూ అలా చేయలేదన్నారు. పరస్పరం జైశ్రీరామ్ అంటూ పలుకరించుకోవాలని ప్రజలకు సూచించారు.

రాహుల్ 'పూజారి' వ్యాఖ్యలపై విమర్శలు

న్యూఢిల్లీ: తపస్వులకే తప్ప పూజారులకు భారత్‌లో స్థానం లేదన్న వ్యాఖ్యలతో రాహుల్ తమను చులకన చేశారంటూ ఆలయ పూజారులు మండిపడ్డారు. ప్రయాగ్‌రాజ్ సహా పలుచోట్ల ఆయన దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన తెలిపారు.

కుంగుతున్నా వదలట్లేదు

- ప్రతీ నిమిషం ప్రమాదమే
- జోషీమఠ్ వాసులకు ప్రభుత్వ హితవు

డెహ్రాడూన్: భూమి కుంగిపోతున్నా సొంతింటిని, స్వస్థలాలను వదిలి వెళ్లేందుకు జోషీమఠ్ వాసులు ససేమిరా అంటున్నారు. ఖాళీ చేయాలంటూ ఇప్పటికే దాదాపు 200కుపైగా ఇళ్లకు అధికారులు ఎరుపు రంగు పూశారు. వెంటనే సురక్షిత శిబిరాలకు లేదా అద్దె భవనాలకు తరలిపోవాలని, ఒక్కో కుటుంబానికి నెలకు రూ.4,000 చొప్పున ఆరునెలలపాటు ఆర్థికసాయం అందిస్తామని ఉత్తరాఖండ్ ప్రభుత్వం ప్రకటించింది. సోమవారం మరో 68 ఇళ్లకు పగుళ్లు పడ్డాయి. దీంతో కుంగిన, దెబ్బతిన్న ఇళ్ల సంఖ్య 678కి పెరిగింది. అయినా పలువురు ఇళ్లు వీడటం లేదంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ సంధూ సోమవారం ఆందోళన వ్యక్తంచేశారు. ' ప్రతి నిమిషమూ అత్యంత ప్రధానం. వెంటనే ఇళ్లను వీడండి'' అని కోరారు. ''ఎన్‌డీఆర్‌ఎఫ్, రాష్ట్ర బృందాలు ఇప్పటికే జోషీమఠ్‌లో సహాయ, పునరావాస చర్యల్లో నిమగ్నమయ్యాయి. భూమి కుంగడంతో పగిలిన తాగు నీటి సరఫరా పైపులను పునరుద్ధరించాలి. లేదంటే పెద్దమొత్తంలో నీరు దిగువ భూముల్లో ఇంకి త్వరగా మరింతగా కుంగే ప్రమాదం పెరుగుతుంది'' అని ఆయన అన్నారు. కాగా, ఘటనను



జాతీయ విపత్తుగా ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ సోమవారం డిమాండ్‌చేసింది. కుటుంబానికి రూ.5,000 చాలా తక్కువ మొత్తమని, సర్వస్వం కోల్పోతున్న ఒక్కో బాధితునికి రూ.50వేలు ఇవ్వాలని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి హరీశ్ రావత్ అభిప్రాయపడ్డారు.

రణరంగంగా బ్రెజిల్

బోల్సోనారో మద్దతుదారుల రచ్చ

- అధ్యక్ష భవనం, సుప్రీంకోర్టు, కాంగ్రెస్, భవనాల ఆక్రమణ
- రంగంలోకి సైన్యం, అరెస్టులు



పార్లమెంట్ భవనాన్ని వేలాది మంది ఆందోళనకారులు చుట్టుముట్టిన దృశ్యం

రియో డీ జనీరియో: బ్రెజిల్ రాజధాని నగరం బ్రసీలియాలో మాజీ దేశాధ్యక్షుడు జైర్ బోల్సోనారో మద్దతుదారులు దురాక్రమణకు దిగారు. ఇటీవలి అధ్యక్ష ఎన్నికల్లో లూయిజ్ ఇన్సియో లూలా డ సిల్వా చేతిలో బోల్సోనారో ఓడిపోవడం జీర్ణించుకోలేని ఆయన మద్దతుదారులు ఆదివారం రాజధానిలోని అత్యంత కీలకమైన భవనాలపై దాడికి తెగించారు. దేశాధ్యక్షుడి అధికార నివాసం, కాంగ్రెస్, సుప్రీంకోర్టు భవనాల ముందున్న బారికేడ్లను బద్దలుకొట్టి, భవనాల గోడలెక్కి అద్దాలు, కిటికీలు ధ్వంసంచేశారు. సుప్రీంకోర్టులో న్యాయమూర్తులు కూర్చొనే ప్రధాన బల్లాను ధ్వంసంచేశారు. కోర్టు ఆవరణలోని పురాతన విగ్రహాన్ని కూలదోశారు. ''బోల్సోనారో నేతృత్వంలో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు సైన్యం చర్యలు తీసుకోవాలి. డ సిల్వాను దింపేయాలి'' అని డిమాండ్‌చేస్తున్నారు. భవనాల్లో ఫర్నిచర్, కంప్యూటర్లనూ ధ్వంసంచేశారు. వారాంతం కావడంతో భవనాల్లో సిబ్బంది అంతగా లేరు.

ఊహించని ఘటనతో ఉలిక్కిపడిన సైన్యం వెంటనే రంగ ప్రవేశం చేసింది. భవనాల ప్రాంగణాల్లోని ఆందోళనకారులను చెదరగొట్టేందుకు టియర్ గ్యాస్‌లను ప్రయోగించింది. 300 మందిని అరెస్ట్‌చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చింది. అధ్యక్ష ఎన్నికల్లో ఓటమిని బోల్సోనారో ఒప్పుకోక మద్దతుదారులను ఉసిగొల్పడం ఇంతటి ఆందోళనకు కారణమైంది. రెండేళ్ల క్రితం అమెరికా పార్లమెంట్‌పై డొనాల్డ్ ట్రంప్ మద్దతుదారులు చేసిన దాడిని ఈ ఘటన గుర్తుకుతెచ్చింది.

ఫాసిస్టు శక్తుల విలయం: డసిల్వా

ఆందోళనలపై డ సిల్వా ఆగ్రహించారు. ''ఫాసిస్ట్ శక్తులు చెలరేగిపోయాయి. దీనిపై సత్వరం స్పందించని పోలీసు అధికారులపై కఠిన చర్యలు తప్పవు' అన్నారు. ఇలాంటి ఘటన జరిగే ప్రమాదముందని కొన్నినెలలుగా రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తుండటం గమనార్హం. గత ఏడాది అక్టోబర్ 30న డ సిల్వా గెలుపు తర్వాత మొదలైన నిరసనలు ఆనాటి నుంచి ఆగలేదు. రోడ్ల దిగ్బంధం, వాహనాల దగ్ధం, సైన్యం జోక్యంచేసుకోవాలంటూ సైనిక కార్యాలయాల వద్ద ఆందోళనకారుల బైఠాయింపులతో నిరసనలు దేశమంతటా కొనసాగుతుండటం తెల్సిందే.

ప్రపంచ దేశాధినేతల ఆందోళన

బ్రెజిల్‌లో అధికార కేంద్రాలైన ప్రధాన భవనాలపై దాడిని పలు ప్రపంచ దేశాలు ఖండించాయి. 'ప్రజాస్వామ్యాన్ని కూలదోసే ప్రతి చర్యనూ ఖండిస్తాం. పాలనలో అధ్యక్షుడు డ సిల్వాకు సాయంగా ఉంటాం' అని అమెరికా అధ్యక్షుడు బైడెన్ వ్యాఖ్యానించారు. ' ఎన్నికల ద్వారా డ సిల్వా ప్రభుత్వాన్ని ఎన్నుకున్న ప్రజాభీష్టాన్ని గౌరవించాలి' అంటూ దాడులను ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెరస్ తీవ్రంగా తప్పుబట్టారు. ఘటనపై ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తంచేశారు. ఆందోళనకారులనుద్దేశిస్తూ.. 'ఎన్నికలు అనే ప్రజాస్వామ్య సంప్రదాయాలను అందరూ గౌరవించాల్సిందే. ఈ విషయంలో డ సిల్వా సర్కార్‌కు మా పూర్తి మద్దతు ఉంటుంది' అని మోదీ అన్నారు.

ఎయిర్ హోస్టెస్‌తో అసభ్య ప్రవర్తన!

ఇద్దరు తాగుబోతు ప్రయాణికుల అరెస్ట్

పట్నా: భారతీయ విమానాల్లో ప్రయాణికుల అనుచిత ప్రవర్తన ఘటనలు మరువకముందే ఆదివారం మరో ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ఢిల్లీ నుంచి పట్నాకు వస్తున్న ఇండిగో విమానంలో తప్పతాగిన ఇద్దరు ప్రయాణికులు ఎయిర్‌హోస్టెస్‌తో అసభ్యంగా ప్రవర్తించారని వార్తలొచ్చాయి. విమాన సిబ్బందితోపాటు తోటి ప్రయాణికులతోనూ గొడవ పడినట్లు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అయితే, వీరు విమానంలో పట్నాకు వస్తున్నట్లు ఇండిగో సంస్థ ఫిర్యాదుచేయడంతో పట్నాలో దిగగానే పట్నా ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్ అధికారులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం బిహార్‌లో మద్య నిషేధం అమల్లో ఉన్నందున మద్యసేవనం రాష్ట్రపరిధిలో నేరం. మద్యం తాగి బిహార్‌లో అడుగుపెట్టినందుకే కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. విమానంలో వీరు తోటి ప్రయాణికులతో అనుచితంగా ప్రవర్తించినట్లు అధికారంగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఎవరైనా ఫిర్యాదు చేసే చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ఇండియన్ ఎయిర్‌లైన్స్‌పై డీజీసీఏ సీరియస్

న్యూఢిల్లీ: పారిస్–న్యూఢిల్లీ ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానంలో ప్రయాణికుల అనుచిత ప్రవర్తనపై వివరణ ఇవ్వాలని సంస్థను డీజీసీఏ సోమవారం ఆదేశించింది. గత ఏడాది డిసెంబర్ ఆరున జరిగిన రెండు ఘటనలను అందులో ప్రస్తావించింది. సిబ్బంది సూచనలను లెక్కచేయకుండా బాత్రూమ్‌లో ధూమపానం చేస్తున్న వ్యక్తిపై, తోటి ప్రయాణికురాలి సీటు, దుప్పటిపై మూత్రవిసర్జన చేసిన మరో తాగుబోతు ప్రయాణికుడిపై అప్పుడే వెంటనే ఎందుకు చర్యలు తీసుకోలేదో తెలపాలని డీజీసీఏ సూచించింది. ' ఏదైనా విమానంలో అనుకోని ఘటన జరిగితే ల్యాండింగ్ జరిగిన 12 గంటల్లోపు మాకు నివేదించాలి. కానీ డిసెంబర్ ఆరున ఘటన జరిగితే జనవరి ఆరున మేం అడిగేదాకా ఆనాటి ఘటనపై సంస్థ ఎలాంటి రిపోర్ట్‌చేయలేదు. అనుచితంగా ప్రవర్తించే ప్రయాణికుల విషయంలో మీ వైఖరి నిబంధనలకు అనుగుణంగా లేదు. రెండు వారాల్లోపు నివేదించండి. తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటాం' అని డీజీసీఏ పేర్కొంది.

అమెరికాలో తొలి సిక్కు మహిళా జడ్జి



హూస్టన్: అమెరికాలోని హ్యారిస్ కౌంటీ జడ్జిగా భారత సంతతికి చెందిన మన్‌ప్రీత్ మోనికా సింగ్ బాధ్యతలు చేపట్టారు. అమెరికాలో మొట్టమొదటి సిక్కు మహిళా జడ్జిగా ఆమె చరిత్ర సృష్టించారు. టెక్సాస్ లా నంబర్–4లోని హ్యారిస్ కౌంటీ సివిల్ కోర్ట్‌లో న్యాయమూర్తి అయిన మన్‌ప్రీత్ హూస్టన్‌లోనే పుట్టి, పెరిగారు. ప్రస్తుతం బెల్లెయిర్‌లో భర్త, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నారు. ఈమె తండ్రి 1970ల్లో భారత్ నుంచి వలస వచ్చారు. మన్‌ప్రీత్ గత 20 ఏళ్లుగా లాయర్ వృత్తిలో ఉన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారత సంతతికి చెందిన జడ్జి రవి శాండిల్ అధ్యక్షత వహించారు. రవి శాండిల్ టెక్సాస్ రాష్ట్ర మొదటి ఆసియా సంతతి జడ్జి కూడా. అమెరికాలో సుమారు 5 లక్షల మంది సిక్కులుండగా, వారిలో 2 వేల మంది హూస్టన్ ప్రాంతంలోనే నివసిస్తున్నారు.

సాక్షి
హైదరాబాద్

మంగళవారం । 10 । జనవరి । 2023



ఎమ్మెల్యే కాలనీలో భారీ చోరీ


బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే కాలనీకి చెందిన ఓ వ్యాపారి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు రూ. 50 లక్షల విలువైన బంగారు వజ్రాభరణాలతో పాటు రూ.15 లక్షలు ఎత్తుకెళ్లారు. –8లో



..ప్రయోజనం శూన్యం

కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన మార్కెట్‌తో ఎలాంటి ప్రయోజనం లేదని ది హోల్‌సేల్ ఫ్రూట్ కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ తాజుద్దీన్ అన్నారు. –8లో

దారిదోపిడీ కేసులో హవాలా కోణం



వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దారి దోపిడీ కేసు మరో మలుపు తిరిగింది. ఫిర్యాదుదారు వెంకట్‌రెడ్డి విచారణలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. –8లో

న్యూస్‌రీల్

నేడు 'పైగా టూంబ్స్'కు ఎలిజబెత్ జోన్స్

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్ ఒవైసీ నగర్‌లోని 'పైగా టూంబ్స్'ను మంగళవారం ఉదయం 9.30 గంటలకు యూఎస్ ఎంబసీ చార్జ్ డీ ఎఫైర్స్ (సీడీఏ) ఎలిజబెత్ జోన్స్ సందర్శించనున్నట్లు యూఎస్ కాన్సులేట్ జనరల్ హైదరాబాద్ మీడియా కన్వీనర్ మహ్మద్ అబ్దుల్ బాసిత్ తెలిపారు. 18, 19వ శతాబ్దంలో నిర్మించిన 'పైగా టూంబ్స్' పరిరక్షణ, పునరుద్ధరణ నేపథ్యంలో నిధుల మంజూరు కోసం ఎలిజబెత్ సందర్శించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆర్టీసీ సేవలు అమోఘం: బాజిరెడ్డి గోవర్ధన్

- హైటెక్ సిటీలో ఏసీ మినీ బస్సులు ప్రారంభం



మాదాపూర్: సామాన్య ప్రజలతో పాటు ఐటీ ఉద్యోగులకు సేవలు అందిస్తున్నామని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హైటెక్ సిటీలో సోమవారం టీఎస్ఆర్టీసీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏసీ మినీ బస్సులను ఎండీ సజ్జనార్, స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్లతో కలిసి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. సైబర్ లైనర్ పేరుతో ప్రారంభించిన ఈ బస్సులు ఐటీ కారిడార్‌లో తిరుగుతాయని తెలిపారు. వీటిలో వైఫై సేవలు, ట్రాకింగ్ సిస్టం అందుబాటులో ఉంటాయన్నారు. ఐటీ ఉద్యోగులు ఒక్కరే ఒక కారులో రావడం వల్ల ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందని చెప్పారు. ఐటీ కంపెనీల్లో పని చేసేవారు మెట్రోలో వచ్చి సైబర్ లైనర్ బస్సులను ఉపయోగించుకోవాలని సూచించారు. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే నష్టాల్లోంచి బయటపడుతోందని ఆయన స్పష్టంచేశారు. ఐటీ ఉద్యోగులకు రవాణా సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతోనే సైబర్ లైనర్ బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ వి.జగదీశ్వర్‌గౌడ్, హమీద్ పటేల్, ఎస్సీ ఎస్సీ సెక్రటరీ కృష్ణయోదుల పాల్గొన్నారు.

రాజీవ్ స్వగృహ టవర్స్ ప్రీ బిడ్‌కు విశేష స్పందన

సాక్షి, సిటీబ్యూరో: పోచారం, గాజుల రామారంలలోని రాజీవ్ స్వగృహ టవర్స్‌కు సోమవారం హిమాయత్‌నగర్‌లో నిర్వహించిన ప్రీ బిడ్ సమావేశానికి విశేష స్పందన లభించింది. బిల్డర్లు, డెవలపర్లు, పలు ఉద్యోగ సంఘాలకు చెందిన ప్రతినిధులు సుమారు 50 మందికి పైగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో హెచ్ఎండీఏ ఎస్టేట్ అధికారి గంగాధర్, చీఫ్ ప్లానింగ్ అధికారి గంగాధర్, ప్లానింగ్ అధికారి ప్రభాకర్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు. పోచారంలోని 9 అంతస్తుల టవర్లు నాలుగు ఉన్నాయి. వాటిలో ఒక్కో టవర్‌లో 72 నుంచి 198 ఫ్లాట్లను నిర్మించుకొనే సదుపాయం ఉంది. గాజుల రామారంలో 14 అంతస్తుల టవర్లు ఐదు ఉన్నాయి. ఒక్కో టవర్‌లో 112 ఫ్లాట్లను నిర్మించుకోవచ్చు. ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న ఈ రెండు ప్రాంతాల్లో మధ్యతరగతి వర్గాలు ఎంతో ఆసక్తి చూపుతున్నాయి. ముఖ్యంగా ఉద్యోగ సంఘాలు ఈ టవర్‌లను కొనుగోలు చేసి ఫ్లాట్‌లను నిర్మించుకొని తమ ఉద్యోగులకు విక్రయించేందుకు సంసిద్ధంగా ఉన్నాయి. ఈ మేరకు వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని తమ సందేహాలను అధికారుల దృష్టికి తెచ్చారు. సింగిల్ టైమ్ రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించాలని, జీఎస్టీ భారం లేకుండా చూడాలని వివిధ సంఘాల ప్రతినిధులు కోరారు. ఉద్యోగసంఘాల ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

నేటి 'ఎగ్జిబిషన్'.. లేడీస్ స్పెషల్

అబిడ్స్: అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)లో మంగళవారం మహిళలకు మాత్రమే అనుమతి ఇస్తామని ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు అశ్వినిమార్గం తెలిపారు. ప్రతిసారిలానే ఈ ఏడాది కూడా ఎగ్జిబిషన్‌లో లేడీస్ డే రోజు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలచే సాంస్కృతిక కార్యక్రమాలు, పలు విభాగాల్లో ఆటల పోటీలు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 10.30 గంటల వరకు మహిళలను మాత్రమే అనుమతించి లేడీస్ డే వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



శిక్షణలో భాగంగా రన్నింగ్ చేస్తున్న అగ్నివీర్‌లు

'అగ్ని' బరాటాలు!

మొదటి బ్యాచ్ అగ్నివీర్‌ల శిక్షణ ప్రారంభం

- రెండు భాగాలుగా 31 వారాల పాటు తర్ఫీదు
- అత్యాధునిక సిమ్యులేటర్లు సైతం వినియోగం



సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన, గతేడాది అత్యంత వివాదాస్పదంగా మారిన అగ్నిపథ్ పథకం అమలులోకి వచ్చింది. మొదటి బ్యాచ్‌లో మొత్తం 40 వేల మంది అగ్నివీర్‌లుగా ఎంపిక కాగా.. వీరిలో 5,600 మందికి నగరంలోని గోల్కొండలోని ఆర్టిలరీ సెంటర్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 2 నుంచి మొదటి బ్యాచ్ మొదలైంది. ఈ నేపథ్యంలో ట్రైనింగ్‌లోని విశేషాలను వివరించేందుకు ఆర్మీ అధికారులు సోమవారం మీడియా టూర్ నిర్వహించారు. దేశంలోనే అతి పెద్దదైన గోల్కొండ ఆర్టిలరీ సెంటర్‌లో జరుగుతున్న అగ్నివీర్‌ల శిక్షణ తీరుతెన్నులు ఇలా..

స్క్వాడ్స్‌గా విభజించి..

ఇప్పటికే 2,265 మంది అగ్నివీర్‌లకు శిక్షణ మొదలైంది. వీళ్లని రీజియన్, బ్యాటరీ, ట్రూప్, స్క్వాడ్స్‌గా విభజించారు. ఒక్కో స్క్వాడ్‌లో గరిష్టంగా 32 మంది అభ్యర్థులు ఉంటారు. వీరికి ఫిజికల్, వెపన్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ సహా అనేక అంశాల్లో శిక్షణ ఇస్తారు. ఫిజికల్ ట్రైనింగ్ కోసం ఆర్టిలరీ సెంటర్‌లో మొత్తం 30 గ్రౌండ్స్ ఉన్నట్లు చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కల్నల్ షలీన్ సింగ్ తెలిపారు. ఇందులో స్క్వాడ్ల వారీగా రోప్, బార్స్, బీమ్స్ తదితరాలతో శిక్షణ ఇచ్చి అప్పర్ బాడీ పటిష్టమయ్యేలా చేస్తారు.

ముందు బేసిక్ ఆపై అడ్వాన్స్...

మొత్తం 31 వారాల పాటు సాగే శిక్షణను బేసిక్, అడ్వాన్స్‌గా విభజించారు. బేసిక్‌లో ప్రతి అంశానికీ సంబంధించి ప్రాథమిక అంశాలు బోధిస్తారు. డ్రిల్, వెపన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, రాజ్యాంగం, మానవహక్కులు తదితరాలను అవగాహన కల్పిస్తారు. పది వారాల పాటు సాగే ఈ శిక్షణలో అభ్యర్థుల ప్రతిభ, ఆసక్తి బట్టి ఆయా రంగాల్లో అడ్వాన్స్ శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో టెక్నికల్ అసిస్టెన్స్, గన్నర్స్, డ్రైవర్స్ ఇలా వివిధ విభాగాలు ఉంటాయి. ఫిజికల్ ట్రైనింగ్ మాత్రం ఆద్యంతం కొనసాగుతుంది. ప్రతి అగ్నివీర్‌కు ఆంగ్ల, హిందీ భాషలతో పాటు మాట, నడక, నడత, వేషధారణ తదితరాలను బోధిస్తున్నారు. ఉదయం 4 గంటలకు నిద్రలేచే అగ్నివీర్... 6 గంటలకు గ్రౌండ్‌కు వస్తారు. 7.30 గంటల వరకు ఫిజికల్ ట్రైనింగ్, అప్పటి నుంచి 8.45 గంటల వరకు డ్రిల్ లేదా వెపన్స్ ట్రైనింగ్, 8.45 నుంచి 1.30 వరకు థియరీ క్లాసులు ఉంటాయి. రెండో విడత మధ్యాహ్నం 4 గంటలకు గేమ్స్ మొదలవుతాయి. 5.20 తర్వాత అభ్యర్థులకు ఫ్రీ టైమ్ కాగా... 9 గంటలకు నిద్రకు ఉపక్రమించాల్సిందే.

అత్యాధునిక సిమ్యులేటర్స్ వినియోగం..

బేసిక్ ట్రైనింగ్‌లో వెపన్స్ శిక్షణను ఇబ్రహీంబాగ్ లాంగ్ రేంజ్‌లో ఇన్సాస్ రైఫిల్‌తో ఇస్తారు. అడ్వాన్స్ శిక్షణలో మాత్రం ఆర్టిలరీ గన్స్‌పై ఉంటుంది. ఆర్టిలరీ సెంటర్‌లో అగ్నివీర్‌ల శిక్షణ కోసం అత్యాధునిక సిమ్యులేటర్స్ వాడుతున్నారు. 'లివింగ్ ఎ లైఫ్ లెస్ ఆర్డినరీ ఐయామ్ ఎ అగ్నివీర్' అనేది అగ్నివీర్ నినాదం కాగా.. 'వన్ షాట్ ఇన్ ఎనిమీ' అన్నది వెపన్స్ ట్రైనింగ్‌కు సంబంధించింది. యుద్ధంలోనే కాదు శిక్షణలోనూ తూటాలు నష్టపోకుండా తొలి దశలో సిమ్యులేటర్‌పై శిక్షణ ఇస్తున్నారు. దీంతో పాటు రేడియో ద్వారా సమాచార మార్పిడి, యుద్ధ, అత్యవసరమ సమయాల్లో మెడికల్ కేర్, రూమ్ ఇంటర్వెన్షన్, శాండ్ మోడల్.. ఇలా అనేక సిమ్యులేటర్లతో అగ్నివీర్‌లు శిక్షణ పొందుతున్నారు. గోల్కొండ ఆర్టిలరీ సెంటర్‌లో శిక్షణ పొందున్న వారికి అగ్నివీర్ అనేది ఇంటి పేరుగా మారిపోతోంది. ప్రతి ఒక్కరూ తమను పరిచయం చేసుకునేప్పుడు 'అగ్నివీర్ రాకేష్ కుమార్', 'అగ్నివీర్ అజాజ్ అహ్మద్', 'అగ్నివీర్ హమన్‌సింగ్' అని చెబుతున్నారు.

మొదట 2300 మందికి..

- 15 శాతం మందికి గోల్కొండ ఆర్టిలరీలోనే..
- బ్రిగేడియర్ రాజీవ్ చౌహాన్



అగ్నిపథ్ భాగంగా తొలి దశలో 15 శాతం మందికి గోల్కొండలోని ఆర్టిలరీ సెంటర్‌లోనే శిక్షణ ఇస్తున్నట్లు బ్రిగేడియర్ రాజీవ్ చౌహాన్ తెలిపారు. మొదటి బ్యాచ్ అగ్నివీర్‌లకు శిక్షణ మొదలైన నేపథ్యంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. 1900 ఎకరాల్లో విస్తరించి ఉన్న గోల్కొండ ఆర్టిలరీ సెంటర్ దేశంలోనే అతి పెద్దదని, ఇక్కడ అగ్నివీర్‌లకు అత్యుత్తమ శిక్షణ లభిస్తుందని పేర్కొన్నారు. మొదటి బ్యాచ్‌లో 2300 మందికి శిక్షణ ఇవ్వాల్సి ఉండగా ఇప్పటికే 2265 మందికి ప్రారంభమైందని వివరించారు. రెండో దశలో మరో 3300 మందికి మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభంకానుందని రాజీవ్ చౌహాన్ వెల్లడించారు. 31 వారాల పాటు ఉండే అగ్నివీర్ శిక్షణతో 10 వారాల పాటు బేసిక్ ట్రైనింగ్, ఆపై 21 వారాలు అడ్వాన్స్‌డ్ శిక్షణ ఉంటాయని తెలిపారు. శిక్షణతో పాటు మూడున్నరేళ్ల సర్వీసులో ఆయా అగ్నివీర్‌లు చూపించే ప్రతిభ ఆధారంగా 25 శాతం మంది పూర్తి స్థాయిలో సైన్యంలో కొనసాగుతారని వివరించారు. నాలుగేళ్లు సైన్యంలో ఉండి బయటకు వచ్చే వాళ్లు సైతం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారని ఆయన స్పష్టం చేశారు.

క్యాబ్‌లో కాజీపేటకు | పరార్

సీరియల్ స్నాచింగ్స్ తర్వాత పింకు గ్యాంగ్ ఎస్కేప్

- పోలీసుల దృష్టి మళ్లించడానికే నగరంలో సంచారం
- కర్ణాటక, ఉత్తరప్రదేశ్ సహా ఐదు రాష్ట్రాల్లో గాలింపు
- పట్టుకోవడానికి రంగంలోకి 14 ప్రత్యేక బృందాలు





సీసీ కెమెరాలకు చిక్కిన పింకు, దీపక్, మంగళ్, సేవేజ్‌ల చిత్రాలు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల పరిధిలోని ఐదు ఠాణాల పరిధిలో ఏడు చైన్ స్నాచింగ్స్ చేసిన బవారియా గ్యాంగ్‌కు చెందిన పింకు, దీపక్, మంగళ్, సేవేజ్‌లు క్యాబ్‌లో కాజీపేటకు పారిపోయినట్లు తేలింది. శనివారం ఉదయం రెండున్నర గంటల వ్యవధిలో పంజా విసిరిన రింకు నేతృత్వంలోని ముఠా 20 తులాలకు పైగా బంగారం కాజేసిన విషయం విదితమే. వీళ్లను పట్టుకోవడానికి టాస్క్‌ఫోర్స్, స్పెషల్ ఆపరేషన్ టీమ్‌లకు (ఎస్వోటీ) చెందిన 14 ప్రత్యేక బృందాలు ఐదు రాష్ట్రాల్లో గాలిస్తున్నాయి. నగరంలో ఉన్న సీసీ కెమెరాల్లో నమోదైన ఫీడ్ ఆధారంగా పోలీసులు స్నాచర్ల కదలికలు గుర్తించారు.

ఇట్నుంచి లోపలకు అట్నుంచి బయటకు..

బెంగళూరులో శుక్రవారం పంజా విసిరిన ఈ పింకు గ్యాంగ్ శనివారం ఉదయం నగరంలో రెచ్చిపోయింది. ఉప్పల్‌లో మొదలెట్టి రామ్‌గోపాల్‌పేట (ఆర్.పేట)వరకు వరుసపెట్టి స్నాచింగ్స్ చేసింది. ఈ ఏడు గొలుసు దొంగతనాలు చేయడానికి నాంపల్లిలో వాహనాన్ని తస్కరించింది. పింకు నేతృత్వంలో నగరానికి నలుగురు రాగా... శనివారం ఉదయం ఇద్దరు కాచిగూడ రైల్వేస్టేషన్‌లోనే వేచి ఉన్నారు. స్నాచింగ్స్ చేయడానికి వాడిన వాహనాన్ని పింకు గ్యాంగ్ ఆర్.పేటలో వదిలేసింది. అక్కడ నుంచి ఆటోలో కాచిగూడ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ఓ గేటు నుంచి లోపలకు వెళ్లిన ఇద్దరు స్నాచర్లు మరో గేటు నుంచి బయటకు వచ్చేశారు. ఆ సమయంలో వీరి వెంట మరో ఇద్దరూ ఉన్నారు. వీళ్లు ప్రయాణించిన ఆటోడ్రైవర్‌ను విచారించిన పోలీసులు కీలక ఆధారాలు సేకరించారు.

ఎంజీబీఎస్ నుంచి క్యాబ్‌లో..

కాచిగూడలో మరో ఆటో ఎక్కిన స్నాచర్లు నాంపల్లి రైల్వేస్టేషన్‌కు వచ్చారు. అక్కడా 'లోపలకు-బయటకు' కథ నడిపి బయట ఉన్న ఓ ట్రావెల్స్ వద్దకు వెళ్లారు. వరంగల్‌కు కారు మాట్లాడుకునే ప్రయత్నం చేసినా ఫలించలేదు. దీంతో మరో ఆటోలో ఎంజీబీఎస్ వరకు వెళ్లారు. బస్టాండులోకి వెళ్లిన వచ్చిన నలుగురూ అక్కడ క్యాబ్ మాట్లాడుకుని కాజీపేట వెళ్లారు. వాళ్లను హైవే వద్దే వదిలి వచ్చానంటూ ఈ క్యాబ్ డ్రైవర్ పోలీసులు చెప్పారు. తమను పట్టుకోవడానికి పోలీసులు సీసీ కెమెరాల్లోని ఫీడ్ వినియోగిస్తారన్న విషయం పింకుకి తెలుసు. అలా చేసినప్పుడు వారి సమయం వృథా కావడంతో పాటు దృష్టి మళ్లించడానికే పింకు ఇలా చేసి ఉంటాడని అధికారులు చెబుతున్నారు. కాచిగూడ నుంచి నాంపల్లికి ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో ఆ నలుగురూ ఉల్లాసంగా ఉన్నారని, వారిలో ఎలాంటి టెన్షన్ కనిపించలేదని, జోకులు వేసుకుంటూ నవ్వుకున్నారని ఆ ఆటోడ్రైవర్ పోలీసులకు తెలిపాడు.

బవారియాలో పట్టడం కష్టమే...

ఈ స్నాచర్ల కోసం పోలీసులు ఉత్తరప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఢిల్లీల్లో గాలిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్, ఎస్వోటీలకు చెందిన బృందాలు ఉత్తరప్రదేశ్‌లోని షామ్లీ, బవారియాలకు వెళ్లాయి. అయితే అక్కడకు వెళ్లి నిందితులు ఉన్నారా? లేదా? అనేది ఆరా తీయడం, అరెస్టు చేసి తీసుకురావడం కష్టమేనని పోలీసులు చెప్తున్నారు. అలాంటి ప్రయత్నాలు చేస్తే ఊరంతా కలిసి దాడులకు దిగుతుందని, ఈ నేపథ్యంలోనే పక్కా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నామన్నామని అంటున్నారు. 2019లో అర్ధరాత్రి వరకు శివార్లలో వేచి చూసిన నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆపై చాకచక్యంగా గ్రామంలోకి ప్రవేశించి ఇద్దరు స్నాచర్లను అదుపులోకి తీసుకున్నారు. ఇప్పుడూ అదే పంథా అనుసరించాలని భావిస్తున్నారు. మరోపక్క ప్రధాన నిందితుడు, సూత్రధారి రింకు ఇప్పటికే నేపాల్ చేరి ఉంటాడని, పరిస్థితులు చక్కబడ్డాకే షామ్లీ వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.



కలిసే బతుకుదామన్నాడు.. కానరాని లోకాలకు వెళ్లాడు..



రోదిస్తున్న మంజుల



రతన్ (ఫైల్)

బస్టాప్ వద్ద ఢీకొన్న టస్కర్ వాహనం

- చక్రాల కింద నలిగిపోయిన ప్రాణం
- కాపాడండి అంటూ భార్య రోదనలు
- ఇల్లాలి కళ్లెదుటే భర్త దుర్మరణం
- తీవ్ర గాయాలతో ఆస్పత్రికి బాధితురాలు
- రాజేంద్రనగర్‌లో విషాదకర ఘటన
- మృతుడు కర్ణాటక వలస కార్మికుడు

రాజేంద్రనగర్: 'మరో నెల రోజుల్లో ఇంటికి వస్తా. అక్కడే ఏదో ఒక పని చేసి బతుకుదాం.. పిల్లాపాపలతో అందరం హాయిగా ఉందాం' అని చెప్పిన భర్త.. తన కళ్ల ముందే అసువులు బాయడంతో ఆ ఇల్లాలు విలపించిన తీరు అందరి గుండెలను కదిలించింది. ఒంటి నిండా తీవ్ర గాయాలతో చావు బతుకుల మధ్య కొట్టుకుంటున్న భర్తను కాపాడాలని కనిపించిన వారి కాళ్లా వేళ్లా పడింది. కానీ.. కట్టుకున్న వాడి ప్రాణాలను కాపాడుకోలేకపోయింది. ఈ హృదయ విదారక ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం కలబురగి జిల్లా సేడం మండలానికి రతన్ (35), మంజుల (32) భార్యభర్తలు. వీరికి ముగ్గురు సంతానం.

స్థానికంగా పనులు లేకపోవడంతో..

ఏడాది క్రితం బతుకుదెరువు కోసం రతన్ నగరానికి వలస వచ్చాడు. పాండురంగానగర్ ప్రాంతంలో అద్దె ఇంట్లో ఉంటూ స్థానికంగా కూలీ పని చేస్తున్నాడు. ప్రతి నెలా సొంతూరికి వెళ్లి భార్యకు డబ్బులు ఇచ్చి వచ్చేవాడు. కూలీ పనులు దొరక్కపోవడంతో రెండు నెలలుగా గ్రామానికి వెళ్లడం లేదు. దీంతో ఆయన భార్య మంజుల మూడు రోజుల క్రితం భర్త వద్దకు వచ్చింది. రెండు రోజులు భర్తతో ఉండి అప్పటి వరకు జమ చేసిన డబ్బులు తీసుకుని సోమవారం ఉదయం స్వగ్రామానికి వెళ్లేందుకు సిద్ధమైంది. మరో నెల రోజులు ఇక్కడే పని చేసి వచ్చిన డబ్బుతో తానే వస్తానని భార్యకు చెప్పాడు. ఇక్కడ అంతగా పని దొరకడం లేదని గ్రామానికి వచ్చి పని చేసుకుని మీతోనే ఉంటానన్నాడు.

దూసుకు వచ్చిన మృత్యువు..

సోమవారం ఉదయం భార్యభర్తలు ఇదే విషయం మాట్లాడుకుని హైదర్‌గూడలోని బస్టాప్ వద్దకు చేరుకున్నారు. బస్టాప్ వద్ద ఉదయం 6 గంటలకు నిలుచుని ఉన్నారు. ఇదే సమయంలో ఆరాంఘర్ నుంచి మెహిదీపట్నం వైపు వెళ్తున్న టస్కర్ వాహనం ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తూ వేగంగా దూసుకువచ్చింది. బస్టాప్‌లో నిలుచున్న దంపతులిద్దరినీ ఢీకొట్టింది. టస్కర్ చక్రాల కింద నలిగిన రతన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మంజులకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి వరకు తనతో నెల రోజుల్లో గ్రామానికి వస్తానన్న భర్త తన కళ్లెదుటే తిరిగి రాని లోకాలకు వెళ్లడంతో ఆమె కన్నీరుమున్నీరుగా రోదించింది. భర్త బతికే ఉన్నాడనుకుని కాపాడండంటూ అక్కడ ఉన్నవారిని ప్రాధేయపడింది. ఆమె అభ్యర్థనలు అతడి ప్రాణాలను కాపాడలేకపోయాయి. ప్రమాదానికి కారకుడైన టస్కర్ డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పారిపోయాడు. కేసు దర్యాప్తులో ఉంది.

స్ట్రీట్ సర్క్యూట్‌కు | నయా సొబగులు

సాక్షి, సిటీబ్యూరో: వచ్చే నెల 11న నెక్లెస్ రోడ్డులోని స్ట్రీట్ సర్క్యూట్‌లో నిర్వహించనున్న ఫార్ములా–ఈ రేసింగ్ కార్ పోటీలకు సన్నాహాలు మొదలయ్యాయి. పోటీల కోసం ఏర్పాటు చేసిన 2.8 కిలోమీటర్ల ట్రాక్‌ను మరోసారి సమగ్రంగా అధ్యయనం చేసి నివేదికను అందజేసేందుకు సాంకేతిక నిపుణుల బృందం సోమవారం నగరానికి చేరుకుంది. ఈ బృందం ఇచ్చే రైడర్ స్కానింగ్ నివేదిక ఆధారంగా ట్రాక్‌లో అవసరమైన మార్పులు చేయనున్నారు. అంతర్జాతీయ స్థాయిలో జరగనున్న ఈ– కార్ రేసింగ్ పోటీలకు దేశంలోనే తొలిసారిగా నగరం ఆతిథ్యమివ్వనున్న నేపథ్యంలో ఎలాంటి లోపాలకు తావులేకుండా అధికారులు పటిష్టమైన చర్యలు చేపడుతున్నారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో జరిగిన ఇండియన్ రేసింగ్ కార్ పోటీల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం ట్రాక్‌లో ఉన్న లోపాలపై నిపుణులు దృష్టి సారించారు. ఈ పోటీల్లో రేసర్లు మలుపుల వద్ద ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వాహనాలు బ్రేక్ డౌన్‌కు గురై ప్రమాదాల బారినపడ్డారు. మరోవైపు నగరంలో జరిగిన ఇండియన్ రేసింగ్ కార్ పోటీలకు కొనసాగింపుగా రెండు రోజుల క్రితం చెన్నైలో నిర్వహించిన జాతీయస్థాయి ఫైనల్ పోటీల్లో ఒక రేసర్ మృత్యువాత పడ్డట్టు సమాచారం. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని ఫిబ్రవరి 11న జరిగే పోటీల్లో ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.

మలుపుల్లో మార్పులు..

పోటీల కోసం రూపొందించిన స్ట్రీట్ సర్క్యూట్ 2.8 కిలోమీటర్ల మార్గంలో 18 మలుపులు ఉన్నాయి. వీటిలోంచే గంటకు 320 కిలోమీటర్ల గరిష్ట వేగంతో ఎలక్ట్రిక్ కార్లు దూసుకెళ్లాల్సి ఉంటుంది. అంతర్జాతీయ ప్రమాణాల మేరకు ట్రాక్ బాగానే ఉన్నా ఒకటి, రెండు మలుపుల వద్ద మార్పులు చేయాల్సి ఉన్నట్లు నిపుణులు ఇప్పటికే గుర్తించారు. ప్రస్తుతం నగరానికి చేరుకున్న బృందంలో ట్రాక్ సర్వే నిపుణులు కూడా మలుపులపై అధ్యయనం చేయనున్నారు. ఐమాక్స్ వద్ద, ఇందిరాగాంధీ విగ్రహం నుంచి ట్యాంక్‌బండ్ వెళ్లే రూట్‌లో ఉన్న రెండు మలుపుల్లో మార్పులు చేయవలసి ఉంటుందని ప్రాథమికంగా గుర్తించారు. ఈ రెండు చోట్ల వాహనాలు ముందుకు వెళ్లడం ఇబ్బందిగా ఉంది. వేగాన్ని నియంత్రించే క్రమంలో రేసర్లు చాలా కష్టపడాల్సి వస్తోంది. ఈ రెండు మలుపుల్లో కొద్దిగా ఎత్తు పెంచి తగిన మార్పులు చేసే అవకాశం ఉన్నట్లు హెచ్ఎండీఏ అధికారి ఒకరు తెలిపారు.

నగరానికి చేరుకున్న సాంకేతిక నిపుణులు

- రైడర్‌స్కానింగ్ నివేదిక ఆధారంగా మార్పులు
- ఇప్పటికే మలుపుల వద్ద లోపాల గుర్తింపు
- ఫార్ములా– ఈ పోటీల నిర్వహణకు నెక్లెస్ రోడ్ ట్రాక్‌పై సమగ్ర అధ్యయనం



టికెట్లు నాలుగు విభాగాలుగా..

ఈ పోటీల కోసం బుక్ మై షో ద్వారా టికెట్ అమ్మకాలు చేపట్టిన విషయం విదితమే. మొత్తం 22,500 టికెట్లు విక్రయించనున్నారు. రూ.1000 నుంచి రూ.3500, 6000, 10,000 చొప్పున నాలుగు కేటగిరీల్లో వీటిని అమ్ముతారు. ఈ పోటీల సందర్భంగా నగరంలోని ప్రధాన కూడళ్లలో భారీ స్క్రీనింగ్‌లను ఏర్పాటు చేసేందుకు హెచ్ఎండీఏ సన్నాహాలు చేపట్టింది.

ఎలక్ట్రిక్ పరికరాల ప్రదర్శన..

ఫార్ములా– ఈ పోటీల సందర్భంగా ఎలక్ట్రిక్ కార్ల వినియోగంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రదర్శన నిర్వహించనున్నారు. ఇందుకోసం నెక్లెస్‌రోడ్డులోనే కొన్ని స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. వీటిలో ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించిన వివిధ రకాల విడిభాగాలను ప్రదర్శించనున్నారు. 'ప్రస్తుతం నిపుణుల బృందాలు రంగంలోకి దిగాయి. సంక్రాంతి వరకు అన్ని రకాల సర్వేలు, అధ్యయనాలు పూర్తి చేసుకొని లండన్‌లోని కన్సల్టెన్సీకి రైడర్ స్కానింగ్ నివేదికను అందజేస్తారు. అక్కడి నుంచి వచ్చే సలహాలు, సూచనల ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటాం' అని ఓ అధికారి చెప్పారు.

కేలండర్ ఆవిష్కరణ



న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం నూతన కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్. చిత్రంలో జాతీయ న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బోధ లక్ష్మారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బయ్య తదితరులు. – సాక్షి,సిటీబ్యూరో

పండ్ల మార్కెట్‌ను తరలించొద్దు



ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న పండ్లతోటల రైతులు

ఇబ్రహీంపట్నం: బాటసింగారం నుంచి పండ్ల మార్కెట్‌ను తరలించొద్దని సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పండ్ల తోటల రైతులు కలిసి విన్నవించారు. గతంలో గడ్డిఅన్నారంలో ఉన్న పండ్ల మార్కెట్‌ను కోహెడకు తరలించారని, అక్కడి నుంచి బాటసింగారానికి మార్చారన్నారు. విజయవాడ–హైదరాబాద్ ప్రధాన రహదారిలో బాటసింగారానికి తరలించిన ఈ మార్కెట్ రైతులందరికీ అనువుగానే ఉందని.. అలాంటప్పుడు తరలించాల్సిన అవసరం లేదన్నారు. కొందరు వ్యాపారులు స్వలాభం కోసం మామిడిపల్లికి పండ్ల మార్కెట్‌ను తరలించాలని ప్రయత్నిస్తున్నారని.. ఈ ప్రయత్నాన్ని నిలువరించాలని విజ్ఞప్తి చేశారు. విషయాన్ని మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాటసింగారంలోనే పండ్ల మార్కెట్ కొనసాగేలా చర్యలు చేపట్టాలని కోరారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



రంగారెడ్డిజిల్లాకోర్టులు: నిజామాబాద్ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గణపతిపై పెట్టిన అక్రమ కేసులకు నిరసనగా తెలంగాణ న్యాయవాదుల సంఘం సమాఖ్య అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు సోమవారం విధులను బహిష్కరించారు. ఈ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా న్యాయవాద సంఘం అధ్యక్షుడు గుర్రం సుధాకర్ రెడ్డి పిలుపు మేరకు న్యాయవాదులు రంగారెడ్డి జిల్లా కోర్టులో విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బాచిరెడ్డి శాయి రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, పొన్నం దేవరాజ్ గౌడ్, బార్ కౌన్సిల్ సభ్యులు అనంతసేన్ రెడ్డి, న్యాయవాదుల జేఏసీ అధ్యక్షుడు పులిగారి గోవర్ధన్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ గణపతిపై పెట్టిన అక్రమ కేసును వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేసేవరకు ఆందోళన కొనసాగిస్తామని పేర్కొన్నారు.

సరూర్‌నగర్ ఠాణా ఆకస్మిక తనిఖీ

చైతన్యపురి: రాచకొండ కమిషనరేట్ నూతన కమిషనర్ డి.ఎస్. చౌహాన్ సోమవారం సాయంత్రం సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రిసెప్షన్, సెక్షన్, క్రైం విభాగాలను పరిశీలించారు. నమోదయ్యే కేసులు, ఇన్వెస్టిగేషన్ తదితర అంశాలపై ఇన్‌స్పెక్టర్ సీతారాంను అడిగి వివరాలు తెలుసుకున్నారు.



సరూర్‌నగర్ పీఎస్‌ను పరిశీలిస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

ఘనంగా ఆలియా మదర్సా 150వ వార్షికోత్సవం



సాక్షి,సిటీబ్యూరో: హైదరాబాద్ నగరంలోని మొట్టమొదటి ఇంగ్లీష్ మీడియం స్కూలు ఆలియా మదర్సా 150వ వార్షికోత్సవం సోమవారం నిజాం క్లబ్‌లో అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా మదర్సా ఆలియా పూర్వ విద్యార్థులు తమ స్కూల్ విశేషాలను గుర్తు చేసుకున్నారు. సియాసత్ పత్రిక ఎడిటర్ జాహెద్ అలీఖాన్ చేతుల మీదుగా సావనీర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సియాసత్ దిన పత్రిక ఎడిటర్, నిజామ్ క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ ఈ వార్షికోత్సవంలో 1949బ్యాచ్ విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. అబ్దుల్ మనమ్, జఫర్ జావీద్ వెబ్ సైట్ ను ప్రారంభించారు. మీడియా ప్లస్ ఫౌండేషన్ రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. నిజాం నవాబు 1872లో ఆలియా మదర్సాను స్థాపించి ఆంగ్లవిద్యను అందరికీ చేరువ చేశారన్నారు. ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్, నిజాం సంస్థాన ప్రధానమంత్రి మహారాజ కిషన్ ప్రసాద్‌తో పాటు ఎందరో ప్రముఖులు ఈ ఆలియా మదరసా విద్యార్థులేనన్నారు. ముహమ్మద్ అజహరుద్దీన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆలియా పూర్వ విద్యార్థులకు, ఆలియా మదర్సా నిర్వాహకులకు మెమెంటోలను అందజేశారు. ఫుట్ బాల్ క్రికెట్ టీమ్ మాజీ కెప్టెన్ షబ్బీర్ అలీ కూడా అజహరుద్దీన్ చేతుల మీదుగా మెమెంటోను అందుకున్నారు. సీనియర్ పాత్రికేయులు సోమశేఖర్ ఆలియా అల్యుమ్నీ అసోషియేషన్‌ను ప్రకటించారు. అబ్దుల్ ముతకబ్బిర్, ముహమ్మద్ యూసుఫ్ జాఫర్, హమీద్ లతీఫ్, గులామ్ ముహమ్మద్, ఖుతుబుద్దీన్, సయ్యద జహంగీర్, ముహమ్మద్ ఇఫ్తెకార్ హుసైన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఖాలిద్ షెహ్ బాజ్ కార్యక్రమ నిర్వహణను పర్యవేక్షించారు.

దారిదోపిడీ కేసులో హవాలా కోణం

- వైన్స్ షాప్ యజమాని అరెస్టు
- రూ.కోట్లల్లో అక్రమ లావాదేవీలు జరిగినట్లు గుర్తింపు
- డైరీ స్వాధీనం చేసుకున్న పోలీసులు

హస్తినాపురం: వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు రోజుల క్రితం జరిగిన దారి దోపిడీ కేసు మరో మలుపు తిరిగింది. డబ్బులు పోగొట్టుకున్నట్లు ఫిర్యాదు చేసిన వెంకట్‌రెడ్డి విచారణలో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఎంఆర్‌ఆర్ వైన్స్ యజమాని వెంకట్‌రెడ్డి రూ. 50 లక్షలు తీసుకుని బైక్‌పై వెళ్తుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైకుతో ఢీకొట్టి తన బ్యాగులో ఉన్న రూ. 25 లక్షలు తీసుకుని పరారైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన సీసీఎస్ పోలీసులు వెంకట్‌రెడ్డి ఇంటిపై దాడి చేసి ఇంట్లో ఉన్న రూ. 2.75 కోట్ల నగదుతో పాటు వెంకట్‌రెడ్డి రాసుకున్న డైరీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ప్రవీణ్ నేతృత్వంలో రెండేళ్లుగా పాతబస్తీలోని రియాసత్‌నగర్‌కు చెందిన ఫారుఖ్‌తో కలిసి హవాలా లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. నగదు దోపిడీపై విచారణలో భాగంగా పోలీసులు స్వాధీనం చేసుకున్న డైరీలో గత ఆరు నెలల్లో రూ. 28 కోట్లు ప్రవీణ్ పంపినట్లు రాసుకున్నట్లు గుర్తించారు. హవాలా నగదు వ్యవహారం బయటపడటంతో వెంకట్‌రెడ్డి దోపిడీ డ్రామా ఆడినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. వెంకట్‌రెడ్డి డైరీ కీలకం కావడంతో అందులో పేర్కొన్న ప్రవీణ్, ఫారుఖ్‌ల లింకుపై పోలీసులు ఆరాతీస్తున్నారు. రెండు ప్రత్యేక బృందాలతో పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించకపోవడం గమనార్హం.

ఎమ్మెల్యే కాలనీలో భారీ చోరీ

- రూ. 50 లక్షల విలువ చేసే బంగారు వజ్రాభరణాల లాకర్ ఎత్తుకెళ్లిన దొంగలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీకి చెందిన ప్రముఖ వ్యాపారి అరిహంత్ జైన్ నివాసంలో గుర్తుతెలియని వ్యక్తులు రూ. 50 లక్షల విలువైన బంగారు వజ్రాభరణాలతో పాటు రూ.15 లక్షలు నగదు ఎత్తుకెళ్లిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే... అరిహంత్ జైన్ ఈ నెల 4న ఉదయం తన అత్త నిద్రించే బెడ్‌రూమ్‌లో కప్‌బోర్డు తెరిచి ఉండటమే కాకుండా వస్తువులన్నీ చెల్లా చెదురుగా పడి ఉండటాన్ని గమనించాడు. దీంతో ఆయన కప్‌బోర్డును తెరిచి చూడగా గోద్రేజ్ లాకర్ కనిపించలేదు. అందులో రెండు డైమండ్ నెక్లెస్‌లు, నాలుగు డైమండ్ గాజులు, మూడు డైమండ్ ఉంగరాలు, ఒక బంగారు నెక్లెస్, నాలుగు డైమండ్ పెండెంట్స్, మూడు బంగారు గొలుసులు, రూ.15 లక్షల నగదు ఉన్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంట్లో ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజీని పరిశీలించగా 3 తేదీ సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో సీసీ కెమెరాల కోసం ఏర్పాటు చేసిన వైర్లను ముందుగానే కత్తిరించినట్లుగా గుర్తించారు. అదే వ్యక్తి లాకర్‌ను ఎత్తుకెళ్ళినట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. బంజారాహిల్స్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇటీవల ఫిలింనగర్‌లో శమంతక డైమండ్ షోరూంలో దొంగలు పడి రూ. 2 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు తస్కరించిన ఘటన మరువక ముందే తాజాగా ఎమ్మెల్యే కాలనీలో భారీ దొంగతనం చోటు చేసుకోవడంతో పోలీసులు నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. పాత నేరస్తుల కదలికలపై దృష్టి సారించారు. ఫిలింనగర్ శమంతక డైమండ్స్‌లోనూ దొంగలు రెండు లాకర్లను ఎత్తుకెళ్లారు. తాజా ఘటనలోనూ లాకర్‌ను ఎత్తుకుపోయిన నేపథ్యంలో ఈ రెండు చోరీలు ఘరానా దొంగల పనే అయి ఉండవచ్చునని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి దారుణ హత్య



శివాజీ (ఫైల్)

రాంగోపాల్‌పేట్: ముగ్గురు యువకుల మధ్య మొదలైన చిన్నపాటి గొడవ ఓ యువకుడి హత్యకు దారితీసిన సంఘటన మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఓల్డ్ గాస్మండికి చెందిన భూక్యా శివాజీ అలియాస్ శివ (25) కొరియర్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంటి పక్కన ఉండే వారి పెళ్లికి వెళుతున్నానని చెప్పి బయటికి వెళ్లాడు. రాత్రి 12 గంటల సమయంలో సైనిక్‌పురికి చెందిన తన స్నేహితుడు మింటు అలియాస్ డేనియల్‌తో కలిసి ఇంటి సమీపంలో మద్యం సేవిస్తున్నారు. అదే సమయంలో అటుగా వెళుతున్న గుర్తు తెలియని యువకుడిని ఆపి ఎవరు, ఇక్కడేమి చేస్తున్నావంటూ ప్రశ్నించడమేగాక అతడిపై చేయి చేసుకున్నారు. దీంతో సదరు యువకుడు తన స్నేహితుడికి ఫోన్ చేసి తన బైక్‌లో పెట్రోల్ అయిపోయిందని ఓల్డ్ గాస్మండికి రావాలని సూచించాడు. దీంతో మరో యువకుడు కారులో అక్కడికి వచ్చాడు. అయితే శివాజీ మరోమారు వారితో గొడవ పడ్డాడు. దీంతో అతను తన చేతిలో ఉన్న పువ్వులు కట్ చేసే బ్లేడుతో శివాజీపై దాడి చేసి కారులో పరారయ్యాడు. దీంతో శివాజీ స్నేహితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం రక్తపు మడుగులో పడి ఉన్న శివాజీని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అతను అప్పటికే మృతి చెంది ఉండటంతో మార్చురీకి తరలించారు. శివాజీ స్నేహితుడు డేనియల్ ఉదయం పోలీస్ స్టేషన్‌కు వచ్చి జరిగిన విషయం పోలీసులకు చెప్పాడు.

పోలీసుల అదుపులో నిందితులు ?

యువకుడిని హత్య చేసిన వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ప్రధాన నిందితుడిని బన్సీలాల్‌పేట్‌కు చెందిన పూల వ్యాపారిగా గుర్తించారు. కారు ఆధారంగా నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

కోహెడ మార్కెట్‌తో ప్రయోజనం శూన్యం

- రాష్ట్ర వ్యాప్తంగా 8 పండ్ల మార్కెట్లు
- బాటసింగారం మార్కెట్‌కు రూ.లక్షల అద్దె ఎందుకు
- కమీషన్ ఏజెంట్ల సంఘం అధ్యక్షుడు తాజుద్దీన్

సాక్షి,సిటీబ్యూరో: గతంతో పోలిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 8 పండ్ల మార్కెట్లు ఉనికిలోకి వచ్చాయని, కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన మార్కెట్‌తో ఎలాంటి ప్రయోజనం లేదని ది హోల్‌సేల్ ఫ్రూట్ కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ తాజుద్దీన్ అన్నారు. సోమవారం మామిడిపల్లి పండ్ల మార్కెట్‌లో విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఉన్నంత పండ్ల వ్యాపారం ప్రస్తుతం లేదని, కోహెడలో రూ. కోట్లు ఖర్చు చేసి మార్కెట్ నిర్మించినా ఆశించిన ఫలితం ఉండదన్నారు. ఈ విషయం మార్కెటింగ్ శాఖ మంత్రి, ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కమీషన్ ఏజెంట్లను సంప్రదించకుండా కోహెడలో మార్కెట్ నిర్మించడం సరికాదన్నారు. వ్యాపారం చేసేది, ఫీజుల చెల్లించేది కమీషన్ ఏజెంట్లేనని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రంలో 8 పండ్ల మార్కెట్లు ఏర్పాటయ్యాయన్నారు. గతంలో కొత్తపేట్ మార్కెట్ ఆసియాలో అతిపెద్ద మార్కెట్‌గా ఉండేదని, కానీ ప్రస్తుతం బాటసింగారం మార్కెట్‌కు అంతగా సరుకు రావడం లేదన్నారు. గతంలో మహారాష్ట్ర, కర్నాటకతో పాటు ఏపీ నుంచి నగరానికి పండ్లు కొనేందుకు వ్యాపారులు వచ్చే వారని, ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లోనూ మార్కెట్లు అందుబాటులోకి రావడంతో వారు అక్కడికక్కడే పండ్లు కొనుగోలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మార్కెటింగ్‌శాఖ అనాలోచిత చర్యలు పండ్ల రైతులు, వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లను ఇబ్బందుల పాలు చేస్తున్నాయన్నారు. కొత్తపేట్ పండ్ల మార్కెట్ స్థలంలో మల్టిసూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం పేరిట ఆగమేఘాలపై గడ్డిఅన్నారం మార్కెట్‌ను నేలమట్టం చేశారన్నారు. దీంతో హోల్‌సేల్ వ్యాపారులు తమ సొంత పూచీపై పండ్లను ఉత్తరాది రాష్ట్రాల నుంచి తెప్పించుకుంటున్నట్లు తెలిపారు. మామిడి సీజన్‌లోనూ రైతులు బాటసింగారం మార్కెట్‌కు కాయలు తీసుకురావడం లేదని, హోల్‌సేల్ వ్యాపారులే నేరుగా తోటల వద్దకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారన్నారు. కోహెడలో మార్కెట్ నిర్మాణం కాకపోవడంతో హోల్‌సేల్ వ్యాపారులు మామిడిపల్లిలోని వక్ఫ్ భూమిలో పండ్ల మార్కెట్ ఏర్పాటు చేసుకున్నారన్నారు. కోహెడలో మార్కెట్ నిర్మాణం కాక ముందే అధికారులు లైసెన్సుల కోసం దరఖాస్తులు తీసుకున్నట్లు ఆరోపించారు. గతంలోనే ప్రభుత్వ అనుమతి లేదని జారీ చేసిన 180 లైసెన్సులను మార్కెటింగ్ శాఖ రద్దు చేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.



క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: కుందన్‌బాగ్ 11 కేవీ ఫీడర్‌లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఐఏఎస్ క్వార్టర్స్, ఐపీఎస్ క్వార్టర్స్, మినిష్టర్స్ క్వార్టర్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ కిశోర్‌కుమార్ సోమవారం తెలిపారు. అదే విధంగా ఇంటర్‌గ్రాఫ్, సప్తగిరి టవర్స్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో ఇంటర్‌గ్రాఫ్, తాజ్ వివెంట పరిసరాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

- ఐటీసీ 11 కేవీ ఫీడర్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జూబ్లీహిల్స్ రోడ్-15, 22, 32, 36, 41, పెద్దమ్మ టెంపుల్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ శ్రీనివాస్ సోమవారం తెలిపారు.
- ఫిల్మ్‌నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో జూబ్లీహిల్స్ రోడ్-45, శ్రీహరి హోం ఏరియాలలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- నాగార్జుననగర్ 11 కేవీ ఫీడర్‌లో నాగార్జుననగర్ కమ్యూనిటీహాల్ ఏరియా, గౌతం టిఫిన్ సెంటర్ ఏరియా, పోచమ్మ ఆలయం ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కమ్యూనిటీ హాళ్లను పరిశీలించిన అధికారులు

రహమత్‌నగర్: ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమం కోసం జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా కంటి వెలుగు కేంద్రాల ఏర్పాటు కోసం కమ్యూనిటీహాళ్లను పరిశీలించారు. జీహెచ్ఎంసీ సర్కిల్ 19 యూసీడీ డిప్యూటీ ప్రాజెక్ట్ అధికారి హిందుమతి, ఏఎంహెచ్ఓ డాక్టర్ బిందు భార్గవి, శానిటేషన్ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్‌లు రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలో పర్యటించి కమ్యూనిటీ హాళ్లలోని సౌకర్యాలను పరిశీలించారు. రహమత్‌నగర్ డివిజన్‌లోని ఓంనగర్, బ్రహ్మశంకర్ నగర్, కార్మికనగర్ తదితర ప్రాంతాల్లోని కమ్యూనిటీ హాళ్లను పరిశీలించారు. అన్ని వసతులు ఉన్న కమ్యూనిటీ హాల్ వివరాలను సంబంధిత అధికారులకు అందజేశారు.

సిటీలో 'సెలబ్రిటీ సీక్రెట్స్'



సాక్షి,సిటీబ్యూరో: నగరంలో ఈట్, షాప్ అండ్ ట్రీట్ అనే వినూత్న పద్ధతిలో 'సెలబ్రిటీ సీక్రెట్' ప్రారంభించడం అభినందనీయమని సినీ నటి, నిర్మాత ఘట్టమనేని మంజుల అన్నారు. 'ఆహార ప్రియుల కోసం ఫుడ్ వెరైటీస్, షాపింగ్ కోసం వస్త్రోత్పత్తుల వేదిక, సౌందర్యానికి మెరుగులుదిద్దే బ్యూటీ సేవలన్నింటినీ' ఒకే చోట అందించేలా జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 41లో ఏర్పాటు చేసిన మల్టీ డిజైనర్ స్టోర్ 'సెలబ్రిటీ సీక్రెట్'ను సోమవారం ఆమె ప్రముఖ సామాజిక వేత్త పింకీ రెడ్డితో కలిసి ప్రారంభించారు. సెలబ్రిటీ సీక్రెట్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వెంకట్, డాక్టర్ మాధవి చౌదరి పాల్గొన్నారు.

విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన తేదీలు ఖరారు

రహమత్‌నగర్(బోరబండ): బోరబండ హనుమాన్ దేవాలయ కమిటీ సమావేశం ఆలయ చైర్మన్ లక్ష్మణ్‌గౌడ్ అధ్యక్షతన సోమవారం జరిగింది. సమావేశంలో ఆలయ చైర్మన్ మాట్లాడుతూ, ఆలయ పునః నిర్మాణ పనులు, విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన తేదీలను నిర్ణయించామన్నారు. ఫిబ్రవరి 3న వాస్తుపూజ, ఆలయ సంప్రోక్షణ, పుణ్య వాచనం, హోమం, 4న ధ్వజస్తంభానికి అభిషేకం, వేద పారాయణం, 5న విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, పూజ కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

ఉద్యోగంలో నుంచి తీసేశాడని..

యజమానిపై కత్తితో దాడి

బంజారాహిల్స్: తనను ఉద్యోగంలో నుంచి తీసేశాడని కక్ష పెంచుకుని ఓ యువకుడు యజమానిపై కత్తితో దాడికి పాల్పడిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఫిలింనగర్ సైట్-2లోని డీవీఎస్ ఎన్‌క్లేవ్‌లో ఎస్‌వి సుగేష్ అనే వ్యక్తి హ్యాన్‌వేస్ కేరళ కేఫ్ పేరుతో అపోలో ఆస్పత్రి వద్ద హోటల్ నిర్వహిస్తున్నాడు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన జ్యూస్ సెంటర్‌లో పని చేసేందుకు జాఫర్ అనే యువకుడిని నియమించుకున్నాడు. అయితే కొద్ది రోజులుగా జాఫర్ కస్టమర్ల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తుండటంతో గత నెల 31న విధుల్లో నుంచి తొలగించి మరొకరికి సెంటర్‌ను అప్పగించాడు. దీంతో అతడిపై కోపం పెంచుకున్న జాఫర్ ఈ నెల 2న మధ్యాహ్నం సుగేష్ హోటల్ వెనుక రెస్ట్‌రూమ్‌లో ఉండగా ఫోల్డర్ కత్తితో పొత్తి కడుపులో పొడిచి అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన సుగేష్ అపోలో ఆస్పత్రిలో చేరగా ఆపరేషన్ చేశారు. సోమవారం బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు జాఫర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులకు సృజన పోటీలు

- విద్యార్థులకు తేలికగా అర్థమయ్యేలా కృత్యాల తయారీ
- మండల స్థాయిలో పూర్తి
- ఈ నెలాఖరులో జిల్లా స్థాయి పోటీలు
- షేక్‌పేట మండలం నుంచి ఐదుగురు టీచర్లు జిల్లా స్థాయికి ఎంపిక



తాము రూపొందించిన కృత్యాలతో విద్యార్థులకు బోధిస్తున్న గతి పాఠశాల టీచర్లు

బంజారాహిల్స్: ప్రభుత్వ పాఠశాలల తరగతి గదుల్లో బోధనపై ఇక నుంచి ఉపాధ్యాయుల కృత్యాలు కీలక పాత్ర పోషించనున్నాయి. రోజువారీ పాఠ్య ప్రణాళికలతో పాటు కృత్యాలతో పాఠాలు బోధించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటి వరకు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి వారి సామర్థ్యాలను గుర్తించిన ఉపాధ్యాయులు ఈ నెలలో పరీక్షలను ఎదుర్కోబోతున్నారు. ఎన్నిమార్కులు సాధిస్తే అంత గుర్తింపు లభిస్తుంది.

- ఇందుకోసం విద్యాశాఖ ఖైరతాబాద్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, రహ్మత్‌నగర్, యూసుఫ్‌గూడ, బోరబండ, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ పరిధిలో ఉన్న 47 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని 178 మంది టీచర్లు తమ ఆలోచనలకు పదును పెడుతున్నారు.
- వీరు తాము రూపొందించిన సృజనతో కూడిన కృత్యాలను ఇప్పటికే మండల స్థాయిలో ప్రదర్శించారు.
- ప్రాథమిక తరగతుల్లో బోధన మరింత విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించేందుకు సందర్శన బృందాలను ఏర్పాటు చేసి ఎప్పటిప్పుడు పరిశీలిస్తోంది.
- చిన్న పిల్లలకు బొమ్మలు, కృత్యాలతో బోధిస్తే మంచి ఫలితాలు వస్తాయని ఈ మేరకు టీచర్లను కృత్యాధార బోధన వైపు దృష్టిసారించేలా చేశారు.
- కృత్యాల తయారీ, వినియోగం విషయంలో వారి మధ్య అంతర్గత పోటీలు కూడా నిర్వహిస్తున్నారు.
- ఇప్పటికే షేక్‌పేట మండల స్థాయిలో ఈ మేళాలు పూర్తయ్యాయి. త్వరలోనే జిల్లా, రాష్ట్ర స్థాయిలో మేళా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఖైరతాబాద్ జోన్ పరిధిలోని ఉపాధ్యాయులు రూపొందించిన కృత్యాలకు మార్కులు వేయనున్నారు.

ప్రయోజనాలు ఇలా..

- ఉపాధ్యాయుడు బోధనేతర సమయంలో విద్యార్థులతో కూర్చొని కృత్యాలు తయారు చేస్తే విద్యార్థులతో తమ ఆలోచనలను పంచుకునే అవకాశం ఉంటుందని, విద్యార్థి స్థాయిలో తమ ఆలోచనలను వివరించే అవకాశం ఉంటుందని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.
- బోధనలో విద్యార్థి స్థాయికి టీచర్ దిగితేనే వారిని ఆకట్టుకుంటుందని ఒకసారి బోధిస్తే చాలా రోజుల పాటు పదిలంగా ఉంటుందని మనో విజ్ఞాన నిపుణులు కూడా నివేదిక సమర్పించారు. ఆ నేపథ్యంలోనే ఈ విధానానికి శ్రీకారం చుట్టారు .ప్రాథమిక తరగతులు చదివే విద్యార్థికి కథలు, బొమ్మలతో ఏం చెప్పినా ఆసక్తికరంగా వింటారని భావిస్తున్నారు.

షేక్‌పేట మండలంలో ఎంపికైన టీచర్లు

షేక్‌పేట మండల పరిధిలో మొత్తం 27 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఇటీవల జరిగిన సృజన పోటీల్లో మండల స్థాయి నుంచి ఫిలింనగర్‌లోని వినాయకనగర్ ప్రభుత్వ పాఠశాల టీచర్ జె. స్వాతి, బంజారాహిల్స్ రోడ్ నెం. 2 ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాల టీచర్ హిమబిందు, బంజారాహిల్స్ రోడ్ నెం.7 గతి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉర్దూ టీచర్ అర్షియా సుల్తానా, ఎన్బీటీ నగర్ ప్రాథమిక టీచర్ జె. పుష్పలత, ఫిలింనగర్ ఎమ్మార్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు శ్రీదేవి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

మార్కులు ఇలా వేస్తారు..

ప్రతి ప్రాథమిక పాఠశాల నుంచి సబ్జెక్టుకు ఒక కృత్యం చొప్పున కనీసం నాలుగు కృత్యాలను పాఠశాల స్థాయిలో ఎంపిక చేస్తారు. నాలుగు సబ్జెక్టులకు ఒకటి చొప్పున నాలుగు ప్రదర్శనలు తయారు చేసి ఇప్పటికే మండల స్థాయి ప్రదర్శన నిర్వహించారు. ఉపాధ్యాయులు తక్కువ ఖర్చుతో స్వయంగా రూపొందించిన కృత్యాలకు 10 మార్కులు, తయారు చేసిన విధానానికి 10 మార్కులు, అభ్యసన ఫలితాల తోడ్పాటుకు 10 మార్కులు, బహుళ ప్రయోజనాలకు 10 మార్కుల చొప్పున మొత్తం 40 మార్కులు కేటాయించారు. ప్రతి సబ్జెక్టుకు సంబంధించిన మేళాలను ప్రదర్శనగా పెట్టిన గదికి ప్రముఖ శాస్త్రవేత్తల పేర్లు పెట్టి విద్యార్థులకు ఆలోచింపజేయాలని, ప్రతి పాఠశాల నుంచి కనీసం నాలుగు కృత్యాలు జిల్లా స్థాయిలో పోటీ నిర్వహించి పది మెరుగైన కృత్యాలను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపిస్తారు. విద్యార్థుల సమక్షంలో వారి భాగస్వామ్యంతో పాఠాలకు అనుగుణంగా కృత్యాలను తయారు చేస్తే విద్యార్థులు చక్కగా పాఠాలు వింటారని ఈ బోధన కొనసాగించేందుకు అధికారులు ముందుకు వచ్చారు.

ఉత్సాహంగా 'డాజిల్-23'



జేహెచ్‌పీఎస్‌లో విద్యార్థుల ఆటా, పాటా

ఫిలింనగర్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారిని మరింత ప్రోత్సహించేందుకు జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో డాజిల్-23 పేరుతో వినోదభరిత కార్యక్రమాన్ని నిర్వహించారు. పండుగ వాతావరణంలో జరిగిన ఈ మెగా ఉత్సవంలో జేహెచ్‌పీఎస్ తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని సరదా, సంతోషాల్లో మునిగి తేలారు. విద్యార్థులు వారి తల్లిదండ్రుల కోసం ఆటల పోటీలు నిర్వహించారు. ఫుడ్‌స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.విద్యార్థులు తమ ప్రతిభను చాటి చెప్పే ప్రదర్శనలతో ఉత్సాహాన్ని నింపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు చేసిన ఫ్లాష్ మాబ్ నృత్యాలు ఈ కార్యక్రమంలో మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. స్టాండ్ అఫ్ కామెడీ, లైట్ మ్యూజిక్, ఫ్యూజన్, బాలీవుడ్ డ్యాన్స్‌లు, మిమిక్రీ, భోగి మంటలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. వర్చువల్ గేమ్‌లు, డాట్ గేమ్‌లు, బుల్‌రైడ్, పిన్‌బాల్, బెలూన్‌షూటింగ్ ఇలా ప్రతి కార్యక్రమం ఆకర్షణీయంగా నిలిచింది. ఈ సందర్భంగా పదో తరగతి, 12వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. పాఠశాల చైర్మన్ మురళీ ముకుంద్, ప్రిన్సిపాల్ వరలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ కాంచనవల్లి ఈ సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

సెలోనిస్‌తో కేఎల్ డీమ్డ్ వర్సిటీ ఎంఓయూ



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

బంజారాహిల్స్: దేశంలో అగ్రగామి యూనివర్సిటీల్లో ఒకటైన కేఎల్ డీమ్డ్ టూబి యూనివర్సిటీ జర్మనీ కేంద్రంగా ఎగ్జిక్యూషన్ మేనేజ్‌మెంట్‌లో అంతర్జాతీయంగా అగ్రగామిగా వెలుగొందుతున్న సెలోనిస్‌తో ఓ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీనిలో భాగంగా సెలోనిస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సీఈఓ హైదరాబాద్‌లోని కేఎల్ గ్లోబల్ బిజినెస్ స్కూల్‌లో ప్రారంభించనున్నారు. ఈ కేంద్రం ప్రాసెస్, మైనింగ్స్ ముఖ్య సూత్రాలపై ఆధారపడి ఉంటుంది. సెలోనిస్ కోసం నైపుణ్యం కలిగిన విభాగాల్లో ప్రాసెస్ మేనేజ్‌మెంట్ ఒకటి. ఈ భాగస్వామ్యంతో అభ్యాసంతో పాటుగా తరగతి కార్యక్రమాలు, ఆన్‌లైన్ సర్టిఫికెట్, థీసెస్ సపోర్ట్, గెస్ట్ లెక్చరర్స్ కోసం విద్యార్థులు సెలోనిస్ సాంకేతికతను ఉచితంగా పొందే వీలుంటుంది. ఈ అవగాహన ఒప్పందాలను సెలోనిస్ సీనియర్ అకడమిక్ అలైన్స్ మేనేజర్ మంజునాథ్ చంద్రశేఖర్, కేఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్ హైదరాబాద్ డైరెక్టర్ ఎ. రామకృష్ణలు సోమవారం సంతకాలు చేసి మార్చుకున్నారు. డాక్టర్ ఎల్. కోటేశ్వర్‌రావు, వాణి పాల్గొన్నారు.

'సంస్కార్ ది లైఫ్' లో సంక్రాంతి సంబురాలు



సంక్రాంతి వేడుకల్లో సంస్కార్ స్కూల్ విద్యార్థులు

శ్రీనగర్‌కాలనీ: విద్యార్థులు రంగురంగుల ముగ్గులతో, ఆటపాటలతో సందడి చేస్తూ సంక్రాంతి శోభను ముందే తీసుకువచ్చారు. సోమవారం ఎర్రగడ్డ సంస్కార్ ది లైఫ్ స్కూల్‌లో సంక్రాతి సంబురాలు వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు ముగ్గులతో పాటు, పలు పోటీల్లో పాల్గొని సంక్రాతి పండుగ విశిష్టతను తెలియజేశారు. హరిదాసు వేషధారణలో విద్యార్థులు అలరించారు.పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వేడుకల్లో స్కూల్ సీఈఓ మోహనవంశీ, డైరెక్టర్ మధుమతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ది హ్యాక్ రెవెల్యూషన్'లో ముఫకంజా విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నం3లోని ముఫకంజా ఇంజినీరింగ్ కాలేజ్, ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సౌజన్యంతో 'ది హ్యాక్ రెవెల్యూషన్-2023' పేరుతో హ్యాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఫకంజా ఇంజినీరింగ్, విట్ వెల్లూర్, సీబీఐటీ, ఐఎస్ఎల్, సీఎంఆర్, వాసవి, లార్డ్స్, దక్కన్ తదితర కళాశాలల నుంచి 96 బృందాలు పాల్గొన్నాయి. 15 గంటల పాటు కొనసాగిన ఈ కార్యక్రమంలో ముఫకంజా ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ చాటి మూడు బహుమతులు గెలుచుకున్నారు. ముఫకంజా కాలేజీకి చెందిన సయ్యద్ సుజాజుద్దీన్, సయ్యద్ ఒమర్ ఫిరోజ్, అయేషా ఫాతిమా, ఖుజాయిమా నిఖత్ విద్యార్థుల బృందం మొదటి బహుమతి గెలుచుకోగా రూ.15 వేల నగదు అందజేశారు. రెండో బహుమతిని ఇదే కాలేజీకి చెందిన అనియా గౌస్, అబ్దుల్ ముక్తాదిర్ అహ్మద్, జువేరియా తన్వీర్, సయేదా జైనప్ ఫాతినా గెలుచుకోగా వీరికి రూ. 10 వేల బహుమతి అందజేశారు. మూడో బహుమతి జాహిద్ కాన్, రయావుద్దీన్, అబ్దుల్ రఫీ, సాజిద్ అహ్మద్ అన్సారీ, సాకిబ్ అహ్మద్ బృందం గెలుచుకోగా రూ. 7 వేల బహుమతి అందజేశారు. అలాగే సీబీఐటీకి చెందిన విద్యార్థుల బృందాలు కన్సోలేషన్ బహుమతులు అందుకున్నాయి. వీరందరికీ సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్, డాక్టర్ బషీర్ అహ్మద్ అభినందనలు తెలిపారు. డీన్ సయ్యద్ ఫర్హతుల్లా హుస్సేని, షబ్బీర్ అహ్మద్ తదితరులు బహుమతులు అందజేశారు.

సమన్వయంతో చెత్త తరలించాలి: జెడ్సీ



అధికారులతో మాట్లాడుతున్న జెడ్సీ రవి కిరణ్

బంజారాహిల్స్: జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం, రాంకీ సంస్థ సమన్వయంగా చెత్తను ఎప్పటికప్పుడు తరలిస్తూ పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చూడాలని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్ సూచించారు. సోమవారం జోనల్ కార్యాలయంలో ఆయా సర్కిళ్ల డీఎంసీలు, ఏఎంహెచ్ఓలు, రాంకీ సూపర్‌వైజర్లు, ఎస్ఎస్ఆర్ ఏజెన్సీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు ఎప్పటికప్పుడు రాంకీ వాహనాల ద్వారా చెత్తను ఎత్తివేయించి తరలించడంలో ఎస్ఎఫ్ఏలు అప్రమత్తంగా ఉండాలని జెడ్సీ కోరారు. రోడ్లపై వేసే భవన వ్యర్థాలను ఎస్ఎస్ఆర్ ఏజెన్సీలు ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. చెత్తను ఆటోల్లో వేయాలని అవగాహన కలిగిస్తున్నా కొన్ని చోట్ల ఇంకా రోడ్ల పక్కన వేస్తున్నారని, ఈ విషయంలో ఎస్ఎఫ్ఏలు ఎప్పటికప్పుడు తొలగించే ఏర్పాట్లు చేయాలన్నారు. అదనపు చెత్త తరలింపు వాహనాలను సంక్రాంతి తర్వాత పెంచుతామని రాంకీ సంస్థ హామీ ఇచ్చింది.

మృతుడి కుటుంబానికి బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే దానం

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని గౌతంనగర్ బస్తీకి చెందిన గుంటి నాగరాజు గత ఏప్రిల్‌లో ప్రమాదవశాత్తు మరణించారు. ఇతడికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కార్మిక శాఖ మంజూరు చేసిన లేబర్ కార్డును గతంలో పంపిణీ చేశారు. ఈ కార్డు కింద ప్రమాద బీమా రూ. 6.30 లక్షలు మంజూరైంది. ఈ చెక్కును సోమవారం గుంటి నాగరాజు సతీమణి గుంటి జ్యోతికి దానం జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో సోమవారం అందజేశారు. నాగరాజు మృతి బాధాకరమని, అతడి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్మికులందరూ లేబర్ కార్డు తీసుకోవాలని సూచించారు. ఈ కార్డు వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయన్నారు.

వైభవంగా దీపాలంకరణ సేవ



గోదాదేవి సన్నిధిలో దీపాలంకరణ

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నం .14లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాస మహోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం తెల్లవారుజామున గోదాదేవి రంగనాథ స్వామి సన్నిధిలో దీపాలంకరణ సేవ వైభవంగా నిర్వహించారు. మహిళా భక్తులు దీపాలు వెలిగించి పూజలు విశేష పూజలు చేశారు. గోదారంగనాథ స్వాముల దివ్యాలంకారాన్ని దర్శించుకున్నారు. తెల్లవారుజామున తిరుప్పావై పాశురాలు పఠించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అద్దంకి శశికాంతాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అన్ని రాష్ట్రాల్లో బీసీల జనగణన చేపట్టాలి

లిబర్టీ: బీసీల ఆత్మగౌరవాన్ని మరింతగా పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం బీసీల జనగణన చేపట్టి తన నిజాయితీని నిరూపించుకోవాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు డి.కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తూ బీహార్ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 21వ తేదీ నుంచి బీహార్‌లో బీసీ జనగణనను ప్రారంభించనుండటం అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని అన్ని రాష్ట్రాల్లో బీసీ జనగణనను చేపట్టి బీసీల పట్ల తనకున్న ప్రేమను చాటుకోవాలన్నారు. తెలంగాణలోనూ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు బీసీ జనగణనకు శ్రీకారం చుట్టి బీసీల ముఖ్యమంత్రిగా పేరు పొందాలని కుమారస్వామి కోరారు.

నేటితో ముగియనున్న 'నేషనల్ సిల్క్ ఎక్స్‌పో'



శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో గ్రామీణ హస్తకళావికాస్ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో-2023 మంగళవారంతో ముగియనుంది. ఈ ప్రదర్శనలోని చీరలు మహిళలను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు తయారు చేసిన సిల్క్, కాటన్ వస్త్రాలు, డిజైనరీ ఆభరణాలు, పలు ఫ్యాన్సీ వస్తువులు సుమారు 70 స్టాళ్లలో అందుబాటులో ఉంచామని నిర్వాహకుడు జయేష్‌గుప్తా తెలిపారు.

ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయండి

లిబర్టీ: కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు లిబర్టీ వద్ద సోమవారం ఆందోళనకు దిగారు. పోలీసులు అడ్డుకోవడం ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు పోలీసుల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆమ్ ఆత్మీయ పార్టీ కోర్ కమిటీ రాష్ట్ర సభ్యుడు డాక్టర్ డి.సుధాకర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోని ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పరిధి కాదని చెత్త తరలించకుంటే సహించం

కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: పారిశుద్ధ్య కార్మికులు, ఎస్ఎఫ్ఏలు మా పరిధి కాదని, మాకు సంబంధం లేదని వీధులను శుభ్రం చేయకుండా వదిలేస్తే అక్కడి పారిశుద్ధ్య సమస్యలు ఎవరు పరిష్కరిస్తారని వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ కవితారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆమె బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని సింగాడికుంట చోటు భాయ్ వీధిలో పర్యటించారు. అక్కడ రెండు డివిజన్ల మధ్య ఉన్న ఓ వీధి తమకు రాదంటే తమకు రాదంటూ స్థానిక పారిశుద్ధ్య కార్మికులు వారం రోజులుగా శుభ్రం చేయకపోవడంతో బస్తీవాసులు కార్పొరేటర్ దృష్టికి సమస్యను తీసుకొచ్చారు. స్పందించిన కార్పొరేటర్ సోమవారం అక్కడికి ఏఎంహెచ్ఓ ప్రవీణతో కలిసి వెళ్లారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని లేకుంటూ తగు చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఏఎంహెచ్ఓ స్థానిక సూపర్‌వైజర్లను హెచ్చరించారు.


ఈ-శ్రమ్ కార్డుతో కార్మికులకు ఎన్నో ప్రయోజనాలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రమీల

రహమత్‌నగర్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ శ్రమ్ కార్డు వల్ల కార్మికులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని సర్కిల్ 21 అసిస్టెంట్ లేబర్ అధికారి ప్రమీల అన్నారు. ఎస్పీఆర్ హిల్స్ వినాయకనగర్‌లో సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ-శ్రమ్ కార్డు అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్డు ఉన్న కార్మికులకు బీమాతో పాటు ఇతర సదుపాయాలు వర్తిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ కార్డు కలిగి ఉండాలని సూచించారు.సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు స్వామి, భాగ్యరాజ్, నరసింహ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నేషనల్ మార్షల్ ఆర్ట్స్ పోటీలు



మెడల్ అందుకుంటున్న కబీర్ మహేశ్

ఖైరతాబాద్: నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ 2023 పోటీలు ఆదివారంతో ముగిశాయి. వాసవి సేవాకేంద్రంలో శనివారం ప్రారంభమైన ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. కరాటే, కుంపు, కిక్ బాక్సింగ్‌లపై జరిగే చాంపియన్‌షిప్ పోటీల్లో ఫైనల్స్‌కు చేరిన వారికి మెడల్స్ అందజేశారు. కిక్ బాక్సింగ్, కరాటే, కుంపు పోటీలలో మహ్మద్ ముదాసిర్ అలీ గోల్డ్ మెడల్, కరాటే ఈవెంట్‌లో కబీర్ మహేశ్ గోల్డ్ మెడల్స్ సాధించారు. పోటీలకు ప్రత్యేక అతిథిగా హాజరైన సబా ఫాతిమా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈసారి పోటీలకు మంచి స్పందన వచ్చిందని మార్షల్ ఆర్ట్స్ కిక్ బాక్సింగ్ అకాడమీ డైరెక్టర్ మహ్మద్ ఫరీదుద్దీన్ తెలిపారు.

బ్రాందీ షాపులపై పోలీసుల స్పెషల్ డ్రైవ్

రహమత్‌నగర్: రహమత్‌నగర్‌లోని బ్రాందీ షాపుల్లో ఎక్సైజ్, సివిల్ పోలీసులు సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జూబ్లీహిల్స్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు, ఎస్ఐ చారిలు బ్రాందీ షాపుల్లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ, వైన్ షాపుల ఆవరణలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా షాపుల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్దిష్ట సమయంలో షాపులు మూసివేయాలని, ఆరుబయట మద్యం తాగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీసులు వైన్ షాపు ముందు మద్యం తాగుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. గ్రంథాలయ ఆవరణలో పార్కింగ్ చేసిన వాహనాలకు చలాన్లు విధించారు.

సరికొత్త 'జీవన శైలి'!

- దీర్ఘకాలిక జబ్బుల బాధితులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామాల్లోనే మెరుగైన వైద్య సేవలు
- 30 ఏళ్లు దాటిన 2.09 కోట్ల మందికి స్క్రీనింగ్ పరీక్షలు

సాక్షి, అమరావతి: దేశంలో 66 శాతం మరణాలకు జీవనశైలి జబ్బులే ప్రధాన కారణమని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు హెచ్చరిస్తున్నాయి. 2019 గణాంకాలే ఇందుకు నిదర్శనం. బీపీ, షుగర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధుల బాధితులకు క్రమం తప్పకుండా వైద్యుల పర్యవేక్షణ అవసరం. తరచూ పరీక్షలతోపాటు జబ్బు తీరు ఆధారంగా మందుల డోసు మారుస్తుండాలి. దీన్ని నిర్లక్ష్యం చేస్తే గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, కిడ్నీ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో మధుమేహం, రక్తపోటు, ఇతర దీర్ఘకాలిక సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా బాధితులకు మెరుగైన వైద్యం అందించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ 'ఫ్యామిలీ డాక్టర్' విధానానికి సీఎం జగన్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమం ట్రయల్ రన్ ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతోంది.

పోటెత్తుతున్న బీపీ

రాష్ట్రంలో మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్, ఇతర జీవనశైలి జబ్బులను ప్రాథమిక దశలో గుర్తించేందుకు 30 ఏళ్లు దాటిన వారందరికీ వైద్య ఆరోగ్య శాఖ స్క్రీనింగ్ నిర్వహిస్తోంది. 2,09,65,740 మందికి ఇప్పటివరకు పరీక్షలు చేశారు. వీరిలో 14.87 లక్షల మందికి రక్తపోటు ఉన్నట్లు నిర్ధారణ కాగా 33.84 లక్షల మంది హైరిస్క్ గ్రూప్‌లో ఉన్నట్లు తేలింది. ఇక 11.17 లక్షల మందికి మధుమేహం ఉన్నట్లు గుర్తించగా మరో 36 లక్షల మంది డయాబెటిస్ హైరిస్క్ గ్రూప్‌లో ఉన్నారు.



ఫ్యామిలీ డాక్టర్ యాప్‌లో డేటా

మధుమేహం, రక్తపోటు ఉన్నట్లు నిర్ధారించిన వారి వివరాలను ఫ్యామిలీ డాక్టర్ యాప్‌తో అనుసంధానించి వైద్యులు గ్రామాలకు వెళ్లినప్పుడు బాధితుల ఆరోగ్యంపై వాకబు చేస్తున్నారు. పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నారు. గత ఏడాది అక్టోబర్ 21 నుంచి 4,33,157 మంది రక్తపోటు బాధితులు ఫ్యామిలీ డాక్టర్ క్లినిక్‌కు హాజరు కాగా 90 శాతం మందికిపైగా వ్యక్తుల్లో సమస్య అదుపులో ఉన్నట్లు తేలింది. 3.23 లక్షల మంది మధుమేహం బాధితులు క్లినిక్‌లకు హాజరు కాగా 78 శాతం మందిలో సమస్య అదుపులోకి వచ్చింది.

11 ఇంటర్ చేంజర్లు 105 అండర్‌పాస్‌లు.. 85 వంతెనలు

- రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తరభాగం ప్రణాళిక సిద్ధం
- వీటి నిర్మాణానికి దాదాపు రూ.2 వేల కోట్ల వ్యయం
- 158.64 కి.మీ. నిడివి రోడ్డు నిర్మాణానికి రూ.8,600 కోట్లు
- భూపరిహారానికి రూ.5,200 కోట్లు
- డ్రాఫ్ట్ డీపీఆర్‌లో పేర్కొన్న యంత్రాంగం

సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగురోడ్డు(ట్రిపుల్ ఆర్) ఉత్తర భాగం.. దీని నిడివి 158.645 కి.మీ... ప్రస్తుతానికి నాలుగు వరసల రోడ్డు.. ఈ పరిధిలో జాతీయ, రాష్ట్ర రహదారులను 11 చోట్ల అడ్డంగా దాటాల్సి ఉన్నందున భారీ ఇంటర్‌చేంజర్ స్ట్రక్చర్లను నిర్మించనున్నారు. ఒక్కోటి దాదాపు 70 ఎకరాల విస్తీర్ణంలో ఉంటాయి. వీటికితోడు 105 అండర్ పాస్‌లు.. 85 వంతెనలు నిర్మించనున్నారు. ఈ మేరకు ప్లాన్లను సిద్ధం చేస్తున్నారు.

ప్రతి మూడు కి.మీ.కు రెండు అండర్‌పాస్‌లు

పెద్ద రహదారులను దాటేటప్పుడు ట్రంపెట్, డబుల్ ట్రంపెట్, క్లైవర్ లీఫ్ నమూనాల్లో ఇంటర్‌చేంజర్ వంతెనలను నిర్మించనున్న విషయం తెలిసిందే. కానీ, రోడ్లతో సంబంధం లేకుండా ప్రతి కిలోమీటరున్నర నడివికి ఓ అండర్‌పాస్ చొప్పున నిర్మాణానికి ప్లాన్‌చేశారు. స్థానికంగా ఉండే ఊళ్ల నుంచి వాహనాలు రోడ్డును అటూఇటూ దాటాలంటే కచ్చితంగా అండర్‌పాస్‌లు అవసరం. అందుకోసం ప్రతి కిలోమీటరున్నరకు ఒకటి చొప్పున ఉండేలా డిజైన్ సిద్ధం చేశారు. అలా ఉత్తర భాగం నిడివిలో 105 అండర్‌పాస్‌లకు ప్లాన్ చేశారు. ఇది చిన్నాచితక అండర్‌పాస్‌లు కాదు. భారీ వాహనాలు సులభంగా దూసుకెళ్లేలా 5.5 మీటర్ల ఎత్తుతో ఉంటాయి. భవిష్యత్తులో ఈ రోడ్లను వెడల్పు చేయాల్సి వస్తే, అండర్‌పాస్‌లను వెడల్పు చేయటం సాధ్యం కాదు. అందుకే ఇప్పుడు అవసరం ఉన్నా లేకున్నా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని 20 మీటర్ల వెడల్పుతో నిర్మించనున్నారు. ఇక వాగులువంకలు, సాగునీటి ప్రాజెక్టుల నుంచి నీటిని తరలించే కెనాల్స్, చెక్‌డ్యామ్‌లు, గుట్టల నుంచి జాలువారే ప్రాంతాల్లో ప్రత్యేకంగా వంతెనలు నిర్మిస్తారు. నీటిప్రవాహానికి రింగురోడ్డు ఏమాత్రం అడ్డంకి కావద్దని ఈ ఏర్పాటు చేశారు. ఉత్తర రింగు నిడివిలో దాదాపు 85 వరకు ఇలాంటి వంతెనలు నిర్మించనున్నారు. నీళ్ల వెళ్లటానికే పరిమితం కాకుండా పక్కనుంచి ట్రాక్టర్లు లాంటి వాహనాల రాకపోకలకు ఏర్పాట్లు చేయనున్నారు. ఇలా ఇంటర్ ఛేంజర్లు, అండర్‌పాస్‌లు, నీళ్ల పారేందుకు నిర్మించే వంతెనల కోసం రూ.2 వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు.



డ్రాఫ్ట్ డీపీఆర్ సిద్ధం

రీజినల్ రింగురోడ్డు ఉత్తర భాగం నిర్మాణానికి రూ.13,800 కోట్లు ఖర్చవుతుందని డ్రాఫ్ట్ డీపీఆర్‌లో అధికారులు పేర్కొన్నారు. ఈ రోడ్డును ప్రతిపాదించిన సమయంలో రూ.9 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేయగా, ఇప్పుడు ఆ ఖర్చు భారీగా పెరగనుందని స్పష్టమవుతోంది. రోడ్డు నిర్మాణానికి రూ.8,600 కోట్లు, భూపరిహారా నికి రూ.5,200 కోట్లు అవసరమవుతాయని డ్రాఫ్ట్ డీపీఆర్‌లో పేర్కొన్నట్టు తెలిసింది. రోడ్డు నిర్మాణ వ్యయంలో స్ట్రక్చర్లు, వంతెనలు, అండర్‌పాస్‌లకు రూ.2 వేల కోట్ల ఖర్చవుతుందని పేర్కొన్నట్టు సమాచారం. భూసేకరణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో రూ.2,600 కోట్లు చొప్పున భరించాల్సి ఉంటుంది.

రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను జమ చేయాల్సిందిగా ఇప్పటికే ఎన్‌హెచ్ఏఐ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసిన అంశం తెలిసిందే. రింగురోడ్డు దక్షిణ భాగానికి సంబంధించి అలైన్ మెంటును ఖరారు చేసి ఢిల్లీకి ఆమోదం కోసం పంపారు. 189.2 కి.మీ. నిడివితో ఈ అలైన్ మెంటును రూపొందించారు. దీనికి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపాల్సి ఉంది. ఆమోదం వచ్చిన వెంటనే భూసేకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారు.

బొగ్గు దిగుమతి చేసుకోవాల్సిందే !

- దేశీయ బొగ్గుకు 6శాతం విదేశీ బొగ్గు కలపాలి
- లేకుంటే దేశీయ బొగ్గు సరఫరాకు కోత పెడతాం
- రాష్ట్రాల జెన్‌కోలకు కేంద్ర విద్యుత్ శాఖ ఆదేశం
- తక్షణమే దిగుమతులకు ఆర్డర్ చేయాలని సూచన

సాక్షి, హైదరాబాద్: విదేశాల నుంచి తప్పనిసరిగా బొగ్గు దిగుమతులు చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం మళ్లీ ఆదేశించింది. ఇటీవల కాలంలో దేశంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగిపోవడంతో దేశంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలు బొగ్గు కొరతను ఎదుర్కొనే అవకాశముందని పేర్కొంది. దేశీయ బొగ్గు సరఫరా పెరిగినప్పటికీ విపరీతమవుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి సరిపోదని స్పష్టం చేసింది. ప్రతి రోజూ లక్ష టన్నుల నుంచి 3లక్షల టన్నుల బొగ్గు కొరత ఉండవచ్చని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మిగిలి ఉన్న కాలం(మార్చి 2023)తో పాటు వచ్చే ఆర్థిక సంవత్సరంలోని తొలి అర్ధ వార్షికం(2023 మార్చి–సెప్టెంబర్) వరకు 6శాతం దిగుమతి చేసుకున్న బొగ్గును దేశీయ బొగ్గుతో కలిపి(బ్లెండ్ చేయడం అంటారు) థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో వినియోగించాలని ఆదేశించింది. ఈ ఆదేశాలను అమలు చేయని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు దేశీయ బొగ్గు సరఫరాను కట్టడి చేస్తామని హెచ్చరించింది.

అన్ని రాష్ట్రాలకు లేఖ రాసిన కేంద్రం

విదేశీ బొగ్గు దిగుమతుల్లో ఎంత శాతం లోటు ఉంటే అంత శాతం వరకు దేశీయ బొగ్గు సరఫరాను సంబంధిత థర్మల్ విద్యుత్ కేంద్రాలకు కోత పెడతామని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ సోమవారం అన్ని రాష్ట్రాలకు లేఖ రాసింది. ఈ ఆదేశాల అమలులో భాగంగా విదేశీ బొగ్గు దిగుమతుల కోసం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. పోటీ బిడ్డింగ్ ద్వారా పారదర్శకమైన పద్ధతిలో బొగ్గు దిగుమతులకు తక్షణమే రాష్ట్రాల జెన్‌కోలతో పాటు ఇండిపెండెంట్ విద్యుత్ ఉత్పత్తిదారులు టెండర్లను ఆహ్వానించాలని కోరింది.

అలా ఆర్డర్ చేసే ప్రసక్తే లేదు

గతేడాది సైతం విదేశీ బొగ్గు దిగుమతులను అప్పట్లో కేంద్రం తప్పనిసరి చేయగా, తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకించింది. రాష్ట్రంలోని విద్యుత్ ప్లాంట్లు దేశీయ బొగ్గు ఆధారంగా పనిచేస్తాయని, విదేశీ బొగ్గును వినియోగిస్తే సాంకేతిక సమస్యలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్రం ఎంత ఒత్తిడి చేసినా రాష్ట్ర ప్రభుత్వం విదేశీ బొగ్గుకు ఆర్డర్ ఇవ్వలేదు. సింగరేణి బొగ్గు గనుల సంస్థ రాష్ట్రంలో ఉండడంతో రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఎలాంటి బొగ్గు కొరత ఉండదని, ఖరీదైన బొగ్గు దిగుమతులకు ఆర్డర్ చేసే ప్రసక్తే లేదని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

బాబు భుజం కాయడమే పవన్ అజెండా

- జనసేన ఆవిర్భావం నుంచి వారిద్దరూ కలిసే ఉన్నారు
- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: రాజకీయంగా రోజురోజుకూ పతనమవుతున్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును నిలబెట్టడమే అజెండాగా జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పని చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు), వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. జనసేన ఆవిర్భావం జరిగిన 2014 నుంచే వారిద్దరూ కలిసే ఉన్నట్లు తాము ఆది నుంచి చెబుతున్నామని గుర్తు చేశారు. 'చంద్రబాబు ఎప్పుడు ఇబ్బందుల్లో ఉంటే అప్పుడు పవన్ రక్షించడానికి వస్తాడు. ప్యాకేజీ తీసుకుని పరిమితంగా రాజకీయాలు చేస్తుంటాడు. ఇందులో భాగంగానే కొన్నిసార్లు కలసి ఉంటాడు. కొన్నిసార్లు విడిపోయినట్లు నటిస్తుంటాడు' అని ధ్వజమెత్తారు. సోమవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సజ్జల మీడియాతో మాట్లాడారు.

- తమ అపవిత్ర కలయికను సమర్థించుకునేందుకు పరస్పర పరామర్శలు, ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో చంద్రబాబు, పవన్ డ్రామాలాడుతున్నారు. ప్రజల పట్ల పవన్‌కు నిజంగానే ప్రేమ ఉంటే చంద్రబాబు ప్రచార పిచ్చికి బలైన 11 బాధిత కుటుంబాలను ఎందుకు పరామర్శించ లేదు? రాజకీయాల్లో పొత్తులు తప్పు కాకున్నా వాటిని బహిర్గతం చేసి ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత పార్టీలపై ఉంది.
- ప్రచార పిచ్చితో ఇరుకు సందుల్లో సభలు నిర్వహించి చింతపండు, చీరలు ఇస్తామంటూ 11 మంది పేదలను చంద్రబాబు పొట్టన పెట్టుకోవడం వల్లే ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించేలా జీవో 1 జారీ చేశాం.
- వెంటిలేటర్‌పై ఉన్న టీడీపీని కాపాడుకోవడం కోసమే చంద్రబాబు ముందస్తు ఎన్నికల జపం చేస్తున్నారు. ప్రజాబలంతో తిరుగులేని నేతగా ఎదిగిన సీఎం జగన్‌ను ఎదుర్కొనేందుకు కుట్రదారులంతా ఏకమవుతున్నారు. పవన్, చంద్రబాబు కలయికను స్వాగతిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ.. బీజేపీ కూడా వారితో కలిసొస్తే ఏం సమాధానం చెబుతారు? సీఎం వైఎస్ జగన్‌కు ఉన్న ప్రజాబలం ముందు ఎవరూ నిలవలేరు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మళ్లీ ఘన విజయం సాధించడం ఖాయం. సీఎం జగన్ షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలకు వెళ్తారు.

ఏపీ అప్‌డేట్స్

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

10న వర్చువల్ సేవా టికెట్ల దర్శన కోటా విడుదల

తిరుమల: తిరుమలలో ఈ నెల 12 నుంచి కళ్యాణోత్సవం, ఊంజల సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవలకు సంబంధించిన ఆన్‌లైన్ వర్చువల్ సేవా టికెట్లు, సంబంధిత దర్శన టికెట్ల కోటాను 10వ తేదీ ఉదయం 9 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అయితే శ్రీవారి ఆలయంలో బాలాలయం దృష్ట్యా ఫిబ్రవరి 22 నుంచి 28వ తేదీ వరకు ఆన్‌లైన్ వర్చువల్ సేవ, అనుబంధ దర్శన టికెట్ల కోట అందుబాటులో ఉండదు. భక్తులు ఈ విషయాన్ని గమనించి దర్శన టికెట్లను బుక్ చేసుకోవాలని టీటీడీ కోరుతోంది.

టీడీపీతో పొత్తుకు ఛాన్స్ లేదు

తమ నేతలకు బీజేపీ అంతర్గత సందేశం

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకునే అవకాశాలు లేవంటూ పరోక్షంగా బీజేపీ స్పష్టంచేసింది. తమ పొత్తు జనం, జనసేనతో మాత్రమే అని తెలిపింది. ఈ మేరకు తమ పార్టీ నేతలకు అంతర్గత సందేశాలు పంపింది. చంద్రబాబును జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కలిసిన నేపథ్యంలో బీజేపీ తమ నేతలకు పలు ఆదేశాలిచ్చింది. కుటుంబ, అవినీతి, వారసత్వ పార్టీలకు బీజేపీ దూరంగా ఉంటుందని స్పష్టం చేయాలని నేతలకు సూచించింది. టీవీ చర్చల్లో, మీడియా ప్రతినిధులతో మాట్లాడే సమయంలో పార్టీ విధానం గురించి అధికార ప్రతినిధులు స్పష్టంగా చెప్పాలంటూ ఆ సందేశాల్లో సూచించింది. పవన్, చంద్రబాబు భేటీపై ఎలాంటి వ్యాఖ్యలు, అపోహలు అవసరం లేదని, ఇలాంటి భేటీలు రాజకీయాల్లో సర్వసాధారణ అంశంగా చూద్దామంటూ నేతలకు సూచించింది.

నగర వార్తలు

గ్రేటర్‌పై డీజిల్ కాలుష్యం పంజా!

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో కాలుష్యం కోరలు చాస్తోంది. రోజురోజుకు పరిస్థితి తీవ్రంగా మారుతోంది. ముఖ్యంగా డీజిల్ వాహనాల కారణంగా సిటీ పొగచూరుతోందని, గుండె, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని పీసీబీ తాజా అధ్యయనంలో తేలింది. గ్రేటర్‌లో వాహనాల సంఖ్య సుమారు 80 లక్షలకు చేరువైంది. ఇందులో పదిహేనేళ్లకు పైబడిన కాలంచెల్లిన వాహనాలు 20 లక్షలకు పైమాటే. వీటిలో డొక్కు బస్సులు, ట్రక్కులు, కార్లు తదితర డీజిల్ వాహనా లు విడుదల చేస్తున్న పొగతో ప్రధాన నగరంతోపాటు శివారు ప్రాంతాలు పొగచూరుతున్నాయి. ప్రధానంగా మోటారు వాహనాలు, పరిశ్రమలు విడుదల చేస్తున్న పొగలో సూక్ష్మ ధూళి కణాల(పిఎం2.5) మోతాదు అనూహ్యంగా పెరగడంతో సిటీజన్లలో గుండె కండరాలు, ధమనులు దెబ్బ తింటున్నట్లు పీసీబీ తాజా అధ్యయనంలో వెల్లడైంది. నగరంలో 28 ప్రాంతాల్లో సూక్ష్మ ధూళికణాల మోతాదును ఈ సంస్థ నిపుణులు నమోదు చేశారు. వీరి లెక్కల ప్రకారం ఘనపుమీటర్ గాల్లో సూక్ష్మ ధూళికణాల మోతాదు 32 మైక్రో గ్రాములకు మించరాదు. కానీ ఆయా ప్రాంతాల్లో వీటి మోతాదు 60 మైక్రో గ్రాములకు పైగా నమోదవడం ఆందోళన కల్గిస్తోంది.

గుండెకూ చేటు..

ఈ సూక్ష్మ ధూళికణాలు గుండెలోని సూక్ష్మ ధమనులు, కెరోటిడ్ ఇంటిమా మీడియాపై పేరుకు పోవడంతో వాటి మందం పెరిగి గుండెకు రక్తసరఫరా తగ్గుతున్నట్లు ఈ అధ్యయనం వెల్లడించింది. ఈ పరిణామంతో గుండెదడ, గుండెపోటు తదితర హృదయ సంబంధిత సమస్యలు సిటీజన్లలో క్రమంగా పెరుగుతున్నట్లు ఈ అధ్యయనం తెలిపింది. సూక్ష్మధూళి కణాల కాలుష్యంతో పురుషుల్లో 1.79 శాతం గుండె జబ్బుల ముప్పు పెరుగుతుందని, మహిళల్లో 2.98 శాతం మందికి గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నట్లు ఈ అధ్యయనం పేర్కొంది. ధూళి కణాల కాలుష్యం మెదడుకు రక్తం సరఫరా చేసే రక్త నాళాలకు కూడా చేటు చేస్తుందని ఈ అధ్యయనం స్పష్టంచేయడం గమనార్హం.

కాలుష్యానికి కారణాలివే..

- పలు కూడళ్లలో వాయు కాలుష్యం అవధులు దాటుతోంది. గ్రేటర్ పరిధిలో సుమారు 80 లక్షలకు పైగా ఉన్న వాహనాలు వెదజల్లుతున్న పొగ, ట్రాఫిక్ రద్దీలో రహదారులపై రేగుతున్న దుమ్ముతో సిటీజన్ల ముక్కుపుటాలు, శ్వాసకోశాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి.
- పలుప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లోచెత్తను తగులబెట్టడంతో కాలుష్య తీవ్రత పెరుగుతోంది. పరిశ్రమలు వెదజల్లుతోన్న కాలుష్యంతో సమీప ప్రాంతాలు పొగచూరుతున్నాయి.
- శివారుప్రాంతాల్లో నిర్మాణ సంబంధ కార్యకలాపాలు పెరగడంతో సూక్ష్మధూళికణాలు పీల్చే గాలిలో చేరి సమీప ప్రాంతాల్లోని సిటీజన్ల ఊపిరితిత్తుల్లోకి చేరుతున్నాయి.
- ఘణపు మీటరు గాలిలో సూక్ష్మధూళికణాలు(పీఎం2.5) మోతాదు 32 మైక్రోగ్రాములకు మించరాదు. కానీ పలు కూడళ్లలో పలుమార్లు అంతకు రెట్టింపు స్థాయిలో ధూళికాలుష్యం నమోదవుతోంది.
- గ్రేటర్ పరిధిలో రాకపోకలు సాగించే 80 లక్షలవాహనాల్లో ఏటా సుమారు 109.5 కోట్ల లీటర్ల పెట్రోలు,120.45 కోట్ల లీటర్ల డీజిలును వినియోగిస్తుండడంతో పొగ తీవ్రత ఏటేటా పెరుగుతూనే ఉంది.
- గ్రేటర్ పరిధిలో పదిహేనేళ్లకు పైబడిన కాలం చెల్లిన వాహనాలు 20 లక్షల వరకు ఉన్నాయి. ఇవన్నీ రోడ్లపైకి ముంచెత్తుతుండడంతో పొగ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.
- వాహనాల నుంచి వెలువడుతున్న పొగ నుంచి కార్బన్‌మోనాక్సైడ్,నైట్రోజన్ డయాక్సైడ్,సల్ఫర్‌డయాక్సైడ్,అమ్మోనియా,బెంజీన్,టోలిన్,ఆర్ఎస్‌పీఎం(ధూళిరేణువులు) వంటి కాలుష్య ఉద్గారాలు వాతావరణంలో చేరి నగర పర్యావరణం పొగచూరుతోంది.

జాగ్రత్తలు తప్పనిసరి..

- సూక్ష్మ ధూళి కణాల కాలుష్యం బారిన పడకుండా ముక్కుకు మాస్కులు ధరించాలి.
- కాలం చెల్లిన వాహనాలను రోడ్డెక్కకుండా నియంత్రించాలి.
- ట్రాఫిక్ పద్మవ్యూహంలో ఎక్కువ సేపు గడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- కల్తీ ఇంధనాల వినియోగాన్ని కట్టడి చేయాలి. ప్రతీపెట్రోలు బంకులో తూనికలు కొలతల శాఖ ఆధ్వర్యంలో ఇంధన నాణ్యత తనిఖీలు నిర్వహించాలి.

పీసీబీ తాజా అధ్యయనంలో వెల్లడి

- డీజిల్ వాహనాలతో పొగచూరుతున్న సిటీ, శివారు ప్రాంతాలు
- గుండెకు పొగ పెడుతున్న కాలుష్యం



ప్రాంతం	ధూళి కాలుష్యం మైక్రో గ్రాముల్లో
బాలానగర్	68
ఉప్పల్	67
జూబ్లీహిల్స్	61
ప్యారడైజ్	72
చార్మినార్	84
జీడిమెట్ల	89
ట్యాంక్‌బండ్	61
ఎంజీబీఎస్	69
చిక్కడపల్లి	71
లంగర్‌హౌజ్	66
మాదాపూర్	50
కూకట్‌పల్లి	70
సైనిక్‌పురి	69
రాజేంద్రనగర్	41
నాచారం	89
ఆబిడ్స్	92
కేబీఆర్‌పార్క్	54
హెచ్‌సీయూ	76
జూపార్క్	79
పంజగుట్ట	82

పరిమితి: ఘనపు మీటరు గాలిలో 60 మైక్రోగ్రాములు మించరాదు.

పలు చోట్ల వంద మైక్రోగ్రాములకు మించిన ధూళికాలుష్యం...

కాలుష్య నియంత్రణ మండలి తాజా లెక్కల ప్రకారం నగరంలో బాలానగర్, ప్యారడైజ్, చార్మినార్, జీడిమెట్ల, లంగర్‌హౌజ్, కూకట్‌పల్లి,సైనిక్‌పురి, నాచారం, జూపార్క్, పంజగుట్ట తదితర ప్రాంతాల్లో ధూళికాలుష్యం వంద మైక్రోగ్రాములు మించడం ఆందోళన కలిగిస్తోంది. ఆయా ప్రాంతాల్లో నివాసం ఉంటున్న స్థానికులు, పాదచారులు, వాహనదారులు ఈ ధూళికాలుష్యంతో అస్తమా, సైనస్, బ్రాంకై టిస్ వంటి శ్వాసకోశ వ్యాధులతో సతమతమౌతున్నారు.

తప్పుడు కేసులను ఖండిస్తున్నాం: హెచ్‌సీఏఏ

హైదరాబాద్: నిజామాబాద్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిపై తప్పుడు కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు హైకోర్టు అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్(హెచ్‌సీఏఏ) కార్యదర్శి గాడిపల్లి మల్లారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీసులు తప్పుడు కేసు నమోదు చేశారని..వెంటనే ఉపసంహరించుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపతామని హెచ్చరించారు.

స్లాబు కూలిన ఘటనలో కాంక్రీట్ యజమాని అరెస్టు

భాగ్యనగర్‌కాలనీ: కూకట్‌పల్లిలో నిర్మాణంలో ఉన్న భవనం స్లాబు కూలి ఇద్దరు కూలీలు మృతి చెందిన సంఘటనలో సెవెన్ హిల్స్ ఇన్ఫ్రా కాంక్రీట్ యజమాని భుజంగరావును కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. ప్రగతినగర్‌లోని ఆయన నివాసంలో సోమవారం అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. భవన నిర్మాణ యజమాని దంపతులు లక్ష్మణరావు, పద్మజలు పరారీలో ఉండగా మృతుల కుటుంబ సభ్యులకు భవన నిర్మాణ యజమాని మధ్యవర్తుల సహాయంతో ఒక్కొక్కరికి ఐదు లక్షల చొప్పున నష్టపరిహారం కల్పించినట్లు కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌రావు తెలిపారు.

సప్లిమెంటరీ పాసైన విద్యార్థులకు అనుమతివ్వండి

ఉస్మానియా యూనివర్సిటీ: డిప్లొమా చివరి సంవత్సరం సప్లిమెంటరీలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు వివిధ ఇంజినీరింగ్ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరం ప్రవేశాలను అనుమతించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు యాదీశ్వర్, విద్యార్థి యూనియన్ రాష్ట్ర కన్వీనర్ కె.రమేష్ ఆధ్వర్యంలో డిప్లొమా విద్యార్థులు మసాబ్ ట్యాంక్‌లోని ఉన్నత విద్యా మండలి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అనేక కాలేజీల్లో ఇంజినీరింగ్ సీట్లు ఖాళీగా ఉన్నాయని, డిప్లొమా విద్యార్థులు విద్యాసంవత్సరం నష్టపోకుండా అవకాశం కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు.



రాష్ట్ర ఉన్నత విద్య మండలి అధికారికి వినతి పత్రం అందచేస్తున్న ఆర్‌పీఐ అధ్యక్షులు యాదీశ్వర్

నడిరోడ్డుపై వృద్ధుని హత్య

మలక్‌పేట: నడిరోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వృద్ధుని హత్య చేసిన సంఘటన సోమవారం మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ కసపరాజు శ్రీనివాస్ సమాచారం మేరకు... మూసారంబాగ్ జ్ఞానదీప్ టవర్స్‌లో నివాసముంటున్న రిటైర్డ్ ఉద్యోగి మహ్మద్ జాఫర్ (63) మూసారంబాగ్ చౌరస్తాలోని మహ్మదీయ మసీద్ లైన్ పక్కన నుంచి నడిచి వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి అతనిని కత్తితో పొడిచి పరారయ్యాడు. స్థానికులు ప్రమాదంలో గాయపడి ఉన్నాడని భావించి మలక్‌పేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు మహ్మద్ జబ్బార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. అతని ఒంటిపై కత్తి గాట్లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో హత్యగా నిర్ధారించి నిందితుడి కోసం గాలింపు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ప్రభుత్వ సహకారంతోనే ఆర్టీసీ నష్టాలు తగ్గుముఖం



డైరీని ఆవిష్కరిస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ సజ్జనార్ తదితరులు

టీఎస్ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్ర అద్దె బస్సుల యజమానుల సంక్షేమ సంఘం డైరీని బాగ్‌లింగంపల్లిలోని కల్యాణ మండపంలో టీఎస్ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులు, అద్దెబస్సు యజమానులు, ప్రభుత్వ సహకారంతో ఆర్టీసీ సంస్థ నష్టాలను తగ్గుముఖం పట్టించామని చెప్పారు. అద్దె బస్సు యజమానుల సమస్యలను గతంలోనే పరిష్కరించామన్నారు. కరోనా అనంతరం నష్టాలను అధిగమిస్తూ ముందుకెళ్తున్నామన్నారు. రోజూ రూ.10 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు నష్టాలను తగ్గించగలిగామన్నారు. 50 వేల మంది ఉద్యోగులు ఉన్న అతిపెద్ద సంస్థ ఆర్టీసీ అని, వారి కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం కేసీఆర్ కూడా ప్రతి ఏటా రూ.1500 కోట్లు ఇస్తూ సహకారం అందిస్తున్నారన్నారు. దీనిద్వారా సంస్థకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ.. ప్రజలందరి సహకారంతో నేడు ఆర్టీసీ సంస్థ అభివృద్ధి చెందుతుందని, కోవిడ్ కారణంగా అందరూ చాలా ఇబ్బంది పడ్డారన్నారు. ప్రజల ఆదరణ వల్ల సంస్థలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల నేడు సంస్థ పూర్వ వైభవం దిశగా వెళ్తుందని, తమ దృష్టికి వచ్చిన అన్ని సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ఈడీలు పురుషోత్తం నాయక్, మునిశేఖర్, వినోద్, అద్దె బస్సుల యజమానుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మైపాల్‌రెడ్డి, కోశాధికారి సత్యం బాబు, ఉపాధ్యక్షుడు రవి, సంయుక్త కార్యదర్శి మాధవరెడ్డి, అదనపు కార్యదర్శి రామకృష్ణారెడ్డి, బాలవర్ధన్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తెలంగాణ ప్రతిభను నలుదిశలా చాటాలి

- మంత్రి శ్రీనివాస్ గౌడ్
- మాదాపూర్ శిల్పారామంలో రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలు షురూ

మాదాపూర్: యువ కళాకారులు జాతీయ స్థాయిలో విజయం సాధించి తెలంగాణ ప్రతిభను చాటి చెప్పాలని మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ పి.వాణీదేవి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం, యువజన సరీ్వసుల శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న యువ జనోత్సవాలను యువ జన సర్వీసుల శాఖ డైరెక్టర్ వెంకటేశం, జనరల్ మేనేజర్ వేణుగోపాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువ కళాకారులు ప్రతిభను కనబరిచేందుకు ఇది మంచి అవకాశమన్నారు. మొదటి రోజు జానపద నృత్యం (గ్రూప్), జానపద గీతం (గ్రూప్), వక్తృత్వ అంశాల్లో 33 జిల్లాల నుంచి విచ్చేసిన సుమారు 1000 మంది యువ కళాకారులు పాల్గొన్నారు. మంగళవారం జింఖానా గ్రౌండ్స్‌లో కబడ్డీ అంశానికి యువతీ యువకులను ఎంపిక చేయనున్నారు. రాష్ట్రస్థాయి యువజనోత్సవాలలో ప్రథమ బహుమతి గెలుచుకున్న కళాకారులు, క్రీడాకారులు కర్ణాటకలోని హుబ్లీ, ధార్వాడ్‌లలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు.



కళాకారులతో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

స్త్రీ శక్తి

సూపర్ ఫైటర్



సవాలుకు దీటైన సమాధానం విజయంలోనే దొరుకుతుంది.

'అమ్మాయిలు బైక్ నడపడం కష్టం' అనే మాట విన్నప్పుడు పట్టుదలగా బైక్ నడపడం నేర్చుకుంది.

'ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ప్రవేశించడం చాలా కష్టం' అనే మాట విన్న తరువాత ఫైటర్ పైలట్ కావాలనుకునే లక్ష్యానికి బీజం పడింది.

'మిగ్-21 బైసన్' యుద్ధ విమానాన్ని నడిపి చరిత్ర సృష్టించిన స్క్వాడ్రన్ లీడర్ అవని చతుర్వేది జపాన్‌లో జరగబోయే ఎయిర్ కంబాట్ ఎక్సర్‌సైజ్‌లలో పాల్గొనబోతోంది...

ఇండియా, జపాన్ దేశాలు కలిసి ఎయిర్ కంబాట్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించనున్నాయి. ఎయిర్ డిఫెన్స్‌కు సంబంధించి పరస్పర సహకారాన్ని అందిపుచ్చుకునే లక్ష్యంగా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్(ఐఏఎఫ్), జపాన్ ఎయిర్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్(జేఏఎస్‌డీఎఫ్)లు గగనతల విన్యాసాలకు శ్రీకారం చుట్టనున్నాయి. జపాన్‌లో హైకురీ ఎయిర్‌బేస్ కేంద్రంగా జరిగే ఎయిర్ కంబాట్ ఎక్సర్‌సైజ్‌లు (వీర్ గార్డియన్ 2023) ఈ నెల 12 నుంచి 26 వరకు జరగనున్నాయి. మన దేశానికి సంబంధించి సుఖోయ్-30 ఎంకేఐ, సీ-17 హెవీ-లిఫ్ట్ ఎయిర్ క్రాఫ్ట్‌లు దీనిలో భాగం అవుతాయి. ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న ఫస్ట్ ఉమెన్ ఫైటర్ పైలట్‌గా స్క్వాడ్రన్ లీడర్ అవని చతుర్వేది చరిత్ర సృష్టించనుంది. మన దేశంలో జరిగిన కంబాట్ ఎక్సర్‌సైజ్‌లలో మహిళా ఫైటర్ పైలట్‌లు పాల్గొన్న సందర్భాలు ఉన్నప్పటికీ, వేరే దేశంలో జరిగే దానిలో ఒక మహిళా ఫైటర్ పైలట్ పాలుపంచుకోడం ఇదే తొలిసారి.

మధ్యప్రదేశ్‌కు చెందిన అవని చతుర్వేది జైపూర్‌లో బీటెక్ చేసింది. విమానాలపై ఉన్న ఆసక్తితో రాజస్థాన్‌లోని వనస్థలి యూనివర్శిటీ 'ఫ్లయింగ్ క్లబ్'లో చేరింది. అక్కడ మొదలైన ఆమె ప్రయాణం విజయపరంపరలతో సాగుతూనే ఉంది. 'మిగ్-21 బైసన్' యుద్ధ విమానాన్ని నడిపిన తొలి మహిళా ఫైటర్ పైలట్‌గా 2018 చరిత్ర సృష్టించింది అవని. రాష్ట్రపతి చేతుల మీదుగా 2020లో 'నారీశక్తి' పురస్కారాన్ని అందుకున్న అవని, వైమానిక రంగంలో పనిచేయాలనే లక్ష్యాన్ని ఏర్పరచుకోవడానికి ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తిని ఇచ్చింది. అవని తండ్రి నీటిపారుదలశాఖలో ఇంజనీరు. సోదరుడు సైన్యంలో పనిచేస్తున్నాడు. సోదరుడి స్ఫూర్తితోనే సైన్యంలోకి వచ్చింది అవని. భారతీయ వైమానికదళంలో పనిచేయాలనే తన లక్ష్యాన్ని ఇతరులతో పంచుకున్నప్పుడు 'ఫ్లైయింగ్ క్లబ్‌లో చేరినంత సులువు కాదు' అని వెక్కిరించిన వాళ్లూ ఉన్నారు. అయితే వాటిని అవని సీరియస్‌గా తీసుకోలేదు. ఎఎఫ్‌సిఎటీ పరీక్షలో రెండో స్థానంలో నిలిచి ప్రశంసలు అందుకుంది. దుండిగల్(హైదరాబాద్)లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో కఠినమైన శిక్షణ పొందింది. సాహసాలతో చెలిమి చేసింది. అవనికి బాస్కెట్‌బాల్, చెస్ ఆడడం, పెయింటింగ్ అంటే ఇష్టం. బాస్కెట్‌బాల్ వల్ల తెగువ, చెస్‌తో లోతైన ఆలోచన, పెయింటింగ్‌తో సృజనాత్మక శక్తులు తనలో వచ్చి చేరాయి. 'ప్రతిరోజూ ఒక కొత్త విషయం నేర్చుకోవాలనేది నా విధానం. మంచి ఫైటర్ పైలట్‌గా పేరు తెచ్చుకోవాలనేది నా లక్ష్యం' అంటోంది అవని చతుర్వేది. 'కఠినమైన ఫైటర్-ఫ్లయింగ్ షెడ్యూల్స్' అంటూ ఒకప్పుడు ఐఏఎఫ్ మహిళలను కంబాట్ స్ట్రీమ్‌లోకి తీసుకోవడానికి పెద్దగా ఆసక్తి చూపలేదు. అయితే ఇప్పుడు ఐఏఎఫ్ ఆలోచన ధోరణిలో మార్పు వచ్చింది. దీనికి తాజా ఉదాహరణ జపాన్‌లో జరిగే ఎయిర్ కంబాట్ ఎక్సర్‌సైజ్‌కు అవని చతుర్వేదిని ఎంపిక చేయడం.

ప్రదర్శన


రంగస్థలంపై పాకుడు రాళ్ళు

'పాకుడు రాళ్ల' మీద స్థిరంగా నిలవడం కష్టం. పాకుడు రాళ్లు పట్టుకుని పైపైకి ఎగబాకడమూ కష్టమే. సినిమా రంగంలో స్త్రీల కెరీర్ పాకుడు రాళ్లపై నడక వంటిదని రావూరి భరద్వాజ రాసిన నవల 'పాకుడు రాళ్లు' జ్ఞానపీఠ్ అవార్డు గెలుచుకుంది. తెలుపు నలుపు కాలం నాటి నటీమణి జీవితాన్ని ఆధారం చేసుకుని 1978లో రాసిన ఈ నవల ఇప్పుడు నాటకంగా ప్రదర్శితమవుతోంది. ఒక భారీ నవలను నాటకంగా మలచడం కష్టమైనా దర్శకురాలు నస్రీన్ ఇషాక్ విజయం సాధించింది. ఒక మహిళ ప్రధాన పాత్ర వహించే ఈ నాటకానికి మరో మహిళ దర్శకత్వం వహించడం, వస్తువు ఈ కాలానికి కూడా రిలవెంట్‌గా ఉండటంతో ఇప్పటికి ఆరు ప్రదర్శనలు పూర్తి చేసుకుంది. నస్రీన్ ఇషాక్ పరిచయం... నవలను నాటకంగా మలచడంలో ఆమె సాధక బాధకాలు...

గుంటూరు జిల్లాలోని ఒక ఊరిలో నాటకాలు ఆడే అమ్మాయి మంగమ్మ మొదట చెన్నైకి చేరి, అక్కడ 'మంజరి'గా మారి, నటిగా టాప్‌స్టార్ అయ్యి, ఆ తర్వాత బొంబాయిలో ఎదిగి, భారతదేశం తరఫున సాంస్కృతిక రాయబారిగా అమెరికా వరకూ వెళ్లగలిగింది. అయితే ఆమె ముగింపు? ఆత్మహత్య. సినిమా రంగపు పాకుడురాళ్లు ఆమెను చివరకు పతనం అంచునే పడేస్తాయి. ఈ మంగమ్మ అను మంజరి కథనే రచయిత రావూరి భరద్వాజ 'పాకుడురాళ్లు' నవలగా రాశారు. నవల వచ్చాకగాని ఆ తర్వాతగాని ఈ మంజరి ఎవరి కథ అనేది ఆయన బహిరంగ పరచలేదు. మూకీల నుంచి టాకీలుగా సినిమా మారుతుండగా టాప్‌స్టార్ అయిన ఒక హీరోయిన్ కథ అని కొంతమంది, 1950లలో టాప్‌స్టార్ అయిన మరో హీరోయిన్ కథ అని మరి కొంతమంది అంటూ ఉంటారు. అయితే రచయిత రావూరి భరద్వాజ జర్నలిస్టు కూడా కావడం వల్ల తనకు తెలిసిన సమాచారంతో, ముగ్గురు నలుగురు హీరోయిన్ల జీవితాన్ని ఒక మంజరికి ఆపాదించి రాశారని నవలలోని ఘటనలను బట్టి అర్థమవుతుంది. ఇది ఒక రకంగా కొంతమంది హీరోయిన్ల ఉమ్మడి బయోగ్రఫీ. అందుకే ఆ నవలకు అంత బలం, చారిత్రక విలువ.

ఇప్పుడు నాటకంగా

'పాకుడురాళ్లను నాటకంగా చేయడం చాలా పెద్ద సవాలు. దీనిని గంటన్నర నిడివి గల నాటకంగా చేద్దామనుకున్నాను. కానీ గంటా యాభై నిమిషాల కంటే తగ్గించలేకపోయాను' అంటారు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ థియేటర్ విభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేస్తున్న 52 ఏళ్ల నస్రీన్ ఇషాక్. ఈమె దర్శకత్వం వహించిన 'పాకుడు రాళ్లు' నాటకం మొన్న జనవరి ఒకటిన విశాఖలో హౌస్‌ఫుల్‌గా ప్రదర్శితమైంది. దానికి ముందు హైదరాబాద్, అద్దంకిలలో కూడా ప్రదర్శితమైంది. షోస్ రిపీట్ అవుతున్నాయి కూడా. 'ఈ నాటకంలో మంజరి ఎదుర్కొన్న ఘటనలు నేటికీ సినిమా రంగంలో అలాగే ఉన్నాయి. ఆ మధ్య వచ్చిన మీటూ ఉద్యమాన్ని కూడా చూశాం. భరద్వాజ గారు ఈ నవలను విస్తృత ఘటనలతో రాశారు. మంజరి తానే బాధితురాలిగా ఉండి ఆ తర్వాత ఎదుటివారిని ఆడించే శక్తిమంతురాలు అవుతుంది. నవలలో ఆమె పాత్ర అంతర్గత పెనుగులాటను, దాని గాఢతను రచయిత రాయలేదు. మంజరి పాత్రను సహానుభూతితో అర్థం చేసుకునేలా నాటకం ముగింపును మలచడానికి నవలను శోధించాల్సి వచ్చింది' అంటారు నస్రీన్ ఇషాక్. 'పైకి చూడటానికి ఈ నవల మంజరి తన శరీరాన్ని చూపిస్తూ ఇతరులతో ఆడిన ఆటగా ఉంటుంది. కాని లోన చూస్తే ఆ ఆట వల్ల ఆమె పడే వేదన తెలుస్తుంది' అంటారు ఆమె.



'పాకుడురాళ్ళు' నాటకం పోస్టర్



దర్శకురాలు నస్రీన్ ఇషాక్

18 మంది నటీనటులు

వేదిక మీద 18 మంది నటీనటులు ఈ నాటకాన్ని ప్రదర్శిస్తారు. నవలలో ఎదురు పడే ముఖ్య పాత్రలు- కల్యాణి, రాజమణి, చంద్రం, చలపతి, మాధవరావు... ఈ పాత్రలన్నీ మంజరితో తలపడతాయి. నాటకంలో ఐదు పాటలు ఉన్నాయి. మంజరి పాత్రను భావనా వరుపాండల్ పోషించింది. 'ఒక నటి బయోపిక్‌ను స్టేజ్ మీద ఏ మేరకు నిజాయితీగా చూపించగలమో ఆ మేరకు పాకుడురాళ్లలో చూపించాం' అంటారు నస్రీన్ ఇషాక్.



నాటకంలో దృశ్యం

తెలుగు రాకపోయినా

నస్రీన్ ఇషాక్‌ది ఢిల్లీ. అక్కడే ఢిల్లీ యూనివర్సిటీలో వీధి నాటకాల నుంచి నాటకరంగం మీద ఆసక్తి పెంచుకున్నారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాలో సీటు సాధించి చదువుకున్నారు. 2009 నుంచి హైదరాబాద్‌లో ఉన్నారు. 'మొదట నేను ఇంగ్లిష్, హిందీ నాటకాలు వేయించేదాన్ని. కాని ఇక్కడ ఉన్నదంతా తెలుగు నటులు. మాతృభాషలో నాటకం ఆడటం నటులకు చాలా ముఖ్యం. అందుకని తెలుగు సాహిత్యం నుంచి నాటకాలను ఎంచుకోవాలని నిశ్చయించుకున్నాను. మొదట 'మైదానం' నవలను నాటకం చేశాను. ఇప్పుడు 'పాకుడు రాళ్లు' చేశాను. నాటకం చేయాలని అనుకున్నాక ఒక నెల రోజులపాటు రీడింగ్ సెషన్స్ ఉంటాయి. మా నటీనటులు ఒక్కో చాప్టర్ చదువుతూ దాని సారాంశం నాకు హిందీలోనో ఇంగ్లిష్‌లోనో చెబుతూ వెళతారు. నవల ఆత్మను పట్టుకుంటే నాటకం వేయడానికి భాష అడ్డంకి కాదు అని నా భావన. సన్నివేశాల వరుస, నటీనటుల ఎక్స్‌ప్రెషన్స్, ఎనర్జీ, ఇన్‌వాల్వ్‌మెంట్, ఫీలింగ్, వేరియేషన్స్... వీటిని నేను చూసుకుంటాను. నాకు తెలిసిపోతాయి' అంటారు నస్రీన్.

ఆమె భర్త నౌషాద్ ముహమ్మద్‌ది కేరళ. అతను సెంట్రల్ యూనివర్సిటీ థియేటర్ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు.

'పాకుడురాళ్లు నాటకాన్ని మరెన్నో ప్రదర్శనలు వేయాలని ఉంది' అంటున్న నస్రీన్ కోరిక నెరవేరాలని కోరుకుందాం.

ముగ్గు - ముచ్చట

చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com
(మీ ఊరి పేరుతోపాటు కాలనీ- వీధి పేరు కూడా రాయండి)





అడపాల మహాలక్ష్మి
టాటానగర్
బెంగళూరు

21 చుక్కలు, 11 వచ్చే వరకు మధ్య చుక్క





బొడ్డు రూనీ,
చౌటుప్పల్, యాదాద్రి భువనగిరి జిల్లా

11 చుక్కలు, 11 వరుసలు, సరిచుక్క



మెత్తళ్ల సీడ్‌ను చూపుతున్న రైతు





ఒడిషాలో మెత్తళ్ల సీడ్ ఉత్పత్తికి ఉపయోగించిన ప్రత్యేక ట్యాంకులు

విటమిన్ 'ఎ' చిరుచేపలు!

2 అంగుళాల చిరు చేపల్లో పెద్ద చేపల్లో కన్నా విటమిన్ 'ఎ' 20 రెట్లు ఎక్కువ!

సహజ నీటి వనరుల్లో పెరిగే 2 అంగుళాల మెత్తళ్లు (ఆంగ్లంలో 'మోల' (Amblypharyngodon mola)) వంటి చిరు చేపలను తినే అలవాటు ఆసియా దేశాల్లో చిరకాలంగా ఉంది. ఎండబెట్టిన మెత్తళ్లను నిల్వ చేసుకొని ఏడాదంతా తింటూ ఉంటారు. ఈ చిరు చేపల్లో అద్భుతమైన సూక్ష్మపోషకాలు పుష్కలంగా ఉండటంతో పోషకాహార లోపాన్ని నిర్మూలించడంలో వీటి పాత్ర విశిష్టమైనది. అయితే, వీటి సైజు వేలెడంతే ఉండటం వల్ల కృత్రిమ విత్తనోత్పత్తి ఇన్నాళ్లూ అసాధ్యంగా మిగిలిపోయింది. అయితే, ఈ పెనుసవాలును శాస్త్రవేత్తలు ఇటీవలే ఛేదించారు. చేపల విత్తనోత్పత్తి రంగంలో ఇది పెద్ద ముందడుగని చెప్పొచ్చు.

జర్మనీకి చెందిన స్వచ్ఛంద సంస్థ జి.ఐ.జడ్. ఆర్థిక తోడ్పాటుతో 'వరల్డ్‌ఫిష్' సంస్థ శాస్త్రవేత్తలు మన దేశంలో మెత్తళ్ల విత్తనోత్పత్తికి సులభమైన సాంకేతిక పద్ధతులను రూపొందించడంలో కొద్ది నెలల క్రితం ఘనవిజయం సాధించారు. దీంతో మెత్తళ్లు, తదితర చిరు చేపలను మంచినీటి చెరువుల్లో సాగు చేసుకునే అవకాశం విస్తృతంగా అందుబాటులోకి వచ్చింది.



2 అంగుళాల చిరు చేపలు.. మెత్తళ్లు

నేచురల్ సూపర్ ఫుడ్స్

భారత్ సహా దక్షిణాసియా దేశాల్లో ప్రజల్లో సూక్ష్మపోషకాల లోపాన్ని ఆహారం ద్వారా సహజమైన రీతిలో అధిగమించేందుకు ఇదొక సువర్ణ అవకాశంగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. మాంసకృత్తులు, ఖనిజాలు, విటమిన్లు, ఎసెన్షియల్ ఫాటీ ఆసిడ్స్ కలిగి ఉండే మెత్తళ్లు నేచురల్ సూపర్ ఫుడ్స్ అని వరల్డ్‌ఫిష్ అభివర్ణించింది. పౌష్టికాహార లోపంతో మన దేశంలో 36% మంది పిల్లలు వయసుకు తగినంతగా ఎదగటం లేదు. 32% మంది తక్కువ బరువు ఉన్నారని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే చెబుతోంది. ఈ సమస్యను అధిగమించడానికి మెత్తళ్లు భేషుగ్గా ఉపయోగపడుతాయని 'వరల్డ్‌ఫిష్' చెబుతోంది.

విటమిన్ ఎ లోపం వల్ల వచ్చే కంటి జబ్బులు, చర్మ వ్యాధులు మెత్తళ్లు తింటే తగ్గిపోతాయి. ఈ చిరు చేపల్లో ఐరన్, జింక్, కాల్షియం, ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్స్, అమినో యాసిడ్స్ ఉన్నాయి. పిల్లలు, గర్భిణీ స్త్రీలను పీడించే సూక్ష్మ పోషక లోపాలు మెత్తళ్లను తింటే తగ్గిపోతాయి.

70 లక్షల సీడ్ ఉత్పత్తి

అధిక పోషకాలున్న మెత్తళ్ల వంటి చిరు చేపల సాగు ప్రోత్సాహానికి ఒడిషా, అస్సాం రాష్ట్రాల్లో, బంగ్లాదేశ్‌లో వరల్డ్‌ఫిష్ సంస్థ గత దశాబ్దకాలంగా కృషి చేస్తోంది. ఒడిషాలోని జగత్సింగ్‌పూర్ జిల్లాలో గల బిశ్వాల్ ఆక్వాటెక్ హేచరీతో కలిసి వరల్డ్‌ఫిష్ చేసిన పరిశోధనలు ఫలించాయి. ఇండ్యూస్డ్ బ్రీడింగ్ టెక్నిక్ ద్వారా మెత్తళ్ల సీడ్ ఉత్పత్తిలో అవరోధాలను 2022 జూన్‌లో అధిగమించటం విశేషం.

70 లక్షల మెత్తళ్ల సీడ్‌ను ఉత్పత్తి చేయగలిగారు. ప్రత్యేకంగా నిర్మించిన చిన్న చెరువుల్లో ఆక్సిజన్‌తో కూడిన నీటిని ఎయిరేషన్ టవర్ ద్వారా అందిస్తూ ప్రయోగాలు చేశారు. ఆ నీటిలో గుడ్ల నుంచి వెలువడిన చిరుపిల్లలు చక్కగా బతికాయి. గుడ్డు నుంచి బయటికి వచ్చిన 3-4 రోజుల్లోనే అతిచిన్న పిల్లలు అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. వీటిని కొద్ది రోజులు నర్సరీ చెరువుల్లో పెంచి తర్వాత సాధారణ చేపల చెరువుల్లోకి మార్చాల్సి ఉంటుంది. తొలి విడత మెత్తళ్ల పిల్లలను ఒడిషా రైతులు, మహిళా స్వయం సహాయక బృందాలకు అందించారు.

మెత్తళ్ల చేప పిల్లలను తెలుగు రాష్ట్రాల్లోనూ చేపల రైతులకు, మహిళా బృందాలకు అందుబాటులోకి తేవాలి. నగరాల్లో/గ్రామాల్లో ఇంటి పంటలు /మిద్దె తోటల సాగుదారులకు కూడా మెత్తళ్ల చేప పిల్లలను అందించాలి. ప్రజలకు పౌష్టికాహార భద్రతను చేకూర్చడంలో చిరు చేపలు ఎంతగానో దోహదపడతాయి.

మెత్తళ్ల చేప పిల్లలను ఒక్కసారి వేస్తే చాలు!

'మోల' చేపలు చూపుడు వేలంత పొడవుండే అద్భుత పోషకాల గనులు .. వీటిని మనం మెత్తళ్లు /సిత్త పరిగెలు /కొడిపెలు /ఈర్నాలు అని పిలుచుకుంటున్నాం . ● గర్భిణులు, బాలింతలు, పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని, రక్తహీనతను, రేచీకటిని పారదోలే వజ్రాయుధాలు ఆ చిరుచేపలు. ● మంచినీటి ఆక్వా చెరువుల్లో బొచ్చె, రాగండి, మోసు, శీలావతి వంటి పెద్ద చేపలతో కలిపి లేదా విడిగానూ ఈ చిరుచేపలను సునాయాసంగా సాగు చేయొచ్చు. ● గ్రామ చెరువులు, కుంటల్లో, పెరటి తోటల్లోని తొట్లలో, మిద్దెల పైన ఫైబర్ టబ్‌లలోనూ ఎంచక్కా చిరు చేపలను పెంచుకోవచ్చు. ● వానాకాలంలో వాగులు, వంకల్లో కనిపించే సహజ దేశవాళీ చేపలివి. ● మెత్తళ్లు చేప తన సంతతిని తనంతట తానే(సెల్ఫ్ బ్రీడర్) వృద్ధి చేసుకుంటుంది.. ఈ చేప పిల్లలను ఒక్కసారి చెరువులో/తొట్లలో వేసుకుంటే చాలు.. నిరంతరం సంతతి పెరుగుతూనే ఉంటుంది. ● ప్రతి 10-15 రోజులకోసారి వేలెడంత సైజుకు పెరిగిన చేపలను పెరిగినట్లు పట్టుబడి చేసి వండుకు తినొచ్చు. ● వాణిజ్య స్థాయిలో పెంపకం చేపట్టి స్థానిక మార్కెట్లలో అమ్ముకొని ఆదాయం కూడా పొందవచ్చు. ● మగ చేపలు 5.0-5.5 సెం.మీ. (2 అంగుళాలు) పొడవు, ఆడ చేపలు 6.0-6.5 సెం.మీ. పొడవు పెరిగేటప్పటికి పరిపక్వత చెందుతాయి. ఆ దశలో పట్టుబడి చేసి వండుకొని తినొచ్చు, ఎండబెట్టుకొని దాచుకోవచ్చు. ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్యలో ఈ చేపల్లో సంతానోత్పత్తి జరుగుతుందని కేంద్రీయ మత్స్య విద్యా సంస్థ (సి.ఐ.ఎఫ్.ఇ.) ఎమిరిటస్ సైంటిస్ట్ డాక్టర్ అప్పిడి కృష్ణారెడ్డి 'సాక్షి సాగుబడి'కి తెలిపారు. నిజానికి, మెత్తళ్ల విత్తనోత్పత్తి ఆవశ్యకత గురించి ఆయన రాసిన వ్యాసాన్ని 'సాక్షి సాగుబడి' ఐదేళ్ల క్రితమే ప్రచురించింది.

సాగుబడి
ఉత్తరాషాఢ కార్తె
జనవరి 11 నుంచి

ఆయుర్వేద పశు వైద్యానికి 'శ్రీ'కారం

● రూ. 50 నుంచి రూ. 200 ఖర్చుతోనే పశు వ్యాధులకు సంప్రదాయ ఆయుర్వేద చికిత్స ● పొదుగు వాపు, ముద్ద చర్మం(లంపీ స్కిన్) వ్యాధి సహా 15 రకాల వ్యాధులకు రైతులే ఇంటిపట్టున చికిత్స చేసుకుంటున్న వైనం ● 3 రాష్ట్రాల రైతులకు అవగాహన కల్పిస్తున్న శ్రీజ పాడి ఉత్పత్తిదారుల సంస్థ

ఆవులు, గేదెలకు సంక్రమించే వ్యాధుల్లో చాలా వరకు రైతులే సులభంగా తయారు చేసుకోగలిగే సంప్రదాయ ఆయుర్వేద మిశ్రమాలతో నయం చేసుకోవచ్చు.పాడి రైతులను బాగా ఇబ్బందిపెట్టే పొదుగు వాపు దగ్గరి నుంచి ఇటీవల కాలంలో రైతులను తిప్పలు పెడుతున్న ముద్ద చర్మం (లంపీ స్కిన్) వ్యాధి వరకు ఏ వ్యాధినైనా సరే.. వంటింట్లో అందుబాటులో ఉండే పసుపు, వెల్లుల్లి, కలబంద వంటి మూలికలతోనే ఖాయంగా నయం చేసుకోవచ్చు. ఇంకా వివరంగా చెప్పాలంటే.. ఖరీదైన యాంటీబయోటిక్ ఔషధాలు వాడనవసరం లేకుండా, కేవలం రూ. 50-200ల ఖర్చుతోనే పశు వ్యాధులకు ప్రభావవంతమైన ఆయుర్వేద వైద్యం చేసుకోవచ్చు. యాంటీబయోటిక్ రసాయనిక అవశేషాలు లేని ఆరోగ్యదాయకమైన పాలు, పాల ఉత్పత్తులను ప్రజలకు అందించవచ్చు.. ఇవన్నీ ఆకాంక్షలు కావు.. దేశవ్యాప్తంగా కోట్లాది పాడి రైతుల అనుభవాలు..



పొదుగు వాపు సోకిన ఆవు పొదుగుకు కలబంద, పసుపు, సున్నం, నిమ్మరసం, బెల్లంతో తయారు చేసిన మిశ్రమాన్ని పూస్తున్న మహిళా రైతు

పశు వ్యాధులు సంప్రదాయ ఆయుర్వేద చికిత్సలతో.. యాంటీబయాటిక్స్ వాడకుండానే.. తక్కువ ఖర్చుతోనే.. ఇంటిపట్టునే నయమవుతున్నాయి. ఈ దిశగా దేశవ్యాప్తంగా విశేష కృషి చేస్తూ, రైతులకు శిక్షణ ఇస్తూ సత్ఫలితాలు సాధిస్తున్న ప్రముఖ సంస్థల్లో శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఒకటి. తిరుపతి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో పనిచేస్తున్న ఈ ఎఫ్.పి.ఓ. పశు ఆయుర్వేద వైద్యంపై గత నాలుగేళ్లుగా పాడి రైతులను చైతన్యవంతం చేస్తోంది. తద్వారా సత్ఫలితాలు వస్తుండడంతో యాంటిబయాటిక్స్ ఉపయోగించటమే మానుకున్నామని రైతులు చెబుతున్నారు. వ్యాధులు సత్వరమే నయం కావడంతో పాటు పశువుల ఆరోగ్యంపై ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేవని రైతులు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. జాతీయ పాడి అభివృద్ధి సంస్థ (ఎన్‌డీడీబీ), బెంగళూరులోని ట్రాన్స్ డిసిప్లనరీ యూనివర్సిటీ (టీడీయు) శాస్త్రవేత్తలు పరిశోధించి రూపొందించిన ఆయుర్వేద మిశ్రమాలనే శ్రీజ ఎఫ్.పి.ఓ. రైతుల్లోకి తీసుకువెళ్తోంది.

15 రకాల వ్యాధులకు ఆయుర్వేద మందులు

పొదుగువాపు, ముద్ద చర్మం (లంపీ స్కిన్) వ్యాధి వంటి మొండి జబ్బులతో పాటు 15 రకాల పశు వ్యాధులను ఆయుర్వేద మిశ్రమాలతోనే తగ్గిస్తున్నాం. తొలిదశలో గుర్తిస్తే పూర్తిగా నయమవుతున్నాయి. పొదుగువాపు వ్యాధిని పాలలో కొవ్వు 3% కన్నా తగ్గినప్పుడే కనిపెట్టి నయం చేస్తున్నాం. ముద్ద చర్మం వ్యాధి వైరల్ ఇన్ఫెక్షన్ వల్ల వస్తోంది. దీని ప్రభావం 20 రోజులుంటుంది. ఈ వ్యాధి ప్రస్తుతం రెండో దశలో తక్కువ తీవ్రతతో ఉంది. ఇమ్యూనిటీ తక్కువ ఉన్న ఆవులు ఒకటి రెండు శాతం మృత్యువాత పడుతున్నాయి. గోట్ పాక్స్ వ్యాక్సిన్ తప్పని సరిగా వేయించుకోవాలి. దాంతో పాటు మొదటి, రెండు డోసుల ఆయుర్వేద మిశ్రమాలను తప్పనిసరిగా వాడాల్సి ఉంటుంది. 10 రోజుల్లో మంచి ఫలితాలు వస్తున్నాయి. చర్మంపై బొబ్బలు మానకుంటే పూత మందు వాడాల్సి ఉంటుంది. 18005322600కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు.



– డా. భాను ప్రకాష్ రెడ్డి
(91545 67180),
శ్రీజ మహిళా పాడి ఉత్పత్తి దారుల సంస్థ, తిరుపతి

యాంటి బయోటిక్స్ లేని పాలు అందిస్తున్నాం



పశువుల్లో వచ్చే వ్యాధుల చికిత్సలో సాధారణంగా యాంటిబయోటిక్ ఔషధాలను ఎక్కువగా ఇస్తున్నారు. వాటి అవశేషాలు పాల ద్వారా మనుషుల దేహాల్లోకి చేరుతున్నాయి. వారి రోగనిరోధక శక్తి తగ్గిపోతోంది. ఈ సమస్య నుంచి బయటపడటానికి యాంటి బయోటిక్స్‌లేని పాలను అందించే దిశగా శ్రీజ సంస్థ పనిచేస్తోంది. అందుకోసం వంటింటిలో తయారు చేసుకునే ఆయుర్వేద మిశ్రమాలతో పశువులకు వైద్యం అందిస్తున్నాం. నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డు మాకు సహకరిస్తోంది. వంద శాతం ఆయుర్వేద వైద్యంతో యాంటిబయోటిక్స్‌లేని ఆరోగ్యకర, స్వచ్ఛమైన పాలను అందిస్తున్నాం. రైతులకు ఖర్చు తగ్గించి, ఆదాయం పెంచే దిశగా ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నాం.

– జయతీర్థాచారి, సీఈవో,
శ్రీజ మహిళా పాడి ఉత్పత్తిదారుల సంస్థ, తిరుపతి

24 గంటలూ ఉచిత ఫోను సదుపాయం

2018లో తంజావూరులో ఎన్‌డీడీబీ ఆధ్వర్యంలో పశు వ్యాధులకు ఆయుర్వేద వైద్యంపై శ్రీజ డైరీ ప్రతినిధులు శిక్షణ పొందారు. ఆ పద్ధతిలో అతితక్కువ ఖర్చుతో పశు వ్యాధులను నయం చేస్తున్నారు. రైతులను చైతన్యం చేసేందుకు ఇప్పటికే 80 వేల శిక్షణా శిబిరాలు నిర్వహించారు. పశు వ్యాధులకు ఆయుర్వేద చికిత్సతో తక్కువ ఖర్చే కాకుండా పాల దిగుబడి పెరుగుతోందంటున్నారు. రైతులకు వచ్చే సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయడం కోసం శ్రీజ డెయిరీ రైతులకు ఉచిత ఫోన్ నెంబర్ **18005322600**ను అందుబాటులోకి తెచ్చింది. ఈ కేంద్రంలో సిబ్బంది 24గంటలూ అందుబాటులో ఉంటారు. పాడిరైతుల సమస్యలపై తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో సమాధానాలిస్తారు. ఎన్.డి.డి.బి. యూట్యూబ్ ఛానల్‌లో సంప్రదాయ ఆయుర్వేద పశువైద్య పద్ధతులపై తెలుగు వీడియోలు కూడా అందుబాటులో ఉన్నాయి.

3 రాష్ట్రాలు.. 1.15 లక్షల మంది మహిళా రైతులు..

శ్రీజ మహిళ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ అంచెలంచెలుగా ఎదిగి అతిపెద్ద మహిళా పాడి రైతుల సమూహంగా మారింది. మూడు రాష్ట్రాల్లోని 1,15,695 మంది మహిళా పాడి రైతులు సభ్యులుగా ఉన్నారు. 95 శాతం మంది ఒకటి లేదా రెండు ఆవులున్న చిన్న, సన్నకారు రైతులే. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, కడప, ఒంగోలు జిల్లాలతో పాటు తమిళనాడు రాష్ట్రం వేలూరు, కాంచిపురం, తిరువణ్ణామలై, విల్లుపురం, క్రిష్ణగిరి జిల్లాలు, కర్నాటక రాష్ట్రం కోలార్, బుల్‌బాగల్ ప్రాంతాలలో శ్రీజ పనిచేస్తోంది. ప్రస్తుతం శ్రీజ టర్నోవర్ రూ. 850 కోట్లకు పైమాటే. 3,880 గ్రామాల్లో సుమారు 2 లక్షల ఆవుల నుంచి పాల సేకరణ జరుగుతోంది. ఈ గ్రామాలను 30 క్లస్టర్లుగా విభజించి మేనేజర్ స్థాయి, వైద్యుల పర్యవేక్షణలో పాడి ఆవుల పెంపకం సాగుతోంది. ప్రత్యేక చొరవతో పాడి రైతుల సందేహాలను నివృత్తి చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. ఆయుర్వేద మందులపై గత నాలుగేళ్ల నుంచి వివరిస్తూ మార్పు తేవటం ప్రశంసనీయం.

– తలపోల శరణ్‌కుమార్,
సాక్షి, తిరుపతి అలిపిరి

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



రాణించిన రిజ్వాన్: తొలి వన్డేలో పాక్ గెలుపు

న్యూజిలాండ్ జట్టుతో కరాచీలో జరిగిన తొలి వన్డేలో పాకిస్తాన్ ఆరు వికెట్ల తేడాతో నెగ్గింది. న్యూజిలాండ్ నిర్దేశించిన 256 పరుగుల విజయలక్ష్యాన్ని పాక్ 48.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. రిజ్వాన్ (77 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ బాబర్ ఆజమ్ (66; 5 ఫోర్లు, 1 సిక్స్), ఫఖర్ జమాన్ (56; 7 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. అంతకుముందు న్యూజిలాండ్ 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 255 పరుగులు సాధించింది. నసీమ్ షా (5/57) కివీస్‌ను దెబ్బ తీశాడు.



తొలి రౌండ్‌లోనే సానియా జోడీ ఓటమి

కొత్త సంవత్సరాన్ని భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా ఓటమితో ప్రారంభించింది. సోమవారం మొదలైన అడిలైడ్ ఓపెన్ ఇంటర్నేషనల్-2 టోర్నీలో సానియా మీర్జా–అనా డానిలినా (కజకిస్తాన్) జోడీ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. సానియా–డానిలినా ద్వయం 6-3, 3-6, 6-10తో 'సూపర్ టైబ్రేక్'లో టాప్ సీడ్ స్టార్మ్ హంటర్ (ఆస్ట్రేలియా)-క్రిదికోవా (చెక్ రిపబ్లిక్) జోడీ చేతిలో ఓడిపోయింది. సానియా–డానిలినా జోడీకి 4,350 డాలర్ల (రూ. 3 లక్షల 58 వేలు) ప్రైజ్‌మనీ దక్కింది.

వన్డేలకు మోగిన విజిల్

వన్డే వరల్డ్‌కప్‌నామ సంవత్సరమిది... అదీ భారత గడ్డపై... ఈ నేపథ్యంలో అక్టోబరుకు ముందు ఇకపై జరిగే వన్డేలన్నీ భారత్‌కు సన్నాహకాలే... మధ్యలో ఐపీఎల్ రూపంలో టి20లు ఉన్నా, వన్డే జట్టు ఎంపికకు, తుది జట్టు కూర్పు కొరకు ఈ మ్యాచ్‌ల ప్రదర్శనే కీలకం అవుతుందనడంలో సందేహం లేదు. ఆసియాకప్ కాకుండా టీమిండియా కనీసం 15 వన్డేలు ఆడాల్సి ఉంది. ఈ క్రమంలో నేటినుంచి జరిగే మూడు వన్డేల సిరీస్‌లో శ్రీలంకను భారత్ ఎదుర్కొంటుంది.

- నేడు భారత్, శ్రీలంక తొలి పోరు
- అన్ని విభాగాల్లో పటిష్టంగా టీమిండియా
- ఆత్మవిశ్వాసంతో లంక బృందం
- మధ్యాహ్నం గం. 1:30 నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

గువహటి: శ్రీలంకతో జరిగిన టి20 సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకున్న భారత జట్టు ఇప్పుడు వన్డే సిరీస్‌పై దృష్టి పెట్టింది. నేడు జరిగే తొలి వన్డేలో ఇరు జట్లు తలపడనున్నాయి. కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిల రాకతో భారత బృందం మరింత పటిష్టంగా మారగా... లంక దాదాపు అదే జట్టుతో మరో పోరాటానికి సిద్ధమైంది. తొలి రెండు టి20లు హోరాహోరీగా సాగినా... చివరి మ్యాచ్‌లో ఏకపక్ష విజయంతో భారత్ తమ స్థాయి ఏమిటో ప్రదర్శించింది. అయితే ఆ సిరీస్‌లో చూపిన ప్రదర్శన లంక జట్టులో ఆత్మ విశ్వాసం పెంచింది. 2017 తర్వాత స్వదేశంలో శ్రీలంకతో భారత్ వన్డే సిరీస్ ఆడుతోంది.



షనక

ఓపెనర్‌గా గిల్...

బంగ్లాదేశ్‌తో చివరి వన్డేలో అద్భుత బ్యాటింగ్‌తో 'డబుల్ సెంచరీ' సాధించినా... ఇషాన్ కిషన్‌కు ఈ మ్యాచ్‌లో మాత్రం చాన్స్ లేదు. కెప్టెన్ రోహిత్ రాకతో అతనిపై వేటు ఖాయమైంది. ఇషాన్‌కు అవకాశం ఇవ్వలేమని రోహిత్ స్పష్టం చేసేశాడు కూడా. వన్డేల్లో ఓపెనర్‌గా తనను తాను నిరూపించుకున్న శుబ్‌మన్ గిల్‌తో పాటు రోహిత్ ఓపెనింగ్ చేస్తాడు. టి20ల్లో ఆడని కోహ్లి తనకు బాగా అచ్చి వచ్చిన ఫార్మాట్‌లో మళ్లీ చెలరేగేందుకు సిద్ధమయ్యాడు. లంకపై ఏకంగా 8 సెంచరీలు, 11 అర్ధ సెంచరీలు చేసిన ఘనమైన రికార్డు కోహ్లికి ఉంది. గత ఏడాది 55.69 సగటుతో 724 పరుగులు చేసిన శ్రేయస్ అయ్యర్‌కు మిడిలార్డర్‌లో చోటు ఖాయం కాగా... వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్ కూడా బరిలోకి దిగుతాడు. దాంతో టి20ల్లో విధ్వంసం సృష్టించిన సూర్యకుమార్‌కు చోటు కష్టమే. పైగా వన్డేల్లో ఇప్పటి వరకు సూర్య ప్రదర్శన అంతంత మాత్రంగానే ఉంది. రాహుల్, శ్రేయస్‌లలో ఒకరిని తప్పించి సూర్యను ఆడించే పరిస్థితి ప్రస్తుతానికి లేదు. ఆరో స్థానంలో ఆల్‌రౌండర్‌గా కొత్త వైస్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా చెప్పుకోదగ్గ ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. బౌలింగ్‌లో ముగ్గురు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్లతో జట్టు కూర్పు ఉండవచ్చు. అక్షర్ పటేల్ ఖాయం కాగా... రెండో స్పిన్నర్‌గా చహల్, కుల్దీప్ యాదవ్‌ల మధ్య పోటీ ఉంది. సీనియర్ పేసర్ షమీ, సిరాజ్‌లతో పాటు మూడో పేసర్‌గా అర్ష్‌దీప్, ఉమ్రాన్‌లలో ఒకరికి చాన్స్ దక్కుతుంది. బంగ్లా చేతిలో సిరీస్ ఓడినా... ఓవరాల్‌పై లంకపై భారత్‌దే పైచేయిగా కనిపిస్తోంది.

162 ఇప్పటి వరకు భారత్, శ్రీలంక జట్ల మధ్య 162 వన్డేలు జరిగాయి. 93 మ్యాచ్‌ల్లో భారత్ గెలిచింది. 57 మ్యాచ్‌ల్లో శ్రీలంక నెగ్గింది. ఒక మ్యాచ్ 'టై'కాగా... 11 మ్యాచ్‌లు రద్దయ్యాయి. ఇక భారత గడ్డపై ఈ రెండు జట్లు 51 మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. 36 మ్యాచ్‌ల్లో టీమిండియా గెలుపొందగా... 12 మ్యాచ్‌ల్లో శ్రీలంక విజయం సాధించింది. మూడు మ్యాచ్‌లు రద్దయ్యాయి.

అందరూ అంతంతే...

శ్రీలంక జట్టు గత కొంత కాలంగా వన్డేల్లో కాస్త మెరుగైంది. స్వదేశంలో ఆస్ట్రేలియాతో సిరీస్ గెలవడం ఆ జట్టు చెప్పుకోదగ్గ ప్రదర్శన. అయితే సమస్యంతా ఒక్కొక్క ఆటగాడి వన్డే రికార్డుతోనే. ప్రస్తుతం ఉన్న జట్టులో అంతా టి20ల్లో ఆకట్టుకున్నవారే అయినా... వన్డేల్లో రెగ్యులర్‌గా తమను తాను నిరూపించుకున్నవారు ఎవరూ లేరు. టి20లతో పోలిస్తే వన్డేల్లో సుదీర్ఘ సమయం పాటు క్రీజ్‌లో నిలిచి ఇన్నింగ్స్‌ను నిర్మించే సమర్థుడైన బ్యాటర్ గానీ... 10 ఓవర్ల పాటు నిలకడగా ప్రత్యర్థిని ఇబ్బంది పెట్టగల బౌలర్ గానీ జట్టులో కనిపించడం లేదు. టి20ల్లో సత్తా చాటిన షనక వన్డే రికార్డు పేలవం. పైగా అతను ఇప్పటి వరకు భారత గడ్డపై వన్డే ఆడనే లేదు. అదే తరహాలో జట్టు ప్రధాన అస్త్రం హసరంగ కూడా వన్డేల్లో అంతంతే. ఇద్దరు పేసర్లు రజిత, కుమారలు ఇప్పటి వరకూ చెప్పుకోదగ్గ ప్రదర్శన ఇవ్వలేకపోగా, మదుషంక వన్డేలో అరంగేట్రం చేయలేదు. ఇలాంటి స్థితిలో భారత్‌కు లంక ఏమాత్రం పోటీ నిస్తుందో చూడాలి.

పిచ్, వాతావరణం

బర్సపర స్టేడియం బ్యాటింగ్‌కు అనుకూలం. ఈ గ్రౌండ్‌లో 2018లో ఒకే ఒక వన్డే జరిగింది. విండీస్ 322 పరుగులు చేసినా, భారత్ 42.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. మ్యాచ్ రోజు వర్షసూచన లేదు.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, శ్రేయస్, రాహుల్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, కుల్దీప్, షమీ, సిరాజ్, అర్ష్‌దీప్.

శ్రీలంక: షనక (కెప్టెన్), కుశాల్ మెండిస్, నిసాంక, అవిష్క, ధనంజయ, అసలంక, హసరంగ, కరుణరత్నే, తీక్షణ, రజిత, కుమార.

'నేను టి20ల నుంచి తప్పుకోలేదు'

గువహటి: వచ్చే టి20 వరల్డ్‌కప్ కోసం జట్టును సిద్ధం చేస్తున్నామని ఇటీవల కోచ్ రాహుల్ ద్రవిడ్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో సీనియర్లు రోహిత్, కోహ్లి టి20ల భవిష్యత్తుపై సందేహాలు రేగాయి. వారిని పక్కన పెట్టి జట్టును పునర్నిర్మిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే దీనిపై కెప్టెన్ రోహిత్ స్పందించాడు. తానేమీ అంతర్జాతీయ టి20ల నుంచి తప్పుకోలేదని, ఐపీఎల్ తర్వాతే దీనిపై ఆలోచిస్తానని అతను అన్నాడు. 'మనం ఈ ఏడాది ఆరు టి20లు ఆడాల్సి ఉంటే మూడు ముగిశాయి. మిగతా మూడులో ఏం చేయాలో తెలుసు. అయితే ఒకటి మాత్రం స్పష్టం. నేను అంతర్జాతీయ టి20లకు గుడ్‌బై చెప్పలేదు. ఐపీఎల్ తర్వాతే దీనిపై ఆలోచిస్తా. అయితే ఈ ఏడాది మా అందరి దృష్టీ వన్డేలపైనే ఉంది. అందరూ అన్ని మ్యాచ్‌లు ఆడలేరు. సీనియర్లకు పని భారం తగ్గించడంలో భాగంగానే లంకతో సిరీస్‌లో కొత్త ఆటగాళ్లు ఆడారు. నేను కూడా విశ్రాంతి తీసుకున్నవారిలో ఉన్నాను' అని రోహిత్ వ్యాఖ్యానించాడు.



రోహిత్

తిరగబెట్టిన బుమ్రా గాయం

లంకతో వన్డే సిరీస్‌కు దూరం



గువహటి: జస్‌ప్రీత్ బుమ్రా వెన్ను గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడని, ఫిట్‌గా ఉన్నాడంటూ గత మంగళవారం సెలక్టర్లు శ్రీలంకతో వన్డేల కోసం అతడిని జట్టులోకి ఎంపిక చేశారు. అయితే తొలి వన్డేకు ఒకరోజు ముందు పరిస్థితి మారింది. గత రెండు రోజులుగా ముంబైలో ప్రాక్టీస్ చేస్తున్న అతనికి వెన్ను గాయం తిరగబెట్టింది. దాంతో సహచరులతో పాటు బుమ్రా గువహటికి వెళ్లలేదు. 'లంకతో వన్డే సిరీస్‌లో బుమ్రా ఆడటం లేదు. అతను పూర్తి స్థాయిలో బౌలింగ్ చేసేందుకు మరికొంత సమయం అవసరం. ముందు జాగ్రత్తగానే ఈ నిర్ణయం తీసుకున్నాం. అతని స్థానంలో ఎవరినీ ఎంపిక చేయడం లేదు' అని బీసీసీఐ ప్రకటించింది. అయితే ప్రస్తుత గాయం తీవ్రత ఏమిటనే దానిపై స్పష్టత లేదు. లంకతో సిరీస్ కాదన్నా... 18 నుంచి న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్‌లో ఆడతాడా అనేదీ చెప్పలేని పరిస్థితి! అయితే ఈ రెండింటికి మించి ఫిబ్రవరి 9 నుంచి ఆస్ట్రేలియాతో జరిగే నాలుగు టెస్టుల సిరీస్‌లో అతను బరిలోకి దిగడం ఎంతో అవసరం. పరిస్థితి చూస్తుంటే అదీ సందేహంగానే ఉంది. ముందుగా తొలి టెస్టుకు దూరం కావచ్చని అనిపించినా... సిరీస్ మొత్తం కూడా దూరమయ్యే ప్రమాదమూ లేకపోలేదు. బుమ్రా విషయంలో ఏమాత్రం తొందరపడదల్చుకోలేదని, స్వదేశంలో వన్డే వరల్డ్‌కప్ కోసం అతను ఉంటే చాలని బోర్డు వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం.

అంతర్జాతీయ క్రికెట్‌కు ప్రిటోరియస్ గుడ్‌బై

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టు ఆల్‌రౌండర్ డ్వేయిన్ ప్రిటోరియస్ అంతర్జాతీయ క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకుంటున్నట్లు ప్రకటించాడు. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని 33 ఏళ్ల ప్రిటోరియస్ స్పష్టం చేశాడు. 2016లో దక్షిణాఫ్రికా తరఫున అరంగేట్రం చేసిన ప్రిటోరియస్ 3 టెస్టులు, 27 వన్డేలు, 33 టి20 మ్యాచ్‌లు ఆడాడు. టెస్టుల్లో 7 వికెట్లు తీసి 83 పరుగులు చేసిన అతను... వన్డేల్లో 35 వికెట్లు పడగొట్టి 192 పరుగులు... టి20ల్లో 35 వికెట్లు నేలకూల్చి 261 పరుగులు సాధించాడు.



అంతర్జాతీయ టి20ల్లో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన దక్షిణాఫ్రికా బౌలర్‌గా ప్రిటోరియస్ (2021లో పాకిస్తాన్‌పై 5/17) ఘనత వహించాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన ప్రిటోరియస్ ఇక నుంచి ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న టి20 లీగ్‌లపై, ఇతర పొట్టి ఫార్మాట్‌లపై దృష్టి కేంద్రీకరిస్తానని తెలిపాడు. ప్రస్తుతం ప్రిటోరియస్ ఐపీఎల్ (చెన్నై సూపర్‌కింగ్స్), ద హండ్రెడ్ (వెల్ష్ ఫైర్), కరీబియన్ ప్రీమియర్ లీగ్, ఎస్‌ఏ20 (డర్బన్ సూపర్ జెయింట్స్) లీగ్‌లలో భాగంగా ఉన్నాడు.

సింధు పునరాగమనం

నేటి నుంచి మలేసియా ఓపెన్



కౌలాలంపూర్: గాయంతో ఐదు నెలలు ఆటకు దూరంగా ఉన్న భారత బ్యాడ్మింటన్ స్టార్ క్రీడాకారిణి పీవీ సింధు కొత్త ఏడాదిని ఘనంగా ప్రారంభించాలనే పట్టుదలతో ఉంది. నేటి నుంచి జరిగే మలేసియా ఓపెన్ సూపర్–1000 టోర్నీతో 2023 బ్యాడ్మింటన్ సీజన్ ప్రారంభం కానుంది. ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో భారత అగ్రశ్రేణి క్రీడాకారులందరూ బరిలోకి దిగుతున్నారు. మహిళల సింగిల్స్‌లో భారత్ తరఫున పీవీ సింధు, ఆకర్షి కశ్యప్, సైనా నెహ్వాల్, మాళవిక ... పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్, ప్రణయ్, లక్ష్య సేన్ పోటీపడుతున్నారు. గత ఏడాది ఆగస్టులో కామన్వెల్త్ గేమ్స్‌లో చివరిసారి బరిలోకి దిగిన సింధు మహిళల సింగిల్స్‌లో భారత్‌కు స్వర్ణ పతకాన్ని అందించింది. ఆ తర్వాత చీలమండ గాయంతో ప్రపంచ చాంపియన్‌షిప్‌తోపాటు ఇతర టోర్నీలకు ఆమె దూరంగా ఉంది. సింధు బుధవారం జరిగే తొలి రౌండ్‌లో మూడుసార్లు ప్రపంచ చాంపియన్, రియో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత కరోలినా మారిన్ (స్పెయిన్)తో తలపడుతుంది. పురుషుల సింగిల్స్‌లో మంగళవారం తొలి రౌండ్ మ్యాచ్‌లో కెంటా నిషిమోటో (జపాన్)తో కిడాంబి శ్రీకాంత్ ఆడతాడు. 12 లక్షల 50 వేల డాలర్ల (రూ. 10 కోట్ల 29 లక్షలు) ప్రైజ్‌మనీతో నిర్వహిస్తున్న ఈ టోర్నీలో పురుషుల, మహిళల సింగిల్స్ విజేతలకు 87,500 డాలర్ల చొప్పున (రూ. 72 లక్షలు) అందజేస్తారు.

సినిమా



● రామజోగయ్యశాస్త్రి, నవీన్ యెర్నేని, గోపీచంద్ మలినేని, వై. రవిశంకర్

బ్లాక్ బస్టర్.. రాసిపెట్టుకోండి

- దర్శకుడు గోపీచంద్ మలినేని

''వీరసింహా రెడ్డి'కి తమన్ అత్యద్భుతమైన పాటలు ఇచ్చారు. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా వేరే లెవెల్‌లో ఉంటుంది. ఇందులో అన్ని పాటలు రామజోగయ్య శాస్త్రిగారు రాశారు. 'మాస్ మొగుడు..' చివర్లో తీసిన పాట. అప్పుడు మా కెమెరామేన్ రిషి పంజాబీ డిఐ వర్క్‌లో వుండటం వలన నా 'క్రాక్' సినిమా కెమెరామేన్ జీకే విష్ణు ఈ పాటని చేశారు. బాలయ్యబాబుని చాలా కలర్‌ఫుల్‌గా చూపించారు'' అన్నారు గోపీచంద్ మలినేని. నందమూరి బాలకృష్ణ హీరోగా శ్రుతీహాసన్ హీరోయిన్‌గా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'వీరసింహారెడ్డి'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. సోమవారం ఈ చిత్రంలోని 'మాస్ మొగుడు..' పాట ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. తమన్ స్వరపరచిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా, మనో, రమ్య బెహరా ఆలపించారు. ఈ కార్యక్రమంలో గోపీచంద్ మలినేని మాట్లాడుతూ– ''ఇటీవల ఒంగోలులో జరిగిన వేడుకలో విడుదల చేసిన థియేట్రికల్ ట్రైలర్‌కి ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వచ్చింది. ఇది జస్ట్ శాంపిల్ మాత్రమే. సినిమాలో మామూలుగా ఉండదు. 'వీరసింహా రెడ్డి' ష్యూర్ షాట్ బ్లాక్ బస్టర్... రాసిపెట్టుకోండి'' అన్నారు. రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ– ''నేను బాలకృష్ణగారికి అభిమానిని. ఈ చిత్రానికి సింగిల్ కార్డ్ రాసే చాన్స్ ఇచ్చిన గోపీచంద్ మలినేనికి, మైత్రీ మూవీ మేకర్స్‌కి కృతజ్ఞతలు. అన్ని పాటలూ అద్భుతంగా ఉంటాయి. బాలకృష్ణగారి మార్క్ ఫైర్ బ్రాండ్ సినిమా ఇది'' అన్నారు.

అందుకే ఒక అడుగు వెనక్కి తగ్గా!

- 'దిల్' రాజు

''వారసుడు'ని ఈ నెల 11న విడుదల చేయాలనుకున్నాం. అయితే బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి, చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య' సినిమాలు 12, 13న రిలీజ్ అవుతున్నాయి. ప్రతి థియేటర్‌లో ముందు మన తెలుగు పెద్ద స్టార్స్ సినిమాలు ఆడాలి, ఆ సినిమాలకు అన్ని చోట్ల థియేటర్లు దొరకాలని మా 'వారసుడు'ని రెండు రోజులు ఆలస్యంగా 14న రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు నిర్మాత 'దిల్' రాజు. విజయ్, రష్మికా మందన్న జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వారసుడు'. తమిళంలో 'వారీసు'. 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించారు. సోమవారం జరిగిన సమావేశంలో 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ముందు అనుకున్నట్లే 'వారీసు' ఈ నెల 11న తమిళంలో విడుదలవుతోంది. తెలుగులో వస్తున్న సంక్రాంతి సినిమాలకి మా 'వారసుడు' పోటీ కాదని చెబుతూనే ఉన్నాను. నిర్మాతలు బాగుండాలని కోరుకుంటాను. అందుకే 'వారసుడు' రిలీజ్ విషయంలో నేనే ఒక అడుగు వెనక్కి తగ్గాను. అయితే అందరూ నా మీద పడి ఏడుస్తున్నారు. పండ్లున్న చెట్టుకే రాళ్ల దెబ్బలుంటాయి. నా నిర్ణయంపై ఇండస్ట్రీ పెద్దలు ఆనందం వ్యక్తం చేశారు'' అన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ– ''11న తమిళ్‌లో విడుదలవుతున్న 'వారీసు' పెద్ద హిట్ కాబోతోంది. ఒకచోట విజయం సాధిస్తే ఆ చిత్రాన్ని ఆదరించడానికి మన తెలుగు ప్రేక్షకులు సిద్ధంగా ఉంటారు. రీసెంట్‌గా వచ్చిన 'కాంతార, లవ్ టుడే' చిత్రాలు ఇదే నిరూపించాయి'' అన్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ– ''మన తెలుగు స్టార్స్‌కి గౌరవం ఇస్తూ.. ఇన్ని కోట్లు ఖర్చు చేసి తీసిన సినిమాని 14కి వాయిదా వేసినందుకు 'దిల్' రాజుగారికి హ్యాట్సాఫ్. 'వారసుడు' లేటుగా వచ్చినా సూపర్ డూపర్ హిట్ అవుతుంది'' అన్నారు.



● శ్రీకాంత్, 'దిల్' రాజు



● గుణశేఖర్, సమంత, నీలిమ గుణ

ఓపిక లేకపోయినా వచ్చాను

- సమంత

''జీవితంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నప్పటికీ ఒక్కటి మాత్రం మారలేదు. సినిమాను నేను ఎంతలా ప్రేమిస్తానో... సినిమా కూడా నన్ను అంతలా ప్రేమిస్తోంది. 'శాకుంతలం'తో మీ ప్రేమ మరింత పెరుగుతుందని నమ్ముతున్నాను'' అని సమంత అన్నారు. గుణశేఖర్ దర్శకత్వంలో సమంత లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'శాకుంతలం'. 'దిల్' రాజు సమర్పణలో నీలిమ గుణ నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 17న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సమంత మాట్లాడుతూ– ''ఓపిక లేకపోయినా గుణశేఖర్‌గారిపై ఉన్న అభిమానం, గౌరవంతో నా బలం మొత్తాన్ని కూడగట్టుకుని ఇక్కడికి వచ్చాను. కొందరికి సినిమా అనేది జీవితంలో ఓ భాగం. కానీ, గుణశేఖర్‌గారికి సినిమానే జీవితం. ప్రతి సినిమాలానే 'శాకుంతలం'ని కూడా ఆయన ప్రాణం పెట్టి తీశారు. ఏ కథ విన్నా సినిమా బాగా రావాలని నటీనటులు కోరుకుంటారు. కొన్నిసార్లు ఆ ఊహను దాటి ఎన్నో అద్భుతాలు జరుగుతాయి..'శాకుంతలం' చూశాక నాకు అదే భావన కలిగింది'' అన్నారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– ''గుణశేఖర్‌గారు 'శాకుంతలం' కథ చెప్పినప్పుడు లీడ్ రోల్‌లో సమంత అయితే సరిపోతారనుకున్నాం. కథ విని, సమంత కూడా ఓకే అన్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో తెరకెక్కిన ఒరిజినల్ పాన్ ఇండియా సినిమా ఇది'' అన్నారు. గుణశేఖర్ మాట్లాడుతూ– ''శాకుంతలం'లో ముగ్గురు హీరోలున్నారు. కథకు హీరో దేవ్ మోహన్, సినిమాకు హీరో సమంత, తెర వెనక హీరో 'దిల్' రాజుగారు. ఇండియాలో వచ్చిన హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రాల్లో అతి పెద్ద బడ్జెట్ సినిమా 'శాకుంతలం'. ఓ హీరోయిన్‌ని నమ్మి ఇంత బడ్జెట్ పెట్టిన రాజుగారికి థ్యాంక్స్. (చెమర్చిన కళ్లతో)'' అన్నారు. గుణశేఖర్ మాటలకు సమంత భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టారు. ''మా నాన్న ఎన్నో విజువల్స్ వండర్స్ సృష్టించారు. 'శాకుంతలం' ఆయనకు పూర్వ వైభవం తెస్తుంది'' అన్నారు నీలిమ గుణ.



● అడివి శేష్

ఆల్ప్స్ పర్వతాలకు...

ఓ మిషన్ మీద ఒక గూఢచారి ఇండియా నుంచి ఆల్ప్స్ పర్వతాలకు వెళతాడు. ఆ మిషన్ ఏంటి? ఎలా విజయం సాధించాడు? అనేవి తెలియడానికి ఇంకా సమయం ఉంది. గూఢచారి పాత్రలో అడివి శేష్ హీరోగా రూపొందనున్న చిత్రం 'గూఢచారి 2'. ఈ చిత్రం ఫస్ట్ లుక్, ప్రీ విజన్ వీడియోను రిలీజ్ చేశారు. 'గూఢచారి'కి సీక్వెల్‌గా 'గూఢచారి 2' రూపొందనుంది. కాగా తొలి భాగం భారతదేశంలో జరిగితే రెండో భాగం కథ ఇండియా నుంచి ఆల్ప్స్ పర్వతాలకు ప్రయాణిస్తుంది. అడివి శేష్ కథ అందించిన ఈ చిత్రం ద్వారా ఎడిటర్ వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మించనున్నారు.

● సూర్య వశిష్ట, అనికా



పేరు లేని ఊరులోకి...

చిన్న చిన్న విషయాల్లో ఆనందాన్ని వెతుక్కునే అమ్మాయి సత్య. మొబైల్ ఫోన్‌ని అంటి పెట్టుకుని ఉండే సత్య ఒకసారి ఓ ఆటోడ్రైవర్‌తో మాట్లాడుతుంది. ఆ పరిచయం ప్రేమదాకా దారి తీస్తుంది. ఆ తర్వాత ఏం జరిగింది? అనేది 'బుట్టబొమ్మ'లో చూడాలి. అనికా సురేంద్రన్, సూర్య వశిష్ట, అర్జున్ దాస్ ముఖ్య తారలుగా నటించిన చిత్రం ఇది. ఈ చిత్రంలోని 'పేరు లేని ఊరులోకి..' అంటూ సాగే తొలి పాటను సోమవారం రిలీజ్ చేశారు. స్వీకర్ అగస్తి స్వరపరిచిన ఈ పాటను సనాపతి భరద్వాజ్ పాత్రుడు రచించగా, మోహనా భోగరాజు ఆలపించారు. నూతన దర్శకుడు శౌరి చంద్రశేఖర్ రమేష్ దర్శకత్వంలో ఎస్. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం నెల 26న విడుదల కానుంది.

అన్నీ మరచిపోతాడు



● సుధీర్‌బాబు

సుధీర్ బాబు హీరోగా మహేష్ దర్శకత్వంలో వి. ఆనంద ప్రసాద్ నిర్మించిన చిత్రం 'హంట్'. ఈ నెల 26న ఈ చిత్రం విడుదల కానున్న సందర్భంగా మేకింగ్ వీడియోను విడుదల చేశారు. ఈ చిత్రంలోని యాక్షన్ సీక్వెన్స్‌ని ఫ్రాన్స్‌కి చెందిన క్యాంపస్ యూనివర్స్ కాస్‌కేడ్స్ టీమ్ డిజైన్ చేసింది. సుధీర్‌బాబు మాట్లాడుతూ – ''ఈ చిత్రంలోని రిస్కీ ఫైట్స్‌కి డూప్ వాడలేదు. రోప్, బెడ్‌లాంటివి ఏవీ లేకుండానే ఫైట్స్ చేశాం. ఈ సినిమాలో అన్నీ మరచిపోయే రెండు షేడ్స్ ఉన్న అర్జున్ పాత్ర చేశాను. జ్ఞాపకశక్తి కోల్పోక ముందు కోల్పోయాక.. ఇలా నా పాత్ర ఉంటుంది'' అన్నారు. ''హై వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించాం. హాలీవుడ్ మార్వెల్ స్టూడియోస్ నిర్మించిన పలు చిత్రాలకు వర్క్ చేసిన రేనాడ్ ఫవెరో, బ్రయాన్ విజియర్ 'హంట్'కి స్టంట్స్ కంపోజ్ చేశారు. 'జాన్ విక్ 4'కి చిత్రానికి కూడా వాళ్లే స్టంట్ కొరియోగ్రాఫర్స్. ఈ ముగ్గురికీ తొలి భారతీయ చిత్రం ఇది'' అన్నారు ఆనందప్రసాద్. ఈ చిత్రానికి సంగీతం: జిబ్రాన్, కెమెరా: అరుల్ విన్సెంట్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: అన్నే రవి.

కథే మా ధైర్యం

- అనిల్ కుమార్ ఆళ్ల

''సంక్రాంతికి చిరంజీవిగారు, బాలకృష్ణగారు వంటి స్టార్ హీరోల చిత్రాలు (వాల్తేరు వీరయ్య, వీరసింహా రెడ్డి) విడుదలవుతున్నాయి. అయినప్పటికీ చిన్న సినిమా అయిన మా 'కళ్యాణం కమనీయం'ని విడుదల చేస్తున్నామంటే మా ధైర్యం కథే'' అని డైరెక్టర్ అనిల్ కుమార్ ఆళ్ల అన్నారు. సంతోష్ శోభన్, ప్రియ భవానీ శంకర్ జంటగా నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న రిలీజవుతోంది. ఈ చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయమవుతున్న అనిల్ కుమార్ ఆళ్ల చెప్పిన విశేషాలు.

- నేను పుట్టి, పెరిగింది గుంటూరులో. చదువు పూర్తయ్యాక హైదరాబాద్ వచ్చి సినిమా ప్రయత్నాలు ప్రారంభించాను. వారాహి సంస్థలో 'తుంగభద్ర' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశాను. 'కళ్యాణం కమనీయం' లైన్ అనుకున్నాక నా స్నేహితుడు అజయ్ కుమార్ రాజు ద్వారా యూవీ క్రియేషన్స్‌తో పరిచయం ఏర్పడింది. వారికి కథ నచ్చడంతో ఈ సినిమా నిర్మించారు.
- పెళ్లయ్యాక భర్తకు జాబ్ లేకుంటే భార్య ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొంటుంది? తమ చుట్టూ జరిగే ఈగో (అహం) గేమ్స్‌ను ఈ జంట ఎలా ఎదుర్కొంది? అనేది ఆసక్తిగా ఉంటుంది. శివ, శ్రుతి పాత్రల్లో సంతోష్, ప్రియ నటన ఆకట్టుకుంటుంది. 'కళ్యాణం కమనీయం' కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్.
- నా దృష్టిలో సినిమా అంటే మనల్ని మనం పోల్చుకోవాలి. నా లైఫ్‌లో జరిగిన వాస్తవ ఘటనలు కూడా ఈ చిత్రానికి స్ఫూర్తినిచ్చాయి. నా ఫేవరెట్ డైరెక్టర్స్ చాలామంది ఉన్నారు. ఎమోషన్ చూపించాలంటే మణిరత్నంగారు, ఒక హైలోకి తీసుకెళ్లాలంటే రాజమౌళిగారు, సొసైటీకి మంచి చెప్పే చిత్రాల విషయంలో శంకర్‌గారు, యాక్షన్ అంటే బోయపాటిగారు ఇలా.. చాలా మంది అభిమాన దర్శకులున్నారు. నేను ఏ సినిమా చేసినా ఎమోషన్‌ని మాత్రం మిస్ కాను. ఇక నాకు ఉన్న కలల్లో ప్రభాస్‌గారితో సినిమా చేయాలనే కల ఒకటి.



స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	847	60,747
నిఫ్టీ ▲	242	18,101

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	10,792	▲ 223
డోజోన్స్	33,827	▲ 196
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,725	▲ 25
డాక్స్	14,793	▲ 183
షాంఘై	3,176	▲ 18
నికాయ్ (శుక్రవారం ముగింపు)	25,974	▲ 153

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	56,259
బంగారం (99.5 స్వచ్ఛత)	56,034
వెండి (కిలో)	68,791

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధామసుకు	81.55	83.22
£	బ్రిటన్ పౌండ్	ధామసుకు	98.30	101.64
€	యూరో	ధామసుకు	86.39	89.48
¥	జపాన్ ఎన్ (100)	ధామసుకు	61.67	63.69
AU$	ఆస్ట్రేలియా డాలర్	ధామసుకు	55.90	58.31
S$	సింగపూర్ డాలర్	ధామసుకు	60.92	62.94
SAR	సౌదీ రియాల్	ధామసుకు	20.97	22.64
UAE D	యూఏఈ దిర్హామ్	ధామసుకు	21.53	23.32
¥	చైనా యువాన్	ధామసుకు	11.02	13.05

కొచ్చర్ దంపతులకు బెయిల్

అరెస్ట్‌ను తప్పుపట్టిన హైకోర్ట్



ముంబై: రుణ మోసం కేసులో ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈవో, ఎండీ చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్‌లకు బాంబే హైకోర్టు సోమవారం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ''క్యాజువల్ మరియు మెకానికల్'' ధోరణిలో ఈ అరెస్ట్ జరిగిందంటూ సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)ను తప్పు పట్టింది. అరెస్టులో తగిన చట్టపరమైన విధానం, వైఖరి అవలంబించలేదని 49 పేజీల ఉత్తర్వుల్లో న్యాయమూర్తులు రేవతి మోహితే దేరే, పీకే చవాన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ పేర్కొంది. వీడియోకాన్–ఐసీఐసీఐ బ్యాంక్ రుణం కేసుకు సంబంధించి 2022 డిసెంబర్ 23న కొచ్చర్‌లను సీబీఐ అరెస్టు చేసింది. ప్రస్తుతం వారు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. కాగా, కోర్టు తదుపరి విచారణను ఫిబ్రవరి 6వ తేదీకి వాయిదా వేసింది.

టీటీకే ప్రెస్టేజ్ సూపర్ సేవర్ ఆఫర్

హైదరాబాద్: ప్రముఖ కిచెన్ ఉపకరణాల బ్రాండ్ టీటీకే ప్రెస్టేజ్ 'సూపర్ సేవర్ ఆఫర్ 2022–2023' ను పరిచయం చేసింది. స్టవ్‌లు, బర్నర్లు, కుక్‌టాప్, గ్రైండర్లు, ఎలక్ట్రిక్ కెటిల్స్ వంటి గది ఉపకరణాలు, వంట సామగ్రిలను నమ్మశక్యం కాని గొప్ప తగ్గింపుతో అందుబాటులోకి తెచ్చింది. కొత్త ఏడాది, సంక్రాంతి సంబరాలను మరింత రెట్టింపు చేసుకునేందుకు అద్భుతమైన డీల్స్, భారీ తగ్గింపు, ఉచిత బహుమతులెన్నో ప్రకటించింది. వంటను సులభంగా, తర్వితగతిన చేసే వినూత్న ఉత్పత్తులను అందించే లక్ష్యంగా ప్రతి ఏడాదిలాగే ఈసారి సూపర్ సేవర్ ఆఫర్లు ప్రకటించామని కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ దినేష్ గార్గ్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-1-2023	
విశాఖ	562–00
చిత్తూరు	568–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	554–00
విజయవాడ	554–00
రిటైల్ ధర (డజను)	78.00
9-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	553–00
వరంగల్	555–00
రిటైల్ ధర	6.10

సఖాలిన్-1 క్షేత్రాల్లో ఓవీఎల్‌కు 20 శాతం వాటాలు

న్యూఢిల్లీ: రష్యాలోని సఖాలిన్-1 చమురు, గ్యాస్ క్షేత్రాల్లో తిరిగి 20 శాతం వాటాలను తీసుకున్నట్లు ప్రభుత్వ రంగ దిగ్గజం ఓఎన్‌జీసీ విదేశ్ వెల్లడించింది. ఈ ప్రాజెక్టు ఆపరేటర్ అయిన అమెరికన్ సంస్థ ఎక్సాన్‌మొబిల్ అనుబంధ కంపెనీ ఎక్సాన్ నెఫ్టగాజ్‌ను పక్కకు తప్పించి, దానికి సంబంధించిన అసెట్స్ అన్నింటిని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గతేడాది కొత్త ఆపరేటర్‌కు బదలాయించారు. గతంలో తమకున్న వాటాలను తిరిగి తీసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలంటూ అప్పట్లో షేర్ హోల్డర్లయిన జపాన్ సంస్థ సోడెకో కన్సార్షియం, ఓవీఎల్‌కు రష్యా ప్రభుత్వం సూచించింది. దానికి అనుగుణంగానే ఓవీఎల్ దరఖాస్తు చేసుకోగా, తదనుగుణంగా గతంలో దానికి ఉన్నంత వాటాలను కేటాయించింది. సోడెకో కూడా తన వాటాను అట్టే పెట్టుకుంది. అయితే, ఎక్సాన్‌మొబిల్ విషయంలో స్పష్టత రాలేదు. గతంలో సఖాలిన్1లో ఎక్సాన్ నెఫ్టగ్యాస్, సోడెకో సంస్థలకు చెరి 30 శాతం, రాస్‌నెఫ్ట్‌కు 20 శాతం వాటాలు ఉండేవి. 2001లో ఓవీఎల్ ఇందులో 20 శాతం వాటాలు తీసుకుంది. గతేడాది అక్టోబర్‌లో ఈ ప్రాజెక్టును సఖాలిన్-1 లిమిటెడ్ లయబిలిటీ కంపెనీకి రష్యా బదలాయించింది. ఈ కొత్త కంపెనీలో ఓవీఎల్, రాస్‌నెఫ్ట్‌కు చెరి 20 శాతం, సోడెకోకు 30 శాతం వాటాలు ఉండగా.. ఎక్సాన్‌మొబిల్ వాటా విషయంలో ఇంకా ఏమీ తేలలేదు. ఉక్రెయిన్ మీద దాడికి ప్రతిగా రష్యాపై ప్రపంచ దేశాలు ఆంక్షలు విధించిన నేపథ్యంలో గతేడాది ఏప్రిల్‌లో సఖాలిన్-1 నుంచి ఉత్పత్తిని ఎక్సాన్ నెఫ్టగాజ్ నిలిపివేసింది. ఉక్రెయిన్ యుద్ధానికి ముందు సఖాలిన్-1లో రోజుకు 2,20,000 బ్యారెళ్ల (బీపీడీ) చమురు ఉత్పత్తయ్యేది. నవంబర్ నుంచి మళ్లీ 1,40,000–1,50,000 బీపీడీ మేర ఉత్పత్తి మొదలుపెట్టారు.

శుక్రవారం ప్రధాని ప్రీ బడ్జెట్ భేటీ!



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం ఆర్థివేత్తలు, వివిధ రంగాల నిపుణులతో ప్రీ బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నారు. నీతి ఆయోగ్‌లో జరగనున్న ఈ భేటీలో దేశ ఆర్థిక వ్యవస్థ, వృద్ధి పురోగతికి తీసుకోవాల్సిన చర్యలు వంటి అంశాలపై ప్రధాని చర్చించనున్నారని సీనియర్ ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. పలువురు కేంద్ర మంత్రులు కూడా ఈ సమావేశంలో పాల్గొననున్నట్లు సమాచారం. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1వ తేదీన 2023–24 వార్షిక బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెడతారని భావిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) భారత్ ఎకానమీ వృద్ధి రేటు 6.5–7.0 శ్రేణిలో నమోదవుతుందని అంచనా.

సెన్సెక్స్.. బౌన్స్‌బ్యాక్

- 847 పాయింట్లు హైజంప్
- 60,747 వద్ద ముగింపు
- మూడు రోజుల నష్టాలకు చెక్
- నిఫ్టీ 242 పాయింట్లు ప్లస్
- రూపాయి 31 పైసలు అప్



ముంబై: గ్లోబల్ మార్కెట్ల సానుకూలతలు, ఇన్వెస్టర్ల మూకుమ్మడి కొనుగోళ్లతో దేశీ స్టాక్ మార్కెట్లు కదం తొక్కాయి. వెరసి మూడు రోజుల వరుస నష్టాలకు చెక్ పడింది. సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం టీసీఎస్ క్యూ3 ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఐటీ కౌంటర్లకు డిమాండ్ పుట్టింది. ముందురోజు నాస్‌డాక్ (యూఎస్) జోరందుకోవడం ఇన్వెస్టర్లకు ప్రోత్సాహాన్నిచ్చింది. సెన్సెక్స్ 847 పాయింట్లు జంప్ చేసింది. 60,747 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 242 పాయింట్లు ఎగసి 18,101 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 989 పాయింట్లు దూసుకెళ్లి 60,889ను తాకింది. నేటి ట్రేడింగ్‌లో ఆసియా, యూరోపియన్ మార్కెట్లలో సానుకూల ట్రెండ్ నెలకొంది. దీంతో సెంటిమెంటు బలపడినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. వేతన వృద్ధి మందగించడం, సర్వీసుల రంగం బలహీనపడటంతో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపు వేగానికి కళ్లెం పడనున్నట్లు అంచనాలు పెరిగాయి. డాలరుతో మారకంలో రూపాయి 31 పైసలు బలపడింది. ఇంటర్ బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో 82.35 వద్ద ముగిసింది.

మూడు మాత్రమే

ప్రామాణిక ఇండెక్స్ సెన్సెక్స్‌లో మూడు కౌంటర్లు మాత్రమే డీలా పడ్డాయి. ప్రధానంగా హెచ్‌సీఎల్ టెక్, ఎంఅండ్‌ఎం, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టీసీఎస్, భారతీ ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా, విప్రో, ఇన్ఫోసిస్, ఆర్‌ఐఎల్, యాక్సిస్ బ్యాంక్ లాభపడ్డాయి. బ్లూచిప్స్‌లో కేవలం టైటన్, బజాజ్ ఫిన్‌సర్వ్, మారుతీ వెనకడుగు వేశాయి. టెక్నాలజీ, ఐటీ 2.6 శాతం జంప్‌చేయగా.. పవర్, మెటల్, ఎనర్జీ, క్యాపిటల్ గూడ్స్, ఆటో, ఇండస్ట్రియల్స్ 1.8–1.2 శాతం మధ్య ఎగశాయి. కేవలం కన్జూమర్ డ్యూరబుల్స్ నీరసించింది. మిడ్ క్యాప్ ఇండెక్స్ 1 శాతం, స్మాల్ క్యాప్ 0.5 శాతం చొప్పున బలపడ్డాయి. గత వారం దిద్దుబాటు తదుపరి గ్లోబల్ మార్కెట్లలో నెలకొన్న సానుకూల ట్రెండ్ దన్నుతో ఇన్వెస్టర్లు షార్ట్ కవరింగ్ చేపట్టినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.

టీసీఎస్ క్యూ3 భేష్!

- నికర లాభం రూ. 10,846 కోట్లు
- మొత్తం ఆదాయం రూ. 58,229 కోట్లు
- వచ్చే ఏడాది 1.5 లక్షల మందికి ఉపాధి
- షేరుకి రూ. 75 చొప్పున డివిడెండ్



ముంబై: సాఫ్ట్‌వేర్ సేవల టాటా గ్రూప్ దిగ్గజం టీసీఎస్ ఈ ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 11 శాతం పుంజుకుని రూ. 10,846 కోట్లను తాకింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 9,769 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 19 శాతం ఎగసి రూ. 58,229 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 48,885 కోట్ల టర్నోవర్ నమోదైంది. కార్యకలాపాల్లో వృద్ధి, ఫారెక్స్ లాభాలు తాజా త్రైమాసికంలో కంపెనీ లాభదాయకతకు సహకరించాయి. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 75 చొప్పున డివిడెండ్‌ను ప్రకటించింది. దీనిలో రూ. 67 ప్రత్యేక డివిడెండ్ కలసి ఉంది. వెరసి డివిడెండ్ రూపేణా రూ. 33,000 కోట్లను పంచనుంది. డాలర్ల రూపేణా ఆదాయం 8 శాతం మెరుగుపడినట్లు టీసీఎస్ పేర్కొంది.

భారీగా ఉద్యోగాలు

వచ్చే ఆర్థిక సంవత్సరం(2023–24)లో అత్యంత భారీగా ఉద్యోగ సృష్టికి తెరతీయనున్నట్లు టీసీఎస్ వెల్లడించింది. సుమారు 1.5 లక్షల మందికి ఉపాధి కల్పించే యోచనలో ఉన్నట్లు తెలియజేసింది. డీల్ పరిస్థితులు, పైప్‌లైన్ ఆశావహంగా ఉన్నట్లు సీఈవో ఎన్.గణపతి సుబ్రమణ్యం పేర్కొన్నారు. 7 నుంచి 9 బిలియన్ డాలర్ల మధ్య డీల్స్‌ను లక్ష్యంగా పెట్టుకోగా.. వీటికి మధ్యస్థంగా కాంట్రాక్టులు పొందినట్లు వెల్లడించారు. థర్డ్‌పార్టీ, ఇతర వ్యయాలు పెరగడంతో లాభాల మార్జిన్లు ప్రభావితమైనట్లు సీఎఫ్‌వో సమీర్ సేక్సరియా పేర్కొన్నారు. గతేడాది స్థాయిలోనే 25 శాతం ఇబిటా మార్జిన్లు సాధించగలమని తెలియజేశారు.

తగ్గిన సిబ్బంది...

చాలా ఏళ్ల తదుపరి క్యూ3లో టీసీఎస్ మొత్తం సిబ్బంది సంఖ్య 2,197 తగ్గి 6,13,974కు పరిమితమైంది. ఉపాధి కల్పనకు మించి ఉద్యోగ వలస దీనికి కారణమైనట్లు హెచ్‌ఆర్ చీఫ్ మిలింద్ లక్కడ్ తెలియజేశారు. ఏప్రిల్–డిసెంబర్ మధ్య కాలంలో 42,000 మంది ఫ్రెషర్స్‌ను తీసుకోగా.. క్యూ4(జనవరి–మార్చి)లోనూ మరికొంతమందికి ఆఫర్ ఇవ్వనున్నట్లు తెలియజేశారు. వచ్చే ఏడాది(2023–24)లోనూ 40,000 మంది కొత్తవారిని నియమించుకోనున్నట్లు వెల్లడించారు. పూర్తి ఏడాదిలో 1.25–1.5 లక్షల మందిని ఎంపిక చేసుకునే ప్రణాళికల్లో ఉన్నట్లు తెలియజేశారు.

క్లౌడ్ దన్ను

సీజనల్‌గా బలహీన త్రైమాసికంగా పేర్కొనే క్యూ3లోనూ పటిష్ట ఫలితాలు సాధించాం. ఇందుకు ప్రధానంగా క్లౌడ్ సర్వీసుల్లో వృద్ధి దోహదపడింది. స్వల్పకాలిక అనిశ్చితులున్నప్పటికీ ఉత్తర అమెరికా, ఇంగ్లండ్‌లలో బలపడిన బిజినెస్ సైతం ఇందుకు జత కలిసింది. యూరోపియన్ క్లయింట్ల ఐటీ వ్యయాలను రాజకీయ, భౌగోళిక ఆందోళనలు ప్రభావితం చేస్తున్నాయి.

– రాజేష్ గోపీనాథన్, సీఈవో, ఎండీ, టీసీఎస్

ఇతర హైలైట్స్

- నిర్వహణ లాభ మార్జిన్లు 0.5 శాతం బలపడి 24.5 శాతాన్ని తాకాయి.
- క్యూ3లో 7.9 బిలియన్ డాలర్ల విలువైన డీల్స్ కుదుర్చుకుంది.
- ఉద్యోగుల వలస(అట్రిషన్) స్వల్పంగా తగ్గి 21.3 శాతానికి చేరింది.
- కొత్త ఏడాదిలో 40,000 మంది ఫ్రెషర్స్‌కు ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు కంపెనీ ప్రకటన.

మార్కెట్లు ముగిశాక టీసీఎస్ సాయంత్రం ఫలితాలు విడుదల చేసింది. క్యూ3 పనితీరుపై అంచనాలతో టీసీఎస్ షేరు బీఎస్‌ఈలో 3.35 శాతం ఎగసి రూ. 3,320 వద్ద ముగిసింది.

తెలంగాణలో ఉజ్జీవన్ బ్యాంక్

- అయిదు శాఖల ఏర్పాటు; వచ్చే ఏడాది ఏపీలోకి విస్తరణ
- బ్యాంక్ సీఈవో డేవిస్ వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తాజాగా తెలంగాణకు కార్యకలాపాలు విస్తరిస్తోంది. తొలుత అయిదు శాఖలను ప్రారంభించనుంది. వీటిలో నాలుగు వచ్చే వారంలోనూ, మరొకటి వచ్చే నెలలో ప్రారంభించనున్నట్లు బ్యాంక్ ఎండీ, సీఈవో ఇతిరా డేవిస్ సోమవారమిక్కడ విలేకరుల సమావేశంలో తెలిపారు. వచ్చే ఏడాది వీటి సంఖ్యను రెట్టింపు చేసుకోనున్నట్లు, అలాగే తమ టాప్ 10 మార్కెట్లలో తెలంగాణ కూడా ఒకటిగా నిలవగలదని ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు. అటు వచ్చే ఏడాది ఆంధ్రప్రదేశ్‌లోకి కూడా కార్యకలాపాలు విస్తరించనున్నట్లు డేవిస్ తెలిపారు. ప్రస్తుతం 71 లక్షలకు పైగా కస్టమర్లకు సర్వీసులు అందిస్తున్నామని, కొత్త వాటితో కలిపి ప్రస్తుతం తమకు దేశవ్యాప్తంగా 25 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కలిపి 598 శాఖలు ఉంటాయని వివరించారు.

పసిడి, ట్రాక్టర్ లోన్స్‌పై దృష్టి..

బంగారం రుణాలు, ద్విచక్ర వాహనాల రుణాలు, ట్రాక్టర్ లోన్స్‌పైనా దృష్టి పెడుతున్నట్లు డేవిస్ చెప్పారు. ప్రస్తుతం తమ పోర్ట్‌ఫోలియోలో సూక్ష్మ రుణాల విభాగం 71 శాతంగా ఉండగా మిగతాది అఫోర్డబుల్ హౌసింగ్ మొదలైన విభాగాల్లో ఉంటోందని పేర్కొన్నారు. వచ్చే అయిదేళ్లలో సూక్ష్మ రుణాల పోర్ట్‌ఫోలియోను 50 శాతానికి తగ్గించుకోవడం ద్వారా సెక్యూర్డ్, అన్‌సెక్యూర్డ్ రుణాల మధ్య సమతౌల్యం సాధించాలని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది ఆఖరు నాటికి శాఖల సంఖ్యను 625కి పెంచుకోనున్నామని డేవిస్ చెప్పారు. తెలంగాణ శాఖల్లో తొలుత 30 మంది వరకు సిబ్బంది ఉంటారు. మరోవైపు, మాతృ సంస్థను విలీనం చేసుకునే రివర్స్ మెర్జర్ ప్రక్రియ జూన్–సెప్టెంబర్ మధ్యలో పూర్తి కావచ్చని భావిస్తున్నట్లు వివరించారు.

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ హైకోర్టులో 39 ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కోర్టు మాస్టర్, పర్సనల్ సెక్రటరీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 39
- **అర్హత:** డిగ్రీ(ఆర్ట్స్/సైన్స్/కామర్స్),ఇంగ్లిష్ షార్ట్‌హ్యాండ్, హయ్యర్ గ్రేడ్ ఇంగ్లిష్ టైప్ రైటింగ్ ఉత్తీర్ణులై ఉండాలి. ▪ **వయసు:** 01.01.2023 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.57,100 నుంచి రూ.1,47,760 చెల్లిస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్),ఆంధ్రప్రదేశ్ హైకోర్టు,నేలపాడు,అమరావతి, గుంటూరు జిల్లా చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 25.01.2023.
- **పరీక్ష తేది:** 04.02.2023.
- **ఫలితాల వెల్లడి తేది:** 08.02.2023.
- **వెబ్‌సైట్:** hc.ap.nic.in

తెలంగాణ జిల్లా కోర్టుల్లో 97 రికార్డు అసిస్టెంట్ పోస్టులు

తెలంగాణ జ్యుడీషియల్ మినిస్టీరియల్ సర్వీసులో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన రికార్డ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 97
- **అర్హత:** ఇంటర్మీడియట్ లేదా దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. నిర్ణీత విద్య, సాంకేతిక అర్హతల కంటే ఎక్కువ ఉన్న అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలన సమయంలో సర్టిఫికెట్లు అందజేయాలి.
- **వయసు:** 18 నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ,ఎస్టీ,బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు రూ.22,240 నుంచి రూ.67,300 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** సీబీటీ/ఓఎమ్మార్ పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ)/ఓమ్మార్ పరీక్షలో 100 ప్రశ్నలుంటాయి. జనరల్ నాలెడ్జ్ విభాగంలో 60, జనరల్ ఇంగ్లిష్ విభాగంలో 40ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. పరీక్ష వ్యవధి 120 నిమిషాలు.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 11.01.2023.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.01.2023.
- **హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్ ప్రారంభతేది:** 15.02.2023. ▪ **పరీక్ష తేది:** మార్చి 2023.
- **వెబ్‌సైట్:** tshc.gov.in

తెలంగాణ జిల్లా కోర్టుల్లో 163 ప్రాసెస్ సర్వర్ పోస్టులు

తెలంగాణ జ్యుడీషియల్ మినిస్టీరియల్ సర్వీసులో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 163
- **అర్హత:** పదో తరగతి లేదా దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులు దరఖాస్తులో వృత్తిపరమైన నైపుణ్యాలను పేర్కొనడంతోపాటు స్థానిక భాషలు తెలిసి ఉండాలి.
- **వయసు:** 18నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ,ఎస్టీ,బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు రూ.22,900 నుంచి రూ.69,150 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** సీబీటీ/ఓఎమ్మార్ పరీక్ష(45 మార్కులు), ఇంటర్వ్యూ(5 మార్కులు) ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ)/ఓమ్మార్ పరీక్షలో 45 ప్రశ్నలుంటాయి. జనరల్ నాలెడ్జ్ విభాగంలో 30,జనరల్ ఇంగ్లిష్ విభాగంలో 15 ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది.పరీక్ష వ్యవధి 60 నిమిషాలు.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 11.01.2023.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.01.2023.
- **హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్ ప్రారంభతేది:** 15.02.2023
- **పరీక్ష తేది:** మార్చి 2023.
- **వెబ్‌సైట్:** tshc.gov.in

నార్త్ వెస్ట్రన్ రైల్వేలో 2026 అప్రెంటిస్‌లు

జైపూర్(రాజస్థాన్)లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీఎస్‌ఈ)–నార్త్ వెస్ట్రన్ రైల్వే ఎన్‌డబ్ల్యూఆర్ వర్క్‌షాప్/యూనిట్లలో వివిధ ట్రేడుల్లో అప్రెంటిస్ శిక్షణలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 2026
- **డివిజన్ల వారీగా ఖాళీలు:** డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం, అజ్‌మేర్–413, డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం, బికనీర్–423, డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం, జైపూర్ డివిజన్–494, డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం, జోధ్‌పూర్ డివిజన్–404, బీటీసీ క్యారేజ్, అజ్‌మేర్–126, బీటీసీ లోకో, అజ్‌మేర్–65, క్యారేజ్ వర్క్‌షాప్, బికనీర్–31, క్యారేజ్ వర్క్‌షాప్, జోధ్‌పూర్–70.
- **ట్రేడులు:** ఎలక్ట్రికల్, కార్పెంటర్, పెయింటర్, మేసన్, పైప్ ఫిట్టర్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, వెల్డర్ తదితరాలు.
- **అర్హత:** కనీసం 50శాతం మార్కులతో పదో తరగతి,సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:**15నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:** 10.01.2023.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.02.2023.
- **వెబ్‌సైట్:** www.rrcjaipur.in

సీఆర్‌పీఎఫ్‌లో చేరే మార్గం ఇదిగో!

» ఏఎస్ఐ,హెడ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సీఆర్‌పీఎఫ్ నోటిఫికేషన్
» రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఫిజికల్ టెస్టుల ద్వారా ఎంపిక ప్రక్రియ
» పే లెవల్–5, 4లతో ప్రారంభ వేతన శ్రేణి
» కొనసాగుతున్న దరఖాస్తు ప్రక్రియ

పోలీస్ కొలువుల అభ్యర్థుల ముంగిట మరో జాబ్ నోటిఫికేషన్! ఇది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం కోరుకునే వారికి చక్కటి అవకాశం! ఇంటర్మీడియెట్ అర్హతతోనే అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ), హెడ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సీఆర్‌పీఎఫ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 1,458 పోస్టులను భర్తీ చేయనుంది. ఈ నేపథ్యంలో.. సీఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాల గురించి తెలుసుకుందాం...

సాయుధ దళాల్లో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్)కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ విభాగంలో అడుగుపెడితే జాతీయ స్థాయిలో సీఆర్‌పీఎఫ్ కార్యాలయాల్లో విధులు నిర్వహించే అవకాశం లభిస్తుంది. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలోని పోలీస్ ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు.. అదే సన్నద్ధతతో సీఆర్‌పీఎఫ్ పోస్టులకు కూడా పోటీ పడొచ్చు.

మొత్తం 1,458 పోస్టులు

సీఆర్‌పీఎఫ్ తాజా నియామక ప్రకటనను పరిశీలిస్తే.. అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్(ఏఎస్ఐ), హెడ్ కానిస్టేబుల్ (మినిస్టీరియల్) హోదాల్లో మొత్తం 1,458 పోస్టులను భర్తీ చేయనుంది. ఇందులో 143 ఏఎస్ఐ, 1,315 హెడ్ కానిస్టేబుల్ పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- జనవరి 25, 2023 నాటికి ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** జనవరి 25, 2023 నాటికి 18–25 ఏళ్లు ఉండాలి. గరిష్ట వయో పరిమితిలో ఎస్సీ/ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు సడలింపు లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ

సీఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ(స్టెనో), హెడ్ కానిస్టేబుల్(మినిస్టీరియల్) పోస్టులకు సంబంధించి ఎంపిక ప్రక్రియను మూడు దశల్లో నిర్వహిస్తారు. అవి.. రాత పరీక్ష(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్), స్కిల్ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్. దీంతోపాటు డాక్యుమెంట్ వెరిఫికేషన్, డిటెయిల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్ ఉంటాయి.

రాత పరీక్ష


ఎంపిక ప్రక్రియలో తొలిదశ రాత పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో వంద ప్రశ్నలు–వంద మార్కులకు ఉంటుంది. ఇందులో నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇంగ్లిష్/హిందీ 25 ప్రశ్నలు–25 మార్కులు, జనరల్ అప్టిట్యూడ్ 25 ప్రశ్నలు–25 మార్కులు, జనరల్ ఇంటెలిజెన్స్ 25 ప్రశ్నలు–25 మార్కులు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 25 ప్రశ్నలు–25 మార్కులకు ప్రశ్న పత్రం ఉంటుంది. పరీక్ష సమయం 90 నిమిషాలు. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులు తగ్గిస్తారు. సెక్షన్–ఎలో అభ్యర్థులు తమ ఆసక్తి మేరకు ఇంగ్లిష్ లేదా హిందీ లాంగ్వేజ్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. మిగతా విభాగాలకు ఇంగ్లిష్ లేదా హిందీ మాధ్యమంలో హాజరు కావచ్చు.

స్కిల్ టెస్ట్

- ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే రాత పరీక్షలో మెరిట్ జాబితాలో నిలిచిన వారికి తదుపరి దశలో స్కిల్ టెస్ట్ నిర్వహిస్తారు.
- ఏఎస్ఐ పోస్టుల అభ్యర్థులకు షార్ట్‌హ్యాండ్ పరీక్ష నిర్వహిస్తారు. నిమిషానికి 80 పదాలు చొప్పున పది నిమిషాలపాటు డిక్టేషన్ ఇస్తారు. ఆ డిక్టేషన్‌ను ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో 50 నిమిషాల్లో, హిందీ లాంగ్వేజ్‌లో 65 నిమిషాల్లో సవివరంగా కంప్యూటర్‌పై టైప్ చేయాల్సి ఉంటుంది.
- హెడ్ కానిస్టేబుల్ అభ్యర్థులకు కంప్యూటర్ టైపింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇంగ్లిష్‌లో నిమిషానికి 35 పదాలు, హిందీలో నిమిషానికి 30 పదాలు టైప్ చేయాల్సి ఉంటుంది.
- స్కిల్ టెస్ట్ కేవలం అర్హత పరీక్షగానే ఉంటుంది.

ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్

- రాత పరీక్ష, స్కిల్ టెస్ట్‌లలో అర్హత సాధించిన వారికి తదుపరి దశలో ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ నిర్వహిస్తారు. అభ్యర్థులు నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగుండాలి.
- పురుష అభ్యర్థులు కనీసం 165 సెం.మీ. ఎత్తు ఉండాలి. మహిళా అభ్యర్థులు 150 సెం.మీ ఎత్తు కలిగి ఉండాలి.
- ఛాతి విస్తీర్ణం కనీసం 77 సెం.మీ ఉండాలి. శ్వాస తీసుకున్నప్పుడు 82 సెం.మీగా నమోదవ్వాలి. (ఈ విభాగం నుంచి మహిళా అభ్యర్థులకు మినహాయింపు కల్పించారు)



పోలీస్ జాబ్స్

చివరగా డీఎంఈ

మూడు దశల్లోనూ విజయం సాధించిన వారికి చివరగా డిటెయిల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్(డీఎంఈ) పేరుతో శారీరక, ఆరోగ్య ధ్రుడత్వ పరీక్షలు నిర్వహిస్తారు. దీనికంటే ముందుగా సర్టిఫికెట్ల పరిశీలన చేస్తారు. డీఎంఈలోనూ విజయం సాధించిన వారికి నియామకాలు ఖరారు చేస్తారు.

ప్రారంభ వేతనం

- ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్‌గా నియామకం ఖరారు చేసుకున్న వారికి ఏడో వేతన సవరణ ప్రకారం–పే లెవల్ 4, 5లతో ప్రారంభ వేతనం లభిస్తుంది.
- ఏఎస్ఐ పోస్టులకు ఎంపికైన వారికి పే లెవల్ 5తో రూ.29,200–రూ.92,300 వేతన శ్రేణి ఉంటుంది.
- హెడ్ కానిస్టేబుల్‌గా ఎంపికైన వారికి పే లెవల్ 4తో రూ.25,500–రూ.81,100 వేతన శ్రేణి ఉంటుంది.

పదోన్నతులు ఇలా

సీఆర్‌పీఎఫ్‌లో ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన వారికి పదోన్నతులు ఉంటాయి. హెడ్ కానిస్టేబుల్ అభ్యర్థులు ఇన్‌స్పెక్టర్ స్థాయికి చేరుకోవచ్చు. అదే విధంగా ఏఎస్ఐ నుంచి అసిస్టెంట్ కమాండెంట్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది. డిపార్ట్‌మెంట్ టెస్ట్‌లలో విజయం సాధించిన వారికి మరింత వేగంగా పదోన్నతులు లభిస్తాయి. ప్రతి పదోన్నతికి కనీసం అయిదేళ్లు,గరిష్ఠంగా 18 ఏళ్ల సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకుంటారు.

సిలబస్ అంశాలపై పట్టుతో

జాతీయ స్థాయిలో పోటీ నెలకొనే సీఆర్‌పీఎఫ్ నియామక పరీక్షలో రాణించేందుకు.. అభ్యర్థులు ఆయా సిలబస్ అంశాలపై పట్టు సాధించాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

బేసిక్ గ్రామర్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. యాంటానిమ్స్, సినానిమ్స్, మిస్ స్పెల్ట్ వర్డ్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, యాక్టివ్/ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, వన్‌వర్డ్ సబ్‌స్టిట్యూట్స్, ప్యాసేజ్ కాంప్రహెన్షన్‌లను ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ ఆప్టిట్యూడ్

అభ్యర్థుల్లోని సామాజిక అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడిగే ఈ విభాగంలో రాణించేందుకు.. భారతదేశ చరిత్ర, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, రాజ్యాంగం, శాస్త్రీయ పరిశోధనలు వంటి అంశాలను ఔపోసన పట్టాలి. అదే విధంగా సమకాలీన అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

జనరల్ ఇంటెలిజెన్స్

వెర్బల్, నాన్–వెర్బల్ రీజనింగ్ అంశాలపై పట్టు సాధించాలి. స్పేస్ విజువలైజేషన్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనాలజీస్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అనాలిసిస్, విజువల్ మెమొరీ, అబ్జర్వేషన్, క్లాసిఫికేషన్స్, నంబర్ సిరిస్, కోడింగ్–డీకోడింగ్, నంబర్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వర్డ్ బిల్డింగ్, వెన్ డయాగ్రమ్స్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ప్యూర్ మ్యాథ్స్‌తోపాటు అర్థ గణిత అంశాలపై దృష్టి పెట్టాలి. డెసిమల్స్, ఫ్రాక్షన్స్, నంబర్స్, పర్సంటేజెస్, రేషియోస్, ప్రపోర్షన్స్, స్క్వేర్ రూట్స్, యావరేజస్, ప్రాఫిట్ అండ్ లాస్, అల్జీబ్రా, లీనియర్ ఈక్వేషన్స్, ట్రయాంగిల్స్, సర్కిల్స్, టాంజెంట్స్, ట్రిగ్నోమెట్రీలపై పట్టు సాధించాలి.

స్కిల్ టెస్ట్

స్కిల్ టెస్ట్‌లో రాణించేందుకు.. అభ్యర్థులు కంప్యూటర్ టైపింగ్ ప్రాక్టీస్ మెరుగుపరచుకోవాలి. టైపింగ్ టెస్ట్‌లో.. మొత్తం పదాల్లో అయిదు శాతం కంటే ఎక్కువ తప్పులుంటే.. దానికి అనుగుణంగా అభ్యర్థుల ప్రతిభను గణించే నిబంధన విధించారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:**జనవరి 25,2023
- **అడ్మిట్ కార్డ్ విడుదల:** ఫిబ్రవరి 15, 2023
- **ఆన్‌లైన్ పరీక్ష తేదీలు:** ఫిబ్రవరి 22 – ఫిబ్రవరి 28, 2023
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://crpfindia.com, https://crpf.nic.in

క్లుప్తంగా...

ప్రత్యామ్నాయ మార్గాల్లో అదనపు ఆదాయం: పువ్వాడ

ఎంజీ బస్‌స్టేషన్‌లో 'జీవా' జలం లాంఛనంగా ప్రారంభం



అఫ్జల్‌గంజ్: ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆదాయం పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వెల్లడించారు. ఇప్పటికే కార్గో సర్వీసులు, పెట్రోల్ పంపులతో పాటు తాజాగా మంచినీటి బాటిళ్ల విక్రయానికి శ్రీకారం చుట్టామని ఆయన తెలిపారు. సోమవారం మహాత్మాగాంధీ బస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శుద్ధి చేసిన మంచినీటి బాటిళ్ల (జీవా జలం) విక్రయాలను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్... టీఎస్ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, రవాణా శాఖ కార్యదర్శి శ్రీనివాస రాజు, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్, ఈడీలు వినోద్‌కుమార్, యాదగిరి, ఆర్ఎం శ్రీధర్‌తో కలిసి ప్రారంభించారు.

కొత్తగా 15 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సోమవారం 5,427 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు చేయగా, అందులో 15 మంది కరోనా బారినపడ్డారు. ఈ మేరకు ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు కరోనా బులెటిన్ విడుదల చేశారు.

విదేశాల్లో నర్సింగ్, పారామెడికల్ కొలువులు

టామ్‌కామ్ ఆధ్వర్యంలో దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: విదేశాల్లో నర్సింగ్, పారామెడికల్ ఉద్యోగాల కోసం ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) తెలిపింది. టామ్‌కామ్ రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన విభాగానికి అనుబంధంగా పనిచేస్తోంది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియలో భాగంగా ఈనెల 11వ తేదీన హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజీలో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆరోజున వర్క్‌షాప్‌కు సంబంధిత సర్టిఫికెట్లతో హాజరు కావాలని, ఉద్యోగావకాశాలు తదితర పూర్తి సమాచారం అక్కడే అందుబాటులో ఉంచుతామని వెల్లడించింది. వివరాలకు 9100798204, 9908830438 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించింది.

మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలి

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

సాక్షి, హైదరాబాద్: మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్ మెంట్ (నిథమ్)లో మహిళలకు స్వయం ఉపాధిపై శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. నిథమ్ ఇన్‌స్టిట్యూట్, పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో ఆపరేటివ్ మేనేజ్‌మెంట్, తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ సంస్థలతో మంత్రి శ్రీనివాస్ యాదవ్, పశుసంవర్థక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అధర్ సిన్హాల సమక్షంలో మత్స్య శాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యా ఆయా సంస్థల ప్రతినిధులతో ఒప్పంద పత్రాలను మార్చుకొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మొదటి బృందం శిక్షణ కార్యక్రమం మూడు రోజుల పాటు కొనసాగుతుందని, ఈ విడతలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, పెద్దపల్లి జిల్లాలకు చెందిన మహిళలకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఒక్కో బృందంలో 30 నుంచి 40 మంది చొప్పున 20 బృందాలకు శిక్షణ ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో నిథమ్ డైరెక్టర్ డాక్టర్ చిన్నంరెడ్డి, కో ఆపరేటివ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ తంగిరాల, తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ యూనియన్ ఎండీ అరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ప్రాక్టీస్ రద్దన్నా...

ప్రభుత్వ ఉద్యోగమే ముద్దు



ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసేందుకు డాక్టర్ల ఆసక్తి

- గ్రామాల్లో పనిచేసేందుకు మహిళాడాక్టర్ల ఎదురుచూపు
- అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఇప్పటికే రెట్టింపు దరఖాస్తులు
- ఎంబీబీఎస్‌తో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరినవారికి వేతనాలు తక్కువ

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్ పూర్తి చేసినవారి చూపు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యపోస్టుల వైపు మళ్లింది. ప్రైవేట్ ప్రాక్టీసు కన్నా ప్రభుత్వ ఆసుపత్రే మిన్న అని భావిస్తున్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో వేతనాలు ఆశాజనకంగా లేకపోవడం కూడా దీనికి మరో కారణం. ప్రైవేట్ ప్రాక్టీసుపై ప్రభుత్వం నిషేధం విధించినా ప్రభుత్వ పోస్టుల వైపే ఎక్కువగా మొగ్గు చూపడం గమనార్హం. ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌లో భాగంగా సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు వస్తున్న దరఖాస్తుల సంఖ్యే అందుకు నిదర్శనమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ వర్గాలు చెబుతున్నాయి. అంతా కార్పొరేట్ వైద్యమయం అయిన పరిస్థితుల్లో ప్రైవేట్ ప్రాక్టీసు అసాధ్యమన్న భావనలో చాలామంది వైద్యులు ఉన్నారు. కొందరికైతే ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ. 25 వేలు కూడా ఇవ్వడంలేదు. విదేశీ ఎంబీబీఎస్‌లకైతే కొందరికి రూ. 20 వేలు కూడా ఇవ్వడం లేదన్న చర్చ జరుగుతుంది.

సివిల్ అసిస్టెంట్ పోస్టులకు ఐదు రెట్ల డిమాండ్

వైద్య, ఆరోగ్య శాఖలో మొత్తం 12,755 పోస్టుల భర్తీకి ప్రభుత్వం సన్నాహాలు చేసింది. అందులో 10,028 పోస్టులను మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా భర్తీ చేస్తారు. ఇప్పటివరకు ఎంబీబీఎస్ అర్హతతో ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో 734 పోస్టులు, వైద్య విధాన పరిషత్ పరిధిలో 209 పోస్టులు, ఐపీఎం పరిధిలో ఏడు సివిల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీచేశారు. మొత్తం 950 పోస్టులకు 4,800 దరఖాస్తులు వచ్చాయి. అంటే ఏకంగా ఐదురెట్ల దరఖాస్తులు వచ్చాయి. వీరికి బేసిక్ వేతనం రూ.58,850 ఉంది. డీఏ, హెచ్‌ఆర్ఏ అదనం. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వారికే 90 శాతం మేరకు ఇందులో పోస్టులు దక్కాయి. అనుభవం లేనివారికి, ఇప్పుడే ఎంబీబీఎస్ పూర్తయినవారిలో 90 శాతం మందికి అవకాశమే రాలేదు. కాగా, మొత్తం పోస్టులు పొందినవారిలో అధికంగా మహిళాడాక్టర్లు 509 మంది, పురుష డాక్టర్లు 441 మంది ఉన్నారు. అంటే గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసేందుకు మహిళలే ముందుకు వస్తున్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, బోధనాసుపత్రుల్లో 1,147 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఇటీవల నోటిఫికేషన్ జారీచేయగా, ఇప్పటికే 2 వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయని వైద్య, ఆరోగ్య సేవల నియామక సంస్థ(ఎంహెచ్ఎస్ఆర్‌బీ) సభ్యకార్యదర్శి గోపికాంత్‌రెడ్డి చెబుతున్నారు. ఇంకా మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశముందని ఆయన తెలిపారు.

స్టాఫ్‌నర్సు పోస్టులకైతే 30 వేల మంది పోటీ?

రాష్ట్రంలోని వివిధ వైద్య, ఆరోగ్య విభాగాల్లో 5,204 స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ జారీ అయిన సంగతి విదితమే. ఈ పోస్టులకు పేస్కేల్ రూ.36,750– రూ. 1,06,990 మధ్య ఉండటంతో దాదాపు 30 వేల మంది దరఖాస్తు చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అంటే ఆరురెట్ల డిమాండ్ ఉంటుందని అంటున్నారు. 1,500 ఏఎన్ఎం పోస్టులకు కూడా త్వరలో నోటిఫికేషన్ జారీ కానుంది. వాటికి పదిరెట్లు పోటీ ఉంటుందని అంచనా వేస్తున్నారు.

రాములోరి 'లడ్డూ'పై వివాదం

- భద్రాచలం ఆలయంలో బూజు పట్టిన లడ్డూలు విక్రయిస్తున్నారంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మేజిస్ట్రేట్
- వంటశాల సీజ్ చేసేందుకు వచ్చిన పోలీసులు.. ఆందోళనకు దిగిన రామాలయ అర్చకులు, అధికారులు


నిరసన తెలుపుతున్న ఆలయ సిబ్బంది

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో బూజు పట్టిన లడ్డూల విక్రయం వివాదం తారస్థాయికి చేరింది. భద్రాచలం జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ నీలిమ.. భక్తులు కొనుగోలు చేసిన లడ్డూలు బూజు పట్టి ఉండటాన్ని గమనించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం, దరిమిలా ఆలయంలో వంటశాల సీజ్ చేసేందుకు వచ్చిన సీఐ, పోలీసులను దేవస్థానం వర్గాలు అడ్డుకోవడంతో సోమవారం ఉద్రిక్తతకు దారి తీసింది. నిరసనల నినాదాలతో ఆలయం మార్మోగింది.

పోలీసుల రాకతో రాజుకున్న వివాదం..

భద్రాచలం సీఐ నాగరాజు రెడ్డి తన సిబ్బందితో సోమవారం సాయంత్రం 6గంటల సమయంలో రామాలయంలో లడ్డూలను తయారు చేసే వంటశాలకు వచ్చారు. బూజు పట్టిన లడ్డూలను విక్రయిస్తున్నారంటూ భద్రాచలం జడ్జి ఫిర్యాదు చేశారని, వంటశాలను సీజ్ చేస్తామని చెప్పారు. దీనికి నిరసనగా ఆలయ అర్చకులు, వేదపండితులు, ఏఈఓలు, సిబ్బంది వంటశాల వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా పోలీసులకు, సిబ్బందికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎలాంటి విచారణ, నోటీసులు లేకుండా స్వామివారి ప్రసాదాలను తయారు చేసే వంటశాలకు ఎలా వస్తారని పోలీసులను నిలదీశారు. ఎగ్జిక్యూటివ్ స్థాయి అధికారి ఉన్న ఆలయంలో ముందస్తు సమాచారం లేకుండా చర్యలు తీసుకోవడం తగదని వాదించారు.

పోలీసులపై ఆర్డీఓ అసహనం..

వివాదం తీవ్రరూపం దాల్చడంతో ఆర్‌డీఓ రత్నకళ్యాణి ఆలయానికి వచ్చారు. ఘటనపై పోలీసులు, ఆలయ వర్గాలను ఆరా తీశారు. వంటశాల సీజ్ చేసేందుకు తగిన ఆధారాలు చూపించాలని సీఐని అడగగా.. ఆయన పొంతన లేని సమాధానాలు చెప్పడంతో ఆర్‌డీఓ అసహనం వ్యక్తం చేశారు. లడ్డూ శాంపిళ్లు సేకరించి హైదరాబాద్‌కు పంపించాలని ఫుడ్ సేఫ్టీ అధికారి వేణుగోపాల్‌ను ఆదేశించారు. దీంతో ఆయన లడ్డూ శాంపిళ్లు సేకరించడం ,పోలీసులు వెనుదిరగడంతో వివాదం సద్దుమణిగింది. అంతకుముందు భక్తులు కొన్న లడ్డూలు బూజు పట్టి ఉండటాన్ని గమనించి భద్రాచలం ఫస్ట్‌క్లాస్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ నీలిమ సోమవారం వెళ్లి భద్రాచలం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నాయకత్వాభివృద్ధికి హార్వర్డ్ కిటుకులు!

బీసీ గురుకుల విద్యార్థుల కోసం కొత్త కార్యక్రమం

- హార్వర్డ్‌తో పాటు 'లక్ష్మీమిట్టల్ ఫ్యామిలీ', ఓయూతో అవగాహన
- ఎంపిక చేసిన విద్యార్థులకు పలు రకాల అవగాహన కార్యక్రమాలు
- నాయకత్వ లక్షణాల పెంపుదలే లక్ష్యం


బీసీ గురుకుల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్ట్రక్టర్

సాక్షి, హైదరాబాద్: విద్యార్థులు ఎక్కువగా పాఠ్యాంశాల అభ్యసనకే పరిమితమవుతుంటారు. ప్రస్తుత పరిస్థితుల్లో నిజ జీవితంలో, వృత్తి పరమైన అంశాల్లో ఎదుగుదలకు సబ్జెక్టు ఉంటేనే సరిపోదు. నాయకత్వ లక్షణాలు పుష్కలంగా ఉంటేనే పోటీ ప్రపంచంలో నెగ్గుకువచ్చే అవకాశాలుంటాయి. ఈ ఉద్దేశంతోనే మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్), బీసీ సంక్షేమ శాఖలు ఆ దిశగా సరికొత్త కార్యక్రమాన్ని తీసుకొచ్చాయి. '2023 ప్రోగ్రామ్ ఫర్ సైంటిఫికల్లీ ఇన్‌స్పైర్డ్ లీడర్‌షిప్ (పీఎస్ఐఎల్)' పేరిట గురుకుల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాల పెంపుదల కోసం అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం, ది లక్ష్మీ మిట్టల్ అండ్ ఫ్యామిలీ సౌత్ ఏషియా ఇన్‌స్టిట్యూట్, ఉస్మానియా విశ్వవిద్యాలయంతో బీసీ గురుకుల సొసైటీ అవగాహన కుదుర్చుకుంది. ఇందులో భాగంగా వారం రోజుల పాటు ప్రత్యేక అవగాహన, శిక్షణా కార్యక్రమాలను ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో నిర్వహిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 108 మంది బీసీ గురుకుల సొసైటీ విద్యార్థులు, బీసీ హాస్టల్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. హార్వర్డ్ వర్సిటీ నుంచి ప్రత్యేకంగా ఐదుగురు ఇన్‌స్ట్రక్టర్లు, ఓయూ నుంచి ఐదుగురు ఇన్‌స్ట్రక్టర్ ఫెలోస్ విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. అవగాహన కుదుర్చుకున్న మూడు సంస్థల ప్రతినిధులతో పాటు బీసీ గురుకుల సొసైటీ అధికారులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు.

వివిధ అంశాలపై చర్చా కార్యక్రమాలు..

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ గురుకుల పాఠశాలలు, బీసీ సంక్షేమ హాస్టళ్లలోని ఎనిమిదో తరగతి, ఆపై తరగతుల్లో చదువుతున్న విద్యార్థుల్లో చురుకైన 108 మందిని బీసీ గురుకుల సొసైటీ గుర్తించి ఎంపిక చేసింది. ఇందుకోసం అంతర్గతంగా ప్రత్యేక పరీక్షను నిర్వహించింది. తొలిదశలో ఇలా ఎంపికైన విద్యార్థులకే ప్రత్యేక అవగాహన, శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సైంటిఫిక్ రేసిజం, ది ఆర్ట్ ఆఫ్ కమ్యూనికేషన్, ఇఫ్ స్టార్స్ విత్ అన్ అబ్జర్వేషన్, ది ఎసెన్షియల్స్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్, సినిమా అండ్ సోషల్ చేంజ్ అంశాలపై చర్చా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా వాలీబాల్, రగ్బీ వంటి క్రీడలతో పాటు నృత్యం, ఆత్మరక్షణ, కరాటేపై కూడా సామూహిక చర్చలు జరిపిస్తున్నారు. శిక్షణానంతరం సంబంధిత ఇన్‌స్ట్రక్టర్లు, ఇన్‌స్ట్రక్టర్ ఫెలోస్‌తో నిరంతర అనుసంధాన వ్యవస్థను సొసైటీ ఏర్పాటు చేయనుంది. ఇలా శిక్షణ పొందిన గురుకుల విదార్థులను జిల్లాల వారీగా విభజించి గురుకుల పాఠశాలల్లోని పిల్లలకు రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరిస్తూ వాటిల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహింపజేయనున్నారు. మొత్తంగా ప్రతి గురుకుల విద్యార్థిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించే విధంగా ఈ కార్యక్రమాలు నిరంతరం కొనసాగించేందుకు బీసీ సంక్షేమ శాఖ, బీసీ గురుకుల సొసైటీ ముందుకు సాగుతున్నాయి.

ఆలకించడం, భావ వ్యక్తీకరణ కీలకం



ఇతరులు చెప్పే విషయాల్ని ముందుగా శ్రద్ధగా వినాలి. ఆ తర్వాత మనం చెప్పదలచుకున్న విషయాన్ని ఎలాంటి భయం లేకుండా స్పష్టంగా తెలియజేయాలి. ఈ నైపుణ్యాన్ని క్రమంగా మెరుగుపరుచుకుంటే ఎక్కడైనా, ఎలాంటి వారితోనైనా ధైర్యంగా మాట్లాడగలననే నమ్మకం కుదిరింది.
– సాయికిరణ్, బీసీ గురుకుల పాఠశాల, జైనథ్, ఆదిలాబాద్ జిల్లా

ఆత్మవిశ్వాసం పెరుగుతోంది..



స్టేజీపైన మాట్లాడాలంటే ఎంతో ఆందోళన చెందేదాన్ని. ఈ ప్రత్యేక కార్యక్రమంతో నాలో ఆత్మవిశ్వాసం పెరుగుతోంది. ఇతరులతో మాట్లాడే విధానం, బాడీ లాంగ్వేజీ, భాషపై పట్టు పెంచుకోవడంలో మెళకువలెన్నో నేర్చుకుంటున్నా.– సంఘవి, బీసీ గురుకులం, రామచంద్రాపురం, సంగారెడ్డి జిల్లా

అబ్బా.. చలి చంపుతోంది!

2 నుంచి 5 డిగ్రీలు తగ్గిన ఉష్ణోగ్రతలు

- రెండ్రోజులు మరింత పెరగనున్న చలి
- సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో సీజన్‌లోనే అత్యల్పంగా 4.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్య నిపుణులు

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు

(డిగ్రీల సెల్సియస్‌లో)

కేంద్రం	కనిష్టం	కేంద్రం	కనిష్టం
ఆదిలాబాద్	6.0	నిజామాబాద్	12.5
శివరాంపల్లి (హైదరాబాద్)	7.3	ఖమ్మం	12.6
మెదక్	8.0	హకీంపేట్	12.6
హనుమకొండ	9.9	దుండిగల్	13.8
రామగుండం	10.6	భద్రాచలం	14.0
		మహబూబ్‌నగర్	14.1
		నల్లగొండ	14.8

సాక్షి, హైదరాబాద్/కోహీర్(జహీరాబాద్): రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోతున్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రెండ్రోజులుగా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ మేర తగ్గినట్లు వాతావరణ శాఖ తెలిపింది. రానున్న రెండ్రోజులు రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయని హెచ్చరించింది. ఈశాన్యం వైపు నుంచి తక్కువ ఎత్తులో గాలులు వీస్తున్న నేపథ్యంలో చలి తీవ్రత మరింత పెరుగుతుందని వెల్లడించింది. సోమవారం రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే అత్యల్పంగా సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 4.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. రాష్ట్రంలో ఈ సీజన్‌లో అత్యల్ప ఉష్ణోగ్రత ఇదేనని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

అంతటా ఇవే దృశ్యాలు..


పాల్వంచ మండలంలోని చిరుతానిపాడులో..

కొమురం భీమ్ జిల్లా సిర్పూర్(యు)లో 4.8 డిగ్రీలు రెండో అత్యల్ప ఉష్ణోగ్రత కాగా, రంగారెడ్డి జిల్లా తాళ్లపల్లి, వికారాబాద్ జిల్లా మర్పల్లి 5 డిగ్రీలతో మూడో స్థానంలో నిలిచాయి. చలి తీవ్రత పెరగడంతో ఉదయం 8 గంటల వరకు ప్రజలు బయటికి రాలేకపోతున్నారు. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో ఇంటి నుంచి బయటకు వెళ్లే సమయంలో చలి నుంచి రక్షణ పొందేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యనిపుణులు సూచించారు.

గ్రేటర్ హైదరాబాద్‌లో...

కనిష్ట ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పడిపోవడంతో గ్రేటర్ హైదరాబాద్ గజగజలాడుతోంది. సోమవారం తెల్లవారుజామున శివరాంపల్లిలో కనిష్టంగా 7.3 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. కాగా నగరం మొత్తంగా సరాసరిన 11.3 డిగ్రీల మేర కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీచేసి ప్రభుత్వ యంత్రాంగాన్ని, ప్రజలను అప్రమత్తం చేసింది.

ఉదయం 10దాటినా తొలగని మంచు

పాల్వంచ రూరల్: కొండలు, దట్టమైన అటవీ ప్రాంతాల సమీపాన ఉండే గ్రామాల్లో ఆదివాసీల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. సాయంత్రం ఐదు గంటల నుంచే చలి మొదలవుతుండటం, ఉదయం 10 గంటల వరకూ మంచు తెరలు వీడకపోవడంతో రాత్రంతా నెగడు (చలిమంటలు) వద్దే గడుపుతున్నారు. పడుకునే సమయాన కూడా పక్కన నెగడుకు తోడు దుప్పట్లు కప్పుకుని నిద్రిస్తున్నారు. కొత్తగూడెం జిల్లాలోని చిరుతానిపాడులో, పెద్దకలశ, రాళ్లచెలక, బుసురాయి, ఎర్రబోరు తదితర గ్రామాల్లో ఇదే పరిస్థితి కనిపించింది.

మోడల్ స్కూల్ నోటిఫికేషన్ విడుదల

ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష

సాక్షి హైదరాబాద్: ఇంగ్లిష్ మీడియం చదువులు.. నాణ్యమైన విద్యకు కేరాఫ్ అడ్రస్ అయిన తెలంగాణ మోడల్ స్కూల్స్‌లో ప్రవేశాల నోటిఫికేషన్ విడుదలైంది. 2023–24 సంవత్సరం ప్రవేశాల నోటిఫికేషన్‌ను మోడల్ స్కూల్స్ డైరెక్టర్ ఉషారాణి సోమవారం విడుదల చేశారు. 6వ తరగతితో పాటు, 7–10తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి నోటిఫికేషన్ జారీచేశారు. దరఖాస్తుల స్వీకరణ నేటి నుంచి ప్రారంభంకానుండగా, ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 16న నిర్వహిస్తారు. ఫలితాలను మే 15న ప్రకటిస్తారు. రాష్ట్రంలో 194 మోడల్ స్కూళ్లు ఉండగా, 6వ తరగతిలో 19,400సీట్లతోపాటు, 7–10 తరగతుల్లో మరి కొన్ని ఖాళీ సీట్లున్నాయి. విద్యార్థులు http:// telanganams.-cgg.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష ఫీజుగా జనరల్ విద్యార్థులు రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, వికలాంగ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125 ఫీజుగా చెల్లించాలన్నారు. ప్రవేశాలు ముగిసిన తర్వాత జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని అధికారులు చెప్పారు.

ప్రవేశాల షెడ్యూల్

- ఆన్‌లైన్‌లో దరఖాస్తు: 10-01-2023 నుంచి 15-02-2023
- హాల్‌టికెట్ల డౌన్‌లోడ్: 08-04-2023
- పరీక్షతేదీ: 16-04-2023
- సమయం: 6వ తరగతికి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు
- 7-10 తరగతుల్లో ప్రవేశాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు
- ఫలితాల ప్రకటన 15-05-2023
- పాఠశాలల వారీగా ఎంపికైనవారి జాబితా ప్రకటన 24-05-2023
- సర్టిఫికెట్ వెరిఫికేషన్ 25-5-2023 నుంచి 31-5-2023 వరకు క్లాసుల నిర్వహణ 1-6-2023

వారెవ్వా... వందే భారత్!

సెమీ బుల్లెట్ రైలు అంతా ప్రత్యేకతలమయం

- 180 డిగ్రీల కోణంలో తిరిగే సీటు
- ఎంత వేగంతో వెళ్లినా కుదుపులు ఉండవు
- రైలులో అంతర్భాగంగానే ఇంజిన్
- ఏరోడైనమిక్ డిజైన్‌తో వెలుపలి రూపం




కోచ్‌లో డిజిటల్ స్క్రీన్

సాక్షి, హైదరాబాద్: దేశంలో సెమీ బుల్లెట్ రైలుగా గుర్తింపు పొందిన వందేభారత్ రైలు ఎట్టకేలకు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య పరుగుపెట్టబోతోంది. ఇటు రూపు, అటు తీరు.. రెండూ అభివృద్ధి చెందిన దేశాల్లోని రైలు తరహాలో ఉండటంతో దీనికి ప్రాధాన్యం ఏర్పడింది. పూర్తిస్వదేశీ పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న ఈ రైలు కోసం అన్ని రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికే ఏడు రైళ్లు పట్టాలెక్కగా, ఈనెల 19న సికింద్రాబాద్–విజయవాడ మధ్య ఎనిమిదో రైలు పరుగు ప్రారంభించనుంది. తెలుపు వర్ణం, దానిపై నీలి రంగు చారలు, బుల్లెట్ రైలు తరహాలో లోకో ముందు రూపు, వెడల్పాటి నలుపు రంగు కిటికీ వరస.. ఇలా చూడగానే ఆకట్టుకునే రూపంతో ఉన్న ఈ రైలు సికింద్రాబాద్–విజయవాడ మధ్య పరుగుపెట్టబోతోంది. ఆ తర్వాత దాన్ని విశాఖ వరకు పొడిగించే యోచనలో ఉన్నారు.

ఆటోమేటిక్ తలుపులు...

- ఈ రైలు వెలుపలి రూపు ఏరోడైనమిక్ డిజైన్‌తో రూపొందించారు.
- గరిష్టంగా 180 కి.మీ. వేగాన్ని అందుకునేలా డిజైన్ చేశారు. ఈ వేగాన్ని ప్రయోగదశలో మాత్రమే పరీక్షించి చూశారు. ప్రస్తుతం నిర్వహణ దశలో దాని గరిష్ట వేగ పరిమితి మాత్రం గంటకు 160 కి.మీ. మాత్రమే. ఈ గరిష్ట వేగాన్ని 140 సెకన్లలో అందుకుంటుంది.
- సికింద్రాబాద్–విజయవాడ మధ్య ట్రాక్ వేగ పరిమితిని గంటకు 110 కి.మీ నుంచి 130 కి.మీ.కు పెంచారు.
- పుల్లీ సస్పెండెడ్ ట్రాక్షన్ మోటార్‌తో రూపొందించిన ఆధునిక బోగీలను ఈ రైలులో వినియోగించారు. దీంతో రైలు ఎంత వేగంతో వెళ్లినా కుదుపులు ఉండవు.
- ఈ రైలుకు ప్రత్యేకంగా లోకోమోటివ్‌ను జత చేసే అవసరం ఉండదు. రైలులో అంతర్భాగంగానే ఇంజిన్ ఉంటుంది. ఎంఎంటీఎస్ రైలు తరహాలో లోకోపైలట్ కేబిన్‌లు రెండు చివర్లా ఉంటాయి.
- ఇందులో సీట్ల ప్రత్యేకతే వేరు. అవి 180 డిగ్రీల కోణంలో తిప్పుకోవచ్చు. వెడల్పాటి కిటికీ ఉన్నందున, దాని నుంచి బయటకు చూస్తూ ఉండాలనుకున్నప్పుడు సీటును కిటికీ వైపు తిప్పుకోవచ్చు. కుటుంబసభ్యులు రెండు సీట్లను పరస్పరం ఎదురెదురుగా తిప్పుకుని కూర్చోవచ్చు.
- కోచ్‌లో 32 అంగుళాల డిజిటల్ స్క్రీన్ ఉంటుంది. అందులో ప్రయాణికులకు రైలు వేగంతో సహా అన్ని వివరాలు డిస్‌ప్లే అవుతుంటాయి. ఆడియో అలర్ట్‌లు కూడా ఉంటాయి.
- ఈ రైలుకు ఆటోమేటిక్ తలుపులుంటాయి. వాటి నియంత్రణ లోకోపైలట్ వద్దే ఉంటుంది. మధ్యలో ప్రయాణికులు వాటిని తెరవలేరు, మూయలేరు. రైలు ఆగిన కొన్ని క్షణాలకు డోర్లు తెరుచుకుంటాయి. బయలుదేరటానికి కొన్ని సెకన్ల ముందు మూసుకుంటాయి.
- లోపలి వైపు, బయటి వైపు సీసీటీవీ కెమెరాలుంటాయి. లోపల వైఫై వసతి ఉంటుంది.
- రెండు రైళ్లు ఎదురెదురుగా వచ్చినప్పుడు పరస్పరం ఢీకొనకుండా 'కవచ్' పరిజ్ఞానాన్ని కల్పించారు.
- ప్రతి కోచ్‌లో నాలుగు ఎమర్జెన్సీ లైట్లు ఉంటాయి. విద్యుత్తు సరఫరాలో అవాంతరాలు ఏర్పడినప్పుడు ఇవి వెలుగును అందిస్తాయి.

పగటి వేళలోనే పరుగు..

ఈ రైల్లో ప్రస్తుతానికి చైర్‌కార్ మాత్రమే ఉంటుంది. సాధారణ రైళ్లలాగా స్లీపర్ బెర్తులుండవు. అందువల్ల వీలైనంత దగ్గరి స్టేషన్ల మధ్యనే తిరుగుతాయి. రాత్రి వేళ ప్రయాణం లేదు. సాధారణంగా దూరప్రాంతాల మధ్య రాత్రి వేళ ప్రయాణాన్నే జనం కోరుకుంటారు. నిద్ర సమయంలో ప్రయాణాన్ని ముగించటం ద్వారా పగటిపూట పనులు చూసుకునే అవకాశం కోసం యత్నిస్తారు. కానీ వందేభారత్ రైలు పగటి వేళ మాత్రమే ప్రయాణించాల్సి రావటం ఓ ప్రతికూలాంశం. దీంతో తదుపరి రైళ్లలో బెర్తులు ప్రవేశపెట్టేయోచనలో అధికారులున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.